

'ప్రతిభకు పేదరికం అడ్డు కాకూడదు. పేదింట్లో పుట్టిన ప్రతి ప్రతిభావంతుడు ఉన్నత చదువులు చదవాలి.'

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 6.50
సంపుటి: 15 సంచిక: 283

మంగళవారం 27-6-2023

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | VIJAYAWADA | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



ఏడాది పొడవునా పంటలు
ప్రకృతి సాగు చేస్తూ ఆదర్శంగా నిలిచిన గిరిజన రైతు వినీతపై కథనం - 11లో



అల్‌కరాజ్ మళ్లీ నంబర్‌వన్
ఏటీపీ పురుషుల సింగిల్స్ ర్యాంకింగ్స్‌లో రెండో స్థానానికి జొకోవిచ్ - 12లో



ప్రిగోజిన్ ప్రాణాలకు ముప్పు
రష్యాపై తిరుగుబాటు చేసిన 'వాగ్నర్' చీఫ్ ప్రిగోజిన్‌కు ముప్పు ఉందని అమెరికా నిఘా సంస్థ సీఐఏ అధిపతి డేవిడ్ హెచ్చరించారు.
వివరాలు 6లో ▸



భారత్ వాణిని ప్రపంచం వింటోంది
ప్రధాని మోదీ హయాంలో ప్రపంచ వేదికపై భారత్ పలుకుబడి, స్థాయి పెరిగిపోయాయని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ పేర్కొన్నారు.
వివరాలు 6లో ▸



విమానం నడపను..
జైపూర్‌లో విమానాన్ని అత్యవసరంగా ల్యాండ్ చేసిన పైలట్.. తన డ్యూటీ ముగియడంతో తిరిగి టేకాఫ్ చేసేందుకు నిరాకరించాడు.
వివరాలు 6లో ▸



వెదురు నుంచి జీవ ఇంధనాలు!
బయో ఇథనాల్, బయో గ్యాస్, బయోచర్ తయారీకి వెదురు అనుకూలమని శాస్త్రవేత్తల అధ్యయనంలో తేలింది.
వివరాలు 6లో ▸

న్యాయ సాయం అందించడంలో..
పేదలకు మీరే నేస్తం
మీకు జరిగిన ఈ మంచిని.. ప్రతి పేదవాడికి తిరిగి బదిలీ చేయండి

- అందుకే జూనియర్ లాయర్లకు ఈ సాయం: సీఎం వైఎస్ జగన్
- ఓ అన్నగా, స్నేహితుడిగా మీ నుంచి నేను ఆశించేది అదే..
- నాలుగేళ్లలో 'వైఎస్సార్ లా నేస్తం'తో 5,781 మందికి మేలు
- మొత్తంగా రూ.41.52 కోట్లు జూనియర్ లాయర్లకు అందించాం
- ఈ ఏడాది 2,677 మంది ఖాతాలకు రూ.6.12 కోట్లు జమ
- ఇలాంటి ఆలోచన, పథకం దేశంలో మరే రాష్ట్రంలోనూ లేదు
- రూ.100 కోట్లతో ఇప్పటికే అడ్వొకేట్స్ వెల్ఫేర్ ట్రస్టు ఏర్పాటు



న్యాయవాదులకు 'వైఎస్సార్ లా నేస్తం' చెక్కును అందజేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, అమరావతి: యువ న్యాయవాదులకు అండగా నిలుస్తూ ప్రవేశపెట్టిన 'వైఎస్సార్ లా నేస్తం' లాంటి పథకం దేశంలో మరే రాష్ట్రంలోనూ లేదని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. యువ న్యాయవాదులు వృత్తిలో ప్రవేశించిన తొలి మూడేళ్ల పాటు ఆర్థికంగా ఊతమిచ్చేలా ఈ పథకాన్ని రూపొందించామన్నారు. నాలుగేళ్లుగా లా నేస్తం పథకాన్ని అమలు చేస్తూ ఇప్పటివరకు 5,781 మందికి మొత్తం రూ.41.52 కోట్లు అందించినట్లు చెప్పారు. ఈ ఏడాది ఫిబ్రవరి – జూన్ వరకు మొదటి విడత వైఎస్సార్ లా నేస్తం సాయం కింద 2,677 మంది జూనియర్ న్యాయవాదుల ఖాతాల్లో నెలకు రూ.ఐదు వేలు స్టైఫండ్ చొప్పున రూ.25,000 అందచేస్తూ మొత్తం రూ.6,12,65,000ని ముఖ్యమంత్రి జగన్ సోమవారం తన క్యాంపు కార్యాలయం నుంచి బటన్ నొక్కి నేరుగా ఖాతాల్లో జమ చేశారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్ రెడ్డి, లా సెక్రటరీ జి.ప్రభాకర్, న్యాయవాదులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా

మిగతా 2వ పేజీలో ▶

> జూనియర్ లాయర్లు న్యాయవాద వృత్తిలో స్థిరపడ్డాక పేదల పట్ల ఇదే రీతిలో మమకారం చూపాలి. ప్రభుత్వం తరఫున ఒక అన్నగా, స్నేహితుడిగా మీ నుంచి నేను ఆశించేది అదే. దీన్ని ఎప్పుడూ మరచిపోవద్దని కోరుతున్నా.
> - ముఖ్యమంత్రి వైఎస్ జగన్

అరాచకాలకు అర్థం తెలుసా..?

- సామాజిక స్పృహతో చేసే వ్యయంపై అభాండాలా?.. పిల్లలు, మహిళల భవితవ్యంపై చేసే ఖర్చు ఆస్తుల కల్పన కాదా?
- విద్య, వైద్యం, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ రంగాలకు సర్కార్ పెద్దపీట
- చరిత్రలో తొలిసారిగా ఒకేసారి 17 కొత్త మెడికల్ కాలేజీల నిర్మాణం
- కాగ్ తాత్కాలిక అంచనాల మేరకు మూలధన వ్యయం రూ.7,581 కోట్లు

2 లో

ఫ్యాక్ట్ చెక్

- తాత్కాలిక అంచనాలతో మూల ధన వ్యయాన్ని ఇప్పుడే నిర్ధారించలేం
- టీడీపీ హయాంలో ఏటా రూ.15,227 కోట్లు.. ఇప్పుడు ఆర్థిక ప్రతికూలతలోనూ రూ.16,095 కోట్లు
- ఈ ఏడాది ఏప్రిల్‌లో ఒక్క నెలలోనే మూల ధన వ్యయం రూ.5,588 కోట్లు

అక్రమ మైనింగ్‌పై చర్యలు వేధింపులా?

ఫ్యాక్ట్ చెక్



- తప్పు చేసిన వారిపై కేసులు, జరిమానాలు నేరమా?.. గనుల్లో అక్రమ తవ్వకాలను నిరోధించడం తప్పంటున్న ఈనాడు పత్రిక
- వేధింపులంటూ రోత పుట్టించే రాతలు
- అక్రమార్కులు రాజకీయ నేతలైతే మినహాయింపు ఇవ్వాలనే ధోరణి
- ప్రభుత్వ రెవెన్యూ కొల్లగొడుతున్నా పట్టించుకోకుండా ఉండాలా?
- అధికారుల మనోస్థైర్యాన్ని దెబ్బతీసేలా అవాస్తవ కథనాలు

5 లో

న్యూస్‌రీల్

భారత్, అమెరికా స్నేహానికి అత్యధిక ప్రాముఖ్యత



భారత్–అమెరికా భాగస్వామ్యానికి, స్నేహానికి ప్రపంచంలోనే అత్యధిక ప్రాముఖ్యత ఉందని అమెరికా అధ్యక్షుడు బైడెన్ ట్వీట్ చేశారు. ఇరు దేశాల సంబంధాలు గతంలో ఎన్నడూ లేనంత బలంగా ఉన్నాయని పేర్కొన్నారు.
వివరాలు 6లో ▸

కాంగ్రెస్‌లోకి పొంగులేటి, జూపల్లి



తెలంగాణకు చెందిన మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు సహా 35 మంది నేతలు కాంగ్రెస్‌లో చేరబోతున్నారు. వీరంతా ఢిల్లీలో కాంగ్రెస్ నేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంకతో భేటీ అయ్యారు.
వివరాలు 10లో ▸

టీడీపీతో పొత్తు పెట్టుకోం



రానున్న ఎన్నికల్లో టీడీపీతో పొత్తు పెట్టుకునేది లేదని.. జనసేనతో మాత్రమే కలిసి నడుస్తామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోమువీర్రాజు స్పష్టం చేశారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా వద్దు ప్యాకేజీ చాలని చంద్రబాబే కేంద్రాన్ని కోరారని తెలిపారు.
వివరాలు 10లో ▸

ఒడిశాలో ఘోర ప్రమాదం



ఒడిశాలోని గంజాం జిల్లా దిగపహండి సమీపంలో రెండు బస్సులు ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఓ పెళ్లి బృందానికి చెందిన 12 మంది మరణించారు. మరో ఏడుగురు గాయపడ్డారు. ఈ ఘటనపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.
వివరాలు 6లో ▸

ఐటీ ఎగుమతుల్లో బూమ్
నాలుగేళ్లలో 34 శాతం పెరిగిన ఎగుమతులు

- ఎస్‌టీపీఐతో పోలిస్తే వీసెజ్ ఐటీ ఎగుమతుల్లో భారీ వృద్ధి
- రూ.240 కోట్ల నుంచి రూ.677 కోట్లకు చేరిక
- రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహంతో విస్తరిస్తున్న కంపెనీలు
- విశాఖతోపాటు ద్వితీయ శ్రేణి పట్టణాలపైనా దృష్టి



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఐటీ ఎగుమతులు గత నాలుగేళ్లుగా వేగంగా విస్తరిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటుతో పలు ఐటీ కంపెనీలు కార్యకలాపాలు ప్రారంభిస్తుండటంతో ఐటీ ఎగుమతుల్లో గణనీయమైన వృద్ధి నమోదవుతోంది. స్టాఫ్ట్‌వేర్ టెక్నాలజీస్ పార్క్స్ ఆఫ్ ఇండియా (ఎస్‌టీపీఐ), వీసెజ్‌ల్లో నమోదైన ఐటీ కంపెనీల ద్వారా 2022–23లో రాష్ట్రంలో రూ.1,649.25 కోట్ల విలువైన ఐటీ ఎగుమతులు జరిగినట్లు ఐటీ శాఖ ప్రాథమికంగా అంచనా వేసింది. ఇందులో ఎస్‌టీపీఐలో నమోదైన ఐటీ కంపెనీల ద్వారా రూ.972.43 కోట్ల ఎగుమతులు జరగగా వీసెజ్ కంపెనీల ద్వారా రూ.676.82 కోట్ల ఎగుమతులు జరిగాయి.

రూ.5,000 కోట్లపైనే!

2019–20లో ఏపీ నుంచి రూ.1,087.4 కోట్ల ఐటీ ఎగుమతులు నమోదు కాగా నాలుగేళ్లలో 34 శాతం పెరిగాయి. నాలుగేళ్లలో ఎస్‌టీపీఐ కంపెనీల ద్వారా

మిగతా 10వ పేజీలో ▶

ఇదండీ జగత్



విపక్షాల భేటీ తర్వాత డెవలప్‌మెంట్ బాగా కనిపిస్తోంది.. సంతోషం!



ఇక్కడ సీటొస్తే.. విదేశాల్లో చదవొచ్చు
విదేశీ విద్యలో 'జేఎన్‌టీయూ కే'క

- న్యాక్ ఏ ప్లస్ హోదాతో సానుకూల వాతావరణం.. ఇప్పటికే స్వీడన్, యూఎస్, జర్మనీ యూనివర్సిటీలతో ఒప్పందం
- మరో 45 దేశాల వర్సిటీ ఎంటీసీలతో సంప్రదింపులు.. ఈ ఏడాది నుంచి కోర్సులు అందించేలా ప్రణాళికలు

- వివరాలు 2లో


గోదావరి జిల్లాలను దత్తత తీసుకుంటా



ఉభయ గోదావరి జిల్లాలను దత్తత తీసుకుంటా. 34 అసెంబ్లీ స్థానాల్లో ఒక్క సీటు కూడా వైఎస్సార్‌సీపీ గెలవకుండా చేస్తా. అందు కోసం నేనే తిరుగుతా. నేను సీఎం కావాలని కోరుకోవడం లేదు. చిన్నప్పుడు నేను నర్సాపురం బస్టాండ్‌లో తప్పిపోయా. అదృష్టవశాత్తు దొరికా.. లేకపోతే ఇక్కడే తిరుగుతూ ఉండేవాడిని.
– జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్

10 లో

పవన్ కులాలు, మతాలను రెచ్చగొడుతున్నారు



పవన్ కళ్యాణ్ పదే పదే మతాలు, కులాలను రెచ్చగొట్టి విధ్వంసం సృష్టించడానికి ప్రయత్నిస్తున్నారు. రంగాను హత్య చేయించింది చంద్రబాబే. ముద్రగడ పద్మనాభం కాపుల సంక్షేమం కోసం పోరాడుతుంటే.. ఆ పోరాటాన్ని అణగదొక్కిన ఘనత కూడా చంద్రబాబుదే. వీటిపై పవన్‌కళ్యాణ్ చంద్రబాబును ఒక్కసారి కూడా ప్రశ్నించలేదు. అసలు కాపులకు పవన్ చేసింది ఏమిటి? రాజకీయాల్లో ప్రేమను పంచాలి. చెప్పులు కాదు.
– డిప్యూటీ సీఎం నారాయణస్వామి

10 లో

క్లుప్తంగా...

నేడు 'నెక్స్ట్'పై వెబినార్

సాక్షి, అమరావతి: నేషనల్ ఎగ్జిట్ టెస్ట్ (నెక్స్ట్)పై మంగళవారం నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) వెబినార్ నిర్వహించనుంది. దేశవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలు ఈ వెబినార్‌లో పాల్గొనాలని ఇప్పటికే ఎన్ఎంసీ ఆదేశాలు జారీచేసింది. ఎంబీబీఎస్ పాసైనవారు ఉన్నత విద్య, ప్రాక్టీస్, రిజిస్ట్రేషన్‌ల కోసం ప్రస్తుతం అనుసరిస్తున్న వేర్వేరు విధానాలన్నింటినీ తొలగించి నెక్స్ట్ పేరుతో ఉమ్మడి పరీక్ష నిర్వహించాలని ఎన్ఎంసీ భావిస్తోంది. ఈ క్రమంలో నెక్స్ట్ గురించి విద్యార్థులు, అధ్యాపకులకు ఈ వెబినార్‌లో ఎన్ఎంసీ చైర్మన్ సురేశ్ చంద్ర శర్మ వివరిస్తారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ వైద్య కళాశాలల్లో వెబినార్ కోసం లెక్చర్ హాల్స్‌లో ప్రిన్సిపాల్స్ ఏర్పాట్లుచేశారు.

ఏపీపీఎస్సీ సభ్యురాలిగా సెలీనా బాధ్యతల స్వీకరణ


సెలీనాను అభినందిస్తున్న గౌతమ్ సవాంగ్

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యురాలిగా డాక్టర్ బి.ఎస్.సెలీనా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కమిషన్ చైర్మన్ గౌతమ్ సవాంగ్ ఆమెతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో ఏపీపీఎస్సీ కార్యదర్శి ప్రదీప్ కుమార్, సభ్యులు సలామ్‌బాబు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలిలో అకడమిక్ అధికారిగా పనిచేస్తున్న సెలీనాను రాష్ట్ర ప్రభుత్వం ఏప్రిల్‌లో ఏపీపీఎస్సీ సభ్యురాలిగా నియమించిన విషయం తెలిసిందే.

■ తెలంగాణ

'మార్గదర్శి'లాంటి స్కాం ఇప్పటివరకు జరగలేదు

- తెలంగాణ హైకోర్టుకు తెలిపిన ఏపీ ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: మార్గదర్శి చిట్‌ఫండ్స్ ప్రైవేట్ లిమిటెడ్ లాంటి కుంభకోణం ఇప్పటి వరకు జరగలేదని, ఇకపై జరగబోదని ఏపీ ప్రభుత్వం తెలంగాణ హైకోర్టుకు తెలిపింది. మార్గదర్శి కేసు దర్యాప్తు వివరాలను సీఐడీ అధికారులు మీడియాకు వెల్లడిస్తున్నారని, దీన్ని అడ్డుకోవాలని కోరుతూ చెరుకూరి రామోజీరావు, శైలజ, మార్గదర్శి చిట్‌ఫండ్స్ ప్రై. లిమిటెడ్ తెలంగాణ హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. ఏపీ ప్రభుత్వం తరఫున స్పెషల్ జీపీ గోవిందరెడ్డి వాదనలు వినిపించారు. మార్గదర్శి అక్రమ మార్గాల్లో తరలించిన సొమ్మంతా ఖాతాదారులదేనని చెప్పారు. ఆర్టికల్ 19(1)(ఎ) ప్రకారం విచారణ వివరాలు తెలుసుకునే ప్రాథమిక హక్కు వారికి ఉందన్నారు. అసలు మార్గదర్శి వేసిన పలు పిటిషన్లపై విచారణ జరిపే అర్హత ఈ కోర్టుకు ఉందా.. అన్న అంశంపై విచారణ సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉందని చెప్పారు. ఈ పిటిషన్ జూలై 18న విచారణకు రానుందని, అప్పటివరకు ఎలాంటి ఆదేశాలు ఇవ్వొద్దని విజ్ఞప్తి చేశారు. వాదనలు విన్న ధర్మాసనం.. ఏపీ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేస్తూ విచారణను జూలై 20కి వాయిదా వేసింది.

పార్లమెంట్, అసెంబ్లీ స్థానాల పునర్విభజనపై కుట్ర

- ఎంపీ ఆర్.కృష్ణయ్య

కాచిగూడ (హైదరాబాద్): దేశాన్ని ప్రాంతాల వారీగా రాజకీయ విభజన చేసి, తద్వారా వచ్చే ఎన్నికల్లో విజయం సాధించాలని బీజేపీ భావిస్తుందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. సోమవారం కాచిగూడలో 'పార్లమెంట్, అసెంబ్లీ స్థానాల పునర్విభజనపై కేంద్ర ప్రభుత్వం కుట్ర' అనే అంశంపై సదస్సు జరిగింది. ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ జనాభా నిష్పత్తి ఆధారంగా పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజన జరిగితే ఉత్తరాదిలో స్థానాల సంఖ్య గణనీయంగా పెరుగుతుందని, చట్టసభల్లో దక్షిణాది రాష్ట్రాల రాజకీయ ప్రాధాన్యత తగ్గుతుందన్నారు.

ప్రైవేటు బస్సు బోల్తా

సుల్తానాబాద్ రూరల్: పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి వద్ద రాజీవ్ రహదారిపై ఓ ప్రైవేటు బస్సు అదుపు తప్పి బోల్తా పడింది. సోమవారం ఉదయం జరిగిన ఈ ఘటనలో సుమారు 45 మంది గాయపడ్డారు. పెద్దపల్లి జిల్లా రామగుండం సీకాలనీకి చెందిన జెన్‌కో ఉద్యోగి బాబా కూతురు పెళ్లి రిసెప్షన్ వేడుక ఆదివారం రాత్రి హైదరాబాద్‌లో ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి బాబా తమ బంధువులతో కలిసి ప్రైవేట్ బస్సును అద్దెకు తీసుకుని దాదాపు 50మందికి పైగా వెళ్లారు. శుభ కార్యం ముగిసిన అనంతరం తిరిగి వస్తున్నారు. ఉదయం ఎనిమిది గంటల సమయంలో కాట్నపల్లి వద్దకు రాగానే ఓ ఆటో అడ్డు వచ్చింది. దానిని డ్రైవర్ తప్పించే క్రమంలో బస్సు డివైడర్‌ను ఢీకొని ఒక్కసారిగా బోల్తా పడింది. ఈ ఘటనలో 45 మంది గాయపడ్డారు. వీరిలో 10మందికి తీవ్ర గాయాలయ్యాయి. బస్సు బోల్తా పడడంతో అందులో ఉన్న వారు పెద్ద పెట్టున కేకలు వేశారు. వారి హాహాకారాలు విన్న స్థానికులు వెంటనే తేరుకుని బస్సు వద్దకు పరుగులు తీశారు. గాయపడిన వారిని సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఇక్కడ సీటొస్తే.. విదేశాల్లో చదవొచ్చు

- ఇప్పటికే స్వీడన్, యూఎస్, జర్మనీ యూనివర్సిటీలతో జేఎన్‌టీయూకే ఒప్పందం
- మరో 45 దేశాల వర్సిటీలతో చర్చలు
- న్యాక్ ఏ ప్లస్ హోదాతో సానుకూల వాతావరణం

సాక్షి ప్రతినిధి, కాకినాడ: డాలర్ల డ్రీమ్ ఇప్పటి యువత కల. అందుకోసం విదేశాల్లో ఉన్నత చదువులు చదివి అక్కడే స్థిరపడాలని యువత భావిస్తోంది. ఈ కలను సాకారం చేసుకోవాలంటే.. పొరుగు దేశం వెళ్లి ఏ కోర్సు చేయాలన్నా ఆ దేశం నుంచి వీసా పొందటం, విదేశీ యూనివర్సిటీలలో సీటు పొందడం ఇలా ఎన్నింటినో దాటాలి. ఇలాంటి వ్యయప్రయాసలకు చెక్ పెట్టి విదేశాల్లో ఎంఎస్ చేయాలన్న కలను సాకారం చేస్తోంది కాకినాడలోని జేఎన్‌టీయూ. ఇప్పటికే స్వీడన్‌లో బ్లేకింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ యూనివర్సిటీ, యూఎస్‌లో నార్తర్న్ ఆరిజోనా యూనివర్సిటీలతో ఒప్పందం చేసుకుని పలు కోర్సుల్లో నాలుగేళ్ల డిగ్రీ, ఆరేళ్ల డ్యూయల్ డిగ్రీలకు అవకాశం కల్పిస్తోంది.

45 దేశాల యూనివర్సిటీలతో..

ఇటీవల నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (న్యాక్) ఏ ప్లస్ హోదాను సాధించిన జేఎన్‌టీయూకే (కాకినాడ) విదేశీ విద్య కోసం 45 దేశాల్లోని వివిధ యూనివర్సిటీలతో ఒప్పందాలకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఇందుకోసం ఢిల్లీలోని ఎడ్యుకేషనల్ కన్సల్టెంట్ ఇండియా లిమిటెడ్‌లో సేవలందించిన డాక్టర్ షేక్ సులేమాన్, విదేశీ సేవల కోసం ఫారిన్ యూనివర్సిటీ అడ్మిషన్ డైరెక్టర్ ప్రొఫెసర్ కె.శివనాగరాజును నియమించుకుంది. విద్యార్థులకు ఇబ్బంది లేకుండా వీసా నుంచి యూనివర్సిటీలో అడ్మిషన్ వరకు అంతా జేఎన్‌టీయూకే చూసుకుంటోంది.


విదేశీ వర్సిటీల్లో కోర్సులపై సమావేశమైన జేఎన్‌టీయూకే ప్రతినిధులు (ఫైల్)

జేఎన్‌టీయూకే అందిస్తున్న కోర్సులు

స్వీడన్ బ్లేకింగ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీతో సీఎస్ఈ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్, ఈసీఈ విభాగాల్లో 20 సీట్ల చొప్పున 60 సీట్లతో జేఎన్‌టీయూకే ఒప్పందం చేసుకుంది. ఈ కోర్సు వ్యవధి నాలుగు లేదా ఆరు సంవత్సరాలు. నాలుగు సంవత్సరాల కోర్సులో చేరితే మూడేళ్లు జేఎన్‌టీయూ (కాకినాడ)లోను, ఒక ఏడాది స్వీడన్‌లో అభ్యసిస్తే డిగ్రీ సర్టిఫికెట్ లభిస్తుంది. అదే మూడేళ్లు ఇక్కడ మరో మూడేళ్లు స్వీడన్‌లో అభ్యసిస్తే డ్యూయల్ డిగ్రీ అంటే ఎంఎస్ అర్హత గల సర్టిఫికెట్ అందజేస్తారు. ఫీజు జేఎన్‌టీయూకేలో ఏడాదికి రూ.1.50 లక్షలు, స్వీడన్‌లో ఏడాదికి సుమారు రూ.7 లక్షలు వరకు చెల్లించాలి. యూఎస్‌లోని నార్తర్న్ ఆరిజోనా యూనివర్సిటీలో ఈసీఈ విభాగంలో నాలుగు సంవత్సరాల కోర్సుకు సంబంధించి ఒప్పందం చేసుకుంది. ఈ కోర్సును మూడేళ్లపాటు జేఎన్‌టీయూకేలోను, ఒక ఏడాది యూఎస్‌లోను అభ్యసించాల్సి ఉంటుంది. ఈ కోర్సు పూర్తి చేయడానికి దాదాపు రూ.25 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు ఖర్చవుతుంది. జర్మనీలో స్టెబిన్స్ యూనివర్సిటీలో ఎంప్లాయ్‌మెంట్ లింక్డ్ మాస్టర్ ప్రోగ్రాం రెండేళ్ల కాల వ్యవధితో అందించేందుకు జేఎన్‌టీయూకే ఒప్పందం చేసుకుంది. బీటెక్ చేసిన అభ్యర్థులు ఈ కోర్సులో చేరేందుకు అర్హులు. స్టెబిన్స్ యూనివర్సిటీ నిర్వహించిన పరీక్షలో ఉత్తీర్ణతతో సీటు సాధిస్తే ఉచిత విద్యతో పాటు క్యాంపస్ ఇంటర్వ్యూలు ఉంటాయి.

ప్రవేశాలు ఇలా..

ఈ ఏపీ సెట్ లేదా జేఈఈ, టీఎస్ ఎంసెట్‌లో అర్హత సాధించాలి. ఇంటర్మీడియెట్‌లో ఎంపీసీ ఉత్తీర్ణులై కనీసం 60 శాతం మార్కులు పొందాలి. వివరాలకు జేఎన్‌టీయూకే ఫారిన్ వర్సిటీ రిలేషన్స్ డైరెక్టర్ కార్యాలయంలో సంప్రదించవచ్చు.

విదేశీ ఒప్పందాలకు ప్రణాళిక



ఇప్పటికే అందిస్తున్న కోర్సులకు స్పందన బాగుంది. ఇటీవల న్యాక్ ఏ ప్లస్ హోదా రావడంతో 45 దేశాల్లో పేరొందిన యూనివర్సిటీలతో ఒప్పందాలకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం. జేఎన్‌టీయూకేలో మూడేళ్లు అభ్యసించి నాలుగో ఏడాది విదేశీ కోర్సు చదవచ్చు. ఒప్పందం ప్రకారం విదేశీ యూనివర్సిటీలే మన విద్యార్థులకు పూర్తి సహకారం అందిస్తాయి.
– జీవీఆర్ ప్రసాదరాజు, వీసీ, జేఎన్‌టీయూకే

బ్యాంకులు నిష్పాక్షికంగా వ్యవహరించాలి

- స్థలం వేలం విషయంలో కెనరా బ్యాంకును తప్పుపట్టిన హైకోర్టు
- బ్యాంకు చట్ట విరుద్ధంగా వ్యవహరించింది
- వేలంలో విజేత చెల్లించిన సొమ్మును ముందే ఎలా సర్దుబాటు చేస్తారు?
- చివరి తేదీ వరకు ఆ మొత్తంపై బ్యాంకుకు అధికారం ఉండదు
- వేలం విజేత చెల్లించిన మొత్తం వాపసు చేయాలి
- తీర్పు వెలువరించిన జస్టిస్ సోమయాజులు ధర్మాసనం

సాక్షి, అమరావతి: ఓ ఆస్తి వేలం వ్యవహారంలో కెనరా బ్యాంకు తీరును హైకోర్టు తీవ్రంగా ఆక్షేపించింది. బాకీదారుతో వన్‌టైం సెటిల్‌మెంట్‌కు అంగీకరించి, అతని రుణ ఖాతాను మూసివేసిన కెనరా బ్యాంకు.., మరో వైపు అదే ఆస్తిని బ్యాంకు వేలంలో కొన్న వ్యక్తి నుంచి ముందస్తుగా కొంత వసూలు చేసి, గడువు తేదీకి ముందే దానిని జప్తు/సర్దుబాటు చేయడాన్ని తప్పుపట్టింది. చెల్లింపు చివరి తేదీ వరకు మొత్తం డబ్బు చెల్లించేందుకు వేలంలో విజేతకు అవకాశం ఉంటుందని తెలిపింది. చివరి తేదీన మొత్తం డబ్బు చెల్లించని పక్షంలో మాత్రమే అతని ముందస్తు చెల్లింపులను జప్తు చేసే అధికారం బ్యాంకుకు ఉంటుందని తేల్చి చెప్పింది. ఈ కేసులో కెనరా బ్యాంకు హద్దుమీరడమే కాక, చట్ట విరుద్ధంగా కూడా వ్యవహరించిందని స్పష్టం చేసింది. వేలం వేసిన స్థలం విషయంలో బ్యాంకు నిష్పాక్షికంగా వ్యవహరించలేదంది. ఆ స్థలానికి రెండు భారీ భవంతుల మధ్య సన్నని తోవ గుండా వెళ్లాలన్న విషయాన్ని వేలం ప్రకటనలో తెలియజేయకపోవడాన్ని హైకోర్టు తప్పుపట్టింది. జాతీయ బ్యాంకుగా దాని చర్యలు నిష్పాక్షికంగా, పారదర్శకంగా ఉండాలని తేల్చి చెప్పింది. పిటిషనర్ ముందుగా చెల్లించిన రూ.22.50 లక్షలు, గడువు తేదీ రోజు చెల్లించిన రూ.15 లక్షలను కూడా వాపసు చేయాలని బ్యాంకును ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు, జస్టిస్ ఊటుకూరు శ్రీనివాస్ ధర్మాసనం ఇటీవల తీర్పు వెలువరించింది.



జరిగిందిదీ..
పెరుమాళ్ల ఆగ్రో ఇండస్ట్రీస్ గుంటూరు విద్యానగర్‌లోని 302.50 చదరపు గజాల స్థలాన్ని తనఖా పెట్టి కెనరా బ్యాంకు నుంచి రుణం తీసుకుంది. ఆ రుణం తిరిగి చెల్లించకపోవడంతో బ్యాంకు ఆ స్థలాన్ని వేలం వేసింది. వేలంలో చిలకలూరిపేటకు చెందిన సయ్యద్ హిదయతుల్లా బిడ్‌ను 2019 ఆగస్టు 26న ఆమోదించారు. నిబంధనల ప్రకారం బిడ్ మొత్తంలో 25 శాతం కింద రూ.22.50 లక్షలు ఆయన చెల్లించారు. మిగిలిన మొత్తం చెల్లించేందుకు 2019 అక్టోబరు 25 చివరి తేదీగా నిర్ణయించారు. ఆ తేదీన హిదయతుల్లా రూ.15 లక్షలు మాత్రమే చెల్లించారు. కెనరా బ్యాంకు 2019 సెప్టెంబరు 9న రూ.22.50 లక్షలను పెరుమాళ్ల ఆగ్రో ఇండస్ట్రీస్ రుణ ఖాతా కింద సర్దుబాటు చేసింది. హిదయతుల్లా స్థలం లింకు డాక్యుమెంట్లు, ఇతర వివరాలను కోరినా బ్యాంకు ఇవ్వలేదు. స్థలం ఎల్ ఆకారంలో ఉండటం, రెండు భారీ భవంతుల మధ్య నుంచి సన్నని తోవ గుండా వెళ్లాల్సి రావడంపై ఆయన అభ్యంతరం తెలిపారు. తాను చెల్లించిన మొత్తాన్ని వాపసు ఇవ్వాలని బ్యాంకు అధికారులను కోరారు. వారు స్పందించకపోవడంతో 2019లో హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యంపై జస్టిస్ సోమయాజులు ధర్మాసనం ఇటీవల తుది విచారణ జరిపి, తీర్పు ఇచ్చింది.

ప్రభుత్వ పాలన ప్రజలకు చేరువయ్యేలా పనిచేయాలి

ఐఏఎస్ ప్రొబేషనర్లకు సీఎం వైఎస్ జగన్ సూచన

సాక్షి, అమరావతి: ఐఏఎస్ ప్రొబేషనర్లు (ఏపీ క్యాడర్ అసిస్టెంట్ కలెక్టర్స్ అండర్ ట్రైనింగ్ 2022 బ్యాచ్) 10 మంది సోమవారం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రభుత్వ పాలనను ప్రజలకు చేరువ చేసేలా పనిచేయాలని.. సామాన్యులకు అందుబాటులో ఉండాలని సీఎం వైఎస్ జగన్ ఈ సందర్భంగా వారికి మార్గనిర్దేశం చేశారు. సీఎంను కలిసిన వారిలో ఐఏఎస్ ప్రొబేషనర్లు బి.స్మరణ్‌రాజ్(అనకాపల్లి జిల్లాకు అలాట్‌మెంట్), బి.సహదిత్ వెంకట్ త్రివినాగ్(విజయనగరం), సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి(తూర్పుగోదావరి), కల్పశ్రీ కే.ఆర్(పల్నాడు), కుషల్ జైన్(అనంతపురం), మంత్రి మౌర్య భరద్వాజ్(వైఎస్సార్), రాఘవేంద్ర మీనా(శ్రీకాకుళం), సౌర్యమన్ పటేల్(ప్రకాశం), తిరుమణి శ్రీ పూజ(ఏలూరు), వి.సంజనా సింహ(ఎస్పీఎస్ఆర్ నెల్లూరు)తో పాటు ఏపీ హెచ్ఆర్‌డీ డీజీ ఆర్పీ సిసోడియా, ఏపీ హెచ్ఆర్‌డీ జేడీజీ పి.ఎస్.ప్రద్యుమ్న తదితరులున్నారు.


సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన శిక్షణలో ఉన్న ఏపీ క్యాడర్ 2022 బ్యాచ్ అసిస్టెంట్ కలెక్టర్లు

విద్యుత్‌తో జాగ్రత్త

- విద్యుత్ వినియోగం, భద్రతపై ప్రజల్లో అవగాహనకు వారోత్సవాలు
- ఎలక్ట్రికల్ సేఫ్టీ డైరెక్టర్ జి.విజయలక్ష్మి

సాక్షి, అమరావతి: విద్యుత్ వినియోగంలో అజాగ్రత్తగా వ్యవహరించినా.. ఆటలాడినా పెను ప్రమాదం సంభవిస్తుందని రాష్ట్ర విద్యుత్ భద్రతా సంచాలకులు, ప్రధాన విద్యుత్ తనిఖీ అధికారి జి.విజయలక్ష్మి అన్నారు. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా మెలగాలని సూచించారు. రాష్ట్రంలో విద్యుత్ భద్రతా వారోత్సవాలు సోమవారం నుంచి మొదలయ్యాయి. ఈ సందర్భంగా విజయలక్ష్మి 'సాక్షి'తో మాట్లాడారు. నేషనల్ సేఫ్టీ కౌన్సిల్ సహకారంతో రాష్ట్ర విద్యుత్ భద్రతా విభాగం అధికారులు, సిబ్బంది జూలై 2 వరకు వినియోగదారులకు అవగాహన కల్పిస్తారని చెప్పారు. పరిశ్రమలు, ఆస్పత్రులు, సినిమా హాళ్లు, స్కూళ్లు, బహుళ అంతస్తుల భవనాలు, షాపింగ్ మాల్స్‌లలో విద్యుత్ భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. నగరాలు, పట్టణాల్లో భద్రతకు తీసుకోవాల్సిన చర్యలపై బ్యానర్లను కూడా ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు.



ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు..

- ఐఎస్ఐ గుర్తు ఉన్న ఎలక్ట్రికల్ ఉపకరణాలే వాడాలి
- నీటి పైపులు, విద్యుత్ వైర్లు.. ఒక దానికి ఒకటి దగ్గరగా ఉండవద్దు. టూ పిన్ ప్లగ్ సాకెట్లను ఉపయోగించవద్దు. త్రీ పిన్ ప్లగ్‌లను వినియోగించాలి. విరిగిన స్విచ్‌లు, ప్లగ్‌లు ఉపయోగించవద్దు.
- ఎర్త్ కనెక్షన్ లేకుండా వాటర్ హీటర్లు, ఎలక్ట్రిక్ ఐరన్ తదితరాలను వాడకూడదు.
- తడి చేతితో విద్యుత్ పరికరాలు, స్విచ్‌లు ఉపయోగించవద్దు.
- ఎలక్ట్రికల్ పరికరాలపై పనిచేసేటప్పుడు రబ్బరు చేతి తొడుగులు ఉపయోగించాలి.
- ఓవర్ హెడ్ కింద లైన్లకు సమీపంలో ఇళ్లను నిర్మించవద్దు.
- తెగిపడిన విద్యుత్ తీగలకు దూరంగా ఉండాలి. వాటి గురించి వెంటనే విద్యుత్ శాఖ అధికారులకు తెలియజేయాలి.
- విద్యుత్ ప్రమాదం జరిగితే పోలీసులకు, విద్యుత్ అధికారులకు వెంటనే సమాచారమివ్వండి.

4న హైదరాబాద్‌కు రాష్ట్రపతి ముర్ము రాక

అల్లూరి 125వ జయంతిలో పాల్గొననున్న రాష్ట్రపతి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జూలై 4వ తేదీన హైదరాబాద్ పర్యటనకు రానున్నారు. అదేరోజు సాయంత్రం అల్లూరి సీతారామరాజు 125వ జయంతి వేడుకల్లో పాల్గొననున్నారు. రాష్ట్రపతి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశించారు. రాష్ట్రపతి పర్యటన ఏర్పాట్లపై సోమవారం సచివాలయంలో డీజీపీ అంజనీకుమార్‌తో సమీక్ష నిర్వహించారు. ప్రొటోకాల్‌ను అనుసరించి ఏవిధమైన లోటుపాట్లు లేకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో రాష్ట్రపతి పర్యటనను విజయవంతం చేయాలన్నారు.

పేదలకు మీరే నేస్తం


'వైఎస్సార్ లా నేస్తం' కింద జూనియర్ న్యాయవాదులకు ఆర్థిక సాయం విడుదల చేస్తున్న సీఎం జగన్

▶ మొదటి పేజీ తరువాయి
సీఎం జగన్ ఏమన్నారంటే...

వృత్తిలో నిలదొక్కుకునేలా..
న్యాయవాదులు లా కోర్సు పూర్తి చేసిన మొదటి మూడేళ్లు ప్రాక్టీస్‌పరంగా నిలదొక్కుకోవాల్సిన అవసరం ఉంది. అప్పుడే చదువులు పూర్తయి కోర్టుల్లో అడుగుపెడుతున్న తరుణంలో వారి కాళ్లమీద వాళ్లు నిలబడేలా తోడుగా నిలిచి నెలకు రూ.5 వేలు చొప్పున ఏడాదిలో రూ.60 వేలు ఇస్తున్నాం. మూడేళ్లలో ఇలా ఒక్కొక్కరికీ రూ.1.80 లక్షలు అందిస్తున్నాం. దీనివల్ల వృత్తిలో ఇబ్బంది పడకుండా నిలదొక్కుకుని ముందుకు వెళ్తారన్న ఆలోచనతో ఈ పథకాన్ని ప్రారంభించాం. ఇది ఒక మంచి ఆలోచన, మంచి కార్యక్రమం.

రూ.వంద కోట్లతో వెల్ఫేర్ ట్రస్ట్..
ఇలాంటి ఆలోచన, ఇలాంటి పథకం కేవలం మన రాష్ట్రంలో మాత్రమే అమలు జరుగుతోంది. ఇదొక్కటే కాకుండా అడ్వొకేట్లకు అన్ని రకాలుగా మంచి జరగాలనే ఉద్దేశంతో రూ.100 కోట్లతో అడ్వొకేట్ జనరల్ ఆధ్వర్యంలో ఇప్పటికే వెల్ఫేర్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేశాం. మెడిక్లెయిమ్, న్యాయవాదుల అవసరాలకు రుణాలు లాంటి వాటికి ఈ ఫండ్ నుంచి రూ.25 కోట్లు సహాయం చేశాం. ఈ రెండు కార్యక్రమాల ద్వారా అడ్వొకేట్లకు రాష్ట్ర ప్రభుత్వం తోడుగా ఉందనే సంకేతం వెళ్లింది.

ఇంకా బాగా ఉపయోగపడాలని..
ఇంత మనసు పెట్టి ఈ కార్యక్రమాన్ని చేస్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వం తరఫు నుంచి నేను న్యాయవాదులను కోరేది ఒక్కటే.. జూనియర్ న్యాయవాదులకు ఈ పథకం ద్వారా మంచి జరిగితే వారు వృత్తిలో స్థిరపడ్డాక ఇదే మమకారాన్ని పేదల పట్ల చూపిస్తారని విశ్వసిస్తున్నా. ఒక అన్నగా, స్నేహితుడిగా వారి దగ్గరనుంచి నేను ఆశిస్తున్నది ఇదే. దేవుడి దయ వల్ల మంచి జరుగుతోంది. దీన్ని ఎప్పుడూ మరచిపోవద్దని కోరుతున్నా. ఈ మంచిని ప్రతి పేదవాడికి తిరిగి బదిలీ అయ్యేలా గుర్తుంచుకోవాలని కోరుకుంటున్నా. వైఎస్సార్ లా నేస్తం ద్వారా ఆర్నెల్లకు కలిపి ఒకేసారి మొత్తం రూ.30 వేలు అందిస్తే జూనియర్ న్యాయవాదులకు ఇంకా బాగా ఉపయోగపడుతుందన్న ఉద్దేశంతో క్రితం సారి మార్పులు చేశాం. మళ్లీ డిసెంబరులో ఈ ఏడాది రెండో దఫాకి సంబంధించిన కార్యక్రమం జరుగుతుంది. వీటన్నింటి వల్ల న్యాయవాదులకు మంచి జరగాలని కోరుకుంటున్నా.

మీ స్ఫూర్తితో పేదలకు సాయం చేస్తా


నేను గుంటూరు బార్ అసోసియేషన్‌లో జూనియర్ అడ్వొకేట్‌గా ప్రాక్టీస్ చేస్తున్నా. నిరుపేద కుటుంబానికి చెందిన నేను చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయా. మా బాబాయి కూలి పనులు చేస్తూ తన పిల్లలతో పాటు నన్ను చదివించారు. లా కోర్సు పూర్తవగానే గుంటూరులో ఎక్కడ ఉండాలో అర్థం కాలేదు. స్పందనలో దరఖాస్తు చేసుకోగానే మహిళా ప్రాంగణంలో వసతి కల్పించారు. వైఎస్సార్ లా నేస్తం కింద నెలకు రూ.ఐదు వేలు చొప్పున రెండేళ్లుగా అందుతోంది. మా బాబాయి పిల్లలకు అమ్మ ఒడి, విద్యా కానుక, విద్యా దీవెన వస్తోంది. పిన్నికి చేయూత అందుతోంది. అందరి సంక్షేమం కోసం ఆలోచిస్తున్న ఇలాంటి ప్రభుత్వం, సీఎం దీర్ఘకాలం ప్రజలకు సేవ అందించాలి. మీ స్ఫూర్తితో పేదలకు న్యాయం సాయం చేస్తాను సార్.
– రత్నకుమారి, న్యాయవాది, గుంటూరు

మాలాంటి జూనియర్లకు ఎంతో ఉపయోగం

జూనియర్ అడ్వొకేట్‌గా 2020లో బెజవాడ బార్ అసోసియేషన్‌లో ప్రాక్టీస్ ప్రారంభించా. పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు మీరు సాయం చేస్తుండడంతో మాలాంటి ఎంతోమంది జూనియర్ అడ్వొకేట్స్ లబ్ధి పొందుతున్నారు. లా నేస్తం పథకానికి దరఖాస్తు చేయగానే వెరిఫికేషన్ చేసి మంజూరు చేశారు. మీరు అందిస్తున్న ఈ సాయం నాకు చాలా ఉపయోగపడుతుంది. అడ్వొకేట్స్ కమ్యూనిటీ నుంచి మా మద్దతు మీకు ఎప్పుడూ ఉంటుంది.
– అరవింద్, అడ్వొకేట్, విజయవాడ

అరాచకాలకు అర్థం తెలుసా..?

- సామాజిక స్పృహతో చేసే వ్యయంపై అభాండాలా?..
- పిల్లలు, మహిళల భవితవ్యంపై చేసే ఖర్చు ఆస్తుల కల్పన కాదా?
- టీడీపీ హయాంలో ఏటా రూ.15,227.80 కోట్లు.. ఇప్పుడు ఆర్థిక ప్రతికూలతలోనూ రూ.16,095.90 కోట్లు



సాక్షి, అమరావతి: అంతులేని కసి.. ఆపై సొంత కవిత్వం.. వెరసి అట్టడుగున రాష్ట్రమంటూ శోకాలు!! ఈ రాష్ట్రంలో సంపద సృష్టించడం లేదంటూ గగ్గోలు! మూలధనం వ్యయం అధఃపాతాళానికి చేరిందంటూ శంక! సామాజిక స్పృహ, మానవత్వంతో రైతులకు ఆర్థిక భరోసా కల్పిస్తూ పేద మహిళల జీవనోపాధిని మెరుగుపరుస్తుంటే రామోజీకి మాత్రం ఆర్థిక అరాచకంగా గోచరిస్తోంది. నిజానికి ఈనాడు ప్రచురించినట్లుగా బ్యాంక్ ఆఫ్ బరోడా నివేదికలో ఎక్కడా ఆర్థిక అరాచకం అనే ప్రస్తావనే లేకున్నా నిపుణులంటూ వక్రభాష్యం చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వాలు తమ ఆర్థిక బ్యాలెన్స్‌లు ఎలా ఉన్నాయో పరిశీలించేందుకు సంవత్సరం చివరి వరకు వేచి ఉంటాయని, మార్చి నాటికి పూర్తి చేసే పరిస్థితి ఉండదని బ్యాంక్ ఆఫ్ బరోడా నివేదికలో పేర్కొంది. కాగ్ విడుదల చేసిన ప్రొవిజనల్ (తాత్కాలిక) అంచనాల మేరకు ముగిసిన ఆర్థిక సంవత్సరంలో మూలధన వ్యయం రూ.7,581.58 కోట్లుగా ఉంది. 2021–22కి సంబంధించి కాగ్ ప్రొవిజనల్ అంచనాల్లో ద్రవ్యలోటు జీఎస్‌డీపీలో కేవలం 2.1 శాతంగా పేర్కొంది. రాష్ట్ర విభజన అనంతరం సాధారణ పరిస్థితుల్లో కూడా అంత తక్కువ లేదు. ఒకపక్క కోవిడ్ సంక్షోభం, ఆర్థిక ప్రతికూలతల నుంచి కోలుకుంటూనే ద్రవ్యలోటు జీఎస్‌డీపీలో 2.1 శాతాన్ని రాష్ట్ర ప్రభుత్వం సాధిస్తే దీన్ని జీర్ణించుకోలేని ఎల్లో మీడియా అవి కేవలం ప్రొవిజనల్ అంచనాలే అంటూ కప్పిపుచ్చే యత్నం చేసింది. ఒకపక్క కాగ్‌కు రాష్ట్ర ప్రభుత్వం అవాస్తవాలను చెబుతోందని ఆరోపణలు చేస్తూనే మరోపక్క అవే ప్రొవిజనల్ గణాంకాల ఆధారంగా మూలధన వ్యయంపై విషం చిమ్మడం విస్మయం కలిగిస్తోంది.

ప్రతికూలతలోనూ మెరుగ్గానే..

కాగ్ అకౌంట్లను పూర్తిగా ఖరారు చేసిన తరువాత ఆడిట్ నివేదికలను శాసన సభకు సమర్పిస్తారు. వాస్తవ మూలధన వ్యయం ఎంతనేది అప్పుడే తెలుస్తుంది. అప్పటి వరకు వాస్తవ మూలధన వ్యయం తెలియదు. ప్రొవిజనల్ అంచనాలను పరిగణనలోకి తీసుకున్నా సరే టీడీపీ ఐదేళ్ల పాలనతో పోల్చితే గత నాలుగేళ్లుగా మూలధన వ్యయం మెరుగ్గా ఉందని కాగ్ అకౌంట్స్ చెబుతున్నాయి. టీడీపీ పాలనలో ఏటా సగటున మూలధన వ్యయం రూ.15,227.80 కోట్లు కాగా వైఎస్సార్‌సీపీ పాలనలో ఏడాదికి రూ.16,095.90 కోట్లుగా ఉండటం గమనార్హం. కోవిడ్ సంక్షోభం, మందగమనం కారణంగా ప్రపంచవ్యాప్తంగా రెండు ఆర్థిక సంవత్సరాలు ఆర్థిక రంగంపై తీవ్ర ప్రభావం పడింది. మూలధన నిర్మాణం జీడీపీ అంచనాల్లో భాగంగా ఉంటుంది. 2020–21లో దేశం మొత్తం మీద మూలధన నిర్మాణం 7.34 శాతం క్షీణించింది. అయినప్పటికీ టీడీపీ హయాం కంటే మూల ధన వ్యయం మెరుగ్గానే ఉంది.

ఏప్రిల్‌లో మూలధన వ్యయం రూ.5,588 కోట్లు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో తొలి నెల ఏప్రిల్‌కు సంబంధించి మూల ధన వ్యయం కింద రాష్ట్ర ప్రభుత్వం రూ.5,588 కోట్లు వ్యయం చేసినట్లు తాజాగా కాగ్ పేర్కొంది. ఇది ఆర్థిక సంవత్సరం మొత్తం మీద మూల ధన వ్యయం కింద బడ్జెట్‌లో కేటాయించిన దాంట్లో 17.99 శాతానికి సమానం. ఆర్థిక సంవత్సరం తొలి నెలలోనే మూల ధన వ్యయం కింద భారీ మొత్తం వ్యయం చేయడంతో 2023–24 బడ్జెట్‌లో కేటాయించిన మొత్తం కంటే ఎక్కువ వ్యయం జరిగే అవకాశం ఉన్నట్లు స్పష్టమవుతోంది.

సామాజిక రంగంలో ఆస్తుల కల్పన కనపడదా?

చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వ రంగంలో ఒకేసారి కొత్తగా 17 మెడికల్ కాలేజీల నిర్మాణాన్ని చేపట్టిన విషయం నిజం కాదా? వీటి ద్వారా సామాజిక రంగంలో ఆస్తుల కల్పన జరగడం లేదా? మానవ సూచికలను మెరుగుపరచడం, సామాజిక ఆస్తుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది. వ్యవసాయ రంగంలో రైతులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ఏకంగా రూ.16,404 కోట్ల వ్యయంతో ప్రాజెక్టులను చేపట్టింది. విద్యా రంగంలో నాడు–నేడు కింద రూ.16,450 కోట్ల వ్యయంతో పనులు చేపట్టింది. వైద్య రంగంలో నాడు–నేడు కింద రూ.16,822 కోట్లతో బలోపేతం చేస్తోంది. ఇవన్నీ సామాజిక రంగ వ్యయం కిందకే వస్తాయి. ఆస్తుల కల్పన కిందకే వస్తుంది. సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్న ప్రభుత్వాలకు రెవెన్యూ వ్యయం ఎక్కువగా ఉంటుంది. ఈ విషయం అందరికీ తెలిసిందే. అనివార్య, అత్యవసర వ్యయాలు తలెత్తినప్పుడు మూల ధన వ్యయం తక్కువగా ఉండటం, రెవెన్యూ వ్యయం ఎక్కువగా ఉండటం సర్వసాధారణం.

మూల ధన వ్యయం ఇలా..

టీడీపీ సర్కారు

ఆర్థిక సంవత్సరం	మూలధన వ్యయం రూ.కోట్లలో
2014-15 (ఆడిట్ చేయబడింది)	7,265.00
2015-16 (ఆడిట్ చేయబడింది)	15,042.00
2016-17 (ఆడిట్ చేయబడింది)	15,707.00
2017-18 (ఆడిట్ చేయబడింది)	16,280.00
2018-19 (ఆడిట్ చేయబడింది)	21,845.00
మొత్తం	76,139.00
సగటు	15,227.80

వైఎస్సార్‌సీపీ పాలనలో..

ఆర్థిక సంవత్సరం	మూలధన వ్యయం రూ.కోట్లలో
2019 - 20 (ఆడిట్ చేయబడింది)	17,601.00
2020- 21 (ఆడిట్ చేయబడింది)	20,690.00
2021- 22 (ఆడిట్ చేయబడింది)	18,511.00
2022 - 23 (తాత్కాలిక అంచనా)	7,581.58
మొత్తం	64,383.58
సగటు	16,095.90

తగ్గేదేలే!



అమాంతంగా పెరిగిపోయిన క్రెడిట్ కార్డుల వాడకం

ఏడాదిలో 30 శాతం పెరిగిన రుణాలు

వ్యక్తిగత రుణాల్లో మూడో స్థానంలో క్రెడిట్ కార్డు రుణాలు

దేశంలో క్రెడిట్ కార్డ్ వినియోగం అంతకంతకూ పెరిగిపోతోంది. ఏడాదిలో క్రెడిట్‌కార్డ్ రుణాలు ఏకంగా 30 శాతం పెరగడమే దీనికి నిదర్శనం. క్రెడిట్ కార్డు రుణ బకాయిలు అమాంతంగా పెరుగుతున్నాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) తాజా నివేదిక వెల్లడించింది. ఆ నివేదిక ప్రకారం..

- దేశంలో క్రెడిట్ కార్డ్ రుణ బకాయిలు 2023 ఏప్రిల్‌లో ఏకంగా రూ.2.05 లక్షల కోట్లకు చేరాయి. 2022, ఏప్రిల్లో ఉన్న బకాయిల కంటే ఇవి 30 శాతం అధికం కావడం గమనార్హం. 2023, ఏప్రిల్‌లోనే రూ.1.3 లక్షల కోట్ల మేరకు క్రెడిట్ కార్డ్ రుణాలు తీసుకోవడం విస్మయపరుస్తోంది.
- ఇక బ్యాంకులు ఇస్తున్న మొత్తం రుణాల్లో క్రెడిట్ కార్డ్ రుణాలు 1.4 శాతానికి చేరాయి. 2008లో ఆర్థిక మాంద్యం సమయంలో దేశంలో క్రెడిట్ కార్డ్ రుణాలు అత్యధికంగా 1.2 శాతానికి చేరాయి. అనంతరం దశాబ్దం పాటు క్రెడిట్ కార్డ్ రుణాలు ఒక్క శాతం కంటే తక్కువే ఉంటూ వచ్చాయి. కానీ 2023 ఏప్రిల్‌లో క్రెడిట్ కార్డ్ రుణాలు 1.4 శాతానికి చేరుకోవడం గమనార్హం. కాగా విశ్వసనీయమైన ఖాతాదారులకే క్రెడిట్ కార్డ్ రుణాలిస్తున్నామని బ్యాంకులు చెబుతున్నాయని ఆర్‌బీఐ పేర్కొంది. దేశ జనాభాలో ఇంకా కేవలం 5 శాతం మందే క్రెడిట్ కార్డ్‌లను ఉపయోగిస్తున్నారని కూడా ఆర్‌బీఐ తెలిపింది.
- దేశంలో వ్యక్తిగత రుణాల్లో క్రెడిట్ కార్డ్ రుణాలు మూడో స్థానంలో ఉన్నాయి. వ్యక్తిగత రుణాల్లో గృహ రుణాలు మొదటి స్థానంలో ఉన్నాయి. బ్యాంకులు ఇస్తున్న రుణాల్లో గృహ రుణాల వాటా 14.1 వాటా ఉంది. 3.7శాతం వాటాతో వాహన రుణాలు రెండో స్థానంలో ఉన్నాయి. 1.4 శాతంతో క్రెడిట్ కార్డు రుణాలు మూడో స్థానంలో ఉన్నాయి.
- బ్యాంకులు జారీ చేస్తున్న పారిశ్రామిక రుణాల వాటా 2022–23లో తగ్గింది. 2021–22లో పారిశ్రామిక రుణాలు 26.3శాతం ఉండగా.. 2022–23లో 24.3 శాతానికి తగ్గాయి.

- సాక్షి, అమరావతి

2022-23లో బ్యాంకులిచ్చిన వ్యక్తిగత రుణాలు..

గృహ రుణాలు 14.1%	వాహన రుణాలు 3.7%
క్రెడిట్ కార్డ్ రుణాలు 1.4%	ఫిక్స్‌డ్ డిపాజిట్లపై రుణాలు 0.8%
విద్యా రుణాలు 0.7%	
బంగారు ఆభరణాలపై రుణాలు 0.6%	

క్లుప్తంగా...

ఐదు రోజుల పనిదినాలు మరో ఏడాది..

ఉత్తర్వులు జారీ చేసిన సీఎస్



సాక్షి, అమరావతి: రాష్ట్ర విభజన అనంతరం హైదరాబాద్ నుంచి అమరావతికి తరలి వచ్చి ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు వారానికి ఐదు రోజుల పనిదినాలను మరో ఏడాది పాటు రాష్ట్ర ప్రభుత్వం పొడిగించింది. వారానికి ఐదు రోజులు పనిదినాలపై గతంలో ఇచ్చిన ఉత్తర్వుల కాలం ఈ నెల 27వ తేదీతో ముగుస్తుంది. మరో ఏడాది పాటు వారానికి ఐదు రోజులు పనిదినాలు పొడిగించాలని ఉద్యోగ సంఘాల విజ్ఞప్తి మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ ఆమోదం తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి సోమవారం ఉత్తర్వులిచ్చారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5.30 వరకు కార్యాలయ పనివేళలుగా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

405 కిలోల గంజాయి స్వాధీనం

విజయవాడ శివారులో ఆరుగురిని అరెస్ట్ చేసిన కస్టమ్స్ అధికారులు



సాక్షి, అమరావతి: ప్రత్యేకంగా తయారుచేసిన వాహనంలో తరలిస్తున్న రూ.81.04లక్షల విలువైన 405 కిలోల గంజాయిని విజయవాడ శివారు ప్రసాదంపాడు వద్ద కస్టమ్స్ అధికారులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. గంజాయి తరలిస్తున్న ఆరుగురిని అరెస్ట్‌చేశారు. వారిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు విజయవాడ కస్టమ్స్ విభాగం సోమవారం ఓ ప్రకటనలో తెలిపింది.

నైపుణ్యాల వృద్ధిపై సీహెచ్‌వోలకు శిక్షణ



సాక్షి, అమరావతి: డాక్టర్ వైఎస్సార్ విలేజ్ క్లినిక్స్‌లో పనిచేసే కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్(సీహెచ్‌వో)లలో నైపుణ్యాల వృద్ధికి వైద్యశాఖ ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తోంది. ఇప్పటి వరకు 5,200 మంది సీహెచ్‌వోలు శిక్షణ పూర్తి చేసుకున్నారు. మిగిలిన వారికి శిక్షణ కొనసాగుతోంది. విలేజ్ క్లినిక్స్‌లో ప్రజలకు సేవలు అందించడానికి బీఎస్సీ నర్సింగ్ విద్యార్హత కలిగిన వారిని ప్రభుత్వం సీహెచ్‌వోలుగా నియమించింది. ఫస్ట్ ఎయిడ్, పాము, ఇతర పురుగుల కాటు సందర్భాల్లో క్లినికల్ మేనేజ్‌మెంట్, ఐవీ ఇన్ఫ్యూషన్, ఇంజెక్షన్స్, ఊండ్ కేర్, గాయాలకు డ్రెస్సింగ్, కుట్లు వేయడం, కట్లు కట్టడం, బేసిక్ కార్డియాక్ లైఫ్ సపోర్ట్(బీసీఎల్‌ఎస్)లలో నైపుణ్యం పెంచడం కోసం ప్రత్యేక కరిక్యులమ్‌ను రూపొందించి శిక్షణ ఇస్తోంది. 16 బోధనాస్పత్రులు, 11 జిల్లా, మూడు ఏరియా ఆస్పత్రుల్లో శిక్షణ కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఒక్కో బ్యాచ్‌కి 40 మంది చొప్పున సీహెచ్‌వోలకు వారం రోజుల పాటు శిక్షణ ఇస్తున్నారు. ఇండియన్ రెససిటేషన్ కౌన్సిల్ ఫౌండేషన్ (ఐఆర్‌సీఎఫ్) ఆధ్వర్యంలో బీసీఎల్‌ఎస్‌పై అవగాహన కల్పిస్తున్నారు.

గ్రామస్థాయిలో అభివృద్ధి సూచికలపై కేంద్రం దృష్టి

రేపు ఢిల్లీలో కేంద్ర పంచాయతీరాజ్ శాఖ వర్క్‌షాపు

సాక్షి, అమరావతి: దేశవ్యాప్తంగా గ్రామాల వారీగా స్థానిక పరిస్థితులకు అనుగుణంగా నిర్ణీత అభివృద్ధి సూచికల మేరకు ఏ గ్రామానికి ఆ గ్రామ స్థాయిలోనే పంచాయతీ డెవలప్‌మెంట్ ఇండెక్స్ (గ్రామ అభివృద్ధి సూచికలు) రూపకల్పనపై కేంద్ర పంచాయతీరాజ్ శాఖ దృష్టి సారించింది. ఢిల్లీలో ఈ నెల 28న కేంద్ర పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో అన్ని రాష్ట్రాల పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులతో వర్క్‌షాపు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా కేంద్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ప్రస్తుతం ఆయా అభివృద్ధి సూచికల ప్రకారం గ్రామ స్థాయి ర్యాంకులతో పంచాయతీ డెవలప్‌మెంట్ ఇండెక్స్ రిపోర్టును ఆవిష్కరించనున్నట్టు కేంద్ర పంచాయతీరాజ్ శాఖ జాయింట్ సెక్రటరీ వికాస్ ఆనంద్ అన్ని రాష్ట్రాల పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శులకు లేఖలు రాశారు.

సి'కిల్' సెల్‌పై సర్కారు యుద్ధం

పాడేరులో పరీక్ష కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి విడదల రజిని

- రాష్ట్రంలో 19లక్షల 90వేల 277 మందికి వ్యాధి నిర్ధారణ పరీక్షలు లక్ష్యం
- సికిల్ సెల్, తలసేమియా మరణాల నుంచి గిరిజనుల్ని రక్షించేందుకు చర్యలు



సికిల్‌సెల్ ఎనీమియా నిర్ధారణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి విడదల రజిని

సాక్షి, పాడేరు: సికిల్ సెల్ అనీమియా.. తలసేమియా. ఈ వ్యాధుల మధ్య స్వల్ప వ్యత్యాసాలున్నా రెండూ అత్యంత ప్రమాదకరమైనవే. ఇవి శరీరంలో ఎర్ర రక్త కణాలను ప్రభావితం చేసి రక్తహీనతను కలిగించే వారసత్వ రుగ్మతలే. వీటితో ఎక్కువగా గిరిజనులు బాధపడుతుంటారు. చికిత్స లేని ఈ వ్యాధుల నుంచి గిరిజనులను రక్షించేందుకు.. జీవిత కాలమంతా పూర్తి ఆరోగ్యంతో బతికేలా చర్యలు చేపట్టేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక కార్యక్రమానికి సోమవారం శ్రీకారం చుట్టారు. ఆయన ఆదేశాల మేరకు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ అల్లూరి జిల్లా పాడేరులో 'రుధిర రక్షణ' యజ్ఞాన్ని ప్రారంభించింది. సికిల్ సెల్, తలసేమియా మరణాల నుంచి గిరిజనుల్ని రక్షించేందుకు పెద్ద యుద్ధమే తలపెట్టింది.

ఏమిటీ.. సికిల్ సెల్!

సికిల్ సెల్ అనీమియా అనేది వంశపారంపర్య వ్యాధులలో ఒకటి. ఇది ఎర్ర రక్త కణాల నిర్మాణంపై ప్రభావం చూపుతుంది. ఎర్ర రక్త కణాలు సాధారణంగా గోళాకారంలో రక్తనాళాల నుంచి సులభంగా వెళ్లేలా ఉంటాయి. సికిల్ సెల్ అనీమియాలో కొన్ని ఎర్ర రక్త కణాలు సికిల్స్ (కొడవలి) లేదా చంద్రవంక ఆకారంలో తయారవుతాయి. ఇవి రక్త ప్రవాహాన్ని అడ్డుకుంటాయి. నిజానికి శరీరంలోని వివిధ అవయవాలకు రక్తం ద్వారానే ఆక్సిజన్ అందుతుంది. సికిల్ సెల్స్ రక్త ప్రవాహాని అడ్డుకోవడం వల్ల అవయవాలకు ఆక్సిజన అందక సమస్యలు తలెత్తి మరణానికి దారి తీసే ప్రమాదం ఉంది. సాధారణంగా ఎప్పటికప్పుడు పుట్టే ఎర్ర రక్త కణాలు 120 రోజుల వరకు జీవిస్తాయి. కానీ.. సికిల్ సెల్ రక్త కణాలు మాత్రం పుట్టిన 10 నుంచి 20 రోజులకే మరణిస్తాయి. అందువల్ల ఈ రుగ్మత ఉన్నవారికి రక్తహీనత తలెత్తి ప్రాణాపాయానికి దారి తీస్తుంది.

రాష్ట్ర ప్రభుత్వం ఏం చేస్తోందంటే..

రాష్ట్రంలో సికిల్ సెల్, తలసేమియా బారిన పడిన వారికి ప్రభుత్వం నెలకు రూ.10 వేల చొప్పున ఇప్పటికే పింఛన్లను పంపిణీ చేస్తోంది. అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, నంద్యాల, ప్రకాశం, పల్నాడు, శ్రీకాకుళం, ఏలూరు జిల్లాల పరిధిలో 19 లక్షల 90 వేల 277 మంది సికిల్ సెల్, తలసేమియా బాధితులు ఉన్నట్టు ప్రభుత్వం అంచనా వేసింది. వీరందరికీ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసేందుకు చర్యలు చేపట్టింది.

నిర్ధారణ అయితే..

సికిల్ సెల్ పాజిటివ్‌గా నిర్ధారణ అయితే వారికి ఉచితంగా కౌన్సెలింగ్, మందులను ప్రభుత్వం సమకూరుస్తుంది. 2047 కల్లా రాష్ట్రంలో సికిల్‌సెల్ లేకుండా చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. రాష్ట్రంలో ఐదు చోట్ల ఇంటిగ్రేటెడ్ సెంటర్స్ ఫర్ హిమోగ్లోబినోపాథిస్ పరీక్షల ప్రయోగశాలను సీఎం జగన్ ఏర్పాటు చేశారు. పాడేరు జిల్లా ఆస్పత్రి, విశాఖలోని కేజీహెచ్, కాకినాడ, గుంటూరు, కర్నూలు పట్టణాల్లోని టీచింగ్ ఆస్పత్రుల్లో ఈ ల్యాబ్‌లను అభివృద్ధి చేశారు.

పాడేరులో పరీక్షల్ని ప్రారంభించిన మంత్రి

అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులోని కుమ్మరిపుట్టు గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల భవనంలో ఏర్పాటు చేసిన సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి నిర్ధారణ పరీక్ష కేంద్రాన్ని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్న గిరిజనులకు సీఎం జగన్ ఆరోగ్య రక్షకుడిగా మారారన్నారు. రూ.500 కోట్లతో పాడేరులో మెడికల్ కళాశాల పనులు చురుగ్గా జరుగుతున్నాయని, పార్వతీపురం మన్యం జిల్లాలో రూ.600 కోట్లతో వైద్య కళాశాలను నిర్మిస్తామన్నారు. పార్వతీపురం, రంపచోడవరం, బుట్టాయగూడెం, సీతంపేట తదితర ప్రాంతాల్లో రూ.246 కోట్ల వ్యయంతో జగనన్న మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల సేవలను అందుబాటులోకి తీసుకువస్తున్నామన్నారు. వైద్య ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎంటీ కృష్ణబాబు, కలెక్టర్ సుమిత్‌కుమార్, వైద్య విధాన పరిషత్ కమిషనర్ వెంకటేశ్వర్లు, అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, పాడేరు, అరకు ఎమ్మెల్యేలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, చెట్టి పాల్గుణ హాజరయ్యారు.

'మా కలెక్టరమ్మ' పుస్తకం ఆవిష్కరించిన గవర్నర్



సాక్షి, అమరావతి: కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి రత్నప్రభ రచించిన 'మా కలెక్టరమ్మ' పుస్తకాన్ని ఆంధ్రప్రదేశ్ గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ సోమవారం రాజ్‌భవన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పుస్తక రచయితను గవర్నర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ అధ్యక్షుడు టి.మనోహర్ నాయుడు, సీనియర్ ఐఏఎస్ అధికారి విద్యాసాగర్, రిటైర్డ్ పోలీస్ అధికారులు కె.బాబురావు, రాజా శిఖామణి తదితరులు పాల్గొన్నారు.

సీఎస్‌తో బంగ్లాదేశ్ డిప్యూటీ హైకమిషనర్ భేటీ

సాక్షి, అమరావతి: బంగ్లాదేశ్ డిప్యూటీ హైకమిషనర్(చెన్నై) షెల్లీ సాలెహీన్ సోమవారం రాష్ట్ర సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కేఎస్ జవహర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు వివిధ అంశాలపై చర్చించారు.

'శంఖుచక్ర' నామాలకు టెండర్ ఖరారు!

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని సన్నిధిలో విద్యుత్ దీపాలతో ఏర్పాటు చేయతలపెట్టిన శంఖుచక్ర నామాలకు టెండర్ దాదాపుగా ఖరారైంది. వీటిని న్యూ సీసీ సత్రం మీద ఏర్పాటు చేసేందుకు రూ.34.78 లక్షల అంచనాతో ఈ–ప్రొక్యూర్‌మెంట్ ద్వారా పిలిచిన టెండర్లను సోమవారం తెరిచారు. మొత్తం రెండు టెండర్లు దాఖలయ్యాయి. వీటిలో శ్రీ శ్రావణి ఇండస్ట్రీస్ ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ సంస్థ 5 శాతం ఎక్కువగా రూ.36.52 లక్షలకు, విజయం ఇన్‌ఫ్రా డెవలపర్స్ సంస్థ 18.77 శాతం తక్కువగా రూ.28.25 లక్షలకు టెండర్లు దాఖలు చేశాయి.

'ఎంఎస్ఎంఈ' సేవలకు ప్రత్యేక యాప్

ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఆనంద్‌కుమార్



సమావేశంలో ఆనంద్‌కుమార్ తదితరులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలను (ఎంఎస్ఎంఈలను) పెద్ద ఎత్తున ప్రోత్సహించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేస్తోంది. కొత్తగా ఏర్పాటు చేసే ఎంఎస్ఎంఈలతో పాటు ఇప్పటికే ఉన్న వాటికి అవసరమైన సమాచారమంతా ఒకేచోట లభించే విధంగా ప్రత్యేకమైన యాప్‌ను రూపొందిస్తున్నారు. విజయవాడలో సోమవారం జరిగిన ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎంఎస్ఎంఈడీసీ) బోర్డు మీటింగ్‌లో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం వైఎస్సార్ ఏపీ వన్ తరహాలోనే ఎంఎస్ఎంఈలకు సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న ప్రోత్సాహకాలు, ఏర్పాటుకు సహకారం అందించే విధంగా ఈ యాప్‌ను అభివృద్ధి చేయాలని నిర్ణయించినట్లు ఎంఎస్ఎంఈడీసీ చైర్మన్ ఆదారి ఆనంద్ కుమార్ 'సాక్షి'కి తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో రాష్ట్రంలో కొత్త యూనిట్లు భారీ ఎత్తున ఏర్పాటవుతున్నాయని, వీటిని పరిశీలించి ఎప్పటికప్పుడు అనుమతులు మంజూరు చేసే విధంగా కార్పొరేషన్ నుంచి ప్రతి జిల్లాకు ఇద్దరు అధికారులను నియమించాలని నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. వీటితోపాటు ప్రతినెలా జిల్లాల్లో ఎంఎస్ఎంఈల ఏర్పాటుకు సంబంధించి ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అవగాహన కల్పించే కార్యక్రమాలతో పాటు పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యం కలిగిన మానవ వనరుల అంతరాలను తగ్గించే విధంగా కార్యక్రమాలను చేపట్టాలని నిర్ణయించినట్లు ఆయన వివరించారు. ఎంఎస్ఎంఈడీసీ సీఈవో ప్రవీణ్ కుమార్ వర్చువల్‌గా హాజరైన బోర్డు సమావేశంలో ఈడీ బి.గోపాలకృష్ణ, డైరెక్టర్లు పాల్గొన్నారు.

14న కృష్ణాబోర్డు ఆర్ఎంసీ భేటీ

- ఉమ్మడి ప్రాజెక్టుల రూల్ కర్వ్స్, విద్యుదుత్పత్తి నియమావళే అజెండా
- మళ్లించిన వరద జలాలపైనా చర్చ
- మూడు అంశాలపై బోర్డుకు నివేదిక ఇవ్వనున్న కమిటీ



సాక్షి, అమరావతి: కృష్ణా దిగువ బేసిన్‌లో ఉమ్మడి ప్రాజెక్టులైన శ్రీశైలం, నాగార్జునసాగర్ రూల్ కర్వ్స్ (నిర్వహణ నియమావళి), జలవిద్యుదుత్పత్తికి నిబంధనలు.. మళ్లించిన వరద జలాలను కోటాలో కలపాలా? వద్దా? అనే అంశాలపై చర్చించేందుకు జూలై 14న రిజర్వాయర్ల మేనేజ్‌మెంట్ కమిటీ (ఆర్ఎంసీ) సమావేశమవుతోంది. జలవివాదాలకు కారణమైన సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలను ఖరారు చేసి కృష్ణాబోర్డుకు నివేదిక ఇవ్వనుంది. సమావేశంలో ఆ నివేదికపై కృష్ణా బోర్డు చర్చించనుంది. రెండు రాష్ట్రాల సమ్మతి తీసుకుని ఆ నివేదికను అమలు చేయనుంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణల మధ్య కృష్ణానది జలాల వినియోగంలో తరచు వివాదాలు ఉత్పన్నమవుతుండటానికి ప్రధాన కారణం ఉమ్మడి ప్రాజెక్టుల నిర్వహణ. దిగువన అవసరం లేకున్నా బోర్డు అనుమతి లేకుండా విద్యుదుత్పత్తి చేస్తూ దిగువకు వదిలేస్తుండటం వల్ల జలాలు వృథాగా సముద్రంలో కలుస్తున్నాయి. వరద రోజుల్లో మళ్లించిన జలాలను కోటాలో కలపకూడదని ఏపీ ప్రభుత్వం ప్రతిపాదిస్తుంటే.. కలపాల్సిందేనని తెలంగాణ సర్కార్ పట్టుబడుతోంది. ఈ మూడు అంశాలపై గతేడాది కృష్ణాబోర్డు 16వ సర్వసభ్య సమావేశంలో చర్చించారు. ఆ సమస్యలపై చర్చించి, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై నివేదిక ఇచ్చేందుకు కృష్ణాబోర్డు సభ్యుడు ఆర్కే పిళ్లై కన్వీనర్‌గా రెండు రాష్ట్రాల ఈఎన్సీలు, జెన్‌కో డైరెక్టర్లు సభ్యులుగా కృష్ణాబోర్డు ఆర్ఎంసీని ఏర్పాటుచేసింది. సమస్యలపై చర్చించిన ఆర్ఎంసీ.. వాటి పరిష్కారానికి చర్యలను ఖరారు చేస్తూ గతేడాది డిసెంబర్ 6న నివేదిక సిద్ధం చేసింది. దానిపై సంతకం చేసేందుకు తొలుత అంగీకరించిన తెలంగాణ అధికారులు ఆ తర్వాత అడ్డం తిరిగారు. దీంతో తెలంగాణ అధికారుల సంతకాలు లేకుండానే కృష్ణా బోర్డు సభ్యులు, ఏపీ అధికారులు ఆమోదించిన నివేదికను కృష్ణాబోర్డుకు సమర్పించారు. ఈ నివేదికపై గత మే 10న కృష్ణా బోర్డు 17వ సర్వసభ్య సమావేశంలో చర్చించారు. రెండు రాష్ట్రాల అభిప్రాయం మేరకు.. ఆ మూడు అంశాలపై మరోసారి చర్చించి నివేదిక ఇవ్వాలని ఆర్ఎంసీని బోర్డు ఆదేశించింది.

రూ.2వేల నోట్ల మార్పిడి పేరుతో బురిడీ

- రూ.10లక్షల లాభం ఆశచూపి రూ.90లక్షలతో పరార్
- పార్వతీపురంలో ఇద్దరిని మోసం చేసిన దుండగులు
- పోలీసుల అదుపులో మధ్యవర్తులు



మధ్యవర్తులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

పార్వతీపురం: 'రెండు వేల రూపాయల నోట్లు రూ.కోటి ఇస్తాం. మీరు రూ.500 నోట్లు రూ.90లక్షలు ఇవ్వండి చాలు..' అని నమ్మబలికిన ఇద్దరు వ్యక్తులు మోసం చేశారు. రూ.పది లక్షలు లాభం ఆశ చూపించి రూ.90 లక్షలతో ఉడాయించారు. ఈ ఘటన పార్వతీపురంలో సోమవారం జరిగింది. పార్వతీపురం రూరల్ ఎస్ఐ వై.సింహాచలం తెలిపిన వివరాల ప్రకారం... పార్వతీపురానికి చెందిన ఆబోతుల అనిల్‌కుమార్, ఎల్.అనిల్‌కుమార్ ఓ ప్రైవేట్ బ్యాంకులో రుణాలు ఇప్పిస్తుంటారు. వారి వద్దకు స్థానిక వడ్డీ వ్యాపారుల ద్వారా వారం రోజుల కిందట ఎస్.చక్రపాణి(కాకినాడ), ఎస్కే నజీమ్(భీమవరం) వచ్చి కలిశారు. తమకు తెలిసినవారి వద్ద రూ.2వేల నోట్లు ఉన్నాయని, రూ.500 నోట్లు రూ.90 లక్షలు ఇస్తే... రూ.2వేల నోట్లు రూ.కోటి ఇస్తారని చెప్పారు. ఆ తర్వాత ఇద్దరిని పార్వతీపురం పిలిపించి ఆబోతుల అనిల్‌కుమార్, ఎల్.అనిల్‌కుమార్‌లతో మాట్లాడించారు. ఒకే రోజు రూ.10 లక్షలు వస్తుందని ఆశతో ఆబోతుల అనిల్‌కుమార్, ఎల్.అనిల్‌కుమార్ వారితో ఒప్పందానికి అంగీకరించారు. తమ వద్ద ఉన్న నగదుతోపాటు స్నేహితులు, బంధువుల వద్ద కొంత తీసుకువచ్చి రూ.90 లక్షలను సోమవారం ఆ వ్యక్తులకు ఇచ్చారు. కొద్దిసేపు ఇక్కడే ఉంటే రూ.కోటి తెస్తామని చెప్పి వెళ్లిన ఇద్దరు తిరిగి రాలేదు. దీంతో తాము మోసపోయినట్టు గుర్తించిన ఆబోతుల అనిల్‌కుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మధ్యవర్తులుగా వ్యవహరించిన చక్రపాణి, నజీమ్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితులను పట్టుకుంటామని ఎస్ఐ తెలిపారు.

ఇంటింటా స్వచ్ఛ జలం

- ఏలూరు జిల్లాలో 4.02 లక్షల కుళాయిల ఏర్పాటు
- యుద్ధప్రాతిపదికన జలజీవన్ మిషన్ పనులు
- వచ్చే ఏడాది నాటికి 4.79 ఇళ్లకు కుళాయిలు

సాక్షి ప్రతినిధి,ఏలూరు: గ్రామాల్లో శివారు ప్రాంతాలతో సహా ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీరు అందించడమే జలజీవన్ మిషన్ ప్రధాన ఉద్దేశం. నీటి కుళాయి లేని ఇల్లు లేకుండా చేయడమే లక్ష్యంగా అధికార యంత్రాంగం పెద్ద ఎత్తున కార్యాచరణ రూపొందించింది. దీనిలో భాగంగా యుద్ధప్రాతిపదికన ఇంటింటికీ మంచినీటి కుళాయిలు ఏర్పాటు చేస్తున్నారు. ఏలూరు జిల్లాలో 4.79 లక్షల నివాసాలుండగా ఇప్పటివరకు 4.02 లక్షల ఇళ్లకు కుళాయి కనెక్షన్లు ఏర్పాటుచేశారు. తొలి విడతలో జిల్లాలో 560 పనులను రూ.119.36 కోట్లతో పూర్తి చేశారు. ప్రతి మనిషికి రోజుకు 55 లీటర్ల సురక్షిత నీరు ఇవ్వడమే లక్ష్యంగా ప్రాజెక్టు పనులు చురుగ్గా సాగుతున్నాయి.

మొత్తంగా రూ.597 కోట్లతో..

జిల్లాలోని మెట్ట, మగాణి ప్రాంతాల్లో జలజీవన్ మిషన్‌లో భాగంగా ప్రతి ఇంటికీ రక్షిత మంచినీటి పైపులైన్లు ఏర్పాటు చేస్తున్నారు. చెరువులు, రిజర్వాయర్లు, ఇతర నీటి వనరులను వినియోగించుకుని కుళాయిలకు కనెక్షన్లు ఇస్తున్నారు. ఏలూరు జిల్లాలో తొలి విడతలో 1,023 పనులు నిర్వహించాల్సి ఉండగా రూ.119.36 కోట్ల వ్యయంతో 560 పనులు పూర్తిచేశారు. 386 పనులు పురోగతిలో ఉండగా మరో 72 పనులు ప్రారంభం కావాల్సి ఉంది. ప్రతి ఇంటికి మంచినీటి కుళాయిని అందుబాటులోకి తీసుకువచ్చేందుకు జలజీవన్ మిషన్ పనులు ప్రత్యేకంగా అధికార యంత్రాంగం సమీక్షించి పురోగతి తీసుకువస్తుంది. జిల్లాలో మొత్తం 4,79,889 నివాసాలున్నాయి. ఈ ఏడాది మార్చి 31 నాటికి 3,98,405 ఇళ్లకు మంచినీటి కుళాయిలు అందించారు. అంటే 83 శాతం కుళాయి కనెక్షన్లు ఏర్పాటుచేశారు. మిగిలిన 81,484 కనెక్షన్లలో ఈనెల వరకు 4 వేలు ఏర్పాటు చేసి ఈ ఏడాది చివరి నాటికి 48,472 కనెక్షన్లు పూర్తి చేసేలా అధికారులు టార్గెట్ నిర్ణయించారు. మొత్తంగా జలజీవన్ మిషన్‌లో భాగంగా 2,526 పనులను రూ.597.14 కోట్ల ఖర్చుతో చేపట్టారు. మొదటి విడతలో 1,023 పనులను పూర్తి చేసి రెండో విడతలో మిగిలిన పనులను చేపట్టనున్నారు. 2024 మార్చి 31 నాటికి జిల్లాలో నూరు శాతం ఇళ్లకు మంచినీటి కుళాయిలు ఏర్పాటు చేయడమే మిషన్ లక్ష్యం. దీని కోసం కేటాయించిన నిధులను పూర్తిస్థాయిలో వినియోగించేలా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పటిష్ట కార్యాచరణ రూపొందించడంతో పాటు ప్రతి 15 రోజులకోసారి పనుల పురోగతిపై డివిజన్ వారీగా సమీక్షించి ప్రతినెలా జిల్లాస్థాయిలో సమావేశం నిర్వహిస్తున్నారు.

వేగంగా పనులు

జిల్లాలో ఇప్పటివరకు 85 శాతం మంచినీటి కుళాయిలు ఏర్పాటు చేశాం. వచ్చే ఏడాది మార్చి 31వ తేదీ నాటికి 4.79 లక్షల నివాసాలకు కుళాయి కనెక్షన్లు అందిస్తాం. అందుబాటులో ఉన్న జలవనరులను వినియోగించుకుని మెట్ట, మాగాణి, ఇతర ప్రాంతాలత్లో కూడా కుళాయి కనెక్షన్లు ఏర్పాటు చేయిస్తున్నాం. ప్రతి మనిషికి రక్షిత మంచినీరు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ పథకాన్ని రూపొందించింది.

– ఎస్‌వీవీ సత్యనారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ

త్వరితగతిన పర్యాటక ప్రాజెక్టులు పూర్తి

- అధికారులకు సీఎస్ ఆదేశం
- టైం లైన్ పెట్టుకోవాలని సూచన
- పర్యాటక ప్రాంతాల్లో వసతులు కల్పించాలని వెల్లడి



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ప్రభుత్వపరంగా, ప్రభుత్వ ప్రవేటు భాగస్వామ్యం (పిపిపి)లో చేపట్టిన, ప్రతిపాదించిన పర్యాటక ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) డా. కేఎస్ జవహర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆయన సోమవారం రాష్ట్ర సచివాలయంలో పర్యాటక శాఖపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతి ప్రాజెక్టును టైం లైన్ పెట్టుకొని గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రముఖ పర్యాటక ప్రాంతాలు, దేవాలయాల వద్ద ప్రతిపాదించిన స్టార్ హోటళ్ళు, రిసార్టులు సకాలంలో పూర్తి చేయాలని, తద్వారా ఆయా ప్రాంతాలను పర్యాటక, ఆధ్యాత్మిక పరంగా మరింత అభివృద్ధిలోకి తేవొచ్చని చెప్పారు. రాష్ట్రానికి 970 కిలోమీటర్ల పొడవైన సముద్రతీరం ఉన్నందున బీచ్ టూరిజం అభివృద్ధి చేయాలని అన్నారు. అటవీ ప్రాంతాలు, జల పాతాలు, గుహల వద్ద అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని చెప్పారు. ఎకో టూరిజం ప్రాజెక్టులు, సరస్సులు, రిజర్వాయర్ల వద్ద వాటర్ స్పోర్ట్సు ప్రాజెక్టులను త్వరితగతిన అందుబాటులో తేవాలని ఆదేశించారు. శ్రీశైలం, అన్నవరం, సింహాచలం దేవస్థానాల్లో టెంపుల్ టూరిజం అభివృద్ధికి చర్యలు చేపట్టినట్లు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్ భార్గవ తెలిపారు. సరస్సులు, రిజర్వాయర్లు ఉన్న 77 ప్రాంతాల్లో పిపిపి విధానంలో వాటర్ స్పోర్ట్స్ అభివృద్ధి చేస్తున్నట్లు రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండీ కె.కన్నబాబు వివరించారు. 289 ప్రాంతాల్లో బీచ్‌ల వెంబడి కోస్టల్ జోన్ టూరిజం అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ అమలు చేస్తున్నట్టు చెప్పారు. ఈ సమావేశంలో ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్.ఎస్.రావత్, జల వనరుల శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్, దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ, పీసీసీఎఫ్ ఎ.కె. ఝా తదితరులు పాల్గొన్నారు.

మహిళా పారిశ్రామికవేత్తల సృష్టే లక్ష్యం

సెర్ప్ సీఈవో ఎండీ ఇంతియాజ్



చెక్కు పంపిణీ చేస్తున్న ఇంతియాజ్

సింగరాయకొండ: పేదరికం నిర్మూలించేందుకు ఆర్థిక అసమానతలను తొలగించి మహిళా పారిశ్రామికవేత్తలను సృష్టించడమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని, ఆ ప్రకారమే కృషిచేస్తున్నామని సెర్ప్ సీఈవో ఎండీ ఇంతియాజ్ చెప్పారు. ప్రకాశం జిల్లా సింగరాయకొండ మండలం కనుమళ్ల పంచాయతీ పెద్ద కనుమళ్లలో సోమవారం సెర్ప్, పీఎంఈజీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డక్ హేచరీస్ యూనిట్ల ప్రారంభోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు దశాబ్దాలుగా మహిళల ఆర్థికాభివృద్ధికి సెర్ప్ కృషి చేస్తోందని, ఫలితంగా రాష్ట్ర మహిళలు దేశంలోనే ఆదర్శంగా నిలిచారని చెప్పారు. రాష్ట్రంలో 8.47 లక్షల డ్వాక్రా గ్రూపుల్లో 90 లక్షల మంది మహిళలు సభ్యులుగా ఉన్నారన్నారు. మహిళల్లో సామాజిక, ఆర్థిక సాధికారితను తీసుకురాగలిగామని చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనా విధానం ప్రకారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలను సమన్వయం చేసి మహిళల అభ్యున్నతికి పాటుపడుతున్నామని, చాలావరకు విజయం సాధించామని పేర్కొన్నారు. జీఎం డీఐసీ, పీఎంఈజీపీ కార్యక్రమాన్ని సంయుక్తంగా చేస్తున్నామని, ఈరోజు పీఎంఎఫ్ఎంఐ పథకంలో ఏపీ మొదటి స్థానంలో ఉందని చెప్పారు. ప్రతి మహిళకు వారి ఆర్థిక పరిస్థితికి అనుగుణంగా సహకారం అందించాలని ఆయన సూచించారు. కలెక్టర్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ నియోజకవర్గంలో టంగుటూరు, సింగరాయకొండ మండలాల్లో యూనిట్లు ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందన్నారు.

ఒక వ్యక్తి ఎల్లప్పుడూ తనను తాను సగం చెడ్డవాడిగా,
నగమే నీతిమంతుడిగా భావించుకోవాలి.
అప్పుడు మాత్రమే అతడు ధర్మం వైపు మొగ్గు చూపగలడు.
– జుడాయిజం

సాక్షి
మంగళవారం, 27 జూన్ 2023

స్వయంకృతాపరాధం

పాలు పోసి పెంచిన పాము కాటేయడానికి పడగ విప్పి మీదకొస్తే ఎలా ఉంటుంది? అది ఎలా ఉంటుందో రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు ఇప్పుడు తెలిసొచ్చి ఉంటుంది. శత్రు దేశాలపై దాడి కోసం తాను పెంచిపోషిస్తూ వచ్చిన కిరాయి సైన్యం 'వాగ్నర్ ప్రైవేట్ మిలటరీ కంపెనీ', దాని అధినేత యెవ్‌జెనీ ప్రిగోజిన్ ఒక్కసారిగా తన మీదకే విరుచుకుపడేసరికి పుతిన్ దిగ్భ్రమకు లోనైనట్టున్నారు. గత వారాంతంలో రష్యాలో దాదాపు అంతర్యుద్ధం అంచులకు వెళ్ళిన పరిణామాలు అలాంటివి. దేశానికి దక్షిణాన అతి కీలక నగరాల్లో ఒకటైన రోస్తోవ్ – ఆన్– డాన్ చేజిక్కించుకొని, మాస్కో దిశగా వాగ్నర్ కిరాయి సైనికులు దూసుకు వస్తున్నప్పుడు పరిస్థితి భయానకంగా కనిపించింది. పైకి ఎన్ని బీరాలు పలికినా, చివరకు బెలారస్ దేశాధినేత కుదిర్చిన సంధితో పుతిన్ ఊపిరిపీల్చుకోగలిగారు. ఇప్పటికి వాగ్నర్ సేనలు వెనక్కి తగ్గి, ఉక్రెయిన్‌తో పోరుకు మళ్ళీ సరిహద్దుల దారి పట్టినా, పుతిన్‌కు తగిలిన షాక్, ఆయన ఇమేజ్‌కు పడిన దెబ్బ సామాన్యమైనవి కావు.

ఎవరికీ వంగని, దేనికీ లొంగని ధీరుడిగా పేరున్న పుతిన్ ప్రతిష్ఠను ఈ తిరుగుబాటు చావుదెబ్బ తీసింది. ఉక్రెయిన్‌తో పోరులో బింకంగా ముందడుగు వేస్తున్న ఆయన ఈ దెబ్బ నుంచి కోలుకోవడం సులభమేమీ కాదు. 1999 నుంచి ఇప్పటి దాకా ప్రధానిగానో, అధ్యక్షుడిగానో అధికారంలో ఉంటూ వచ్చారు పుతిన్. రష్యాపై తిరుగులేని పట్టు బిగించిన ఈ ఏలిక తన సుదీర్ఘ హయాంలో తొలిసారిగా పెద్ద సవాలును ఎదుర్కొంటున్నారు. 'పుతిన్‌కు వంటగాడ'నే పేరు దక్కిన ఒక దొంగ, హంతకుడు ఆ స్థాయి నుంచి ప్రైవేట్ సైనిక సంస్థకు అధిపతిగా ఎదగడం వెనక ఉన్నది పుతినే అన్నది జగమెరిగిన సత్యం. ఆఫ్రికా నుంచి అరబ్ ప్రపంచం వరకు, తాజా ఉక్రెయిన్ యుద్ధంలోనూ ఈ కిరాయి మూకల్ని వాడుకుంటూ వచ్చిందీ పుతినే! అందుకే, పూర్తి బాధ్యత కూడా ఆయనదే!

ఉక్రెయిన్‌పై కార్యకలాపాల్లో రష్యా సైనికాధిపతుల పట్ల, ముఖ్యంగా రక్షణ మంత్రి పట్ల ప్రిగోజిన్ కొద్ది నెలలుగా అసంతృప్తితో ఉన్నారు. రక్షణ శాఖలో అగ్రస్థానంలో మార్పుల్ని కోరుకుంటున్నారు. ఆఖరికి ఆయన కిరాయి మూకలు తేలిగ్గా ఒక్కో నగరం దాటుకుంటూ మాస్కో సమీపానికి రావడం అంతర్యుద్ధ మేఘాలను అలముకొనేలా చేసింది. బెలారస్ నేత లుక షెంకో తెరవెనుక రాజీతో ఇప్పటికి గండం గడిచింది. పుతిన్ మీద ప్రేమ కన్నా, డబ్బు కోసమనే ప్రాణాలకు తెగించే వాగ్నర్ మూకలు వెనుదిరగడం ఊరికే జరగలేదు. దేశద్రోహులంటూ వీరంగం వేసిన పుతిన్ చివరకు ఎవరిపై ఏ కేసులూ పెట్టనని ఒప్పుకోవాల్సి వచ్చింది. ప్రిగోజిన్‌పై చర్యలుండవని హామీ ఇవ్వాల్సొచ్చింది. రెండు లక్షల కోట్ల డాలర్ల కన్నా తక్కువకు పడిపోయిన జీడీపీతో, ఉక్రెయిన్‌తో పోరులో నష్టాలతో సతమతమవుతున్న రష్యా కొత్తగా మరో పోరు చేసే పరిస్థితిలో లేదు.

వెరసి, తప్పుడు అంచనాలతో ఉక్రెయిన్‌పై 16 నెలల క్రితం యుద్ధం మొదలుపెట్టి, వెనక్కి రాలేని పద్మవ్యూహంలో చిక్కుకున్న పుతిన్‌కు ప్రపంచం ముందు ఇవి తీరని తలవంపులే. ఇవన్నీ ఆయన స్వయంకృతాపరాధాలే. బలమైన వాగ్నర్ మూకల్ని రక్షణ శాఖ కిందకు తేవాలన్న రష్యా సైనిక నేతల నిర్ణయం బెడిసికొట్టింది. వ్యూహంలో, దాడుల్లో తమ కన్నా వెనుకబడిన ప్రభుత్వ సైనిక నేతల కింద పనిచేయడం ప్రిగోజిన్‌కు మింగుడుపడని విషయం. అందువల్లే ఈ తిరుగుబాటు తలెత్తిందట. పుతిన్‌కు తాను వ్యతిరేకం కాదనే నేటికీ ప్రిగోజిన్ మాట. ఏమైనా, ఇప్పుడు రష్యాకు మరో తలనొప్పి వచ్చి పడింది. ఇకపై ఉక్రెయిన్‌పై పోరులో రష్యన్ సైనిక నేతలు మునుపటిలా ఈ కిరాయి మూకల్ని నమ్మలేరు. రక్షణ శాఖతో కాంట్రాక్ట్ ఉన్నవారే ఇకపై పోరులో పాల్గొంటారట. కానీ, అపనమ్మకమున్న యుద్ధంలో అడుగు ముందుకు పడదు. అసలే ఉక్రెయిన్‌లో ఆశించిన పురోగతి లేక అస్తుబిస్తవుతున్న పుతిన్‌కు ఇది దెబ్బ మీద దెబ్బ.

తాజా తిరుగుబాటులో చేరని వాగ్నర్ ఫైటర్లను ప్రభుత్వ సైన్యంలోకి తీసుకోవాలని రష్యా యోచిస్తున్నప్పటికీ, ఇలాంటి మూకలతో రష్యా ఎలా వేగగలదో చెప్పలేం. ప్రిగోజిన్ తిరుగుబాటు ఇప్పటికి టీ కప్పులో తుపానైపోయినా, క్షీణిస్తున్న పుతిన్ పట్టుకు అది ప్రతీక. అణ్వస్త్ర రష్యా సైనిక బలగంలోని బలహీనతలూ, చీలికలూ బట్టబయలయ్యాయి. సైనిక జనరల్స్‌ను ఒకరి తర్వాత మరొకరిని తొలగిస్తూ వస్తున్న పుతిన్‌కు యుద్ధంలో తగిన వ్యూహమూ ఉన్నట్టు లేదు. మరోపక్క, తాజా ఘటనలతో యుద్ధంలో ఉక్రెయిన్ సైన్యానికి ఊహించని సానుకూలత వరించింది. ఒకవేళ యుద్ధాన్ని ముగించదలుచుకుంటే ఇరుపక్షాలకూ ఓ చిన్న కిటికీ తెరుచుకుంది. కానీ, కిందపడ్డా నాదే పై చేయి అనే పుతిన్ కానీ, 'నాటో' బూచితో రష్యాను దారికి తెచ్చుకోవాలని చూస్తున్న పాశ్చాత్య ప్రపంచం కానీ అందుకు ముందుకొస్తాయా?

ఏమైనా రష్యా పరిణామాలను ప్రపంచం ఆసక్తిగా చూస్తోంది. పుతిన్ తదుపరి అడుగులు, భవితవ్యంపై లెక్కలు కడుతోంది. సైన్యం, పాలనా యంత్రాంగం, వ్యాపార వర్గం సహా వ్యవస్థలన్నిటినీ విడగొట్టి, ఎవరూ అధికారం ప్రోది చేసుకోకుండా బలహీనంగా ఉంచి, నియంత్రణ తన చేతిలో పెట్టుకొనే పుతిన్ ఈ విన్యాసం ఎన్నాళ్ళు చేయగలరో చూడాలి. అందుకే, స్టాలిన్ తర్వాత దీర్ఘకాలం రష్యాను ఏలుతున్న పుతిన్ ఓ అమెరికన్ రాజకీయ శాస్త్రవేత్త అన్నట్టు ఒక రకంగా 'బలహీన బలిష్ఠుడు'. వాగ్నర్ వ్యవహారం అందుకు తాజా ఉదాహరణ. పామును పెంచుతున్నది పగవాణ్ణి కాటేయడానికని భావించినా విషపురుగుకు తన, పర తేడా ఉండదని మర్చిపోవడమే చిక్కు. ఆ సంగతి అమెరికా, పాకిస్తాన్ నుంచి ఇప్పుడు రష్యా దాకా అందరికీ అనుభవంలోకి వచ్చిన పాఠమే!

వైద్య విద్య ప్రక్షాళన అత్యవసరం

విశ్లేషణ



రాకేశ్ కోచర్

ప్రస్తుతం ఒక ఎంబీబీఎస్ విద్యార్థికి ప్రాక్టికల్ అంశాలపై అవగాహన నాస్తి. పోస్ట్‌గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో చేరడమెలా అన్నదానిపైనే విద్యార్థి దృష్టి కేంద్రీకృతమై ఉంటోంది. కానీ ఎంబీబీఎస్ సీట్లతో పోలిస్తే పీజీ సీట్లు మూడొంతుల వరకూ తక్కువ. అయినా అత్యధికులు పీజీ కోసం పోటీపడుతూంటారు. సహజ సామర్థ్యం, అభిరుచులకు అనుగుణంగా పీజీ కోర్సులను ఎంచుకునే సౌలభ్యం వారికి ఉండాలి. దానికోసం ప్రాంతీయ, దేశ అవసరాలకు తగ్గట్టుగా పీజీ సీట్ల సంఖ్యలో మార్పులు చేసుకునే వెసులుబాటు కల్పించుకోవాలి. దేశంలో వైద్యవిద్య ఎదుర్కొంటున్న ఇంకో సవాలు, నాణ్యత! వైద్య విద్య బోధనాంశాలను సమీక్షించి, మార్పులు చేయాల్సిన అవసరముంది. ఈ మార్పుల్లో ప్రాక్టికల్ అంశాలపై శ్రద్ధ పెట్టడం ఒకటి.

ఇటీవల వార్తా పత్రికల్లో ప్రచురితమైన రెండు వార్తలు పరస్పర విరుద్ధంగా కనిపించాయి. ఒకటేమో ప్రభుత్వం యాభై కొత్త వైద్య కళాశాలలకు అనుమతిచ్చిందన్నది. ఈ రెండు కాలేజీల చేరికతో దేశంలోని మొత్తం ఎంబీబీఎస్ సీట్ల సంఖ్య 1,07,000కు చేరుకుంటుంది. రెండో వార్త ఏమిటంటే, దేశం మొత్తమ్మీద కనీసం 38 వైద్యకళాశాలలు తమ గుర్తింపును కొనసాగించేందుకు అవసరమైన ప్రమాణాలను పాటించడం లేదన్నది! ఇంకో వంద కాలేజీలూ ఇదే స్థితిలో ఉన్నట్లు ఈ వార్త చెబుతోంది. నేషనల్ మెడికల్ కమిషన్ మార్గదర్శకాలను ఇవి పాటించడం లేదన్నది ఆరోపణ. సిబ్బంది బయోమెట్రిక్ పద్ధతుల్లో అటెండెన్స్ ఇవ్వాలన్న అంశంతోపాటు మరికొన్ని ఉల్లంఘనల కారణంగా వీటి గుర్తింపు రద్దయ్యే పరిస్థితి ఏర్పడినట్లు సమాచారం. బహుశా ఈ సమస్య కళాశాలల్లో తగినంత సిబ్బంది లేకపోవడం వల్ల ఉత్పన్నమై ఉండవచ్చు. లేదా, సిబ్బంది ఒక చోట కాకుండా, మరిన్ని కళాశాలల్లో బోధనకు అంగీకరించి ఉండటమూ కావచ్చు.

దేశంలో ప్రస్తుతం ఉన్న వైద్యులు ఎంతమంది? 2002 జూన్ నెలలో కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి పార్లమెంటుకు ఇచ్చిన సమాధానం ప్రకారం 13,08,009 మంది అల్లోపతి వైద్యులు ఉన్నారు. వీరిలో పదవీ విరమణ చేసినవారు, మరణించిన వారు లేదా ఇతర దేశాలకు వలస వెళ్లినవారు ఉజ్జాయింపుగా 20 శాతం మంది ఉన్నారని అనుకున్నా ప్రస్తుతం పది లక్షలకుపైగా వైద్యులు అందుబాటులో ఉన్నట్లు తేలుతుంది. ఆయుష్ వైద్యులు 5.75 లక్షల మందిని కూడా చేర్చితే ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రమాణాల ప్రకారం ప్రతి వెయ్యి మందికి ఒక వైద్యుడు అందుబాటులో ఉన్నట్లు అవుతుంది.

2014లో దేశంలోని మొత్తం వైద్య కళాశాలలు 387 కాగా, ఇప్పుడు ఆ సంఖ్య 695కి చేరింది. మరో 75 జిల్లా ఆసుపత్రులను వైద్యకళాశాలలుగా మార్చేందుకు ఇటీవలే ప్రభుత్వం ప్రతిపాదించింది. వీటిల్లో కొన్నింటిని ఇప్పటికే మార్చేశారు కూడా. జిల్లా ఆసుపత్రి కానీ, ఈఎస్ఐ ఆసుపత్రి కానీ రాత్రికి రాత్రి వైద్య కళాశాలగా మారిపోదు. ఇందుకు శిక్షణ పొందిన సిబ్బంది, మౌలిక సదుపాయాల కూర్పు వంటి అనేక మార్పులు, చేర్పులు అవసరమవుతాయి.

దేశంలో ఇప్పటిమాదిరిగానే రాన్నున ఐదు, ఏడేళ్లలో ఏటా ఒక లక్ష మంది కొత్త ఎంబీబీఎస్ వైద్యులు అందుబాటులోకి వస్తారని అనుకుందాం. అప్పటికి దేశ జనాభా సుమారు 150 కోట్లకు చేరుకుంటుంది. వైద్యుల సంఖ్య కూడా 15 లక్షల వరకూ ఉంటుంది. కాబట్టి ప్రతి వెయ్యి మందికి ఒక వైద్యుడు అందుబాటులో ఉంటాడు. ఈ దశలోనే పరిస్థితులు ఆసక్తికరంగా మారతాయి. ఏటా ఎంతమంది వైద్యులు అవసరం? వారందరితో సమర్థంగా పనిచేయించుకోగల



పరిస్థితులు ఉన్నాయా?

ప్రస్తుతం ఒక ఎంబీబీఎస్ విద్యార్థికి ప్రాక్టికల్ అంశాలపై అవగాహన నాస్తి. ఎందుకంటే పోస్ట్‌గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో చేరడమెలా అన్నదానిపైనే విద్యార్థి దృష్టి కేంద్రీకృతమై ఉంటోంది. కానీ ఎంబీబీఎస్ సీట్లతో పోలిస్తే పీజీ సీట్లు మూడొంతుల వరకూ తక్కువ. అయినా ఎంబీబీఎస్ చదివిన వారిలో అత్యధికులు పీజీ కోసం పోటీపడుతూంటారు. పడాలి కూడా. సహజ సామర్థ్యం, అభిరుచులకు అనుగుణంగా పీజీ కోర్సులను ఎంచుకునే సౌలభ్యమూ వారికి ఉండాలి. ప్రాంతీయ, దేశ అవసరాలకు తగ్గట్టుగా పీజీ సీట్ల సంఖ్యలో మార్పులు చేర్పులు చేసుకునే వెసులుబాటు కల్పించుకోవాలి. ఉదాహరణకు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లకు ఫ్యామిలీ మెడిసిన్‌లో పీజీ చేసిన వారిని ఎంపిక చేయవచ్చు. బోధన, పరిశోధనల పట్ల ఆసక్తి ఉన్నవారిని వైద్య కళాశాలలకు ఉపాధ్యాయులుగా శిక్షణ అందించాలి.

ఆరోగ్య రంగంలో నగర, గ్రామీణ ప్రాంతాల మధ్య తీవ్ర అంతరం ఉంటోంది. మూడింట రెండొంతుల జనాభా గ్రామీణ ప్రాంతాల్లోనే ఉన్నా, అక్కడ పనిచేస్తున్న వైద్యులు మొత్తం వైద్యుల్లో 30 శాతాన్ని కూడా చేరడం లేదు. గ్రామీణ ఆరోగ్య రంగ గణాంకాల ప్రకారం 2021– 22లో కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో వైద్యులు, సిబ్బంది కొరత యాభై శాతం కంటే ఎక్కువే! అంతేకాదు... రాష్ట్రాల వారీగా చూసినా ఆరోగ్య కార్యకర్తలు, సిబ్బంది పంపిణీలో తేడా ఉంది. కేరళ, తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, గోవా, ఢిల్లీలతో పోల్చితే... జార్ఖండ్, యూపీ, బిహార్ రాష్ట్రాలు చాలా వెనుకబడి ఉన్నాయి. ఇంకో ఆసక్తికరమైన అంశం... కర్ణాటకలోని మొత్తం వైద్యుల్లో 40 శాతం రాజధాని బెంగళూరులోనే ఉండటం! ఫలితంగా అనేక గ్రామీణ ప్రాంతాల్లో వైద్యం ఇప్పటికీ దూరంగానే ఉంటోంది.

కేంద్ర ప్రభుత్వం ఎంబీబీఎస్ సీట్లను పెంచాలన్న విధాన నిర్ణయం తీసుకోవటం అసలు లక్ష్యమేమిటి? నగరాల్లో తగినంత మంది వైద్యులు అందుబాటులోకి వచ్చిన తరువాత గ్రామీణ ప్రాంత అవసరాలను తీర్చడమా? మౌలిక సదుపాయాలు లేకపోవడం అనే కారణంతో చాలామంది వైద్యులు పల్లె ప్రాంతాలకు వెళ్లేందుకు ఇష్టపడరు. పల్లెల్లో పనిచేస్తే పెట్టిన పెట్టుబడికి తగిన రాబడి లేదన్న భావన కూడా కొంతమంది వైద్యుల్లో, మరీ ముఖ్యంగా ప్రైవేట్ కాలేజీల్లో చదివిన వారిలో ఉంటుంది.

దేశంలో వైద్యవిద్య ఎదుర్కొంటున్న ఇంకో సవాలు, నాణ్యత! వైద్య విద్య బోధనాంశాలను అప్పుడప్పుడు సమీక్షించి, మార్పులు చేయాల్సిన అవసరముంది. ఈ మార్పుల్లో ప్రాక్టికల్ అంశాలపై శ్రద్ధ పెట్టడం ఒకటి. కొత్త కాలేజీలు ఏర్పాటవుతున్నంత వేగంగా మౌలిక సదుపాయాల కల్పన జరగడం లేదు. చాలా రాష్ట్రాల్లోని వైద్య కళాశాలల్లో సూపర్ స్పెషలిస్టుల పోస్టులకు దరఖాస్తులే రాకపోవడం దీనికి ఒక ఉదాహరణ! తగిన మౌలిక సదుపాయాలు, పరికరాలు, పనిచేసుకునేందుకు తగినంత స్వేచ్ఛ ఉన్న ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో మాత్రం ఈ పరిస్థితి లేదు.

ఎంబీబీఎస్‌లోకి ప్రవేశాలను నియంత్రించేందుకు 'నీట్' ద్వారా గట్టి ప్రయత్నమే జరిగింది. అయితే సగం కాలేజీలు ప్రైవేట్‌వి కావడం, అక్కడి విద్యార్థుల ర్యాంకులు అతి తక్కువగా ఉండటం వల్ల దేశంలోని విద్యా ప్రమాణాల్లో సమానత లేదని తెలుస్తుంది! టెలిమెడిసిన్ టెక్నాలజీ ద్వారా దేశం మొత్తమ్మీద ఒకే రకమైన వైద్య విద్యను ఎందుకు అందించలేకపోతున్నామన్నది ప్రశ్న!

ఏతావతా... దేశంలో వైద్యవిద్యను సమూలంగా మార్చాల్సిన అవసరముంది. 1910లో ఫ్లెక్స్‌నర్ నివేదిక తరువాత అమెరికాలో జరిగిన మార్పుల మాదిరిగా అన్నమాట. అప్పట్లో బోధనాంశాలు మొత్తాన్ని రివైజ్ చేశారు. కాలేజీల సంఖ్యను 155 నుంచి తగ్గించారు. ప్రతి అంశానికి సంబంధించిన కనీస ప్రమాణాలు, శిక్షణ, అవధులను నిర్ణయించారు. తరువాతి కాలంలో కెనడా, యూరప్‌లలోనూ ఇదే పద్ధతిని అనుసరించడం గమనార్హం.

భారత్‌లో వైద్య కళాశాలల సంఖ్యను హేతుబద్ధీకరించాల్సిన అవసరముంది. భవిష్యత్తు అవసరాలను కూడా దృష్టిలో ఉంచుకుని ఎంబీబీఎస్ వైద్యులు, స్పెషలిస్టులు, సూపర్ స్పెషలిస్టులను సిద్ధం చేసుకోవాలి. ఉదాహరణకు 2025లో మనకు చిన్న పిల్లల వైద్యులు, కంటి వైద్యుల అవసరం ఎక్కువ అనుకుందాం. అదే సమయంలో ఐదేళ్ల తరువాత న్యూరోసర్జన్లు, ఫిజిషియన్ల అవసరం ఉందని అనుకుంటే... అందుకు తగ్గట్టుగా పీజీ కోర్సులు, సీట్ల సంఖ్యలో హెచ్చుతగ్గులు చేసుకోవాలి.

వ్యాసకర్త ఇండియన్ సొసైటీ ఆఫ్ గ్యాస్ట్రో ఎంటరాలజీ మాజీ అధ్యక్షులు
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఎందుకు ఉన్నట్లు?



లెఫ్టినెంట్ గవర్నర్ రాజీనామా చేయాలి. ఢిల్లీకి ప్రజలకు భద్రతను, రక్షణ కల్పించ గలిగిన మరొక వ్యక్తికి మార్గం ఏర్పర చాలి. కేంద్ర ప్రభుత్వం ఢిల్లీని సురక్షితంగా ఉంచలేకపోతే ఆ పనిని మాకు అప్పగించమనండి. నగరాన్ని, నగర పౌరులను ఎలా భద్రంగా ఉంచవచ్చో మేం చేసి చూపుతాం.

– అరవింద్ కేజ్రీవాల్, ఢిల్లీ ముఖ్యమంత్రి

వృథా పని



కారణం ఏదైనా, జనానికి ఈ రోజుల్లో దేవుడు అనే భావన సమస్యాత్మకం అవుతోంది. అందువల్ల ఏర్పడే ఆధ్యాత్మిక శూన్యతను వాళ్లు 'ధ్యానం', 'నిర్నిమిత్తం' అనే మాటలతో పూరించుకునే ప్రయత్నం చేస్తున్నారు. కళ్ల ముందర చక్రం తిరుగుతూ కనిపిస్తున్నప్పుడు దానిని కొత్తగా కనిపెట్టడం ఎందుకంటాను!

– షీలా నజీరియన్, టీవీ పర్సనాలిటీ

ఇదేం ప్రశ్న!



మణిపూర్ సంక్షోభాన్ని ప్రధాని ఎప్పటికప్పుడు విదేశాల నుంచే సమీక్షిస్తున్నారని హోమ్‌శాఖ చెబుతూ ఉండగా... వారం రోజుల విదేశీ పర్యటన అనంతరం ఢిల్లీ చేరుకోగానే మోదీ, 'ఇండియాలో ఏం జరుగుతోంది?' అని జె.పి. నడ్డాను అడగడం విడ్డూరంగా ఉంది! మణిపూర్‌పై తన 55 రోజుల మౌనాన్ని ప్రధాని ఇకనైనా వీడుతారా?

– జైరామ్ రమేశ్, కాంగ్రెస్ నాయకుడు

నిశ్చయమే జయం



ఈరోజు నేను నా కాళ్లపై నిలబడటానికి కారణం నా తల్లిదండ్రులను డబ్బు అడగకూడదని నిశ్చయించుకోవడమే. ఈ రోజు నేను నాలుగు రాళ్లు సంపాదిస్తున్నానంటే కారణం నాకు ఇష్టమైన పనిని నేను వృత్తిగా ఎంపిక చేసుకోవడమే. ఎదగడం అన్నది మన ఎంపికను బట్టే ఉంటుంది.

– సహేలీ ఛటర్జీ, యువ ఎద్యుప్రెన్యూర్

వీళ్లా చెప్పేది!



నైతికంగా మృతి చెందిన సమాజంలో 'జాంబీ'లు (బతికి లేదిన శవాలు) జీవించి ఉన్నవారికి ఎలా జీవించాలో బోధిస్తాయి. అవినీతిలో కూరుకుపోయిన కొందరు మనుషులు... వైద్యులకు నైతికతను బోధిస్తుంటే నాకు ఆ జాంబీలే గుర్తుకొస్తున్నాయి.

– శివమ్ పాండ్యా, క్యాన్సర్ స్పెషలిస్ట్

మనకాలపు పెను సంచలనం

సందర్భం



బి.టి. గోవిందరెడ్డి

తన కలల్ని వెంటాడుతూ దక్షిణాఫ్రికా నుంచి కెనడాకూ, అక్కడినుంచి అమెరికాకూ వచ్చాడు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ట్విట్టర్, యూట్యూబ్, దిన పత్రిక– ఏదిచూసినా వార్త రూపంలో దర్శనమిస్తాడు. 'సొంతిల్లు' లేకున్నా 2050 నాటికి ఏకంగా అంగారకుడిపైనే కాలనీలు కడతానని ఊరిస్తాడు. ఎవరు అవునన్నా కాదన్నా వర్తమాన యుగంలో విస్మరించలేని పెను సంచలనం ఎలాన్ మస్క్!

స్పేస్‌ఎక్స్, టెస్లా కంపెనీలకు సీఈఓ, బోరింగ్ కంపెనీ సంస్థాపకుడు, ఇప్పుడు సంచలనం రేపుతున్న ఛాట్‌జీపీటీకి బీజం వేసిన భాగస్వాముల్లో మొన్నటివరకూ ఒకడు, మనుషుల ఆలోచనల్ని నియంత్రించే 'న్యూరాలింక్' ప్రాజెక్టు అధినేత, ఇప్పుడు ఎంతో సాధారణ విషయంగా మారిన ఆన్‌లైన్ బ్యాంకింగుకు 1999లోనే తన ఎక్స్‌డాట్ కామ్ ద్వారా అంకురార్పణ చేసినవాడు... ఇలా ఏ కొత్త సాంకేతికత పురుడు పోసుకున్నా అక్కడ మస్క్ ఉంటాడు. అందుకే అతన్ని 'ఇన్నో వేషన్ గురూ' అని ముద్దుగా పిలుస్తారు. ఎక్స్‌డాట్‌కామ్ 'పే పాల్'గా మారడం, అందులో 25 కోట్ల డాలర్లు సంపాదించటం మస్క్ సాధించిన వ్యాపార విజయం.

ల్యాప్‌టాప్‌ను పనిచేయించే లిథియం బ్యాటరీతో కారు కూడా నడపొచ్చని అతను తొలిసారి ప్రకటించినప్పుడు ప్రపంచం నమ్మలేదు. బడా కార్ల కంపెనీలనుకునేవన్నీ ఎగతాళి చేశాయి. కానీ 'టెస్లా' కారు రోడ్డుపైకి వచ్చేసరికి నోరెళ్లబెట్టాయి. పదేళ్లు గడిచిందో లేదో అన్ని బ్రాండ్ల ఎలక్ట్రిక్ కార్లు ఇప్పుడు పరుగులు పెడుతున్నాయి. పర్యావరణ పరిరక్షణకు అతనో రూట్ మ్యాప్ ఇచ్చాడు. వాహనాల తీరుతెన్నులను మార్చాడు గనుకే అతని టెస్లా సంస్థ ప్రఖ్యాత టొయోటా కార్ల కంపెనీ కంటే మూడు రెట్లు పెద్దదిగా ఆవిర్భవించింది.

మస్క్ గురించి ఆసక్తికర కథనం చెప్పాలి. నాసా వెబ్‌సైట్‌లోకి పోయి వాళ్లకు సమీప భవిష్యత్తులో అంగారకుడిపైకి వెళ్లే ఆలోచన లేదని తెలుసుకుని నేరుగా రష్యా వెళ్లి ఒక రాకెట్ బేరమాడాడు. అంగారకుడిపైకి తానే రాకెట్ ప్రయోగించడం అతని లక్ష్యం. వాళ్లు చెప్పిన రేటు గిట్టుబాటు కాకపోవడంతో తానే సొంతంగా రాకెట్‌ను ఎందుకు తయారుచేయరాదన్న పట్టుదల పెరిగింది. కొన్నాళ్లు స్పేస్ ఇంజనీరింగ్ బుక్స్ తిరగేసి రాకెట్ అంతు చూశాడు. దాని తయారీలోని ప్రతి అంశాన్నీ పట్టుకున్నాడు. ఆ రకంగా 'స్పేస్ ఎక్స్'



ఆవిర్భవించింది. పునర్వినియోగ రాకెట్‌ను ప్రయోగించి, విజయవంతంగా భూమ్మీదకు తీసు కొచ్చాక మస్క్‌పై నమ్మకం పెరిగింది. ప్రైవేటు రంగంలో 'స్పేస్‌ఎక్స్' తిరుగులేని పెద్ద సంస్థ. 2008లో వచ్చిన 'ఐరన్ మ్యాన్' చిత్రానికి అతడే స్ఫూర్తి. బోరింగ్, హైపర్‌లూప్ సంస్థలు మస్క్ ముందుచూపును తెలియజేస్తాయి. నగరాల దిగువన టన్నెల్స్ తవ్వి వాటిలో వాహనాలు దూసుకుపోయేలా చేయడం, వ్యాక్యూమ్‌తో ఉండే హైపర్ లూప్‌లో హైస్పీడ్ రైళ్లను పరుగులు పెట్టించడం మస్క్ ధ్యేయాలు.

1971 జూన్ 28న దక్షిణాఫ్రికాలోని ప్రిటోరియాలో జన్మించిన మస్క్ బాల్యం ఏమంత మధురమైనది కాదు. తొమ్మిదేళ్లున్నప్పుడే అమ్మా నాన్న విడిపోయారు. అయితే ఫిజిక్స్ మీద తనకు ఇంత ఆసక్తి కలగజేసింది మాత్రం తండ్రేనంటాడు. పన్నెండేళ్ల ప్రాయంలో ఎంతో పోరుపెట్టి తండ్రితో కొనిపించుకున్న కమొడోర్ వీఐసీ–20 కంప్యూటర్ ఎంత మొరాయిస్తున్నా దానిపైనే అద్భుతాలు సాధించిన చరిత్ర అతడిది. ఆ కంప్యూటర్ మాన్యువల్ ప్రకారం ఆర్నెల్లు పట్టే ప్రాథమిక అంశాలను, మూడంటే మూడు రోజుల్లో పూర్తి చేయడమే కాదు... దాంట్లోనే ఒక కొత్త కంప్యూటర్ గేమును తయారు చేశాడు. దాని సోర్స్ కోడ్ అమ్మి 500 డాలర్లు తెచ్చుకున్నాడు. అదే అతడి తొలి సంపాదన. దక్షిణాఫ్రికాలో స్కూల్ ఫైనల్ ముగిశాక ఒంటరిగా కెనడా వెళ్లాడు. గ్రాడ్యుయేషన్ అయ్యాక స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీలో పీహెచ్‌డీ సీటు సాధించినా రెండంటే రెండే రోజులు హాజరై మనసు మార్చుకున్నాడు. వ్యాపారమే తన భవిష్యత్తుగా భావించాడు. తన సోదరుడితో(కింబల్ మస్క్) కలిసి జిప్2 రూపొందించాడు. మనం ఇప్పుడు చూసే గూగుల్ మ్యాపులకు అది తొలి రూపం. దాన్ని 31 కోట్ల డాలర్లకు అమ్మి ఆశ్చర్యపర్చాడు.

మస్క్‌కు పని రాక్షసుడన్న పేరుంది. బోర్డ్ రూమ్ ఎత్తుగడల్లో అతన్ని మించినవాడు లేడు. టెస్లా సంస్థ స్థాపించి, తనను భాగస్వామిగా ఆహ్వానించిన మార్టిన్ ఎబెర్‌హార్డ్‌ను కంపెనీ నుంచే సాగనంపి 2008లో దాన్ని చేజిక్కించుకున్న కపటి అని మస్క్‌ను తిడతారు. ఇక ట్విటర్ మస్క్ చేతుల్లో పక్షాక ఎలా విలవిల్లాడుతున్నదో తెలిసిందే. ట్విట్టర్ ఎదుగుదలలో చెమటోడ్చిన వేలాది మందిని ఇంటికి పంపాడు. వింత వింత నిర్ణయాలతో అందరినీ ఏడిపించాడు. అయితే రెండు మూడు తరాల ముందుచూపుతో ఆలోచించగలిగే సృజనాత్మకత, దాన్ని సాకారం చేసుకోవడానికి కావలసిన మొండి ధైర్యం ఉన్న ప్రజ్ఞాశీలి అనడంలో సందేహం లేదు.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్టు

ఉమ్మడి పౌరస్మృతితోనే సమన్యాయం

అభిప్రాయం



పొనక జనార్దన్ రెడ్డి

ఉమ్మడి పౌరస్మృతి గురించి భారత న్యాయ కమిషన్ వారు జూన్ 14, 2023న ఒక బహిరంగ ప్రకటన జారీచేసి... భారత పౌరులు, మత సంస్థల నుండి తమ అభిప్రాయాలు, సూచనలు, సంప్రదింపుల కోసం 30 రోజుల సమయం నిర్దేశించారు. మత ప్రస్తావన లేని వ్యక్తిగత పౌర చట్టాలు భావితరానికి అందించాలనే దృఢ సంకల్పమే పై నిర్ణయానికి కారణం.

భారత పార్లమెంట్‌లో ఉమ్మడి పౌరస్మృతి గురించి ఏనాడో చర్చించడం జరిగింది. ఆనాటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ఒక దశలో వ్యతిరేకించినా, న్యాయశాఖ మంత్రి బీఆర్ అంబేడ్కర్ మాత్రం సమర్థించారు. అయినప్పటికీ ఇది అమలులోకి రాలేదు. ఈ కారణంగానే హిందూ వివాహ చట్టం, హిందూ వారసత్వ చట్టం, మైనారిటీ మరియు గార్డియన్‌షిప్ చట్టం, దత్తత చట్టం, మనోవర్తి చట్టాలు మాత్రమే అమల్లోకి వచ్చాయి. అంటే హిందువులకే వ్యక్తిగత చట్టాల క్రోడీకరణ జరిగింది.

కేంద్రంలోని ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం తమ 2019 మేనిఫెస్టోలో ఉమ్మడి పౌరస్మృతిని చేర్చింది. దీనికోసం భారత న్యాయ కమిషన్ విస్తృత ప్రచారం ద్వారా 75,000 పైచిలుకు భారత పౌరుల అభిప్రాయాలు సేకరించి ప్రభుత్వానికి నివేదించింది. దీనిమూలంగా నవంబర్ 2019, మార్చి 2020 రెండుసార్లూ ఉమ్మడి పౌరస్మృతి బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టారు. కానీ ప్రతిపక్షాల తీవ్ర నిరసనల నడుమ, ఇది తొందరపాటు నిర్ణయం అని ఆర్ఎస్ఎస్ ప్రకటించడం వల్ల ప్రభుత్వం బిల్లును ఉపసంహరించుకుంది.

చాలామందికి అవగాహన లేని విషయం ఏమిటంటే, ఉమ్మడి పౌరస్మృతి వర్తించే పౌర చట్టాలు ఆరు మాత్రమే. అవి: వివాహ చట్టం, విడాకుల చట్టం, మనోవర్తి చట్టం, వారసత్వ చట్టం, దత్తత చట్టం, ఆస్తిహక్కు వారసత్వ చట్టం. ఇప్పుడున్న పౌర చట్టాలు దేశాభివృద్ధికి నిరోధకంగా ఉన్నాయనీ, పౌరులందరికీ సమాన హక్కులు లేవనీ, కొన్ని మతాలలో స్త్రీలు అణచివేతకు గురవుతున్నారనీ అత్యున్నత న్యాయస్థానం ట్రిపుల్ తలాక్ కేసులో వ్యాఖ్యానించింది. 1985 నాటి షాబానో కేసులో అత్యున్నత న్యాయస్థానం మనోవర్తి కోసం ముస్లిం చట్టాలను పక్కనపెట్టి సెక్షన్ 125–128



క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌ను ముస్లిం మహిళలకు వర్తింపజేసింది. ముస్లింలకు షరియత్ బోర్డు అనే ఒక ప్రైవేటు సంస్థ దశ, దిశ నిర్దేశించడాన్ని తీవ్రంగా పరిగణించింది.

భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 21 ద్వారా అందరికీ సమాన అవకాశాలు ఉండాలనేది ప్రాథమిక హక్కుగా నిర్దేశించారు. రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలైన ఆర్టికల్ 44 పార్ట్ 4 ఉమ్మడి పౌరస్మృతిని అమల్లోకి తీసుకురావాలని నిర్దేశించింది. కానీ ఆర్టికల్ 37 ప్రకారం ఆదేశిక సూత్రాల అమలు కోర్టుల ద్వారా కుదరదు. ఏమైనప్పటికీ ఉమ్మడి పౌరస్మృతి జాప్యానికి కారణాన్ని రాజకీయ కోణంగానే చూడాలి. రాజకీయ పార్టీలు ఓటు బ్యాంకు కోసం దీన్ని తెరపైకి తీసుకురావటం, వెంటనే వెనక్కి తీసుకోవటం జరుగుతోంది. ప్రతి రాజకీయ పార్టీలోనూ అంతర్గతంగా సమర్థించడం, విభేదించడం రెండూ జరుగుతున్నాయి. దీనికి ఉదాహరణ, ఆర్ఎస్ఎస్ దీన్ని తొందరపాటు చర్యగా అభివర్ణించడమే!

ఉమ్మడి పౌరస్మృతి పైన ఉన్న ప్రధాన అపోహ, ప్రభుత్వాలు వ్యక్తిగత మత స్వేచ్ఛను హరిస్తాయని! భిన్న సంస్కృతులు కలిగిన భారత దేశంలో అమలు కష్టసాధ్యమవుతుందని! 1961లో పోర్చుగీస్ దేశం నుండి విడిపడిన గోవా రాష్ట్రం ఇప్పటికే ఉమ్మడి పౌరస్మృతిని అమలుచేస్తోంది. అక్కడ మతస్వేచ్ఛకు భంగం కలిగినట్లు ఒక్క ఉదాహరణ కూడా కనిపించదు. ఉమ్మడి పౌరస్మృతి వల్ల ప్రత్యామ్నాయ న్యాయ ప్రక్రియకు స్వస్తి పలకవచ్చు. స్త్రీలపై మతపరమైన అణచివేత, అసమానతలను తొలగించవచ్చు. ఓటుబ్యాంకు రాజకీయాలు లేకుండా పోతాయి. కోర్టుల్లో పౌరులందరికీ ఒకే విధమైన తీర్పులతో సమన్యాయం అమలవుతుంది. మన దేశాన్ని సెక్యులర్ దేశంగా రాజ్యాంగపరంగా ప్రకటించడం వల్ల మత స్వేచ్ఛకు ఎలాంటి భంగం వాటిల్లదు. దీన్ని రాజ్యాంగంలోని ఆర్టికల్ 25, 26లో పొందుపరిచారు. అదేవిధంగా కొన్ని తెగలకు, అణగారిన వర్గాలకు రాజ్యాంగపరంగా ఉన్న హక్కులు కాపాడబడతాయి. ఈ కారణాల వల్ల ఉమ్మడి పౌరస్మృతి భారతదేశానికి చారిత్రక అవసరం.

వ్యాసకర్త ఆంధ్రప్రదేశ్ మహా ప్రశాసకుడు
మొబైల్: 83094 09689

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, ఆషాఢ మాసం, **తిథి:** శు.నవమి రా.10.24 వరకు, తదుపరి దశమి, **నక్షత్రం:** హస్త ఉ.11.12వరకు, తదుపరి చిత్త, **వర్జ్యం:** రా.7.34 నుండి 9.15 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.06 నుండి 8.58 వరకు, తదుపరి రా.10.55 నుండి 11.41 వరకు, **అమృతఘడియలు:** తె.5.40 నుండి 7.22 వరకు (తెల్లవారితే బుధవారం); **రాహుకాలం:** ప.3.00 నుండి 4.30 వరకు, **యమగండం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **సూర్యోదయం:** 5.31, **సూర్యాస్తమయం:** 6.34.

క్లుప్తంగా...

లోడింగ్‌లో విశాఖ పోర్టు రికార్డు

- ఒక్క రోజులోనే నౌకలో 50,450 మెట్రిక్ టన్నుల ఐరన్ ఓర్ లోడింగ్



దొండపర్తి(విశాఖ దక్షిణ): సరుకు రవాణాలో రికార్డులు సృష్టిస్తున్న విశాఖ పోర్టు తాజాగా లోడింగ్‌లో కూడా చరిత్ర సృష్టించింది. నూతన సాంకేతికత సాయంతో రెండునెలల క్రితం నెలకొల్పిన రికార్డును తిరగరాసింది. ఎంవీ జీసీఎల్ నర్మద కార్గో నౌకలో ఆదివారం ఒక్క రోజే 50,450 మెట్రిక్ టన్నుల ఇనుప ఖనిజాన్ని లోడ్ చేసి పోర్టు అధికారులు, సిబ్బంది సత్తా చాటారు. ఈ ఏడాది మార్చి 26న అత్యధికంగా చేసిన 44,374 మెట్రిక్ టన్నుల లోడింగ్ రికార్డును అధిగమించారు. ఈ విషయాన్ని పోర్టు అధికారులు సోమవారం వెల్లడించారు.

ట్రిపుల్ ఐటీలకు 38,100 దరఖాస్తులు

- ఆర్జీయూకేటీలో ముగిసిన దరఖాస్తుల స్వీకరణ

నూజివీడు: రాష్ట్రంలోని రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్జీయూకేటీ) పరిధిలోని నూజివీడు, ఇడుపులపాయ, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీల్లో పీయూసీ ప్రథమ సంవత్సరం ప్రవేశాల కోసం 38,100 దరఖాస్తులు వచ్చినట్లు అడ్మిషన్ల కన్వీనర్ ఆచార్య ఎస్ఎస్ఎస్‌వీ గోపాలరాజు తెలిపారు. దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ సోమవారంతో ముగిసిందని పేర్కొన్నారు. ఒక్కో ట్రిపుల్ ఐటీలో 1000 సీట్లతో పాటు ఈడబ్ల్యూఎస్ కోటా కింద అదనంగా మరో 100 సీట్లు కలిపి 1100 సీట్లు ఉన్నాయని తెలిపారు. ఎంపికైన అభ్యర్థుల జాబితాను జూలై 13న ప్రకటించనున్నట్లు చెప్పారు. కాగా, కరోనా కారణంగా గత మూడేళ్లుగా ఎంట్రన్స్ పరీక్ష నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేసిన విషయం తెలిసిందే. ఈ ఏడాది పదో తరగతి పరీక్షలు నిర్వహించి మార్కులు ప్రకటించిన నేపథ్యంలో విద్యార్థులకు వచ్చిన మార్కుల ఆధారంగా ఎంపికను నిర్వహించనున్నారు.

ధర్మవరంలో అమ్మఒడి లబ్ధిదారుల భారీ ర్యాలీ



ధర్మవరంలో అమ్మఒడి లబ్ధిదారుల భారీ ర్యాలీ

ధర్మవరం: శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణంలో సోమవారం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో 'జగనన్న అమ్మ ఒడి' లబ్ధిదారులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ నెల 28న అమ్మఒడి నిధుల విడుదల సందర్భంగా జగనన్నకు కృతజ్ఞతలు తెలుపుతూ ఈ ర్యాలీ చేపట్టారు. స్థానిక మారుతీ రాఘవేంద్ర స్వామి కల్యాణ మండపం నుంచి మొదలైన ర్యాలీ.. గాంధీనగర్, పీఆర్‌టీ సర్కిల్ మీదుగా కళాశాల సర్కిల్ వరకూ సాగింది. అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఎమ్మెల్యే కేతిరెడ్డి మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా రంగంలో సమూల మార్పులు తెచ్చారని కొనియాడారు. అదే చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు కార్పొరేట్ విద్యాసంస్థలకు మేలు చేస్తూ ప్రభుత్వ విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేశారని దుయ్యబట్టారు.

పోర్టుబ్లెయిర్ విమానం విశాఖలో అత్యవసర ల్యాండింగ్

- ప్రతికూల వాతావరణంతో వెనక్కి వచ్చిన ఎయిర్ ఇండియా ఫ్లైట్
- 270 మంది ప్రయాణికులకు విశాఖలో వసతి
- సోమవారం మధ్యాహ్నం తిరిగి పయనం



హోటల్ నుంచి బస్సులో విమానాశ్రయం వద్దకు వచ్చిన ప్రయాణికులు

గోపాలపట్నం: (విశాఖ పశ్చిమ): ఢిల్లీ నుంచి పోర్టుబ్లెయిర్‌కు వెళ్లాల్సిన ఎయిర్ ఇండియా విమానం విశాఖపట్నంలో అత్యవసర ల్యాండింగ్ అయింది. ఆదివారం ఉదయం ఢిల్లీలో బయలుదేరిన ఈ విమానం పోర్టుబ్లెయిర్‌కు వెళ్లింది. అక్కడ విమానం దిగడానికి ప్రతికూల వాతావరణం నెలకొంది. దీంతో పైలెట్ విమానాన్ని వెనక్కి మళ్లించి ఉదయం 11 గంటలకు విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయంలో ల్యాండింగ్ చేశారు. పోర్టుబ్లెయిర్‌లో వాతావరణం అనుకూలిస్తుందని కొద్దిసేపు ఎదురు చూశారు. కానీ, అక్కడ పరిస్థితి అనుకూలంగా లేకపోవడంతో ప్రయాణికులను విశాఖ విమానాశ్రయంలో దించేసి ఎయిర్ ఇండియా విమానం ఢిల్లీకి వెళ్లిపోయింది. ఆ విమానంలోని 270 మంది ప్రయాణికులకు విశాఖలోని ఓ హోటల్లో బస ఏర్పాటు చేశారు. మళ్లీ ఆ విమానం సోమవారం విశాఖ వచ్చి మధ్యాహ్నం 2.30 గంటలకు ప్రయాణికులను తీసుకుని పోర్టుబ్లెయిర్‌కు బయలుదేరి వెళ్లినట్లు విమానాశ్రయ వర్గాలు తెలిపాయి.

అక్రమ మైనింగ్‌పై ‣ చర్యలు వేధింపులా?

- తప్పు చేసిన వారిపై కేసులు, జరిమానాలు నేరమా?
- గనుల్లో అక్రమ తవ్వకాలను నిరోధించడం తప్పంటున్న ఈనాడు పత్రిక
- వేధింపులంటూ రోత పుట్టించే రాతలు
- అక్రమార్కులు రాజకీయ నేతలైతే మినహాయింపు ఇవ్వాలనే ధోరణి
- ప్రభుత్వ రెవెన్యూ కొల్లగొడుతున్నా పట్టించుకోకుండా ఉండాలా?
- అధికారుల మనోస్థైర్యాన్ని దెబ్బతీసేలా అవాస్తవ కథనాలు



ఫ్యాక్ట్ చెక్

సాక్షి, అమరావతి : ఎవరైనా తప్పు చేస్తుంటే తప్పని చెప్పాలి. నేరం చేస్తే నేరమని చెప్పాలి. ఈనాడు పత్రిక నేరమే కరెక్టు అంటుంది. తప్పులు చక్కగా చేయొచ్చంటుంది. తప్పు చేసే వాళ్లపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటే వేధింపులంటూ రాతల్లో రోత పుట్టిస్తుంది. రాష్ట్రంలో 'మైనింగ్'పై ఇలాంటి రోత కథనమే మరొకటి రాసింది. రాష్ట్రంలో అక్రమ మైనింగ్‌ను నిరోధించేందుకు గనుల శాఖ చేపట్టిన తనిఖీలు, విధిస్తున్న జరిమానాలపైనా వక్రభాష్యాలు చెబుతోంది. అడ్డగోలుగా గనులను కొల్లగొడుతూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న వారిపై చర్యలు తీసుకుంటే కక్ష సాధింపుగా, వేధింపులుగా చిత్రీకరిస్తోంది. ఇలా అక్రమార్కులకు వత్తాసు పలుకుతూ సోమవారం ఓ తప్పుడు కథనం ప్రచురించింది. మైనింగ్ కార్యకలాపాల పర్యవేక్షణ, తనిఖీలు గనుల శాఖ ప్రధాన విధి. దాన్ని కూడా తప్పు పడుతూ ఈనాడు పత్రిక రాజకీయాలు అంటగడుతోంది. అక్రమ క్వారీయింగ్ చేసే వారు రాజకీయ నేతలైతే వారికి మినహాయింపు ఇవ్వాలనే ధోరణిలో వాదిస్తోంది. మైనింగ్ అక్రమార్కులపై ఆ పత్రిక ఒక్క ముక్క రాయకపోగా, అక్రమార్కులను ప్రోత్సహించడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

ఇవీ వాస్తవాలు

➤ నెల్లూరు జిల్లాలో 5 ఎకరాలు లీజుకు తీసుకుని దాదాపు 50 ఎకరాల్లో అక్రమంగా తవ్వేస్తుంటే స్థానికులు ఫిర్యాదు చేశారు. గనుల శాఖ అధికారులు అక్కడ క్వారీలో తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో కళ్లు చెదిరే దారుణాలు, అక్రమ తవ్వకాలు బయటపడ్డాయి. వాటన్నింటి విలువ రూ.142 కోట్లుగా తేలింది. ఆ మొత్తాన్ని అధికారులు జరిమానాగా విధించారు. ఈ చర్య ఈనాడుకు తప్పుగా, కక్ష సాధింపుగా కనపడుతోంది.

➤ సత్యసాయి జిల్లా ధర్మవరం నియోజకవర్గం పరిధిలోని ఎన్‌హెచ్ – 42లో ముదిగుబ్బ బైపాస్ ప్రాంతంలో నితిన్ సాయి సంస్థ రోడ్డు నిర్మాణంలో అడ్డుగా ఉన్న కొండ ప్రాంతాన్ని తొలుస్తోంది. దాన్నుంచి వచ్చిన రాయిని మొబైల్ క్రషర్ ద్వారా బయటికి తరలించి, విక్రయిస్తోంది. ఈ సమాచారం తెలిసి గనుల శాఖ అధికారులు తనిఖీ చేశారు. సుమారు రూ.15 కోట్ల విలువైన మెటల్‌ను అక్రమంగా విక్రయించినట్లు తేలింది. దీనిపై చర్యలు తీసుకోవడాన్ని తప్పుపట్టడం ఈనాడు వక్రనీతికి అద్దం పడుతోందని గనుల శాఖాధికారులు వ్యాఖ్యానిస్తున్నారు.

➤ అనంతపురం జిల్లా బొమ్మనహాళ్ మండలం నేమకల్ వద్ద ఉన్న కొన్ని కంకర క్వారీలు నిబంధనలు ఉల్లంఘిస్తున్నాయి. గతంలో వాటికి జరిమానాలు విధిస్తూ అధికారులు నోటీసులిచ్చారు. వీటిపై కొందరు కోర్టుకు వెళ్లారు. అక్కడ వారి వాదన చెల్లలేదు. జరిమానాలు చెల్లించకపోవడం, న్యాయస్థానాల నుంచి కూడా అనుకూలంగా ఉత్తర్వులు రాకపోవడంతో చాలా క్వారీల్లో మైనింగ్ జరగడంలేదు. దీన్ని కూడా ఆ పత్రిక వక్రీకరించింది. క్వారీలను వేధిస్తున్నారంటూ అడ్డగోలుగా రాసింది. గన్నవరం, గుడివాడ ప్రాంతాల్లోనూ అక్రమ మైనింగ్‌పై ఫిర్యాదులు రావడంతో గనుల శాఖ తనిఖీ చేసింది. ఉల్లంఘనలు బయటపడడంతో కేసులు నమోదు చేసింది. ఇది కూడా ఈనాడుకు కక్ష సాధింపుగా కనపడింది. అక్రమాలను నిస్సిగ్గుగా సమర్థించింది.

అక్రమ మైనింగ్‌పై ఉక్కుపాదం మోపుతున్నాం

విజిలెన్స్ స్క్వాడ్‌లతో అక్రమ మైనింగ్‌పై ఉక్కు పాదం మోపుతుంటే దాన్ని వక్రీకరిస్తూ కథనాలు రాయడం సరికాదు. మైనింగ్ అక్రమాలపై టోల్ ఫ్రీ నంబర్ 1800 5994599 కు వచ్చే అన్ని ఫిర్యాదులపైనా తక్షణం స్పందించి చర్యలు తీసుకుంటున్నాం. 2014 – 2019 మధ్య అక్రమ మైనింగ్‌పై కేవలం 424 కేసులు నమోదైతే, 2019 నుంచి 2023 వరకు నాలుగేళ్లలోనే 786 కేసులు నమోదు చేశాం. ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులకు రాజకీయ ఉద్దేశాలను ఆపాదించేలా ఈనాడు పత్రిక కథనం ప్రచురించడం దారుణం. అక్రమ మైనింగ్‌పై గనుల శాఖ చర్యలు తీసుకోవడం నేరమా? తప్పు చేసిన వారిపై కేసులు నమోదు చేయడాన్ని వేధింపుల కింద ఈనాడు పత్రిక చిత్రీకరిస్తోంది. అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటే రాజకీయ దురుద్దేశాలను అంటగడతారా? ఇటువంటి తప్పుడు కథనాల వల్ల ఉద్యోగుల మనోస్థైర్యం దెబ్బతింటుంది.

– మైనింగ్ డైరెక్టర్ వీజీ వెంకటరెడ్డి

పోలవరంతోనే రాష్ట్రాభివృద్ధి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



సభలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

పోలవరం రూరల్: పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. నిర్వాసితుల సమస్యలపై సీపీఐ ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్ర సోమవారం ఏలూరు జిల్లా పోలవరానికి చేరుకుంది. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో రామకృష్ణ మాట్లాడుతూ.. పోలవరం నిర్వాసితులకు పక్కా గృహాలు నిర్మించడంతో పాటు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ అమలు చేయాలన్నారు. ఈ పర్యటనలో నిర్వాసితుల సమస్యలు తెలుసుకున్నామన్నారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. పూర్తిస్థాయిలో నిర్వాసితులకు న్యాయం జరిగేంతవరకు పోరాడతామని స్పష్టం చేశారు.

రూ.30 వేల కోట్లు విడుదల చేయాలి: తులసిరెడ్డి

సభకు హాజరైన ఏపీ కాంగ్రెస్ కమిటీ కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎం.తులసీరెడ్డి మాట్లాడుతూ.. పోలవరం ప్రాజెక్ట్‌కు కేంద్ర ప్రభుత్వం 2023–24 సంవత్సరానికి గాను రూ.30 వేల కోట్లు వెంటనే విడుదల చేయాలన్నారు. నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి కూడా సహకరించాలన్నారు. పలువురు మాట్లాడుతూ పోలవరం నిర్మాణానికి ఎవరూ వ్యతిరేకం కాదని, పోలవరం నిర్మాణంతో పాటు నిర్వాసితులకు న్యాయం జరగాలని కోరారు. సభలో సీపీఐ రాజ్యసభ సభ్యుడు పి.సంతోష్‌కుమార్, సీపీఎం రాష్ట్ర నాయకుడు పి.మధు, టీడీపీ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, రాష్ట్ర మేధావుల ఫోరం కన్వీనర్ చలసాని శ్రీనివాస్, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ పాల్గొన్నారు.

ఎవరికి వారే..

- పోలవరంపై ఉభయ కమ్యూనిస్టులు చెరోదారి
- కలిసి ఉద్యమిద్దామని విడిగా కార్యాచరణ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ఉభయ కమ్యూనిస్టు పార్టీల వైఖరి ఎవరికివారే యమునా తీరేలా ఉంది. పోలవరం పోరుకు కలిసి ఉద్యమిద్దామని అనుకున్న రెండు పార్టీలు చివరకు ఏకాభిప్రాయం కుదరక విడిగా కార్యాచరణ చేపట్టడం గమనార్హం. పోలవరం ముంపు ప్రాంతాల్లో నిర్వాసితుల సమస్యలపై సీపీఎం రాష్ట్ర శాఖ 'పోలవరం పోరు కేక' పేరుతో మహా పాదయాత్రను చేపడుతున్నట్టు తొలుత ప్రకటించింది. దీంతో తాము వెనుకబడిపోతామేమో అనుకుని కలిసి ఉద్యమం చేద్దామంటూ సీపీఎంతో సీపీఐ సంప్రదింపులు జరిపింది. నిర్వాసిత గ్రామాల్లో పాదయాత్ర చేద్దామని సీపీఎం అంటే, పోలవరం ఎత్తు, నిర్వాసితులు తదితర రాజకీయ అంశాలను దీనికి సీపీఐ ముడిపెట్టింది. దీంతో వారి మధ్య ఏకాభిప్రాయం లేక ఈ నెల 20వ తేదీ నుంచి సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు నేతృత్వంలో పోలవరంలో పాదయాత్ర చేపట్టారు. పాదయాత్రకు దూరంగా ఉన్న సీపీఐ.. సోమవారం పోలవరంలో బహిరంగ సభ నిర్వహించింది. అఖిలపక్షం పేరుతో సీపీఐ, టీడీపీ, కాంగ్రెస్, జనసేన వంటి పార్టీలతో సభ జరపడం గమనార్హం. ఏ సమస్యపైనైనా సీపీఎం సొంత పంథాలో కార్యాచరణ చేపడుతుంటే.. సీపీఐ మాత్రం టీడీపీకి మేలు జరిగేలా కార్యక్రమాలు చేపడుతోందని ఉభయ కమ్యూనిస్టు పార్టీల్లోనే అంతర్గతంగా చర్చ సాగుతోంది. చంద్రబాబు డైరెక్షన్‌లోనే సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పనిచేస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వంపై అనవసరపు విమర్శలు చేస్తున్నారనే వాదన వినిపిస్తోంది. ఆయన వైఖరి సొంత పార్టీలోని నేతలకు సైతం మింగుడు పడటంలేదు. దీనిపై పార్టీ అంతర్గత సమావేశాల్లోను రామకృష్ణ పలు మార్లు విమర్శలపాలైనట్టు సమాచారం. టీడీపీ వెంట నడిచేందుకు తాపత్రయ పడుతున్న సీపీఐని అనుసరించేందుకు సీపీఎం సిద్ధంగా లేదని పోలవరం పోరు కేక విషయంలో మరోసారి రుజువైంది.

పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కరించండి

- గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు సీపీఎం బృందం వినతిపత్రం



గవర్నర్ నజీర్‌కు వినతిపత్రం అందిస్తున్న సీపీఎం బృందం

సాక్షి, అమరావతి: పోలవరం నిర్వాసితుల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్‌కు సీపీఎం ప్రతినిధి బృందం విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు పీడీఎఫ్ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, సీపీఎం రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యుడు వై.వెంకటేశ్వరరావు, పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు బొప్పన కిరణ్, ఎ.అశోక్ సోమవారం రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 20వ తేదీ నుంచి సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు నేతృత్వంలో 400 కిలోమీటర్ల మేర మహా పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు గవర్నర్‌కు వివరించారు. నిర్వాసితుల సమస్యలపై జూలై 4న విజయవాడలో మహాధర్నా చేపడుతున్నట్లు తెలిపారు. పదమూడు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని గవర్నర్‌కు అందించారు.

బాబు హయాంలో అభివృద్ధి శూన్యం

- 1,002వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు



రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

తాడికొండ: తన 14 ఏళ్ల పాలనలో చంద్రబాబు రాష్ట్రాన్ని అభివృద్ధి చేసింది శూన్యమని బహుజన పరిరక్షణ సమితి నాయకులు విమర్శించారు. తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు సోమవారం నాటికి 1,002వ రోజుకు చేరాయి. రిలే నిరాహార దీక్షల శిబిరాన్ని పలువురు సందర్శించి మద్దతు తెలిపారు. వారు మాట్లాడుతూ తన స్వార్థం కోసం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు ఏపీకి తీరని అన్యాయం, ద్రోహం చేశాడని విమర్శించారు. అయితే ఇప్పుడు మొసలి కన్నీరు కార్చుతూ తన బినామీ ఆస్తులు కాపాడుకునేందుకు అమరావతిలో రాజధాని పెట్టాలని చెప్పడం సిగ్గుచేటన్నారు. వేర్పాటువాద ఉద్యమాలకు బీజం పడకూడదనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వికేంద్రీకరణకు పెద్దపీట వేసి మూడు రాజధానుల ఏర్పాటు దిశగా అడుగులు వేస్తున్నారని వివరించారు. బాబు పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు తీరని అన్యాయం చేసిన కారణంగానే అతన్ని తరిమికొట్టారని, అయినా బుద్ధి మార్చుకోకుండా పదేపదే మోసం చేస్తూ అధికారం కోసం అబద్ధాలతో ప్రజల్లో తిరగడం సిగ్గుచేటన్నారు. దుష్ప్రచారం చేస్తున్న బాబు, ఆయన ఎల్లో మీడియాను ప్రజలు నమ్మరన్నారు. మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, పులి దాసు, కారుమూరి పుష్పరాజ్, బేతపూడి సాంబయ్య, బొలిమేర శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ మానసిక ఆస్పత్రిలో మెరుగైన వసతులు

- నేడు ఎన్ఏబీహెచ్ పర్యటన
- వసతులు, వైద్యసేవల పరిశీలన
- నేషనల్ అక్రిడిటేషన్ లభిస్తే కేంద్రం నుంచి ప్రత్యేక నిధులు



ప్రభుత్వ మానసిక ఆస్పత్రి

విశాఖపట్నం (ఏయూ క్యాంపస్): ప్రభుత్వ మానసిక వైద్యశాలను నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఫర్ హాస్పిటల్ అండ్ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ (ఎన్ఏబీహెచ్) సంస్థ సందర్శించనుంది. ఇద్దరు సభ్యుల బృందం మంగళ, బుధవారాల్లో ఆస్పత్రిలో విభిన్న అంశాలను ప్రత్యక్షంగా పరిశీలిస్తుంది. అనంతరం ఎన్ఏబీహెచ్ గుర్తింపు అందించే అవకాశం ఉంది. కమిటీ పర్యటన నేపథ్యంలో ఆస్పత్రిని పూర్తిస్థాయిలో అధికారులు సిద్ధం చేస్తున్నారు. ఎన్ఏబీహెచ్ కమిటీ బృందం గతంలోనూ ప్రభుత్వ మానసిక వైద్యశాలను సందర్శించినప్పటికీ గుర్తింపు ఇవ్వలేదు. వివిధ అంశాలు ప్రమాణాలకు అనుగుణంగా లేవనే కారణంగా గుర్తింపు పొందడం సాధ్యం కాలేదు. ప్రస్తుత అధికారులు గతంలో ఎన్ఏబీహెచ్ కమిటీ సభ్యులు సూచించిన అంశాలను పూర్తిస్థాయిలో పూర్తిచేసి గుర్తింపు సాధించడానికి సిద్ధమయ్యారు. కమిటీ పర్యటనలో భాగంగా మౌలిక వసతులు, ఆస్పత్రి రికార్డులు, ఫైర్ సేఫ్టీ, నీటి సదుపాయాలు, ఆస్పత్రి లైసెన్సులు, ఆస్పత్రిలో అందిస్తున్న సేవలు, పరిశుభ్రత, రోగుల సంరక్షణ, ఔషధాలు అందిస్తున్న విధానం వంటివి నిశితంగా పరిశీలిస్తారు.

గుర్తింపు లభిస్తే మంచిదే

ఎన్ఏబీహెచ్ గుర్తింపు లభిస్తే కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులు అందుతాయి. ఆస్పత్రి ప్రాంగణాన్ని ఎంతో సుందరంగా తీర్చిదిద్దారు. వార్డులు, కారిడార్లు పరిశుభ్రంగా ఉంచారు. ప్రత్యేకంగా పారిశుధ్య నిర్వహణపై దృష్టి సారించి నిరంతరం శుభ్రం చేస్తున్నారు. విద్యుత్, నీటి సరఫరా తదితర అంశాలను సైతం సునిశితంగా పరిశీలిస్తూ అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నారు. ఆస్పత్రి ప్రాంగణంలో ఆహ్లాదాన్ని పంచేవిధంగా రెండు అంతస్తుల్లో కారిడార్లలో కుండీలలో మొక్కలను ఏర్పాటు చేశారు. ఆస్పత్రిలో ఉన్న సెమినార్ హాల్, వీడియో కాన్ఫరెన్స్ హాల్, వైద్యుల విశ్రాంతి గదులు వంటివి పూర్తిస్థాయిలో సిద్ధం చేశారు.

గుర్తింపు సాధిస్తాం



ఎన్ఏబీహెచ్ సభ్యుల పరిశీలన అనంతరం ఆస్పత్రికి గుర్తింపు ఇస్తారు. గతంలో సందర్శించిన కమిటీ సభ్యులు సూచించిన అంశాలను పరిగణలోకి తీసుకుని మౌలిక వసతులు అభివృద్ధి చేయడం జరిగింది. ప్రమాణాలకు అనుగుణంగా ఆస్పత్రిలో అన్ని వసతులు సిద్ధం చేశాం.

– కేవీ రామిరెడ్డి, సూపరింటెండెంట్

గెయిల్ స్టేషన్‌లో లీకైన గ్యాస్ పైపులైన్

- మరమ్మతు చేస్తుండగా తెగిపడిన టెక్నీషియన్ చేతి మణికట్టు



గొల్లపాలెంలోని కేశనపల్లి గెయిల్ స్టేషన్ వద్దకు చేరుకున్న గ్రామస్తులు, అధికారులు

మలికిపురం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం గొల్లపాలెంలోని కేశనపల్లి గెయిల్ స్టేషన్‌లో లీకైన గ్యాస్ పైపులైన్‌కు మరమ్మతులు చేస్తుండగా ఓ వ్యక్తి చేతి మణికట్టు తెగిపోయిన ఘటన సోమవారం జరిగింది. వివరాల్లోకి వెళితే... గెయిల్ స్టేషన్‌లో గ్యాస్ సరఫరా చేసే ప్రధాన పైపులైను జాయింట్ వద్ద పైపు పెద్ద శబ్దంతో పేలి గ్యాస్ పైకి ఉవ్వెత్తున ఎగజిమ్మింది. వెంటనే స్పందించిన పాలకొల్లుకు చెందిన టెక్నీషియన్ ఎం.శంకర్, సిబ్బంది లీకవుతున్న గ్యాస్‌ను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో శంకర్ చేతి మణికట్టు గ్యాస్ తాకిడికి తెగిపోయింది. అయినా సిబ్బంది తీవ్రంగా శ్రమించి మరమ్మతులు చేశారు. ఈ సమయంలో మంటలు లేకపోవడంతో పెనుప్రమాదం తప్పిందని సిబ్బంది, గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. గాయపడిన శంకర్‌ను వెంటనే ఓఎన్జీసీ అంబులెన్స్‌లో రాజోలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

వైఎస్ జగన్ మళ్లీ సీఎం కావాలి..

- ఏపీకి చేరుకున్న తెలంగాణవాసి సైకిల్ యాత్ర



తాడేపల్లికి సైకిల్ యాత్ర చేస్తున్న ప్రవీణ్

జగ్గయ్యపేట: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండోసారి కూడా సీఎం కావాలని కోరుతూ తెలంగాణకు చెందిన వైఎస్సార్‌సీపీ నేత చేపట్టిన సైకిల్ యాత్ర సోమవారం రాష్ట్రంలోకి ప్రవేశించింది. జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం లింగంపల్లికి చెందిన బొద్దు ప్రవీణ్ రెండోసారి జగన్ సీఎం కావాలని కోరుతూ ఈ నెల 21న జనగామ నుంచి తాడేపల్లి వరకు సైకిల్ యాత్ర ప్రారంభించారు. సోమవారం ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటకు యాత్ర చేరుకోవడంతో.. పట్టణంలోని బైపాస్ రోడ్డులోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎన్నో సంక్షేమ పథకాలతో ప్రజలకు అండగా నిలుస్తున్న సీఎం వైఎస్ జగన్ రెండో సారి కూడా ముఖ్యమంత్రి అయితే ప్రజలకు మరింత మేలు జరుగుతుందని చెప్పారు. ప్రజలు, భగవంతుడి ఆశీస్సులతో ఆయన కచ్చితంగా విజయం సాధిస్తారని తెలిపారు.

ఏఆర్‌సీలో ఆడపులి కుమారి మృతి



కుమారి(ఫైల్)

ఆరిలోవ(విశాఖ తూర్పు): జంతు పునరావాస కేంద్రం(ఏఆర్‌సీ)లో ఆడ పులి మృతి చెందిన విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. జూ పార్కు సమీపంలో ఉన్న ఏఆర్‌సీలో 23 సంవత్సరాల వయసు కలిగిన కుమారి అనే ఆడపులి వృద్ధాప్యం కారణంగా అనారోగ్యానికి గురై ఈ నెల 24వ తేదీ రాత్రి మృతి చెందినట్లు జూ క్యూరేటర్ నందనీ సలారియా తెలిపారు. పశ్చిమ బెంగాల్‌లో ఫేమస్ సర్కస్ కంపెనీకి చెందిన కుమారిని 2007లో ఏఆర్‌సీకి తీసుకొచ్చారని, కుమారి మృతితో ఏఆర్‌సీలో ప్రస్తుతం పులులు లేవని పేర్కొన్నారు. కాగా, కుమారి మృతి చెందిన రెండు రోజులు వరకు విషయం బయటపడకుండా జూ అధికారులు గోప్యంగా ఉంచడం గమనార్హం. అదే రోజు ఉదయం జూలో జానకి అనే 22 ఏళ్ల ఆడ పెద్ద పులి మరణించిన విషయం బయటకు వెల్లడించిన జూ అధికారులు ఏఆర్‌సీలో మృతి చెందిన కుమారి విషయాన్ని గోప్యంగా ఉంచడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

బాబు పాలనలోనే ఆర్యవైశ్యులపై దాడులు

- రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్



ఒంగోలు టౌన్: చంద్రబాబు పాలనలోనే ఆర్యవైశ్యులపై విపరీతంగా దాడులు జరిగాయని.. ఒంగోలులోనే అనేక మంది హత్యకు గురయ్యారని రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్ చెప్పారు. వాస్తవాలను దాచిపెడుతూ.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. సోమ వారం ఒంగోలులో ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు పాలనలో 500 మంది ఆర్యవైశ్యుల మీద దాడులు జరిగాయని, ఒంగోలులో పల్లపోతు శ్రీనివాసరావు, ప్రమీలారాణిని అత్యంత దారుణంగా నరికి చంపారని గుర్తు చేశారు. కానీ ఇప్పుడు కుటుంబ కలహాల వల్ల జరుగుతున్న హత్యలకు, ఘర్షణలకు రాజకీయ రంగు పులిమి తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ హయాంలో ఆర్యవైశ్యులకు రూ.30 కోట్లు ఇచ్చినట్లు చెప్పడం అబద్ధమన్నారు. రాష్ట్రంలోని ఆర్యవైశ్యులకు ఇప్పటివరకు ఎవరూ చేయని విధంగా సీఎం జగన్ మేలు చేస్తున్నారని.. దీనిపై బహిరంగ చర్చకు తాను సిద్ధమని సవాల్ విసిరారు. నిరుపేద ఆర్యవైశ్యులకు ఇళ్ల స్థలాల పట్టాలిచ్చారని, అనేక సంక్షేమ పథకాలను అందిస్తున్నారని వివరించారు.

ప్రభుత్వ బడికీ బస్సొచ్చింది

- నెల్లూరు జిల్లా మనుబోలు మండలం అక్కంపేట జెడ్పీ స్కూల్ ఘనత
- మాజీ సర్పంచ్ ఔదార్యంతో స్కూల్ బస్ సౌకర్యం
- రూ.25 లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన మాజీ సర్పంచ్



పాఠశాల కోసం ఏర్పాటు చేసిన బస్సు

మనుబోలు: నాణ్యమైన విద్య అందించేలా సర్కారీ స్కూళ్లను సైతం కార్పొరేట్ స్కూల్స్‌కు దీటుగా తీర్చిదిద్దుతూ ప్రభుత్వం ఆధునిక సౌకర్యాలు కల్పిస్తోంది. ఇంగ్లిష్ మీడియం బోధనతోపాటు డిజిటల్ క్లాస్ విధానాలను అమల్లోకి తీసుకొచ్చింది. ప్రభుత్వ కృషికి తన తోడ్పాటును అందిస్తూ జెడ్పీ హైస్కూల్‌కు స్కూల్ బస్సును విరాళంగా అందించారు ఓ మాజీ సర్పంచ్. దీంతో ఇళ్ల వద్దే బస్ ఎక్కి రయ్యిమంటూ బడికి వెళ్లి వస్తున్నారు ఆ పాఠశాల విద్యార్థులు. వివరాల్లోకి వెళితే.. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా మనుబోలు మండలం అక్కంపేట గ్రామానికి చెందిన నారపరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి గ్రామానికి సర్పంచ్‌గా పనిచేశారు. ఆ సమయంలో గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో సరిపడినంత మంది విద్యార్థులు లేరనే సాకుతో అప్పటి టీడీపీ ప్రభుత్వం మూసివేసేందుకు సిద్ధపడింది. దీంతో అప్పటి సర్పంచ్ కిరణ్ న్యాయస్థానాన్ని ఆశ్రయించి పాఠశాలను మూతపడకుండా కాపాడారు. ఆ తరువాత ఇంటింటికీ తిరిగి పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపాలని తల్లిదండ్రుల్ని అభ్యర్థించారు. విద్యార్థులకు తన సొంత డబ్బుతో యూనిఫాం, బూట్లు, ప్రత్యేకంగా ట్యూటర్, టీవీ, ఇంటర్‌నెట్ తదితర వసతుల్ని సమకూర్చారు. దీంతో క్రమంగా పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరగసాగింది.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాకతో దశ మారిపోయింది

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి నడుం బిగించింది. ఇదే అదునుగా భావించిన మాజీ సర్పంచ్ కిరణ్ ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి ద్వారా ఉన్నతాధికారులతో మాట్లాడించి ప్రాథమికోన్నత పాఠశాలను అంచెలంచెలుగా పెంచుకుంటూ ఉన్నత పాఠశాలగా మార్పు చేయించుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నాడు–నేడు నిధులతో పాఠశాలలో మౌలిక వసతులను గణనీయంగా మెరుగుపర్చింది. చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులు పాఠశాలకు వచ్చేందుకు సరైన రవాణా సదుపాయం లేకపోవడంతో ఇబ్బందులు పడుతుండేవారు. దీంతో కిరణ్ పాఠశాల కోసం బస్సు కొనుగోలు చేయాలని భావించారు. రూ.25 లక్షల్ని వెచ్చించి బస్సు కొనుగోలు చేశారు. బస్సు నడిపే డ్రైవర్ జీతం, ఇంధన ఖర్చులు కూడా తానే భరిస్తూ విద్యార్థులకు స్కూల్ బస్సు నడుపుతున్నారు. కిరణ్ ఔదార్యాన్ని ఈ ప్రాంత ప్రజలు ప్రశంసిస్తున్నారు.

క్లుప్తంగా...

గో రక్షకుల మూకదాడిలో ఒకరు మృతి

ముంబై: ఆవు మాంసం తరలిస్తున్నారనే అనుమానంతో ఇద్దరు వ్యక్తులపై గో రక్షకుల మూక దాడిలో ఒకరు ప్రాణాలు కోల్పోయారు. మహారాష్ట్రలోని నాసిక్ జిల్లా గంభీర్‌వాడి వద్ద శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. ముంబైకి చెందిన ఇద్దరు వ్యక్తులు కారులో మాంసం తీసుకెళ్తుండగా 10 నుంచి 15 మంది వ్యక్తుల గుంపు ఘోటి-సిన్నార్ రోడ్డులో వాహనాన్ని అడ్డుకుని స్టీల్ రాడ్లు, కర్రలతో దాడి చేశారు. ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. అఫాన్ అన్సారీ(32) చనిపోగా నాసిర్ ఖురేషి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. హత్య కేసు నమోదు చేసిన పోలీసులు 11 మందిని అదుపులోకి తీసుకున్నారు. నాసిక్ జిల్లాలో రెండు వారాల వ్యవధిలో జరిగిన రెండో ఘటన ఇది. ఈ నెల 8న ఆవులను తరలిస్తున్న టెంపోను గోరక్షకులు అడ్డగించి, అందులోని ముగ్గురిపై దాడి చేయగా ఒకరు ప్రాణాలు కోల్పోయారు.

సీనియర్ మంత్రులతో ప్రధాని మోదీ భేటీ

న్యూఢిల్లీ: అమెరికా, ఈజిప్టుల్లో అధికారిక పర్యటనలను ముగించుకుని వచ్చిన ప్రధాని మోదీ సోమవారం సీనియర్ కేబినెట్ సహచరులతో సమావేశమయ్యారు. ఈ భేటీలో హోం మంత్రి అమిత్ షా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, పట్టణ వ్యవహారాలు, పెట్రోలియం శాఖల మంత్రి హర్దీప్ సింగ్ పూరి పాల్గొన్నారు. ప్రధాని ప్రిన్సిపల్ సెక్రటరీ పీకే మిశ్రా తదితర సీనియర్ అధికారులు కూడా హాజరయ్యారు. విదేశీ పర్యటనలను ముగించుకుని ప్రధాని మోదీ సోమవారం వేకువజామున ఢిల్లీకి చేరుకున్నారు.

రాజ్యసభ ఎంపీ హర్‌ద్వార్ దుబే కన్నుమూత



న్యూఢిల్లీ: ఉత్తర ప్రదేశ్‌కు చెందిన బీజేపీ సీనియర్ నేత, రాజ్యసభ సభ్యుడు హర్‌ద్వార్ దుబే (74) కన్ను మూశారు. అనారోగ్యానికి గురైన ఆయన ఈ నెల 12న ఢిల్లీలోని ఫోర్టిస్ ఎస్కార్ట్స్ హార్ట్ ఇన్‌స్టిట్యూట్‌లో చేరారు. ఆయన సోమవారం ఆస్పత్రిలో కన్నుమూశారని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ఆగ్రా కంటోన్మెంట్ నియోజకవర్గం నుంచి అసెంబ్లీకి ఎన్నికైన దుబే..1991లో కల్యాణ్ సింగ్ కేబినెట్‌లో మంత్రిగా పనిచేశారు. సంఘ్ పరివార్, ఏబీవీపీలతో ఆయనకు దగ్గరి సంబంధాలున్నాయి. దుబే మృతి పట్ల రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని మోదీ, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ సంతాపం ప్రకటించారు.

వెదురు నుంచి జీవ ఇంధనాలు!



బయో ఇథనాల్, బయో గ్యాస్ తయారీకి అనుకూలం

- 'హంగేరియన్ యూనివర్సిటీ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ లైఫ్ సైన్సెస్' సైంటిస్టుల అధ్యయనంలో వెల్లడి
- పునరుత్పాదక ఇంధన రంగంలో వెదురు ఒక విప్లవమే సృష్టిస్తుందంటున్న పరిశోధకులు


ఆధునిక యుగంలో ప్రపంచవ్యాప్తంగా శిలాజ ఇంధనాల వినియోగం నానాటికీ పెరిగిపోతోంది. సరైన ప్రత్యామ్నాయ ఇంధనాలు విరివిగా అందుబాటులో లేకపోవడంతో పెట్రోల్, డీజిల్, బొగ్గు వంటి వాటిపై అనివార్యంగా ఆధారపడాల్సి వస్తోంది. వీటివల్ల వాతావరణ మార్పులు సంభవిస్తున్నాయని, పర్యావరణానికి, భూగోళంపై మానవళి మనుగడకు ముప్పు ఏర్పడుతోందని తెలిసినప్పటికీ మరో దారిలేక ప్రమాదకరమైన ఇంధనాలపైనే అధికంగా ఆధారపడాల్సి వస్తోంది. మరోవైపు పునరుత్పాదక ఇంధనాలపై పరిశోధనలు జరుగుతున్నాయి. సౌర, పవన విద్యుత్ ఉత్పత్తి ఆశించిన స్థాయిలో ఊపందుకోవడం లేదు. జల విద్యుత్ ఉత్పత్తికి కొన్ని పరిమితులున్నాయి. ఇలాంటి తరుణంలో హంగేరీలోని 'హంగేరియన్ యూనివర్సిటీ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ లైఫ్ సైన్సెస్' పరిశోధకులు తీపి కబురు అందించారు. అడవుల్లో సహజసిద్ధంగా, విస్తృతంగా పెరిగే వెదురు(బ్యాంబూ)తో బయో ఇథనాల్, బయో గ్యాస్ వంటి జీవ ఇంధన ఉత్పత్తులు తయారు చేయవచ్చని తమ అధ్యయనంలో తేల్చారు. సమీప భవిష్యత్తులో పునరుత్పాదక ఇంధన రంగంలో వెదురు ఒక విప్లవమే సృష్టించబోతోందని చెబుతున్నారు. శిలాజ ఇంధనాలకు కాలుష్యానికి తావులేని ఇలాంటి ఇంధనాలే సరైన ప్రత్యామ్నాయం అవుతాయని అంటున్నారు. ఈ అధ్యయనం వివరాలను 'జీసీబీ బయో ఎనర్జీ' జర్నల్‌లో ప్రచురించారు.

- ఇతర చెట్లతో పోలిస్తే వెదురు చాలా వేగంగా పెరుగుతుంది. ఇదొక విలువైన సహజ వనరు. కాలుష్యాన్ని కట్టడి చేసే విషయంలో వెదురును 'సూపర్ స్పాంజ్'గా పరిగణిస్తుంటారు. కార్బన్ డయాక్సైడ్‌ను పీల్చుకుంటుంది. వాతావరణంలోకి ప్రాణవాయువు(ఆక్సిజన్)ను అధికంగా విడుదల చేస్తుంది.
- ప్రమాదకరమైన గ్రీన్‌హౌస్ వాయువుల ఉద్గారాన్ని అరికట్టడంలో వెదురు పాత్ర చాలా కీలకం. భూమిపై వాతావరణాన్ని శుద్ధి చేస్తుంది.
- ప్రకృతిలో వెదురు ప్రాధాన్యతను గుర్తించిన పరిశోధకులు దాని నుంచి పునరుత్పాదక ఇంధనాల తయారీపై ప్రత్యేకంగా దృష్టి పెట్టారు.
- కిణ్వ ప్రక్రియ(ఫెర్మెంటేషన్), అధిక ఉష్ణోగ్రతల వద్ద కుళ్లిపోయేలా చేయడం(పైరోలిసిస్)తోపాటు హైడ్రోథర్మల్ లిక్విఫాక్షన్, అనెయిరోబిక్ డైజెషన్ వంటి ప్రక్రియల ద్వారా ముడి వెదురు నుంచి బయో ఇథనాల్, బయోగ్యాస్ ఉత్పత్తి చేయవచ్చని కనిపెట్టారు.
- పరిశుద్ధమైన, స్థిరమైన ఇంధన వనరులను అందించగల సామర్థ్యం వెదురుకు ఉందని గుర్తించారు.
- కొన్ని జాతుల వెదురు నుంచి అధికంగా బయో ఇంధనం ఉత్పత్తి అవుతుందని చెబుతున్నారు. వేర్వేరు జాతులు వేర్వేరుగా రసాయన చర్య జరపడమే ఇందుకు కారణమని పేర్కొంటున్నారు.
- వెదురులో సెల్యూలోజ్‌లు, హెమిసెల్యూలోజ్‌లో అధిక మోతాదులో ఉంటాయి. వీటి నుంచి బయో ఇథనాల్, బయోగ్యాస్‌తోపాటు బయోచర్ అనే ఎరువు కూడా ఉత్పత్తి అవుతుంది.
- వెదురు నుంచి ప్రత్యామ్నాయ ఇంధనాలను తయారు చేసుకుంటే శిలాజ ఇంధనాలపై ఆధారపడాల్సిన అవసరం గణనీయంగా తగ్గిపోతుందని, తద్వారా కాలుష్యాన్ని, వాతావరణ మార్పులను నియంత్రించవచ్చని పరిశోధకులు సూచిస్తున్నారు. వెదురు నుంచి జీవ ఇంధనాల ఉత్పత్తి ప్లాంట్లకు పెద్దగా పెట్టుబడి అవసరం లేదని చెబుతున్నారు. ఇది పూర్తిగా సురక్షితమైన ప్రక్రియ అని పేర్కొంటున్నారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

భారత్ వాణిని ప్రపంచం ఆసక్తిగా వింటోంది

- మోదీ హయాంలో ఉగ్రవాదంపై సమర్థ చర్యలు
- అవసరమైతే సరిహద్దుల అవతల కూడా దాడులు చేస్తాం
- పాక్‌కు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పరోక్ష హెచ్చరిక



జమ్మూ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హయాంలో ప్రపంచ వేదికపై భారత్ పలుకుబడి, స్థాయి పెరిగిపోయాయని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. భారత్ చెప్పే విషయాలను ప్రపంచ సమాజం ఇప్పుడు ఆసక్తిగా వింటోందని చెప్పారు. గతంలో అంతర్జాతీయ వేదికలపై భారత్ ఏ విషయమైనా చెబితే, అంత సీరియస్‌గా తీసుకునేవారు కాదని తెలిపారు. మోదీ ప్రభుత్వం వచ్చాక 2014 తర్వాత అలాంటి పరిస్థితులు లేవని చెప్పారు. యూనివర్సిటీ ఆఫ్ జమ్మూలో జాతీయ భద్రతపై జరిగిన సదస్సులో సోమవారం ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీ అమెరికా, ఈజిప్టుల్లో ఆరు రోజుల పర్యటన సందర్భంగా పలు చారిత్రక ఒప్పందాలపై సంతకాలు చేసిన నేపథ్యంలో రాజ్‌నాథ్ ఈ వ్యాఖ్యలు చేశారు. విదేశాల్లో ప్రధాని మోదీ పలుకుబడి పెరిగిందని చెప్పారు. ఆస్ట్రేలియా ప్రధాని అల్బనీస్ 'బాస్'అంటూ మోదీని అభివర్ణించగా, అమెరికా అధ్యక్షుడు బైడెన్ ఆటోగ్రాఫ్ తీసుకునేంత ప్రజాదరణ కలిగిన నేతగా కొనియాడిన నేపథ్యంలో మంత్రి ఈ మాటలన్నారు. ప్రధాని మోదీ హయాంలో భారత్ మరింత శక్తివంతంగా మారిందన్న ఆయన..అవసరమైన పక్షంలో సరిహద్దుల వెలుపల కూడా దాడి చేయగలదంటూ పొరుగుదేశం పాకిస్తాన్‌ను హెచ్చరించారు. ఉగ్రవాదంపై మోదీ ప్రభుత్వం సమర్థవంతమైన చర్యలు తీసుకుందని చెప్పారు. ఉగ్రవాదంపై 'జీరో టాలరెన్స్'విధానం అంటే అర్థం ఏమిటో దేశంతోపాటు ప్రపంచమే తెలుసుకుందని వ్యాఖ్యానించారు. 2016, 2019ల్లో జరిపిన సర్జికల్ స్ట్రైక్స్‌ను ఆయన ప్రస్తావిస్తూ..ఇందుకు సంబంధించిన నిర్ణయాలను ప్రధాని మోదీ కేవలం 10 నిమిషాల్లోనే తీసుకున్నారని, దీన్ని బట్టి ఆయన సామర్థ్యమేంటో తెలుస్తుందని రాజ్‌నాథ్ తెలిపారు. సరిహద్దుల లోపలే కాదు, వెలుపల కూడా ఉగ్రవాదుల నెట్‌వర్క్‌ను మన బలగాలు ధ్వంసం చేశాయన్నారు. ఉగ్రవాదాన్ని పెంచిపోషించడమే ప్రభుత్వ విధానంగా మార్చుకున్న దేశాలు ఈ ఆటను ఎక్కువ సేపు ఆడలేవన్న విషయాన్ని గ్రహించాలని ఆయన పాక్‌నుద్దేశించి వ్యాఖ్యలు చేశారు. భారత్ కృషితో నేడు చాలా వరకు పెద్ద దేశాలు ఉగ్రవాదంపై కలిసికట్టుగా పోరాడుతున్నాయని చెప్పారు. కశ్మీర్‌లో ఉగ్రవాదాన్ని ప్రేరేపించడం ద్వారా ఏమీ సాధించలేమన్న విషయం పాక్ తెలుసుకోవాలన్నారు. పాక్ ముందుగా తన సొంతింటిని చక్కదిద్దుకోవాలని హితవుపలికారు. పాక్ ఆక్రమిత కశ్మీర్ కూడా భారత్‌దేనని చెప్పారు. దీనిపై పార్లమెంట్ ఇప్పటికే పలు తీర్మానాలు చేసిందని గుర్తు చేశారు. జమ్మూకశ్మీర్‌లో తామూ భాగమేనంటూ పీవోకే ప్రజలు డిమాండ్ చేసే రోజులు ఎంతో దూరంలో లేవని రాజ్‌నాథ్ వ్యాఖ్యానించారు.

5 గ్యారంటీలకు ఏటా రూ.60 వేల కోట్లు



బెంగళూరు: ఎన్నికల ప్రచారంలో రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన ఐదు గ్యారంటీల అమలుకు ప్రతిఏటా రూ.60,000 కోట్ల నిధులు అవసరమని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య చెప్పారు. వచ్చే నెల 7న తేదీన ప్రవేశపెట్టనున్న బడ్జెట్ మొత్తం రూ.3,35,000 కోట్లు ఉంటుందన్నారు. నూతన ఎమ్మెల్యేల శిక్షణా శిబిరాన్ని ఆయన సోమవారం ప్రారంభించారు. దేశానికి స్వాతంత్య్రం వచ్చిన తర్వాత కర్ణాటక తొలి బడ్జెట్ కేవలం రూ.21.3 కోట్లు మాత్రమేనని చెప్పారు. కర్ణాటక ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఐదు గ్యారంటీలు ఏమిటంటే.. నివాస గృహాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా. ఒక్కో ఇంట్లో ఒక మహిళకు నెలకు రూ.2,000 చొప్పున సాయం. దారిద్య్ర రేఖకు దిగువనున్న కుటుంబంలోని ప్రతి సభ్యుడికి 10 కిలోల చొప్పున బియ్యం పంపిణీ. 18–25 ఏళ్ల గ్రాడ్యుయేట్ నిరుద్యోగికి ప్రతినెలా రూ.3,000, డిప్లొమా నిరుద్యోగికి రూ.1,500 చొప్పున సాయం. ప్రజా రవాణా సంస్థ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం.

భారత్-అమెరికా భాగస్వామ్యానికి ప్రపంచంలో ప్రాముఖ్యత: బైడెన్

వాషింగ్టన్: భారత్-అమెరికా భాగస్వామ్యానికి, స్నేహానికి ప్రపంచంలో అత్యధిక ప్రాముఖ్యత ఉందని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఉద్ఘాటించారు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు గతంలో ఎన్నడూ లేనంత బలంగా, సన్నిహితంగా, స్థిరంగా ఉన్నాయని వివరించారు. వ్యూహాత్మక సాంకేతిక భాగస్వామ్యాన్ని మరింత ఉన్నతస్థాయికి చేర్చాలని భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటన సందర్భంగా నిర్ణయించుకున్నామని తెలిపారు. ఈ మేరకు బైడెన్ తాజాగా ట్వీట్ చేశారు. బైడెన్ ట్వీట్ పట్ల ప్రధాని మోదీ స్పందించారు. భారత్–అమెరికా స్నేహం ప్రపంచదేశాల అభ్యున్నతికి తోడ్పతుందని పేర్కొన్నారు. మన భూగోళం మరింత ఉత్తమంగా, స్థిరంగా మారడానికి ఇరుదేశాల భాగస్వామ్యం ఎంతగానో ఉపయోగపడుతుందని ట్విట్టర్‌లో స్పష్టం చేశారు. బైడెన్ అభిప్రాయంతో తాను ఏకీభవిస్తున్నానని తెలిపారు. ఇటీవల తాను చేపట్టిన పర్యటన భారత్–అమెరికా నడుమ సంబంధ బాంధవ్యాల బలోపేతానికి దోహదపడుతుందని మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు. భారత్, అమెరికా దేశాల మధ్యనున్న సన్నిహిత, లోతైన భాగస్వామ్యాన్ని మోదీ పర్యటన మరింత దృఢతరం చేసిందని అమెరికా అధ్యక్షుడి అధికారిక నివాసమైన వైట్ హౌజ్ హర్షం వ్యక్తం చేసింది.

'వాగ్నర్' చీఫ్ ప్రిగోజిన్ ప్రాణాలకు ముప్పు

సీఐఏ అధినేత డేవిడ్ పేట్రాయస్ హెచ్చరిక



వాషింగ్టన్: రష్యా అధినేత వ్లాదిమిర్ పుతిన్‌పై తిరుగుబాటు జెండా ఎగురవేసిన ప్రైవేట్ సైన్యం 'వాగ్నర్' చీఫ్ ప్రిగోజిన్ ప్రాణాలకు ముప్పు పొంచి ఉందని అమెరికా నిఘా సంస్థ సీఐఏ అధిపతి డేవిడ్ పేట్రాయస్ హెచ్చరించారు. తెరిచి ఉన్న కిటికీల వద్ద చాలా అప్రమత్తంగా ఉండాలని ప్రిగోజిన్‌కు సూచించారు. గతంలో పుతిన్ ప్రత్యర్థులు చాలా మంది ఇలా తెరిచి ఉన్న కిటికీల నుంచి జారిపడి మరణించారని పేట్రాయస్ పరోక్షంగా తెలియజేశారు. తిరుగుబాటు చర్య నుంచి వెనక్కి తగ్గడం ద్వారా ప్రిగోజిన్ ప్రస్తుతానికి ప్రాణాలు కాపాడుకున్నాడని, కానీ వాగ్నర్ గ్రూప్‌ను పోగొట్టుకున్నాడని అభిప్రాయపడ్డారు. రష్యా అధికార పీఠం పెత్తనాన్ని ప్రశ్నించినవారు అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటనలు గతంలో చోటుచేసుకున్నాయి. సోవియట్ కూటమిలోనూ, ఆ తర్వాత రష్యాలోనూ ఇలాంటి మరణాలు సంభవించాయి. కిటికీల నుంచి కింద పడిపోయి చనిపోయిన ఘటనలు చాలా ఉన్నాయి. తనపై తిరుగుబాటు చేసిన వారిని పుతిన్ అంత సులభంగా వదిలిపెట్టబోరని ఆయన గురించి తెలిసిన నిపుణులు చెబుతున్నారు. ప్రిగోజిన్ ప్రస్తుతం బెలారస్‌కు చేరుకున్నట్లు తెలుస్తోంది. ఆయన అక్కడ సురక్షితంగా ఉంటారా? అంటే చెప్పలేని పరిస్థితి నెలకొందని అంటున్నారు.

బెంగాల్‌లో కాంగ్రెస్, సీపీఎంలది మరోదారి: మమత


కూచ్‌బెహార్: కేంద్రంలోని బీజేపీకి వ్యతిరేకంగా మహాకూటమి ఏర్పాటుకు తాను ప్రయత్నిస్తుండగా, తమ రాష్ట్రంలో మాత్రం కాంగ్రెస్, సీపీఎం భిన్న స్వరాలు వినిపిస్తున్నాయని టీఎంసీ చీఫ్, బెంగాల్ సీఎం మమతా బెనర్జీ వ్యాఖ్యానించారు. ఆ రెండు పార్టీల చర్యలు రాష్ట్రంలో బీజేపీకి లాభం కలిగించేలా ఉన్నాయని విమర్శించారు. కూచ్‌బెహార్‌లో సోమవారం జరిగిన పంచాయతీ ఎన్నికల ర్యాలీలో మమత మాట్లాడారు. 'కేంద్రంలోని బీజేపీపై పోరాడేందుకు మేం మహాకూటమిని ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నాం. కానీ, బెంగాల్‌లో మాత్రం సీపీఎం, కాంగ్రెస్‌లు బీజేపీతో కలిసి పనిచేస్తున్నాయి. అటువంటి అపవిత్ర బంధాన్ని విచ్ఛిన్నం చేస్తాం'అని పేర్కొన్నారు. దీనిపై కాంగ్రెస్ బెంగాల్ అధ్యక్షుడు అధిర్ రంజన్ చౌధురి స్పందించారు. బీజేపీకి వ్యతిరేకంగా సాగే పోరాటంలో టీఎంసీ విశ్వసనీయతపై ఎప్పటి నుంచో అనుమానాలున్నాయన్నారు. బీజేపీపై పోరాటం విషయంలో తమకు చెప్పే అర్హత మమతా బెనర్జీకి లేదని సీపీఎం ఎదురుదాడి చేసింది. ఈ నెల 23న బిహార్‌లోని పట్నాలో సీఎం నితీశ్ సారథ్యంలో 12కు పైగా రాజకీయ పార్టీల నేతలు సమావేశమై 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఉమ్మడిగా పోరాడాలని వీరు నిర్ణయించారు. తాజాగా మమతా బెనర్జీ మరో బాంబు పేల్చడం గమనార్హం.



వాడేసిన ప్లాస్టిక్ బాటిళ్లతో రూపొందించిన సముద్ర తాబేలు రూపమిది. ప్లాస్టిక్ నియంత్రణపై అవగాహన కల్పించేందుకు చెన్నైలోని ఎడ్వర్డ్ ఇలియట్స్ బీచ్‌లో ఏర్పాటు చేసిన ఈ తాబేలును అందరూ ఆసక్తిగా తిలకించారు.

'డ్రగ్స్ రహిత భారత్'ను సాధిస్తాం

కేంద్ర హోం మంత్రి అమిత్ షా




న్యూఢిల్లీ: నరేంద్ర మోదీ ప్రభుత్వం దేశం నుంచి డ్రగ్స్ భూతాన్ని తరిమేస్తుందని హోం మంత్రి అమిత్ షా చెప్పారు. దేశం గుండా మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అరికడుతుందని స్పష్టం చేశారు. సోమవారం 'ఇంటర్నేషనల్ డే ఎగెనెస్ట్ డ్రగ్ అబ్యూజ్'సందర్భంగా అమిత్ షా ఈ మేరకు ఒక వీడియో సందేశం విడుదల చేశారు. ఇతర శాఖలు, విభాగాల సమన్వయంతో తమ హోం శాఖ అమలు చేస్తున్న నార్కోటిక్స్ వ్యతిరేక జీరో-టాలరెన్స్ విధానం విజయవంతమైందని, సానుకూల ఫలితాలు ఇప్పటికే కనిపిస్తున్నాయని చెప్పారు. డ్రగ్స్ రహిత భారత్ లక్ష్యంలో విజయం సాధించేవరకు తమ పోరాటం కొనసాగుతుందని ఆ వీడియోలో అమిత్ షా స్పష్టం చేశారు. 201-2022 సంవత్సరాల మధ్యలో సమష్టి చర్యల ఫలితంగా రూ.22 వేల కోట్ల మాదకద్రవ్యాలను సీజ్ చేశామన్నారు. ఇవి 2006-13 సంవత్సరాల మధ్య స్వాధీనం చేసుకున్న రూ.768 కోట్ల డ్రగ్స్ కంటే 30 రెట్లు ఎక్కువని వివరించారు. 2006-13 మధ్యలో డ్రగ్స్ విక్రేతలపై 1,257 కేసులు నమోదు కాగా, 2014-22 సంవత్సరాల్లో 3,544 కేసులు పెట్టినట్లు చెప్పారు. ఇవి 181 శాతం అధికమన్నారు. వీటితోపాటు 2022 జూన్ నుంచి ఇప్పటి వరకు 600 టన్నుల డ్రగ్స్‌ను ధ్వంసం చేసినట్లు తెలిపారు. మోదీ ప్రభుత్వం అన్ని శాఖలను సమన్వయం చేస్తూ ఉమ్మడిగా సాగించిన కృషి వల్లనే సాధ్యమైందని అన్నారు. నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో సహా అన్ని విభాగాలు డ్రగ్స్‌పై పోరాటాన్ని కొనసాగిస్తున్నాయని చెప్పారు. ప్రతి ఒక్కరూ మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, తమ కుటుంబాలను ఈ మహమ్మారికి దూరంగా ఉంచాలని ఆయన పిలుపునిచ్చారు.

డ్యూటీ ముగిసింది.. విమానం నడపను

ఎయిర్ ఇండియా విమానం ఎమర్జెన్సీ ల్యాండింగ్ ● పైలట్ నిర్వాకంతో 350 మంది ప్రయాణికుల అవస్థలు

జైపూర్: తన డ్యూటీ ముగిసిందని, అత్యవసరంగా ల్యాండ్ అయిన విమానాన్ని నడపబోనంటూ ఎయిర్ ఇండియా పైలట్ నిరాకరించడంతో 350 మంది ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రాజస్తాన్ రాజధాని జైపూర్‌లో ఈ సంఘటన జరిగింది. లండన్ నుంచి ఢిల్లీకి బయలుదేరిన ఎయిర్ ఇండియా విమానం షెడ్యూల్ ప్రకారం ఆదివారం తెల్లవారుజామున 4 గంటలకు ఢిల్లీ ఎయిర్‌పోర్టులో ల్యాండ్ కావాల్సి ఉంది. వాతావరణం అనుకూలించకపోవడంతో ఢిల్లీలో 10 నిమిషాల పాటు గాల్లోనే చక్కర్లు కొట్టింది. అనంతరం జైపూర్ విమానాశ్రయంలో అత్యవసరంగా ల్యాండ్ అయింది. దాదాపు 2 గంటల అనంతరం తిరిగి ఢిల్లీ వెళ్లేందుకు ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్ (ఏటీసీ) నుంచి అనుమతి లభించింది. కానీ, విమానాన్ని తిరిగి టేకాఫ్ చేసేందుకు పైలట్ అంగీకరించలేదు. తన డ్యూటీ అయిపోయిందని తేల్చిచెప్పాడు. దీంతో 350 మంది ప్రయాణికులు జైపూర్ ఎయిర్‌పోర్టులోనే చిక్కుకుపోయారు. తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొందరు ప్రయాణికులు ఇతర మార్గాల్లో ఢిల్లీ చేరుకున్నారు. కొన్ని గంటల తర్వాత మరో పైలట్‌ను ఏర్పాటు చేయడంతో విమానం ఢిల్లీకి చేరుకుంది. ఎయిర్ ఇండియా నిర్వాకం సోమవారం కూడా బయటపడింది. ముందస్తుగా సమాచారం ఇవ్వకుండానే విమానాన్ని రద్దుచేయడంతో 150 మంది ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తమిళనాడు రాజధాని చెన్నై నుంచి ఉదయం 10.05 గంటలకు ఢిల్లీకి విమానం బయలుదేరాల్సి ఉంది. ఆ విమానాన్ని ఎయిర్ ఇండియా యాజమాన్యం హఠాత్తుగా రద్దు చేసింది. ప్రయాణికులు ఎయిర్‌పోర్టులోనే కొన్ని గంటలపాటు పడిగాపులు పడ్డారు. చివరకు అసలు విషయం తెలుసుకొని యాజమాన్యం తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

మణిపూర్ సీఎంను తొలగించండి



న్యూఢిల్లీ: మణిపూర్‌లో దాదాపు రెండు నెలలుగా హింసాత్మక ఘటనలు కొనసాగుతున్నప్పటికీ ప్రధాని మోదీ మౌనం దాల్చడమేంటని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే ప్రశ్నించారు. మణిపూర్ గురించి ప్రధాని మోదీ నిజంగా ఆందోళన చెందుతున్నట్లయితే ముందుగా చేయాల్సింది ఆ రాష్ట్ర సీఎంను తొలగించడమేనన్నారు. మణిపూర్‌లో పరిస్థితులను చక్కదిద్దడంలో విఫలమైన బీజేపీ ప్రభుత్వం ఆ విషయాన్ని కప్పిపుచ్చు కోలేదని పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన పలు ట్వీట్లు చేశారు. 'గడిచిన 55 రోజుల్లో మణిపూర్ గురించి ప్రధాని మోదీ ఒక్క మాట కూడా మాట్లాడలేదు. ఆయన ఏం చెబుతారా అని ప్రజలంతా ఎదురు చూస్తున్నారు. మోదీ జీ నిజంగా మణిపూర్‌లో పరిస్థితులపై ఆందోళన చెందుతున్నట్లయితే, అక్కడి బీజేపీ సీఎంను ముందుగా తొలగించండి'అని పేర్కొన్నారు. సంఘ విద్రోహ శక్తులు, తీవ్రవాద సంస్థల నుంచి ఆయుధాలను స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. అన్ని పార్టీలతో సంభాషణలు జరిపి, ఉమ్మడి రాజకీయ పరిష్కారాన్ని కనుగొనాలని ప్రభుత్వానికి ఖర్గే సూచించారు. 'రాష్ట్రంలో జాతీయ రహదారులపై సురక్షిత ప్రయాణానికి వీలు కల్పించాలి. ప్రజలకు నిత్యావసర వస్తువులను అందుబాటులోకి తేవాలి. సహాయ, పునరావాస ప్యాకేజీని తక్షణమే అమలు చేయాలి'అని ఖర్గే పేర్కొన్నారు.

'ప్రధానమంత్రి పదవి'పై చర్చించలేదు: శరద్ పవార్

పుణే: పట్నాలో ఇటీవల జరిగిన విపక్షాల సమావేశంలో ప్రధానమంత్రి పదవిపై ఎలాంటి చర్చ జరగలేదని నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ(ఎన్సీపీ) అధ్యక్షుడు శరద్ పవార్ సోమవారం స్పష్టం చేశారు. దేశంలో పెరిగిపోతున్న ద్రవ్యోల్బణం, తీవ్రమైన నిరుద్యోగం, ప్రజా సమస్యలపై చర్చించామని తెలిపారు. మత ఘర్షణలను ప్రేరేపించడానికి కొందరు పన్నుతున్న కుట్రలపైనా చర్చ జరిగిందన్నారు. విపక్షాల సమావేశంపై అధికార బీజేపీ నేతలు చేసిన వ్యాఖ్యలను పవార్ ఖండించారు. సమావేశాలు నిర్వహించుకొనే హక్కు ప్రజాస్వామ్య వ్యవస్థలో విపక్ష నాయకులకు లేదా? అని నిలదీశారు. చిన్నపిల్లల తరహాలో మాట్లాడొద్దని మోదీ ప్రభుత్వానికి శరద్ పవార్ హితవు పలికారు.

విమానం ఇంజిన్ లోపలికి లాగేసింది!

టెక్సాస్ ఎయిర్‌పోర్టులో ఉద్యోగి మృత్యువాత

హ్యూస్టన్: ఊహించని ఘటన ఇది. అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రంలో శుక్రవారం చోటుచేసుకుంది. డెల్టా ఎయిర్ లైన్స్‌కు చెందిన విమానం 23న రాత్రి 10.25 గంటల సమయంలో లాస్ ఏంజెలెస్ నుంచి టెక్సాస్‌లోని శాన్ ఆంటోనియో ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుకు చేరుకుంది. ఎరైవల్ గేట్ వద్దకు చేరిన ఆ విమానంలోని ఒక ఇంజిన్ పనిచేస్తోంది. ఇంజిన్ వేగం ప్రభావానికి అదే సమయంలో అటుగా వెళ్లిన ఉద్యోగి ఒకరిని లోపలికి లాగేసింది. అతడు చనిపోయినట్లు నేషనల్ ట్రాన్స్‌పోర్టేషన్ సేఫ్టీ ఏజెన్సీ(ఎన్‌టీఎస్‌బీ)తెలిపింది. ఈ ఘటనకు దారి తీసిన పరిస్థితులపై డెల్టా ఎయిర్ లైన్స్ అధికారులను విచారిస్తున్నట్లు పేర్కొంది. మృత్యువాత పడిన ఉద్యోగి వివరాలను వెల్లడించలేదు. విమానాశ్రయాల్లో హ్యాండ్లింగ్ కార్యకలాపాలకు కాంట్రాక్టు సేవలందించే యునిఫి ఏవియేషన్ సంస్థ అతడిని నియమించుకున్నట్లు సమాచారం. కాగా, గత ఏడాది అలబామా ఎయిర్‌పోర్టులోనూ ఇలాంటి ఘటనే జరిగింది. విమానం ఇంజిన్ ఒక ఉద్యోగిని లోపలికి గుంజుకోవడంతో అతడు చనిపోయాడు. ఈ ఘటనపై దర్యాప్తు జరిపిన అధికారులు ఇటీవలే సదరు విమాన సంస్థకు రూ.12.80 లక్షల జరిమానా విధించారు.

వీర్యం తారుమారు చేసినందుకు రూ.1.5 కోట్ల జరిమానా

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి జాతీయ వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్(ఎన్‌సీడీఆర్‌సీ) రూ.1.5 కోట్ల జరిమానా విధించింది. కృత్రిమ గర్భధారణ కోసం వచ్చిన మహిళకు ఆమె భర్త వీర్యం బదులు మరొకరి వీర్యాన్ని ఎక్కించడమే ఇందుకు కారణం. అసిస్టెట్ రిప్రొడక్టివ్ టెక్నిక్(ఏఆర్‌టీ) విధానంలో సంతానం కోసం దంపతులు ప్రైవేట్ ఆసుపత్రిలో చేరారు. ఈ ప్రక్రియ విజయవంతంగా పూర్తయిన తర్వాత 2009 జూన్‌లో వారికి కవలలు జన్మించారు. శిశువులకు డీఎన్‌ఏ పరీక్షలు చేయించగా, వారి తండ్రి అతడు కాదని తేలింది. మరొకరి వీర్యంతో వారు జన్మించినట్లు స్పష్టమయ్యింది. మనోవేదనకు గురైన దంపతులు తమకు న్యాయం చేయాలని, రూ.2 కోట్ల నష్టపరిహారం చెల్లించేలా ఆసుపత్రిని ఆదేశించాలని కోరుతూ ఎన్‌సీడీఆర్‌సీని ఆశ్రయించారు. సుదీర్ఘ విచారణ దర్యాప్తు వారికి అనుకూలంగా కమిషన్ ఉత్తర్వులు జారీ చేసింది. దంపతులకు రూ.1.5 కోట్ల పరిహారం చెల్లించాలని ప్రైవేట్ ఆసుపత్రిని ఆదేశించింది. ప్రైవేట్ హాస్పిటళ్లలో కృత్రిమ గర్భధారణ వల్ల జన్మించిన ప్రతి శిశువు డీఎన్‌ఏ ప్రొఫైల్‌ను తయారీ చేసి ఇచ్చేలా నిబంధనలు అమలు చేయాల్సిన అవసరం ఉందని కమిషన్ అభిప్రాయపడింది.

ఒడిశాలో ఘోర బస్సు ప్రమాదం

పెళ్లి బృందంలోని 12 మంది మృత్యువాత



బరంపురం: ఒడిశాలోని గంజాం జిల్లాలో రెండు బస్సులు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో పెళ్లి బృందానికి చెందిన 12 మంది దుర్మరణం పాలయ్యారు. మరో ఏడుగురు గాయపడ్డారు. ఈ ఘటన దిగపహండి సమీపంలోని బరంపురం–తప్తపాని రహదారిపై ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పెళ్లి బృందంతో వస్తున్న ప్రైవేట్ బస్సు రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు చెందిన బస్సును ఢీకొట్టిందని ఎస్పీ శరవణ వివేక్ చెప్పారు. ప్రైవేట్ బస్సులోని వారంతా బరంపురంలోని వివాహ వేడుకకు హాజరై ఖండాదేవ్‌లీకి వెళ్తుండగా ఘోరం చోటుచేసుకుందన్నారు. మృతుల్లో ఒకే కుటుంబానికి చెందిన ఏడుగురున్నారు. క్షతగాత్రులైన ఏడుగురిని ఆస్పత్రికి తరలించామని, ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని తెలిపారు. ఘటనపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు కేంద్రం రూ.2 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.3 లక్షల చొప్పున సాయం ప్రకటించాయి. క్షతగాత్రులకు రూ.50 వేల చొప్పున అందజేయనున్నట్లు పీఎంవో ట్వీట్ చేసింది. ప్రైవేట్ బస్సుకు ఎలాంటి అనుమతులు లేవని అధికారులు తెలిపారు.



గోకాక్ గోడు
ఇప్పటికే జలజలా పరవళ్లు తొక్కాల్సిన గోకాక్ జలపాతం ఎండిపోయిన దృశ్యం. వర్షాలు లేకపోవడంతో ఇలా దర్శనమిచ్చింది

పొంచి ఉన్న చెత్త ముప్పు

గార్డెన్ సిటీ గార్బేజ్ సిటీ అయ్యిందని కొన్నేళ్లుగా బెంగళూరు తీవ్ర విమర్శలను ఎదుర్కొంటోంది. ఏనాడూ టాప్–1 స్వచ్ఛ నగరాల జాబితాలో వచ్చింది లేదు. ఉద్యానవనాలే తప్ప పారిశుధ్యం అధోగతికి చేరుకుందని ప్రజాసంఘాల ఆరోపణల్లో మార్పు లేదు. చెత్త వర్గీకరణ, తరలింపు టెండర్ల ప్రక్రియకు మోక్షం లేక చెత్త సమస్య జిగుసుకుపోతోంది.

- తడి, పొడి విభజనకు తూట్లు
- నెమ్మదించిన ప్రాసెసింగ్ కేంద్రాలు
- సిటీలో నిత్యం 5,800 టన్నుల చెత్త
- ముందుకు సాగని టెండర్ల ప్రక్రియ



ఐటీ సిటీని వీడని చెత్త సమస్య.. బసప్ప సర్కిల్‌లో చెత్తమయం



చెత్తను ప్రాసెస్ చేయకపోవడం వల్ల నిండిపోతున్న డంపింగ్ యార్డులు

బనశంకరి: ఐటీ సిటీలో నిత్యం ఉత్పత్తి అయ్యే తడి, పొడి చెత్త సేకరణ, తరలింపునకు ఒకే ఏజెన్సీకి అప్పగించడానికి ఆహ్వానించిన టెండర్ ప్రక్రియ పెండింగ్‌లో పడింది. ఈ నేపథ్యంలో చెత్త సమస్యకు శాశ్వత పరిష్కారం దొరకడం లేదు. చెత్త సమస్య నివారణకు తీవ్రంగా ప్రయత్నిస్తున్న బీబీఎంపీ, స్వచ్ఛతలో దేశంలోనే అగ్రస్థానంలో ఉన్న ఇండోర్ మాదిరి చెత్త తరలించే వ్యవస్థను అమలు చేయాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో బీబీఎంపీ పరిధిలోని 243 వార్డుల్లో ఉత్పత్తయ్యే తడి, పొడి చెత్తను సేకరించి ప్రాసెసింగ్ కేంద్రాలు, డంపింగ్ యార్డులకు తరలించడానికి గతేడాది సెప్టెంబర్ 28 న 89 ప్యాకేజీలకు టెండర్లను ఆహ్వానించారు. ఇందులో 84 ప్యాకేజీలకు ఎవరూ బిడ్‌లు వేయకపోవడంతో 2023 జనవరి 21న రెండోసారి టెండర్లు పిలిచారు. ఈ ప్రక్రియ అంతిమదశలో ఉండగా



చెత్తను తరలిస్తున్న వాహనాలు

89 ప్యాకేజీల సాంకేతిక బిడ్‌కు పాలికె కమిషనర్ అధ్యక్షతన కమిటీ ఆమోదం తెలిపింది. ఇటీవల అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గత బీజేపీ ప్రభుత్వంలో చేపట్టిన పనులు, టెండర్లను నిలిపివేయాలని ఆదేశించింది. దీంతో నగరంలో పాత పద్ధతిలోనే చెత్త తరలింపు జరుగుతోంది.

టెండర్లు ఆలస్యం కానివ్వం

బెంగళూరు నగరంలో చెత్త నిర్వహణను హైకోర్టు పర్యవేక్షణ చేస్తుందని, అలాగే టెండర్ ప్రక్రియ ఆలస్యం కాకుండా చూస్తాం రాష్ట్ర ప్రభుత్వం త్వరలో కొత్త కాంట్రాక్టు పద్ధతికి ఆమోదం తెలుపుతుంది. బాగలూరు డంపింగ్ యార్డు కేంద్రం నిండిపోతోంది, తడి, పొడి చెత్త విభజనను పెంచి, మిశ్రమ చెత్తను తగ్గించాల్సి ఉందని పాలికె అధికారులు తెలిపారు.

25 శాతమే చెత్త విభజన

బీబీఎంపీ ప్రస్తుతం ఇంటింటి నుంచి తడి, పొడిచెత్త సేకరణ తరలించే బాధ్యత ప్రత్యేక కాంట్రాక్టర్లకు అప్పగించింది. 2019 జనవరి 19న టెండర్లను ఆహ్వానించి 2020లో 90 వార్డుల్లో చెత్త సేకరణ తరలించే టెండర్‌ను కాంట్రాక్టర్లకు అప్పగించారు. మిగిలిన వార్డుల్లో పాలికె నుంచి చెత్త తరలింపు సాగుతోంది. కానీ తడి, పొడి చెత్త సేకరణను ప్రత్యేక కాంట్రాక్టర్లకు ఇచ్చినప్పటికీ తరలింపు మాత్రం 25 శాతం దాటలేదు. రెండు రకాల చెత్త కలిసిపోయి చెత్తదిబ్బల్లో పడేస్తున్నారు. దీంతో ప్రాసెసింగ్ స్తంభించిపోయింది.

ఏడాదికి వందల కోట్ల ఖర్చు

- సిటీలో ఉత్పత్తి అయ్యే చెత్త సేకరణ, తరలింపునకు బెంగళూరు చెత్త నిర్వహణ కంపెనీని ఏర్పాటు చేశారు. మూడేళ్ల క్రితం పాలికె 90 వార్డుల్లో చెత్త తరలించడానికి ఇచ్చిన కాంట్రాక్టు గడువు ముగియగా కొత్త టెండర్ ప్రక్రియ చేపట్టింది.
- బెంగళూరులో నిత్యం 5,800 మెట్రిక్‌టన్నుల చెత్త ఉత్పత్తి అవుతుంది. ఇందులో 3,800 మెట్రిక్ టన్నుల తడి చెత్త, 2 వేల మెట్రిక్ టన్నుల పొడిచెత్త ఉంటోంది.
- తడిచెత్తను ప్రాసెస్ చేసి కంపోస్టు ఎరువుగా తయారు చేయడం కోసం బీబీఎంపీ, కేయుఐడీఎఫ్‌సీ సంయుక్త ఆధ్వర్యంలో 2015లో 7 పొడిచెత్త సంస్కరణ కేంద్రాలను నిర్మించింది.
- ఈ కేంద్రాల నిర్వహణ కోసం 2021 జూన్ వరకు రూ.322 కోట్లు ఖర్చుచేసింది. కానీ ఈ కేంద్రాలు పూర్తిస్థాయిలో పనిచేయడం కష్టమైంది. నిర్ణీత సామర్థ్యం మేర చెత్త ను సేకరించి ఎరువుగా తయారుచేయడం లేదు.
- చిక్కనాగమంగల, దొడ్డబిదరకల్లు, కన్నహళ్లి, కేసీడీసీ, లింగదీరనహళ్లి కేంద్రాలు మాత్రమే పనిచేస్తున్నాయి. ఈ కేంద్రాలను దూరంగా తరలించాలని స్థానిక ప్రజల ధర్నాల వల్ల సిగేహళ్లి, సుబ్బరాయనపాళ్య కేంద్రాలు నిలిచిపోయాయి.
- చెత్త సంస్కరణ కేంద్రాలు అరకొరగా పనిచేయడం వల్ల పాలికె డంపింగ్ యార్డుల్లో చెత్త నిండిపోతోంది. ప్రస్తుతం బాగలూరు డంపింగ్ యార్డులో చెత్త వేస్తున్నారు. ఇది మరో 6 నెలల్లో నిండిపోతుంది, తరువాత కొత్త యార్డును వెతుక్కోవాలి.

బీజేపీలో ప్రాయశ్చిత్త రాజకీయాలు

- వలస నేతల వల్లే క్రమశిక్షణా లేమి
- కేంద్ర మంత్రి జోషీ, ఈశ్వరప్ప వెల్లడి



మాట్లాడుతున్న ఈశ్వరప్ప, పక్కన కేంద్ర మంత్రి జోషి

హుబ్లీ: అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోగానే బీజేపీ నాయకులు గతంలో చేసిన అనేక పనులు తప్పులుగా కనించసాగాయి. అప్పట్లో కాంగ్రెస్, జేడీఎస్ ఎమ్మెల్యేలను చీల్చి సర్కారు ఏర్పాటు చేసి సంబరాలు చేసుకున్నారు. ఇప్పుడే అదే తప్పని పశ్చాత్తాపం వ్యక్తంచేస్తున్నారు. వివరాలు.. పార్టీలో క్రమశిక్షణ లేమికి ఇతర పార్టీల నుంచి వచ్చిన వలస నేతలే కారణమని బీజేపీ సీనియర్ నేత కేఎస్.ఈశ్వరప్ప, కేంద్ర మంత్రి ప్రహ్లాద్‌జోషి వాపోయారు. హుబ్లీలో వారు మీడియాతో మాట్లాడారు. ఒప్పంద రాజకీయాలపై బహిరంగంగా చర్చ జరగడం దురదృష్టకరం అన్నారు. కాంగ్రెస్ గాలి తమకు అంటుకుందని, వారిని పార్టీలో చేర్చుకున్నందునే ఇదంతా అనుభవించాల్సి వస్తోందని పరోక్షంగా ఆపరేషన్ కమలపై అసంతృప్తిని వెళ్లగక్కారు. బీజేపీ ఓటమి తర్వాత కార్యకర్తలు నిరాశలో ఉన్నారన్నారు. అందువల్ల రాష్ట్ర వ్యాప్తంగా 7 బృందాలు పర్యటించి కార్యకర్తల్లోని నిరాశ నిస్పృహలను పోగొట్టి కార్యకర్తల్లో ఉత్సాహం నింపుతామన్నారు.

గ్యారంటీలన్నీ మోసం

నెలన్నర రోజులు గడిచినా కాంగ్రెస్ 5 గ్యారంటీ పథకాలను అమలు చేయకుండా ప్రజలు మోసగిస్తోందన్నారు. హామీలు నెరవేర్చకుండా దాటవేత సమాధానాలు చెబుతూ కేంద్రంపై వేలెత్తి చూపుతున్నారని మండిపడ్డారు. అసలు 5 గ్యారంటీలకు నిధులు ఎక్కడి నుంచి తెస్తారో సీఎం సిద్దరామయ్య శ్వేతపత్రం విడుదల చేయాలని ఈశ్వరప్ప డిమాండ్ చేశారు. అసెంబ్లీ లోపల, బయట ఆందోళన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.

లౌకికపార్టీలు మోదీని ఓడిస్తాయి: మొయిలీ

చిక్కబళ్లాపురం: రాబోయే లోకసభ ఎన్నికలో దేశంలోని 19కి లౌకికవాద పార్టీలు ఏకమై ప్రధాని నరేంద్రమోదీని ఓడిస్తామని కాంగ్రెస్ మాజీ సీఎంఎం ఎం.వీరప్ప మొయిలీ అన్నారు. సోమవారం చిక్కలోని వారి కార్యాలయంలో విలేఖరులతో మాట్లాడారు నేను ఎప్పుడు పార్టీలో టికెట్ అడగలేదు, వారే నన్ను పిలిచి టికెట్ ఇచ్చారు అన్నారు. పాట్నాలో 19 కి లౌకిక పార్టీల నేతలు సమావేశమై రాబోయే లోక్‌సభ ఎన్నికల గురించి చర్చించారని, కాంగ్రెస్ పార్టీ సముద్రం వంటిదని, అనేక నదుల వంటి పార్టీలు వచ్చి చేరుతాయని అన్నారు. రాబోయే తాలూకా, జడ్పీ ఎన్నికలను తీవ్రంగా తీసుకున్నామని, నేను ప్రతి పల్లెలో పర్యటిస్తానని అన్నారు.

పలుచోట్ల వానలు

యశవంతపుర: రాష్ట్ర వ్యాప్తంగా పలు చోట్ల సాధారణ వానలు కురుస్తున్నాయి. మరో 48 గంటల్లో పలు చోట్ల వానలు పడే అవకాశం ఉన్నట్లు వాతావారణశాఖ అధికారులు తెలిపారు. బెంగళూరు గ్రామాంతర జిల్లా నెలమంగల, కనసవాడి, రాజానుకుంట ప్రాంతాలలో వర్షాలు కురిసాయి. సోమవారం ఉదయం హుబ్లీలో అరగంట పాటు ఓ మోస్తరు వర్షం పడింది. దీంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఎండిన నదులు:

వానలు పడని కారణంగా దావణగెరె జిల్లా హరిహర వద్ద తుంగభద్ర నది ఎండిపోయిన దుస్థితి కనిపిస్తోంది. హోన్నాళి–న్యామతి ప్రాంతాలలో తాగునీటి సమస్య నెలకొంది. వచ్చే 15 రోజుల్లోపు వానలు పడకుంటే దావణగెరె, హరిహర ప్రాంతాల్లో తాగునీటికి కటకట తప్పదని అధికారులు హెచ్చరిస్తున్నారు. తుంగభద్ర జాక్‌వెల్‌లు ఎండిపోవటంతో అధికారులు 15 రోజుల నుంచి 47 బోర్లను తోడినట్లు దావణగెరె జిల్లా పంచాయతీ సీఈఓ సురేశ్ హిట్నాల్ తెలిపారు. బీదర్‌లో రెండు రోజులుగా కురుస్తున్న వానలతో వ్యవసాయ పనులు షూరూ అయ్యాయి. బెళగావిలో గోకాక్ సహా అనేక జలపాతాలు నిశ్శబ్దంగా మారాయి.

డబ్బుతో ఎన్నికల్లో గెలవడం అసాధ్యం

- ప్రజాసేవతోనే ఎన్నికల్లో విజయాలు
- అసెంబ్లీ సమావేశాలకు మిస్ కావద్దు
- సీఎం సిద్దరామయ్య



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సీఎం సిద్దరామయ్య, స్పీకర్ ఖాదర్ తదితరులు

శివాజీనగర: అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యేలు తప్పకుండా పాల్గొనాలని, గైర్హాజరు ఉండకూడదని ముఖ్యమంత్రి సిద్దరామయ్య నూతన ఎమ్మెల్యేలకు సలహా ఇచ్చారు. సోమవారం నగర శివారలోని నెలమంగల ఎస్.డీ.ఎమ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యాచురోపతి క్షేమవనంలో కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలకు మూడు రోజులు చేపట్టిన శిక్షణ శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ఎమ్మెల్యే తప్పకుండా అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొనటం ద్వారా మరొకరికి స్ఫూర్తి కావాలన్నారు. అనేక మందికి జీవితంలో ఒకసారైనా ఎమ్మెల్యే కావాలనే ఆకాంక్ష ఉంటుంది. అయితే ఎమ్మెల్యే అయిన తరువాత విధానసౌధ లోపలికే రారు. ఇది సరైన విధానం కాదు. సమావేశాల్లో పాల్గొని నియోజకవర్గ సమస్యలను ప్రస్తావించి ప్రభుత్వం ద్వారా పరిష్కార మార్గం కొనుగొనాలన్నారు. అనేక మంది ఎమ్మెల్యేలకు ధనముంటే ఎన్నికల్లో గెలుపొందవచ్చనే భావం ఉంది. ధనముంటే గెలుపు సాధ్యం లేదని, ప్రజల సమస్యలకు స్పందించి ప్రజోపయోగ పనులు చేపడితే మాత్రం ఎన్నికల్లో గెలుపొందేందుకు సాధ్యపడుతుందని కొత్త ఎమ్మెల్యేలకు సూచించారు. 224 మంది ఎమ్మెల్యేల్లో తొలిసారిగా 70 మంది విధానసభలో ప్రవేశం చేస్తున్నారు. ఇందులో కేంద్ర మాజీ మంత్రి కే.హెచ్. మునియప్ప, గాలి జనార్ధనరెడ్డి, అల్లం ప్రభు తదితరులు ఉన్నారన్నారు. నేటి కాలంలో ఎమ్మెల్యే కావటం కష్టం కావచ్చు. అనేక మంది పోరాటం చేపట్టి విధానసభకు వచ్చారు. ప్రజలు అందరిపై విశ్వాసముంచుకొన్నారు. అందుచేత ప్రజలు ఉంచుకొన్న నమ్మకం ప్రకారం నడుచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో విధానసభ అధ్యక్షుడు యూ.టీ.ఖాదర్, మంత్రులు పాల్గొన్నారు.

13 మంది ఎమ్మెల్యేలు గైర్హాజరు

16వ విధానసభకు కొత్తగా ఎన్నికైన సభ్యులకు చేపట్టిన శిక్షణ శిబిరంలో 13 మంది నూతన ఎమ్మెల్యేలు గైర్హాజరయ్యారు. 69 మంది ఎమ్మెల్యేల్లో 56 మంది ఎమ్మెల్యేలు శిబిరానికి హాజరయ్యారు. గైర్హాజరైన వారు వ్యక్తిగత కారణాలతో రాలేకపోతున్నట్లు వెల్లడించారు.

బాలికపై లైంగికదాడి కేసులో 25 ఏళ్ల జైలుశిక్ష

బనశంకరి: మైనర్ బాలికక మత్తు మాత్రలిచ్చి అత్యాచారానికి పాల్పడిన మౌలాసాబ్ దొడ్డమని అనే కామాంధునికి సోమవారం గదగ జిల్లా కోర్టు 25 ఏళ్ల జైలుశిక్ష రూ.50 వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చింది. 2018లో సవదత్తి తాలూకా తెరదకొప్ప గ్రామంలో నిందితుడు ఒక బాలికను బలవంతంగా బైకులో తీసుకెళ్లి నిర్మానుష్య ప్రాంతంలో ఇంట్లోకి తీసుకెళ్లి మత్తు మాత్రలు మింగించాడు. బాలిక స్పృహ కోల్పోయాక లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ దారుణంపై బాలిక తల్లిదండ్రులు నరగుంద పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి నిందితున్ని అరెస్టు చేశారు. ఐదేళ్ల పాటు సాగిన విచారణలో సోమవారం గదగ్ జిల్లా కోర్టు జడ్జి ఈ మేరకు తీర్పు ఇచ్చారు.

బీబీఎంపీ అక్రమాల దర్యాప్తునకు ప్రత్యేక విచారణ కమిటీ

బనశంకరి: బృహత్ బెంగళూరు మహా నగర పాలికె పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో అక్రమాలపై ప్రభుత్వం సీనియర్ ఐఏఎస్ అధికారులు రశ్మీ మహేశ్, మనీష్ ముద్గిల్ నేతృత్వంలో కమిటీని నియమించింది. ఈ కమిటీ బీబీఎంపీ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనుల అక్రమాలపై దర్యాప్తు చేపట్టి నివేదిక అందించే వరకు బీబీఎంపీ పరిధిలో జరుగుతున్న పనులకు బిల్లులు విడుదల చేయరాదని ఆదేశించింది. దీంతో పనులు పూర్తి చేసి బిల్లుల కోసం నిరీక్షిస్తున్న కాంట్రాక్టర్లకు ఇబ్బందులు తప్పేలా లేవు. బీజేపీ హయాంలో బీబీఎంపీలో వందల కోట్ల పనులు చేపట్టామని, అందులో కొందరి ఎమ్మెల్యేల నియోజకవర్గాలకు ఇష్టానుసారం నిధులు విడుదల చేశారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే బిల్లులు పెండింగ్ పెట్టాలని సీఎం ఆదేశించారు. అంతేగాక డిప్యూటీ సీఎం డీకే. శివకుమార్, రశ్మీ మహేశ్, మునీశ్‌ముద్గిల్ విచారణకు ఆదేశించారు.

బక్రీద్‌తో పొట్టేళ్ల ధరలకు రెక్కలు



బెంగళూరు చామరాజపేటె మైదానంలో పొట్టేళ్ల సంత

యశవంతపుర: బక్రీద్ పండుగ దగ్గర పడుతుండటంతో పొట్టేళ్లు, మేకలకు భారీగా డిమాండ్ ఏర్పడింది. చామరాజపేట క్రీడామైదానంలో ఇప్పటికే పొట్టేళ్ల అమ్మకాలు జోరందుకోవడంతో వ్యాపారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా బండూర్, అమీన్‌గడ్ పొట్టేళ్లకు మంచి డిమాండ్ ఉంది. పావగడ, శిర ప్రాంతాల నుంచి కాపర్లు పొట్టేళ్లు, మేక పోతులను తీసుకువచ్చి అమ్ముతున్నారు. ఇక్కడ జమునపురి, నాటు మేకపోతులకు గిరాకీ బాగా ఉంది. అంతేకాకుండా రామనగర, మండ్య, మద్దూరు, చెన్నపట్టణ, మాగడి, చిక్కబళ్లాపుర, దొడ్డబళ్లాపుర, బాగేపల్లి, తుమకూరు, నెలమంగల, హొసకోట, హరిహర, దావణగెరె, మళవళ్లి, కొళ్లేగాల, హాసన, అరసికెరె ప్రాంతాల నుంచి కాపర్లు మేకపోతులు, పొట్టేళ్లు తెచ్చి సంతలో విక్రయిస్తున్నారు. బండూరు, బాగేవాడి పొట్టేళ్లు రూ. లక్ష నుంచి లక్షన్నర పలుకుతున్నాయి. ఇక కిలారి పొట్టేలు రూ. 80 వేలు, నాటి పొట్టేలు రూ. 60 వేలు, సాధారణ పొట్టేళ్లు రూ. 20 వేల నుంచి 30 వేల వరకు ధర పలుకుతున్నాయి.

సిద్దు బడ్జెట్ రూ.3.5 లక్షల కోట్లు?

- గత బొమ్మై పద్దు కంటే ఎక్కువకు కసరత్తు



శివాజీనగర: శాసనసభా బడ్జెట్ సమావేశాలు జూలై 3 నుంచి ఆరంభమవుతుండగా, ముఖ్యమంత్రి సిద్దరామయ్య 2023–24వ సంవత్సర బడ్జెట్ కోసం కసరత్తు చేస్తున్నారు. ఈసారి బడ్జెట్ మొత్తం రూ.3.5 లక్షల కోట్లు ఉంటుందని అంచనా వేశారు. వివిధ శాఖల మంత్రులు, సీనియర్ అధికారులతో వరుసగా సమావేశాలను నిర్వహించి ఏ శాఖకు ఎంత కేటాయింపులు అనేది చర్చించారు. జూలై 7న కొత్త సర్కారు తొలి బడ్జెట్‌ను సమర్పిస్తారు. ఈ బడ్జెట్‌లో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఐదు గ్యారెంటీ పథకాలకు నిధులు కేటాయించాల్సి ఉంది. ప్రస్తుత ఆర్థిక స్థితిని పరిగణలోకి తీసుకుంటే బడ్జెట్‌కి నిధులు సమకూర్చుకోవడం కష్టతరంగానే ఉంటుంది. ఆదాయాన్ని ఇచ్చే ఎక్సైజ్, వ్యాపార, రిజిస్ట్రేషన్, ముద్రణా శాఖలు చురుగ్గా పనిచేయాలని సీఎం సూచించారు. ఇంతకు ముందు ఫిబ్రవరిలో బీజేపీ సర్కారులో సీఎం బొమ్మయ్ రూ.3 లక్షల 9 వేల కోట్ల బడ్జెట్‌ను సమర్పించారు. ఆ బడ్జెట్‌లో రూ.402 కోట్లు మిగులు చూపించారు. ఈసారి మిగులు ఉంటుందా అనేది అనుమానమే. బొమ్మయ్ బడ్జెట్ కంటే పెద్ద పద్దు ప్రకటించాలని సిద్దరామయ్య భావిస్తున్నారు.

డ్రగ్స్‌తో యువత భవితకు ముప్పు

- మత్తు జబ్బు నుంచి సమాజాన్ని కాపాడాలని ర్యాలీ



డ్రగ్స్ వ్యతిరేక ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

బనశంకరి: డ్రగ్స్ భావితరాల యువత భవిష్యత్‌కు ప్రమాదకరమని, దీనిపై విద్యార్థులు, యువతను జాగృతం చేయాలని డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ అన్నారు. ప్రపంచ డ్రగ్స్ నియంత్రణ దినోత్సవం సందర్భంగా యువజన క్రీడలు శాఖ ఆధ్వర్యంలో సోమవారం విధానసౌధ ముందు జాతాను నిర్వహించారు. డీకే మాట్లాడుతూ వేరే రాష్ట్రాలతో పోలిస్తే రాష్ట్రంలో డ్రగ్స్‌కు అడ్డుకట్ట వేశారని తెలిపారు. డ్రగ్స్ వల్ల భవిష్యత్ ప్రమాదకరంగా మారుతుందని, యువత అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. డ్రగ్స్ సమాజానికి క్యాన్సర్ రోగం లాంటిదని, దీనినుంచి సమాజాన్ని కాపాడి ఆరోగ్యకరమైన సమాజనిర్మాణం చేయాల్సిన అవసరం ఉందన్నారు. మీ స్నేహితులు, పరిచయస్తులు ఎవరైనా డ్రగ్స్ కు బానిసలైతే వారిని పోలీసులు వారిని అరెస్ట్ చేస్తారనే విషయాన్ని చాటి చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి బీ నాగేంద్ర, పెద్దసంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. డ్రగ్స్ వ్యతిరేక నినాదాలు చేస్తూ, ప్లకార్డులు ప్రదర్శిస్తూ యువత, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు.

న్యూస్‌రీల్

చిరుతల సంచారంతో భయం



రోడ్డుపై చిరుతపులులు

తుమకూరు: తుమకూరు జిల్లాలోని చిక్కనాయకనహళ్ళి తాలూకాలోని హులియూరు దగ్గర ఉన్న రంగనకెరె రంగనగుడ్డ చుట్టుపక్కల చిరుత పులులు కనిపించడంతో పరిసర ప్రాంతాల ప్రజలు హడలిపోతున్నారు. రంగనగుడ్డలో ఒకేసారి మూడు చిరుత పులులు రోడ్డుపై నడుచుకుంటూ దర్జాగా వెళుతుండగా కొందరు ఫోటోలు, వీడియోలు తీశారు. ఇవి సోషల్ మీడియాలో వ్యాప్తి చెందాయి. చిరుతల భయంతో మహిళలు, పిల్లలు బయటకు వెళ్లాలంటే వణికిపోతున్నారు. అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వచ్చి పరిశీలించారు. బోనులు ఏర్పాటు చేసి పట్టుకుంటామని తెలిపారు.

బియ్యం తప్పకుండా ఇస్తాం : డీసీఎం

శివాజీనగర: కేంద్ర ప్రభుత్వం బియ్యం సరఫరా చేసే విషయంలో రాజకీయం చేస్తోందని, మాట ప్రకారం పది కేజీల బియ్యం తప్పకుండా ఇస్తామని ఉప ముఖ్యమంత్రి డీ.కే శివకుమార్ అన్నారు. సోమవారం బెంగళూరులో విలేకరులతో మాట్లాడిన ఆయన, బీజేపీకి ఓటమిని జీర్ణించుకోలేక పోతోందని, అన్న భాగ్య పథకం కింద ఒక గింజ తగ్గినా ధర్నా చేస్తామని హెచ్చరించిందని, ఏడాది పొడవునా ధర్నా చేసినా తమకు బాధ లేదని, తాము ప్రజల పక్షాన నిలబడుతామన్నారు. ఆహార భద్రతా చట్టం కింద 5 కేజీల బియ్యం పంపిణీని నాటి యూపీఏ ప్రభుత్వంలో మాజీ ప్రధాని మన్‌మోహన్ సింగ్ జారీలోకి తీసుకొచ్చారని చెప్పారు.

మినీ బస్సు ప్రమాదంలో డ్రైవర్ మృతి



పూర్తిగా ధ్వంసమైన మినీ బస్సు

తుమకూరు: గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ప్రమాదంలో మినీ బస్సు నుజ్జునుజ్జు కాగా డ్రైవర్ దుర్మరణం చెందాడు. ఈ సంఘటన తుమకూరు జిల్లాలోని మధుగిరి తాలూకాలోని జడగొండనహళ్ళి దగ్గర సోమవారం తెల్లవారు జామున జరిగింది. మినీ బస్ డ్రైవర్, మధుగిరి తాలూకా తగ్గిహళ్ళి గ్రామానికి చెందిన సంజీవయ్య (40) పావగడ మార్గంలో వెళ్తుండగా ఏదో భారీ వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. మినీ బస్ బాగా దెబ్బతినగా తీవ్ర గాయాలతో సంజీవయ్య అక్కడే ప్రాణాలు కోల్పోయాడు. బస్సులో ఎవరూ లేకపోవడంతో మరింత ప్రాణనష్టం తప్పింది. మధుగిరి పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు.

నా భార్య డ్రగ్స్‌కు బానిస

- సినీ నిర్మాత చంద్రశేఖర్ ఫిర్యాదు



చంద్రశేఖర్ (ఫైల్)

యశవంతపుర: తన భార్య మత్తు పదార్థాలకు బానిస కావడంతో పాటు డ్రగ్స్ విక్రేతతో అక్రమ సంబంధం పెట్టుకుందని నటుడు, నిర్మాత టి చంద్రశేఖర్ భార్య నమిత, ఆమె స్నేహితుడు లక్ష్మీశ్ ప్రభులపై బెంగళూరు చెన్నమ్మనకెరె అచ్చుకట్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి.. రెండేళ్ల క్రితం చంద్రశేఖర్, నమితను పెళ్లాడారు. బనశంకరి సెకండ్ స్టేజీ లో నివాసం ఉంటున్నారు. నమిత మత్తు పదార్థాలకు అలవాటు పడింది, మానేయాలని బుద్ధిమాటలు చెప్పినా పట్టించుకోవడం లేదు. ఆమెకు డ్రగ్స్‌ను సరఫరా చేస్తున్న లక్ష్మీశ్ ప్రభుతో అక్రమ సంబంధం పెట్టుకుంది. ఇటీవల ఇంటిలో ఇద్దరూ రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోవడంతో ప్రశ్నిస్తే నాపైనే దాడి చేశారని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు.

తప్పుడు ఆరోపణలన్న భార్య

కాగా, భర్త తనపై దాడి చేశాడని భార్య నమితా కూడా ఫిర్యాదు చేసింది. తనకు లక్ష్మీశ్ స్నేహితుడు మాత్రమేనని, భర్త తప్పుడు ఆరోపణలు చేస్తున్నట్లు నమితా పేర్కొంది. అతని స్నేహితులు అరుణ్, హేమంత్‌లు తనపై చాకుతో దాడి చేసినట్లు, ఇంటిలో డ్రగ్స్ పెట్టి అరెస్ట్ చేయిస్తానంటూ బెదిరిస్తున్నట్లు నమిత ఫిర్యాదులో తెలిపింది. ఇరువైపుల ఫిర్యాదును తీసుకుని పోలీసులు విచారణ చేస్తున్నారు.

క్లుప్తంగా

పూడిక తొలగింపునకు శ్రీకారం



రాజ కాలువలో పేరుకున్న పూడికను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

బళ్లారి అర్బన్: నగరంలోని వివిధ ప్రాంతాల్లో ప్రధాన మురుగు కాలువల్లో పేరుకు పోయిన పూడికను తొలగించే ప్రక్రియకు ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. ఎన్నికల ముందు ఓటర్లకు ఇచ్చిన మాట ప్రకారం స్వచ్ఛతను కాపాడి నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు సోమవారం ప్రధాన కాలువల్లో జేసీబీ యంత్రాల ద్వారా పూడికను తొలగించే పనులను ఆయన ప్రారంభించారు.

హ్యాండ్‌బాల్ టోర్నీలో ప్రతిభ



కప్పులతో బాల బాలికల జట్లు

మండ్య: రాజస్థాన్‌లోని జైపూర్‌లో జరిగిన హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొన్న మండ్యకు చెందిన బాలుర, బాలికల క్రీడాకారుల జట్లు ప్రథమ బహుమానం సాధించాయని జట్టు కోచ్ కే.రవి తెలిపారు. మండ్య నగరంలో ఉన్న వివిధ పాఠశాలలు, కళాశాలలకు చెందిన సుమారు 17 సంవత్సరాల లోపు క్రీడాకారులను ఎంపిక చేసి జైపూర్ టోర్నీకి తీసుకెళ్లారు. బాల, బాలికల జట్లు మంచి ప్రతిభ చూపి విజేతలుగా నిలిచాయని చెప్పారు.

అవి మోదీవి కాదు, యూపీఏ బియ్యం

- మంత్రి సంతోష్‌లాడ్

హుబ్లీ: రేషన్ బియ్యం నరేంద్ర మోదీవి అన్న విషయంపై ధార్వాడలో రాష్ట్ర కార్మిక శాఖా మంత్రి సంతోష్‌లాడ్ ఘాటుగా స్పందించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రధాని మోదీ ఇస్తున్న బియ్యం అంటుండడంపై కేంద్రంపై మండిపడ్డారు. యూపీఏ సర్కారు హయాంలోనే ఆహార భద్రత చట్టం తెచ్చామన్నారు. దేశ వ్యాప్తంగా ఈ చట్టం మేరకు ప్రతి పేద కుటుంబానికి 5 కేజీల బియ్యం ఇచ్చామన్నారు. లక్షా పది వేల కోట్ల కేజీల బియ్యం నిల్వ చేసుకొని 5 కేజీల బియ్యం పథకాన్ని ప్రారంభించామన్నారు. 10 కేజీల రేషన్ ఇచ్చే తీరుతామన్నారు. అందువల్ల ఆ బియ్యం మోదీ ఇస్తున్నవి కాదు, యూపీఏ ఇస్తున్న బియ్యం అన్నారు. కేంద్రం ఇచ్చే 5 కేజీల బియ్యానికి తోడుగా రాష్ట్రం తరఫున 5 కేజీలు కలిపి తాము రేషన్‌కార్డులోని ప్రతి ఒక్కరికీ 10 కేజీల బియ్యం ఇస్తామని మాట ఇచ్చామన్నారు. ఆ ప్రకారంగానే 10 కేజీల బియ్యాన్ని ఇస్తామన్నారు. బెంగళూరు- ధార్వాడ వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రారంభోత్సవానికి గైర్హాజరుపై ఆయన స్పందిస్తూ ధార్వాడలో సాంకేతికంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రధాని మోదీ వర్చువల్‌గా రైలును ప్రారంభించారన్నారు. ఈ కార్యక్రమానికి తనకు ఆహ్వానం లేదని ఆయన కేంద్రంపై ధ్వజమెత్తారు.

మా పథకాలు ఆగవు: మంత్రి



మాట్లాడుతున్న మంత్రి ఎంబీ పాటిల్

హుబ్లీ: రాష్ట్ర ప్రభుత్వాన్ని కేంద్రం ఎంతగా ఇబ్బంది పెట్టినా తమ పథకాలు ఎట్టి పరిస్థితిలో ఆగబోవని రాష్ట్ర భారీ పరిశ్రమల శాఖా మంత్రి ఎంబీ పాటిల్ పేర్కొన్నారు. ఆయన సోమవారం నగరంలో మీడియాతో మాట్లాడారు. 10 కేజీల ఉచిత బియ్యం పంపిణీ చేస్తామన్నారు. ఈ విషయంలో కేంద్రం రాజకీయాలు చేస్తోందని ఆరోపించారు. ఎన్నికల్లో ఓటమితో కాంగ్రెస్‌పై ద్వేషాన్ని పేదలపై తీర్చుకుంటున్నారని మండిపడ్డారు. కేంద్రం సహకరించకపోయినా తాము చెప్పినట్లుగా నడుచుకుంటామని ఆయన అన్నారు.

వాసవి మహిళా మేళా



పాల్గొన్న మహిళా మండలి సభ్యులు

కోలారు: కేఈబీ సముదాయ భవనంలో శ్రీనివాస మహిళా మండలి ఆధ్వర్యంలో సోమవారం వాసవి మహిళా మేళాను ఏర్పాటు చేశారు. నగరంతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి వందలాదిగా మహిళలు మేళాలో పాల్గొని వచ్చే శ్రావణ మాసాన్ని దృష్టిలో ఉంచుకుని పూజా సామగ్రిని పెద్ద ఎత్తున కొనుగోలు చేశారు. నగరంలో ప్రతియేటా ఆషాఢ మాసంలో వాసవి మహిళా మండలి సభ్యులు ఈ మేళాను నిర్వహిస్తారు. కరోనా కారణంగా గత రెండేళ్లుగా ఈ మేళాను నిర్వహించలేదు. అందువల్ల ఈ యేడాది వాసవి మహిళా మండలి సభ్యులు ఈసారి మేళాను ఉత్సాహంగా జరిపారు. మహిళా మండలి అధ్యక్షురాలు ఉమా రవీంద్ర, ఉపాధ్యక్షురాలు దేవి గుప్త తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పాపం వారిదే

- మా ప్రభుత్వానిది బాధ్యత కాదు
- విద్యుత్ శాఖా మంత్రి కేజే జార్జ్



సమావేశంలో పాల్గొన్న మంత్రి కేజే జార్జ్, ఎమ్మెల్యేలు, అధికారులు

రాయచూరు రూరల్: రాష్ట్రంలో విద్యుత్ ధరల పెరుగుదలకు బీజేపీనే ప్రధాన కారణమని విద్యుత్ శాఖా మంత్రి కె.జె.జార్జ్ పేర్కొన్నారు. సోమవారం శక్తినగర్ కృష్ణా అతిథిగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2022 నవంబర్‌లో కర్ణాటక విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్(కేఈఆర్‌సీ) చేసిన ప్రతిపాదనల వల్లే విద్యుత్ చార్జీలు పెరిగాయన్నారు. దీనిని కాంగ్రెస్ సర్కార్ చేసిందని ఆరోపించడం తగదన్నారు. గృహజ్యోతి పథకంలో 2.51 కోట్ల మంది లబ్ధిదారుల్లో ఇంతవరకు 52 లక్షల మంది నమోదు చేసుకున్నారన్నారు. విద్యుత్ కోత విధించవద్దని అధికారులకు సూచిస్తామన్నారు. రాయచూరు థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రం (ఆర్టీపీఎస్)లో మొదటి యూనిట్ పునశ్చేతనానికి ఆర్థిక సాధకబాధకాలను తెలుసుకోడానికి శక్తినగర్‌లో పర్యటించానన్నారు. బొగ్గు రవాణా కంపెనీలకు గత ప్రభుత్వం బకాయిలు చెల్లించక పోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆర్టీపీఎస్, యరమరస్ థర్మల్ విద్యుత్ కేంద్రం(వైటీపీఎస్)లో విద్యుత్ ఉత్పత్తి లోపాల సవరణకు అధికారులతో ప్రత్యేకంగా సమావేమయ్యారు. మంత్రి జార్జ్ రెండు కేంద్రాలను పరిశీలించారు. ఎమ్మెల్యేలు బసనగౌడ తుర్విహాళ, హంపనగౌడ బాదర్లి, బసనగౌడ దద్దల్, కేపీసీఎల్ ఎండీ గౌరవ్‌గుప్త, కార్యదర్శి పంకజ్ కుమార్ పాండే, జిల్లాధికారి చంద్రశేఖర్ నాయక్, జిల్లా ఎస్పీ నిఖిల్ తదితరులున్నారు.

పర్యావరణ సంరక్షణకు చర్యలేవీ?

ఆర్టీపీఎస్, వైటీపీఎస్ విద్యుత్ ఉత్పత్తి యూనిట్లలోని లోపాలను సవరించి పర్యావరణ సంరక్షణకు చర్యలు చేపట్టాలని విద్యుత్ శాఖా మంత్రి కె.జె.జార్జ్‌కు ప్రజా ప్రతినిధులు విన్నవించారు. సోమవారం శక్తినగర్‌లోని కృష్ణా అతిథిగృహంలో ఎంపీ రాజా అమరేశ్వర నాయక్, గ్రామీణ ఎమ్మెల్యే బసనగౌడ మంత్రి కేజే జార్జ్‌కు వినతిపత్రం సమర్పించారు.

అప్రకటిత విద్యుత్ కోత తగదు

నగరంలో జెస్కాం అధికారులు అప్రకటిత విద్యుత్ కోత విధించడం తగదని డీసీసీ ఉపాధ్యక్షుడు బాబూరావు మంత్రి కేజే జార్జ్‌కు వినతిపత్రం అందించారు. సోమవారం రైల్వేస్టేషన్‌లో ఆయన మంత్రిని కలిసి విన్నవించారు. విద్యుత్ కోతలకు వేళాపాళా లేకుండా పోయిందని, అధికార్లు విద్యుత్ కోతను అరికట్టేలా చర్యలు చేపట్టేలా ఆదేశించాలని కోరారు.

పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించరూ

రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ పథకంలో కేఈఆర్‌సీ రూపొందించిన నియమాలను ఉల్లంఘించిందని రాయచూరు చాంబర్ ఆఫ్ కామర్స్ ఉపాధ్యక్షుడు మూర్తి పేర్కొన్నారు. సోమవారం శక్తినగర్ అతిథిగృహంలో మంత్రి జార్జ్‌కు వినతిపత్రం సమర్పించి మాట్లాడారు. కేఈఆర్‌సీ పెంచిన ధరలు అశాస్త్రీయంగా ఉన్నాయన్నారు. ఎస్కాంలు పెంచిన ధరలను తగ్గించేలా ప్రభుత్వం జోక్యం చేసుకోవాలన్నారు. కేఈఆర్‌సీ రూపొందించిన కొత్త బిల్లులను ఏప్రిల్, మే, జూన్, జూలై నెలల్లో పరిశీలించి ఆగస్టు నుంచి అమలుకు అనుమతించాలని, పెంచిన విద్యుత్ చార్జీలను ఉపసంహరించుకోవాలని మంత్రిని కోరారు.

వర్షం కోసం గాడిదలకు పెళ్లి



గాడిదలకు వివాహం జరిపించిన గ్రామస్తులు

హొసపేటె: సకాలంలో వర్షాలు కురవాలని జిల్లాలోని హగరిబొమ్మనహళ్లి తాలూకా హనసి గ్రామస్తులు సోమవారం గాడిదలకు వివాహం జరిపించారు. గ్రామంలో ఉదయం గాడిదలకు స్నానాలు చేయించి, పూలమాలలతో అలంకరించి సంప్రదాయంగా పెళ్లి చేశారు. అనంతరం గ్రామ వీధుల్లో మేళతాళాలతో ఊరేగించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

కమిషనర్‌పై చర్యలకు వినతి

రాయచూరు రూరల్: జిల్లాధికారి ఆదేశాలను కాదని సఫాయి కర్మచారుల వేతనాల్లో తారతమ్యం చేసిన నగరసభ కమిషనర్ గురులింగప్పపై చర్యలు చేపట్టాలని సఫాయి కర్మచారి సంఘం డిమాండ్ చేసింది. సోమవారం కలెక్టరేట్ వద్ద చేపట్టిన ఆందోళననుద్దేశించి అధ్యక్షుడు రాజ్ మాట్లాడారు. సవరించిన వేతనాలు చెల్లించాలని రెండేళ్ల క్రితమే ఆదేశించినా బేఖాతరు చేసిన కమిషనర్‌ను విధుల నుంచి సస్పెండ్ చేయాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం అందించారు.

కూరగాయల ధరలకు రెక్కలు

- ఏరకమైనా కిలో రూ.50కి పైనే
- సామాన్య, పేద ప్రజలు బెంబేలు



మార్కెట్‌లో కూరగాయలను ఖరీదు చేస్తున్న కొనుగోలుదారులు

బళ్లారిటౌన్: గత కొన్ని రోజులుగా కూరగాయల ధరలు రోజురోజుకు పెరుగుతుండటంతో సామాన్య, పేద, మధ్యతరగతి ప్రజలు కొనేందుకు వెనుకాడాల్సిన పరిస్థితి నెలకొంది. నెల రోజుల క్రితం కిలో రూ.10 ఉన్న టమాట ధర నేడు రూ.90కి చేరుకుంది. ఇక బీన్స్ కిలో రూ.120, వంకాయలు రూ.80, పచ్చిమిర్చి రూ.100, క్యారెట్ రూ.60, బీరకాయలు రూ.80, సొరకాయలు రూ.30, కాకరకాయలు రూ.60, దొండకాయలు రూ.60, ఇలా వేటి ధరలు చూసినా కిలో రూ.50కి పైగా పలకడంతో పేదలు వాటిని కొనాలంటే ఒకటికి నాలుగు సార్లు ఆలోచించాల్సిన పరిస్థితి నెలకొంది.

వర్షాల జాడలేక ధరలు పైపైకి

ఇటీవల ఎండలు పెరిగి పోవడంతో పాటు తొలకరి వర్షాలు కురవనందున కూరగాయల ధరలకు రెక్కలు వచ్చినట్లు తెలుస్తోంది. అంతేగాక స్థానికంగా కూరగాయల ఉత్పత్తి లేకపోవడంతో ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి కూరగాయలు తరలివస్తున్నాయి. వీటికి రవాణా ఖర్చులు కూడా జతకావడంతో ధరలు పెరుగుతున్నాయని వ్యాపారులు వాపోతున్నారు. ఏదిఏమైనా సామాన్యుడు జేబునిండా డబ్బులు తీసుకెళ్లినా సంచి నిండా కూరగాయలు రావడం లేదన్న చందంగా పరిస్థితి మారింది. రాష్ట్ర ప్రభుత్వం కూడా రైతు బజార్ల ద్వారా సామాన్య, పేద వర్గాలకు కూరగాయలు అందుబాటులో ఉంచాలని ప్రజలు కోరుతున్నారు.

జూదరుల అడ్డాపై పోలీసు దాడి

- 19 ద్విచక్రవాహనాలు సీజ్



పోలీసులు స్వాధీనపరచుకున్న బైక్‌లివే

రాయచూరు రూరల్: జిల్లాలోని మాన్వి తాలూకా జానేకల్ కొండలో జూదం ఆడుతున్నట్లు అందిన సమాచారం మేరకు జూదరుల అడ్డాపై పోలీసులు దాడి చేసి బైక్‌లను స్వాధీనం చేసుకున్న ఘటన జరిగింది. సోమవారం డీసీఐబీ అధికారి తిప్పణ్ణ, మాన్వి సీఐ వీరభద్రయ్యస్వామి హిరేమఠ్ తమ సిబ్బందితో కలిసి దాడి చేసి నలుగురిని అరెస్ట్ చేశారు. పలువురు పోలీసుల కళ్లుగప్పి పారిపోయారు. అయితే వారు వదిలిన 19 ద్విచక్రవాహనాలను సీజ్ చేసి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జక్కలదిన్నిలో చోరీ

జిల్లాలోని సిరవార తాలూకా జక్కలదిన్నిలో ఆదివారం రాత్రి 2 గంటల సమయంలో చోరీ జరిగింది. గ్రామానికి చెందిన రవిగౌడ ఇంటిలో దొంగలు చొరబడి రూ.1.35 లక్షల నగదు, తులం బంగారు, తులం వెండి సామగ్రిని దోచుకెళ్లారు. ఈ ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అవినాష్ కాంబ్లే తెలిపారు.

మాలూరులో 8 మంది అరెస్టు

మాలూరు: అందర్ బాహర్ ఆడుతున్న అడ్డాపై దాడి చేసిన పోలీసులు 8 మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.4100 నగదు, 4 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. తాలూకా కాలోని ఎం.ఉప్పారహళ్లికి చెందిన తిమ్మరాయప్ప, అణికెరెహళ్లికి చెందిన మంజునాథ్, మునిరాజు, బుట్టప్ప, బాలాజీ, కత్తరహళ్లికి చెందిన మంజునాథ్, బళేరుమనగళకు చెందిన ప్రవీణ్‌కుమార్, మాస్తికి చెందిన ఏకె కాలనీ వెంకటేష్‌లను పోలీసులు చేశారు. పోలీసులు రాకను గమనించి ఘటనా స్థలం నుంచి ముగ్గురు పరారయ్యారు. దాడిలో మాస్తి పోలీస్ స్టేషన్ ఎస్ఐ, సిబ్బంది హెచ్‌బీ శివశంకర్, మురళీ, హెచ్‌ఎం నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

కోలారు వార్తలు...

హైటెక్ వేశ్యావాటిక గుట్టురట్టు

- నలుగురి అరెస్టు

శ్రీనివాసపురం: జిల్లాలోని ముళబాగిలు తాలూకా కర్ణాటక, ఆంధ్ర సరిహద్దు వద్ద హైటెక్ వేశ్యావాటికపై ముళబాగిలు పోలీసులు దాడి జరిపి నలుగురు వ్యక్తులను అరెస్టు చేశారు. మరో ముగ్గురు పరారు కాగా వారి కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఈ కార్యాచరణలో 6 మంది మహిళలను రక్షించారు. కార్యాచరణపై కోలారు జిల్లా ఎస్పీ ఎం నారాయణ వివరాలు అందించారు. ఈ మహిళలను హైదరాబాద్‌కు చెందిన విజయ్ అనే వ్యక్తి ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాల నుంచి తీసుకొచ్చి రెస్టారెంట్ యజమానులతో కలిసి వేశ్యావాటికను నడుపుతున్నాడని తెలిపారు. ఘటనకు సంబంధించి మొత్తం 14 మందిని అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు తెలిపారు. రెస్టారెంట్ యజమాని, మేనేజర్, సప్లయర్, రిసెప్షనిస్ట్, మహిళలను తీసుకొచ్చిన ఏజెంట్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఏజెంట్ విజయ్, మంజునాథ్, అంజప్ప, సతీష్‌లను అరెస్టు చేయగా, పరారీలో ఉన్న రెస్టారెంట్ యజమాని చంద్రహాస్ కోసం గాలిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. దాడి సమయంలో రూ.5,56,300 నగదు, రూ.2 కోట్ల విలువ చేసే 10 కార్లు, 14 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఇక్కడ వేశ్యావాటికతో పాటు డ్యాన్స్ కూడా ఆడించే వారని తెలిపారు. విజయవాడ, చిత్తూరు, విశాఖపట్టణం నుంచి మహిళలను తీసుకువచ్చే వారని తెలిసిందన్నారు. సతీష్ అనే వ్యక్తి పార్టీ ఏర్పాటు చేశాడని, మహిళలంతా 20, 21, 23, 24 ఏళ్ల వయసు వారేనని, వారిని సఖి సాంత్వన కేంద్రానికి తరలించినట్లు తెలిపారు. ముళబాగిలు తాలూకా హెచ్.బయప్పనహళ్లి సమీపంలో సుమారు 8 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న రిసార్టులో రాక్ వ్యాలీ బార్ అండ్ రెస్టారెంట్ గదుల్లో మహిళలను ఉంచి వేశ్యావాటికను నిర్వహిస్తున్నారనే ఖచ్చితమైన సమాచారంతో ప్రత్యేక పోలీసు బృందాన్ని రచించి దాడులు నిర్వహించినట్లు ఎస్పీ తెలిపారు.

చెత్త నిర్వహణపై అవగాహన అవసరం



విద్యార్థులకు జాగృతి కల్పిస్తున్న ఉపాధ్యాయులు

కోలారు: చెత్త నిర్వహణపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని సుహాస్ సంస్థ ప్రతినిధి మంజునాథ్ అన్నారు. ఆయన సోమవారం నుగ్గలాపుర ప్రభుత్వ పాఠశాలలో చెత్త డంపింగ్‌పై విద్యార్థులకు జాగృతిని కల్పించి మాట్లాడారు. చెత్త నిర్వహణలో ప్లాస్టిక్ చెత్త వల్ల పర్యావరణానికి తీరని నష్టం కలుగుతోందన్నారు. పాఠశాల విద్యార్థులు చెత్తను రోడ్లు, డ్రైనేజీల్లో వేయరాదన్నారు. చెత్తను సేకరణ కోసం వచ్చే వాహనాల్లోనే వేయాలన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు మంజునాథ్, కావ్య తదితరులు పాల్గొన్నారు.

బక్రీద్‌కు గొర్రెల వ్యాపారం జోరు



అధిక ధరలకు అమ్ముడు పోయిన గొర్రెలివే



సంతలో అమ్మకానికి ఉంచిన గొర్రెలు

మాలూరు: చిక్కతిరుపతిలో సోమవారం వారపు సంత సందర్భంగా ఈనెల 29న బక్రీద్‌ను పురస్కరించుకుని మేకలు, గొర్రెల వ్యాపారం జోరుగా సాగింది. రెండు మేకలు అత్యధికంగా రూ.1.40 లక్షలకు, బన్నూరుకు చెందిన 4 గొర్రెలు రూ.1.80 లక్షల ధరకు అమ్ముడుపోయి రికార్డు సృష్టించాయి. గొర్రెలు, మేకలు, కోళ్లు కలిపి మొత్తం రూ.3 కోట్ల వరకు లావాదేవీలు జరిగినట్లు సమాచారం. ప్రతి సోమవారం చిక్కతిరుపతి ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయం వెనుక భాగంలో సంత జరుగుతుంది. తాలూకాలోని పలు గ్రామాలతో పాటు కోలారు, హొసకోటె, సర్జాపుర, ఆనేకల్, బెంగళూరు, మండ్య, మైసూరు, తమిళనాడులోని బేరికె, హోసూరు, కృష్ణగిరి, సూళగిరి తదితర ప్రాంతాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో వ్యాపారులు వచ్చారు. హోసూరుకు చెందిన అక్రం అనే వ్యక్తి తన జత మేకలను ఏకంగా రూ.1.40 లక్షలకు విక్రయించి రికార్డు సృష్టించాడు. కోళ్లను ఒక్కొక్కటి రూ.1000 నుంచి రూ.2000 ధర వరకు విక్రయించారు.

మహారాష్ట్ర భక్తుల పర్తియాత్ర



ధర్మవరం షిరిడీ సాయి బాబా ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్ రాజు



అశాడీ దిండీ పాదయాత్రలో భక్తులతో కలసి ముందుకు సాగుతున్న సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్ రాజు

ప్రశాంతి నిలయం: ప్రతి ఏటా ఆషాఢ ఏకాదశిని పురస్కరించుకుని మహారాష్ట్ర, గోవా రాష్ట్రాలకు చెందిన వార్కరీ సంప్రదాయాన్ని ఆచరించే భక్తుల ఆషాడీ దిండి పర్తి యాత్ర సోమవారం ఉదయం ధర్మవరం చేరుకుంది. ఇరు రాష్ట్రాలకు చెందిన 1500 మంది భక్తులు మహారాష్ట్రలోని దిండి నుంచి ప్రత్యేక రైలులో ధర్మవరం చేరుకున్నారు. సత్యసాయి ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్ రాజు బృందం వారికి ఘనంగా స్వాగతం పలికారు. విఠోభా, రఖుమాయిలను పూజించే వీరు సత్యసాయి బాబాను విష్ణువుగా భావించి మహారాష్ట్రలోని దిండీ నుంచి పుట్టపర్తికి యాత్రగా చేరుకుంటారు. గత 35 ఏళ్లుగా ఆశాడీ దిండి యాత్ర ఆనవాయితీగా వస్తోంది. ఊరేగింపుగా భక్తిగీతాలు ఆలపిస్తూ పుట్టపర్తికి సాగారు.

పట్టపగలే వరుస చోరీలు

కేజీఎఫ్: నగరంలో సోమవారం పట్టపగలే వరుస చోరీలు జరిగాయి. రాబర్ట్‌సన్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఒకటి, అండర్‌సన్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలో మరో చోరీ జరిగింది. పాత స్వర్ణకుప్పం వేణుగోపాల్ అనే వ్యక్తి ఇంటి పైకప్పునకు ఉన్న సిమెంట్ షీట్‌ను విరిచి లోపలకు చొరబడిన దొంగలు బీరువా తాళం తెరిచి 16 గ్రాముల బంగారం, 250 గ్రాముల వెండి సామగ్రిని దోచుకెళ్లారు. తమిళనాడులోని వటరం పల్లిలో తన సంబంధీకులు ఒకరు మరణించగా, ఇంటికి తాళం వేసి వేణుగోపాల్ తమ కుటుంబ సభ్యులతో కలిసి అక్కడికి వెళ్లడంతో దొంగలు ఇంట్లో చొరబడి నగలు దోచుకు వెళ్లారు. చాంపియన్‌రీఫ్ జీ బ్లాక్‌లో ప్రమీల అనే మహిళ ఇంటికి వేసిన తాళం పగలగొట్టిన దొంగలు ఇంట్లోని రూ.50 వేల విలువ చేసే బంగారు ఆభరణాలు, టీవీని దొంగిలించుకెళ్లారు. పోలీసులు పరిశీలించి జాగిలాన్ని తెప్పించి దొంగల ఆచూకీని కనుగొనే ప్రయత్నం చేశారు.

విదర్భ తరహా ప్యాకేజీ కోసం ధర్నా



కలెక్టరేట్ ముందు ధర్నా చేస్తున్న పదాధికారులు

కోలారు: వచ్చే బడ్జెట్ సమావేశాల్లో జిల్లాకు విదర్భ తరహా ప్యాకేజీని ప్రకటించాలని డిమాండ్ చేస్తూ రైతు సంఘం పదాధికారులు సోమవారం కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించారు. రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె నారాయణగౌడ మాట్లాడుతూ జిల్లా అభివృద్ధిలో గత ప్రభుత్వాలు పూర్తిగా విఫలం అయ్యాయని ఆరోపించారు. రైతులకు నకిలీ విత్తనాలు, మందులు విక్రయిస్తున్నా వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్ట పోతున్న రైతులకు ప్రభుత్వం తగిన పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. మహిళా అధ్యక్షురాలు ఎ.నళినిగౌడ మాట్లాడుతూ సమావేశంలో ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం స్త్రీస్వసహాయ సంఘాల రుణాలు మాఫీ చేయాలని, రోడ్లు, రాజకాలువల అభివృద్ధికి ప్రాధాన్యతనివ్వాలని ఒత్తిడి చేశారు. అనంతరం కలెక్టర్ అక్రం పాషాకు వినతిపత్రం సమర్పించారు. ధర్నాలో జిల్లా అధ్యక్షుడు ఈకంబళ్లి మంజునాథ్, ఫారూక్ పాషా, వక్కలేరి హనుమయ్య, కేఈబీ చంద్రు తదితరులు పాల్గొన్నారు.

పార్కు సొగసు చూడతరమా?

- నిరుపయోగంగా కుట్టుశిక్షణ కేంద్రం
- తుప్పు పట్టిన వ్యాయామ సామగ్రి



వినియోగంలో లేని కుట్టు శిక్షణ కేంద్రం



అధ్వానంగా మారిన పార్కు, ఆట పరికరాలు



మూలన పడిన వ్యాయామ పరికరాలు

కంప్లి: పట్టణంలోని 20వ వార్డు మారుతీనగర్‌లో సుమారు 15 ఏళ్ల క్రితం రూ.లక్షలాది ఖర్చుతో మున్సిపాల్టీ తరఫున ఉద్యానవనం, పిల్లల కోసం ఆట సామగ్రి, జిమ్, కుట్టు శిక్షణా కేంద్రాలను, నీటిసౌకర్యం కోసం పార్కు స్థలంలో మినీ ఓవర్‌హెడ్ ట్యాంక్‌ను కూడా నిర్మించారు. ప్రారంభంలో కొన్నేళ్ల పాటు పార్కు నిర్వహణ సజావుగానే సాగిన అనంతరం సక్రమంగా బాధ్యతలు చేపట్టనందున ఉద్యానవనం ఆవరణలోని ఆటసామగ్రి, వ్యాయామ పరికరాలు మూలన పడ్డాయి. మరుగుదొడ్ల తలుపులు, నీటి సరఫరా పైపులు విరిగిపోయాయి. ఉద్యానవనంలో పిచ్చిమొక్కలు మొలిచి జంగిల్‌గా మారి అధ్వాన స్థితికి చేరింది. ఈ వార్డు కౌన్సిలర్ కూడా పార్కు దుస్థితిపై దృష్టి సారించకపోవడం, మున్సిపల్ యంత్రాంగం పర్యటించకపోవడమే ఈ దుస్థితికి కారణమని మారుతీనగర్ వాసులు ఆరోపిస్తున్నారు. ఏ పథకం ద్వారా ఎంత ఖర్చుతో నిర్మించారనే విషయంలో మున్సిపల్ సిబ్బంది తమకు తెలియదని చేతులు దులుపుకుంటున్నారు. ఎమ్మెల్యే గణేష్ ఈ విషయంపై దృష్టి సారించి కారకులపై చర్యలు తీసుకొని పార్కు వైభవాన్ని తిరిగి పునరుద్ధరించి ప్రజలకు ఉపయోగపడేలా చేయాలని స్థానికులు కోరుతున్నారు.

రెండింతలు పెరిగిన విద్యుత్ బిల్లులు

- వినియోగదారుల్లో తీవ్ర అసహనం
- ఉచితమంటూ దోచేస్తున్నారని ఆక్రోశం



గత నెలతో పోల్చితే ఈ నెలలో రెట్టింపు మొత్తంలో వచ్చిన విద్యుత్ బిల్లులు

శ్రీనివాసపురం: రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ రాగానే విద్యుత్ వినియోగదారులకు గట్టి షాక్ ఇస్తోంది. విద్యుత్ చార్జీల పెంపుతో దాదాపుగా బిల్లులను రెట్టింపు చేసి వినియోగదారుల ఆగ్రహానికి గురవుతోంది. ఎన్నికల సమయంలో 200 యూనిట్ల వరకు విద్యుత్ ఫ్రీ అంటూ ప్రచారం చేసుకుని అధికారంలోకి వచ్చి అనంతరం వినియోగదారుడి నుంచే పరోక్షంగా వసూలు చేస్తోందని ప్రజలు కొత్త ప్రభుత్వంపై ఆక్రోశం వ్యక్తం చేస్తున్నారు. ఇంతింత బిల్లులను తాము ఎక్కడి నుంచి తెచ్చి కట్టాలని ఆవేదన చెందుతున్నారు. మే నెల విద్యుత్ బిల్లును జూన్‌లో కట్టాల్సి ఉండగా జూన్ నెల బిల్లును చూసి వినియోగదారుడు షాక్‌కు గురవుతున్నారు. ముళబాగిలు పట్టణంలోని ముత్యాలపేటకు చెందిన నివృత్త ఉపాధ్యాయుడు నాగరాజ్‌కు ఈనెల కరెంట్ బిల్లు ఏకంగా రూ.2209 రావడంతో బిల్లును చూసి అవాక్కయ్యాడు. దీనిపై బెస్కాం అధికారులను ప్రశ్నిస్తే వారి నుంచి సరైన సమాధానం రావడం లేదు. ఎన్నికల ముందే విద్యుత్ ధరలను కేఈఆర్‌సీ నియమానుసారం పెంచారు. అయితే ఎన్నికల కోడ్ కారణంగా అప్పట్లో పెంచిన ధరలను అమలు చేయలేదు. ప్రస్తుతం వెనుకటి నుంచి పెంచిన విద్యుత్ బకాయిలను కూడా చేర్చి బిల్లులు ఇస్తున్నట్లు సాకులు చెబుతున్నారు. పైగా విద్యుత్ ధరలను పెంచి ప్రజలను లూటీ చేస్తూ ఫ్రీ కరెంట్ ఇస్తామనడం ఎంతవరకు సమంజసమని ప్రజలు వాపోతున్నారు.

క్లుప్తంగా

నేడు కెంపేగౌడ జయంతి



కెంపేగౌడ సాంస్కృతిక వేదిక సభ్యులు

గౌరిబిదనూరు: నగరంలో మంగళవారం నాడ ప్రభు కెంపేగౌడ జయంతిని ఘనంగా నిర్వహించనున్నట్లు కెంపేగౌడ సాంస్కృతిక వేదిక సభ్యుడు జనార్దన మూర్తి తెలిపారు. సోమవారం ఉదయం ప్రైవేటు సముదాయ భవనంలో విలేకరులతో మాట్లాడుతూ... ఉదయం 9.30 గంటలకు ఎంజీ సర్కిల్ నుంచి వివిధ కళా బృందాతో పాటు కెంపేగౌడ విగ్రహాన్ని ఊరేగిస్తామన్నారు. అనంతరం సభలో ఒక్కలిగుల సముదాయానికి ప్రతిభావంత విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందజేస్తామన్నారు. విలేకరుల సమావేశంలో కర్ణాటక రైతు సంఘం, హసిరుసేనె రామచంద్రారెడ్డి, రామలింగారెడ్డి, ఒక్కలిగుల ఐక్య వేదిక ప్రభాకరరెడ్డి, సూర్యప్రకాశ్, అశ్వత్థరెడ్డి, పవన్‌రెడ్డి, అనంత కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వర్షాల కోసం కప్పలకు పెళ్లి



పెళ్లి తంతు నిర్వహిస్తున్న బాలలు

మైసూరు: మైసూరు జిల్లాలో ఇప్పటికీ వర్షాలు కురవక రైతాంగం నిట్టూరుస్తోంది. వరుణ దేవుని కోసం సంప్రదాయ పూజల్ని నమ్ముకున్నారు. హుణసూరు తాలూకాలోని చిక్కెగౌడన కొప్పలి గ్రామంలో వర్షాలు పడాలని కప్పలకు పెళ్లి చేసి ఊరేగించారు. జూన్ నెలకు ముందే కురువాల్సిన తొలకరి జల్లులు ఇప్పటివరకు పడకపోవడంతో జనం ఆందోళనలో ఉన్నారు. అనేక దేవాలయాల్లో విశేష పూజలు చేస్తున్నారు. అయినా కూడా వర్షాలు పడక పోవడంతో చివరి ప్రయత్నంగా కప్పలకు పెళ్లి చేసి వాటిని వెదురుబొంగుకు కట్టి పిల్లలు గ్రామంలో ఊరేగించారు.

బాల నేరస్తులు పట్టివేత

యశవంతపుర: స్కూటీలను అపహరిస్తున్న ఇద్దరు బాల నేరస్తులను జేసీ నగర పోలీసులు అరెస్ట్ చేశారు. ఏడాది కాలంలో మైనర్లు ఇద్దరు 44 స్కూటీలను అహరించినట్లు పోలీసులు తెలిపారు. వీరిని బాల నేరస్తుల కేంద్రానికి అప్పగించారు. ఇద్దరు ఒకే ప్రాంతంలో ఉండటంతో మంచి స్నేహితులయ్యారు. రాత్రి, పగలు వీధుల్లో తిరుగుతూ బైక్‌లపై నిఘా పెట్టి చోరీలు చేసేవారు. అనంతరం వాటిని విక్రయించి ఆ సొమ్ముతో జల్సా చేసేవారు.

మద్యం, డ్రగ్స్‌తో జీవితాలు నాశనం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

తుమకూరు: డ్రగ్స్, మద్యానికి బానిసలైన వారి వల్ల కుటుంబంతో పాటు దేశం మొత్తం పాడవుతుందని, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని తుమకూరు జిల్లా న్యాయమూర్తి నూరిన్నిసా అన్నారు. సోమవారం సోమవారం తుమకూరు నగరంలోని మద్య విసర్జన సమగ్ర పునర్వసతి కేంద్రంలో ప్రపంచ అంతర్జాతీయ మత్తు పదార్థాల అక్రమ రవాణా వ్యతిరేక దినం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ...యువత మత్తుకు దూరంగా ఉండాలని అన్నారు. డ్రగ్స్ సేవనం, విక్రయాలు చట్ట రీత్యా నేరమన్నారు.

లంచాలు ఇవ్వకండి



రైతులకు పైప్‌లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

బాగేపల్లి: అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పథకాలను పొందవచ్చని, ఏ ఒక్కరికి లంచాలు ఇవ్వాల్సిన అవసరం లేదని ఎమ్మెల్యే ఎస్.ఎన్. సుబ్బారెడ్డి అన్నారు. సోమవారం బాగేపల్లి పట్టణంలోని ఉన్న తాలూకా పంచాయతీ ఆవరణంలో అర్హులైన 47 మంది ఎస్సీలకు మహర్షి వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్ ఆధ్వర్యంలో పంపుసెట్లు, మోటార్లు అందజేసి మాట్లాడారు. ప్రజలు పథకాల కోసం మధ్యవర్తులను ఆశ్రయించొద్దని, నేరుగా అధికారులను సంప్రదించాలన్నారు.

బస్సు ఢీకొని సైక్లిస్టు మృతి

చిక్కబళ్లాపురం: ఆర్టీసీ బస్సు ఢీకొని సైక్లిస్ట్ మృతి చెందిన ఘటన సోమవారం నగరంలో వాబసంద్ర రహదారిలో చోటుచేసుకుంది. మృతుడిని ఆనంద్ (56)గా గుర్తించారు. ఈయన నబ్బేనహళ్లికి సైకిల్‌పై వెళ్తుండగా బాగేపల్లి వైపు వెళ్తున్న కేఎస్ ఆర్టీసీ బస్సు ఢీకొంది. తీవ్ర గాయాలతో ఆనంద్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ప్రజా సహకారంతోనే డ్రగ్స్‌కు అడ్డుకట్ట

- బెంగళూరులో ఏడాదిలో 6 వేల కేసులు
- రూ. 117 కోట్ల విలువైన సరుకు సీజ్
- పోలీస్ కమిషనర్ వెల్లడి



పట్టుబడిన మత్తు పదార్థాలను పరిశీలిస్తున్న కమిషనర్



బనశంకరి: ప్రజల సహకారంతోనే డ్రగ్స్ భూతానికి అడ్డుకట్ట పడుతుంది, బెంగళూరు నగరంలో డ్రగ్స్ విక్రయం, సేవించేవారిపై 6,191 కేసులు నమోదు చేసి వీరి వద్ద నుంచి రూ.117 కోట్ల విలువచేసే 6,261 కిలోల డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు నగర పోలీస్ కమిషనర్ బీ.దయానంద్ తెలిపారు. 2022-23 అవధిలో 7,723 మంది భారతీయులు, 159 విదేశీయులను డ్రగ్స్ కేసుల్లో అరెస్ట్‌చేశామని తెలిపారు. సోమవారం ప్రపంచ డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పోలీసులు స్వాధీనం చేసుకున్న 2,117 కిలోల మాదకద్రవ్యాలను నాశనం చేయాలని ఆదేశించారు.

అత్యధికం గంజాయే

ఈ సందర్భంగా విలేకరులతో కమిషనర్ మాట్లాడారు. సిలికాన్ నగరంలో ఏడాదిలో 943 కేసుల్లో డ్రగ్స్ పెడ్లర్ల పై కేసులు నమోదుచేసి వీరి వద్ద నుంచి రూ.117 కోట్ల విలువచేసే 6,261 కిలోల డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. ఇందులో అత్యధికంగా గంజాయి 6,074 కిలోలు, గంజాయి ఆయిల్ 5.5 కిలోలు, బ్రౌన్‌షుగర్ 2.5 కిలోలు, హాషీం 15.6 కిలోలు, ఎండీఎంఏ 52.6 కిలోలు, సింథటిక్ డ్రగ్స్ 109 కిలోలు, 3,406 మత్తు మాత్రలు 1,372 ఎల్‌ఎస్‌డీ స్ట్రిప్స్‌ని స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. అలాగే నగర పోలీస్ స్టేషన్ల పరిధిలో పట్టుబడిన డ్రగ్స్‌ను ఆధునిక పద్ధతిలో నాశనం చేశామని తెలిపారు.

డ్రగ్స్‌పై సమాచారమివ్వండి

నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో 388 పాఠశాలలు, 253 కాలేజీల్లో సుమారు 1.95 లక్షల మంది విద్యార్థులకు డ్రగ్స్ అనర్థాల గురించి ప్రచారం చేసినట్లు చెప్పారు. డ్రగ్స్ అరికట్టడానికి ప్రజల సహకారం అవసరమని, అమ్మేవారు, ఉపయోగించేవారి గురించి పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. సీసీబీ జాయింట్ పోలీస్‌కమిషనర్ శరణప్ప, డీసీపీ యతీశ్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.

దాడి కేసులో నిందితుడి అరెస్ట్



వేదాంత్ (ఫైల్)

యశవంతపుర: హోటల్‌లో బిల్డర్‌పై దాడి చేసి తప్పించుకున్న నిందితుడిని బెంగళూరు ఆర్టీ నగర పోలీసులు అరెస్ట్ చేశారు. బెంగళూరు ఆర్టీ నగరలోని ప్రతిష్ఠిత హోటల్‌లో వైష్ణవి బిల్డర్ యజమాని గోవిందరాజు కొడుకు దర్శన్‌పై వీఏఆర్ బిల్డర్స్ యజమాని సంజయ్ దుగార్ కొడుకు వేదాంత్ దుగార్ దాడి చేశాడు. ఈ నెల 9న దాడి చేసిన వేదాంత్ ముంబై వెళ్లి అక్కడ నుంచి ప్రత్యేక జెట్‌లో నేపాల్ చేరుకున్నాడు. బెంగళూరు పోలీసులు లుకౌట్ నోటీసులు జారీ చేశారు. ఈ నెల 24న నేపాల్ నుంచి బెంగళూరుకు వస్తున్నట్లు సమాచారం అందగానే ఎయిర్‌పోర్ట్‌లో అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు.

ఇద్దరు దొంగలు అరెస్ట్

చైన్ స్నాచింగ్‌లు, బైక్‌లను చోరీ చేస్తున్న ఇద్దరిని దక్షిణ కన్నడ జిల్లా సూరత్కల్ పోలీసులు అరెస్ట్ చేసి వారి నుంచి రూ. 14 లక్షలు విలువైన బంగారు గొలుసులతో పాటు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను హబీబ్ హసన్, మహమ్మద్ ఫైజల్‌గా గుర్తించారు.

కార్మికుల పిల్లలకు కిట్లు

బాగేపల్లి: కార్మిక శాఖలో కోట్ల రూపాయల నిధులు బ్యాంకుల్లో ఊరికే ఉన్నాయని, వాటిని కార్మికుల కోసం ఉపయోగించాలని ఎమ్మెల్యే సుబ్బారెడ్డి అన్నారు. బాగేపల్లి తాలూకాఫీసులో కార్మిక శాఖ ఆధ్వర్యంలో కార్మికుల పిల్లలకు విద్యా కిట్లను అందజేశారు. బాగేపల్లిలో సుమారు 13 వేల మంది కార్మికులు ఉన్నారని, అయితే కార్మిక శాఖలో ఆరు వేల మందే పేర్లను నమోదు చేసుకొన్నారని చెప్పారు.

గంజాయి మత్తులో యువకుల హల్‌చల్



యువకుల దాడిలో గాయపడ్డ గ్రామస్తుడు



పార్టీ జరిగిన తోటలో హుక్కాబార్

- ఘాటి పుణ్యక్షేత్రం సమీపంలో మత్తు పదార్థాల పార్టీ
- ప్రశ్నించిన వారిపై దాడి

దొడ్డబళ్లాపురం: హుక్కా, గంజాయి, మద్యం మత్తులో విచక్షణ మరిచిన యువకుల గుంపు నడిరోడ్డులో మారణాయుధాలు చేతబట్టి ఎదురుపడ్డ వారిపై దాడి చేసి స్థానికులను భయాందోళనకు గురి చేసిన సంఘటన ఘాటి పుణ్యక్షేత్రం సమీపంలోని పాల్‌పాల్‌దిన్నె గ్రామం సమీపంలో చోటుచేసుకుంది. బెంగళూరుకు చెందిన యువకులు ఘాటి పుణ్యక్షేత్రం సమీపంలోని ఒకతోటలో ఆదివారం మత్తు పదార్థాల పార్టీ చేసుకున్నారు. అనంతరం మత్తులో జోగుతూ ఘాటి ప్రధాన రహదారిపైకి వచ్చి పాల్‌పాల్ దిన్నె బస్టాపు వద్ద మారణాయుధాలు చేతబట్టుకుని హల్‌చల్ చేసారు. రోడ్డుపై వెళ్తున్న వాహనాలపై బీరు బాటిళ్లు విసిరారు. ప్రశ్నించిన వారిపై దాడికి పాల్పడ్డారు. సమాచారం తెలుసుకున్న గ్రామస్తులు అందరూ ఒక్కటై అక్కడకు రావడంతో యువకులు పరారయ్యారు. అయితే కొందరు యువకులను పట్టుకున్న గ్రామస్తులు వారిని చితకబాది దొడ్డ గ్రామీణ పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ధరలు చూస్తే వణుకు పుడుతోంది

- మాజీ సీఎం కుమారస్వామి

దొడ్డబళ్లాపురం: రాష్ట్రంలో గత నెల రోజులుగా పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు చూస్తుంటే వెన్నులో వణుకు పుడుతోందని, ఉచిత పథకాల ప్రకటనతో కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిందని మాజీ సీఎం కుమారస్వామి విమర్శించారు. ఈ మేరకు సోమవారం ట్వీట్ చేసిన ఆయన ఎన్నికల సమయంలో ఫ్రీ, ఫ్రీ అని రాష్ట్రమంతా దండోరా వేసిన కాంగ్రెస్ నాయకులు ధరలు పెంచి ప్రజల నడ్డి విరుస్తున్నారన్నారు. అధికారంలోకి వచ్చిన తక్షణం బదిలీల దందాకు పాల్పడుతున్నారన్నారు. పథకాలను నమ్మి ఓటు వేసిన ప్రజలను నట్టేట ముంచుతున్న కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోను మూలనపడేసిందన్నారు. ఉచిత పథకాలతో ప్రజలు ఇబ్బందులు పడతున్నారే తప్ప ఎటువంటి ప్రయోజనం కలగడం లేదన్నారు.

కెంపేగౌడను ఆదర్శంగా తీసుకోవాలి



నాడప్రభు చిత్రపటానికి నివాళి అర్పించి బ్రోచర్ విడుదల చేస్తున్న దృశ్యం

మైసూరు: మైసూరు నగరంలో సోమవారం నాడప్రభు కెంపేగౌడ 514వ జయంతిని వివిధ ప్రాంతాల్లో సంఘ సంస్థలు ఘనంగా నిర్వహించారు. నగరంలోని అగ్రహార సర్కిల్‌లో అఖిల కర్ణాటక ఒక్కలిగ సంఘం ఆధ్వర్యంలో కెంపేగౌడ జయంతి నిర్వహించారు. మైసూరు నగర అభివృద్ధి ప్రాధికార మాజీ అధ్యక్షుడు యశస్వీ ఎస్ సోమశేఖర్ పాల్గొని కెంపేగౌడ చిత్రపటానికి నివాళి అర్పించారు. విజయవంతమైన పాలకుడిగా కెంపేగౌడను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. అదే విధంగా శివరాంపేటెలోని ఒక్కలిగ మహాసభ కార్యాలయంలో నాడప్రభు జయంతి నిర్వహించి ప్రజలకు స్వీట్లు పంపిణీ చేశారు. సీనియర్ సాహితీవేత్త డాక్టర్. సి.పి. కృష్ణకుమార్ పాల్గొని నాడప్రభు కెంపేగౌడ చేసిన అభివృద్ధిని వివరించారు. నేటి రాజకీయ నాయకులు ఆయనను ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

మొబైల్‌లో ఎక్కువగా మాట్లాడుతోందని...

- అనుమానంతో భార్యపై కత్తితో దాడి
- తీవ్ర రక్త స్రావంతో బయటకు పరుగులు



నిందితుడు దయానంద్

బనశంకరి: భార్య తరచూ మొబైల్‌లో మాట్లాడుతోందనే అనుమానంతో భర్త చాకుతో విచక్షణ రహితంగా దాడి చేసిన ఘటన ఆదివారం రాత్రి ఆడుగోడి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాలు...దయానంద్, ప్రియాంక దంపతులు నీలసంద్ర బజార్‌స్ట్రీట్‌లో నివాసం ఉంటున్నారు. వీరికి ఇద్దరు సంతానం. నిత్యం మద్యం సేవించే దయానంద్ ఇంటికి వచ్చి భార్యపై అనుమానంతో గొడవపడేవాడు. ఆదివారం రాత్రి 10 గంటల సమయంలో పీకల దాక మద్యం తాగి ఇంటికి వచ్చాడు. నిద్రలో ఉన్న ప్రియాంకతో గొడవ పడ్డాడు. ఆవేశంతో ఒక్కసారిగా వంటదిలోకి వెళ్లి చాకు తీసుకువచ్చి పిల్లల ముందే ఆమె పొట్టలో బలంగా పొడిచాడు. తీవ్రరక్తస్రావంతో ఆమె కేకలు వేస్తూ బయటకు పరుగు తీసింది. స్థానికులు సహాయవాణికి సమాచారం ఇచ్చారు. హొయ్సళ పోలీసులు అక్కడికి చేరుకుని బాధితురాలిని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రాణాపాయం తప్పింది. పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి విచారణ చేస్తున్నారు.

చెక్‌బౌన్స్ కేసులో జాలప్ప కుమారుడికి శిక్ష

బనశంకరి: చెక్‌బౌన్స్ కేసులో మాజీమంత్రి ఆర్‌ఎల్. జాలప్ప కుమారుడు నరసింహమూర్తికి సోమవారం ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టు జైలుశిక్ష విధించింది. చెక్‌బౌన్స్ ఆరోపణలు రుజువైన నేపథ్యంలో విచారణ చేపట్టిన ప్రత్యేక కోర్టు సోమవారం నరసింహమూర్తికి ఆరు నెలల జైలు, రూ. 20 లక్షల జరిమానా విధించింది. ప్రకాశ్‌కుమార్ అనే వ్యక్తి తన కుమార్తె మెడికల్ సీటు కోసం నరసింహమూర్తి రూ.45 లక్షలు తీసుకున్నాడు. మెడికల్ సీటు లభించకపోవడంతో ప్రకాశ్‌కుమార్‌కు, నరసింహమూర్తి రూ.45 లక్షలు చెక్కు ఇచ్చాడు. కానీ చెక్కు బౌన్స్ కావడంతో మెడికల్ సీటు ఇస్తామని వంచనకు పాల్పడినందుకు నరసింహమూర్తిపై కేసు నమోదైంది. శిక్షను ప్రశ్నిస్తూ అప్పీల్‌కు వెళ్లడానికి కోర్టు రెండు నెలలు గడువు ఇచ్చింది.

సమర్థమైన కార్మిక శక్తికి ఊతం

బనశంకరి: వైవిధ్యమైన, సమర్థమైన కార్మికశక్తిని నిర్మించి పురోగమిస్తామని ఆన్‌లైన్ షాపింగ్ సంస్థ అమెజాన్ ఇండియా ఆపరేషన్స్ పీపుల్స్ ఎక్స్‌పీరియన్స్ అండ్ టెక్నాలజీ డైరెక్టర్ లిజు థామస్ తెలిపారు. మహిళలు, ఎల్‌జీబీటీక్యూఏ, దివ్యాంగులు, రిటైర్డు సాయుధ దళాల ఉద్యోగులకు కంపెనీ విభాగాల్లో సురక్షితమైన వాతావరణాన్ని అందించేందుకు అమెజాన్ కట్టుబడి ఉందని సోమవారం బెంగళూరులో ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లైంగిక అల్పసంఖ్యాకుల కోసం అమెజాన్ గ్లోబల్ ప్రైడ్ థీమ్‌కు అనుగుణంగా అమెజాన్ ప్రౌడ్ టూ బీ మీ పేరుతో ప్రచారం ప్రారంభించినట్లు చెప్పారు.


కాసియా అధ్యక్షునిగా ఎన్నిక

శివాజీనగర: కర్ణాటక చిన్న తరహా పరిశ్రమల సంఘం (కాసియా) నూతన అధ్యక్షునిగా సీఏ శశిధర శెట్టి ఎన్నికయ్యారు. ఇన్నోవేషన్ కేంద్రం ప్రారంభించడం తమ ప్రథమ కర్తవ్యమని ఆయన తెలిపారు. ఇది ప్రత్యేకంగా చిన్న, సూక్ష్మ స్థాయి పరిశ్రమల ఉత్పత్తుల నాణ్యత పెంచడానికి దోహదపడుతుందన్నారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు.

పీహెచ్‌డీ ప్రదానం

బొమ్మనహళ్లి: నగరంలోని బసవనగుడి నేషనల్ కళాశాల డిప్యూటీ ప్రిన్సిపాల్, ప్రాణిశాస్త్రం విభాగం లెక్చరర్ రమేశ్‌కు బెంగళూరు విశ్వ విద్యాలయం పీహెచ్‌డీ ప్రదానం చేసింది. ఈయన మచ్చల చేపల కాలేయం , పునరుత్పత్తి అనే అంశంపై పరిశోధన చేశారు.

కేరళకు వెళ్లిన నిందితుడు మదాని



మదాని (ఫైల్)

దొడ్డబళ్లాపురం: పీపుల్స్ డెమాక్రటిక్ పార్టీ అధ్యక్షుడు, 2008 బెంగళూరు వరుస పేలుళ్ల ప్రధాన నిందితుడు అబ్దుల్ నాసిర్ మదాని సోమవారం సాయంత్రం కేరళకు బయలుదేరి వెళ్లాడు. పోలీస్ బందోబస్తు మధ్య సోమవారం సాయంత్రం 6-15కి విమానంలో బయలుదేరి వెళ్లాడు. మదానితోపాటు ఆతడి కుటుంబ సభ్యులు కూడా వెళ్లారు. విమానంలో కొచ్చిన్ వెళ్లి తరువాత కొల్లం జిల్లాలోని అన్వర్ సిరి సస్తుంమకుట అనే ఊరికి మదాని వెళ్లాడు. ఇతడి భద్రతకు ఒక ఆర్‌ఎస్‌ఐ, ముగ్గురు కానిస్టేబుళ్లు, ఒక డ్రైవర్ వెళ్లారు. 12 రోజుల సిబ్బంది ఖర్చుకై మదని పోలీసు శాఖకు రూ.6,76,101 చెల్లించారు. జులై 7న మదాని మళ్లీ బెంగళూరు తిరిగి వస్తాడు. తండ్రికి ఆరోగ్యం క్షీణించడంతో మదాని సుప్రీంకోర్టుకు మొరపెట్టుకున్నాడు. దీంతో సుప్రీం కోర్టు మదానికి ఏప్రిల్ 17న తండ్రిని చూసిరావడానికి అనుమతి ఇచ్చింది. సుప్రీంకోర్టు 3 నెలలు అనుమతి ఇచ్చింది. అయితే అప్పటి బీజేపీ ప్రభుత్వం మదాని భద్రత ఖర్చు నెలకు రూ.60 లక్షలు చెల్లించాలని షరతు విధించింది. కానీ భద్రత ఖర్చు మరీ ఎక్కువ అయిందని, తగ్గించాలని మదని తరపు లాయర్ కపిల్ సిబల్ సుప్రీం కోర్టును కోరారు. మదానికి తగిన భద్రత కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం కేరళ ప్రభుత్వానికి సమాచారం ఇచ్చారు.

హోసూరు వార్తలు..

కలెక్టర్‌కు వినతుల వెల్లువ

హోసూరు: క్రిష్ణగిరి కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన వినతుల స్వీకరణ కార్యక్రమంలో కలెక్టర్ శరయుకు వినతులు వెల్లువెత్తాయి. తాగునీరు, రోడ్ల వసతి, వీధి దీపాల ఏర్పాటు, కుట్టుయంత్రాలు, ఇళ్లపట్టాలు, వృద్ధాప్య పెన్షన్, ఆర్థిక సాయం కోరుతూ 302 మంది వినతిపత్రాలను అందజేశారు. ఫిర్యాదులను స్వీకరించిన కలెక్టర్ పరిశీలించి తగు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. దివ్యాంగ సంక్షేమ శాఖ ద్వారా 7 మంది దివ్యాంగులకు రూ. 1.19 లక్షల విలువ చేసే సంక్షేమ ఫలాలను అందజేశారు. కార్యక్రమంలో డీఆర్‌వో రాజేశ్వరి, అధికారులు వేడియప్పన్, మురుగేషన్ తదితరులు పాల్గొన్నారు.

సంతానం కలగలేదని...

హోసూరు: పెళ్లి జరిగి మూడేళ్లయినా సంతానం కలగకపోవడంతో జీవితంపై విరక్తి చెందిన వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొన్న ఘటన కావేరిపట్టణం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. వివరాలు...కావేరిపట్టణం సమీపంలోని కుళ్లంబట్టి గ్రామానికి చెందిన కదిరవన్ (31)కు మూడేళ్ల క్రితం పెళ్లి జరిగింది. పిల్లలు కలగలేదు. దీంతో కదివరన్ ఆదివారం రాత్రి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కావేరిపట్టణం పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నారు.

వివాహిత ఆత్మహత్య

హోసూరు: అనారోగ్యంతో బాధపడుతూ ఓ మహిళ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకొన్న ఘటన కావేరిపట్టణం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. వివరాలు... కావేరిపట్టణం సమీపంలోని కాల్వేహళ్లి గ్రామానికి చెందిన మునియప్ప భార్య లక్ష్మీ (53), కొద్ది రోజులుగా అనారోగ్యంతో ఉంది. పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్నా ఫలితం లేకపోవడంతో ఆమె ఆదివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికులు క్రిష్ణగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఫలితంలేక మృతి చెందింది.

హోసూరు చేరుకున్న పుణ్య జలాలు



ఆలయం వద్ద పుణ్య నదుల నీరు

హోసూరు: హోసూరు తేరుపేటలోని కొండపై వెలసిన చారిత్రక ప్రసిద్ధి పొందిన మరకతాంబ సమేత చంద్రచూడేశ్వరస్వామి ఆలయ రాజగోపుర కుంభాభిషేకోత్సవ కార్యక్రమాలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. అందులో భాగంగా దేశంలోని వివిధ ప్రాంతాల్లో ప్రవహించే పుణ్యనదులు గంగ, యమున, సరస్వతి, బ్రహ్మపుత్ర, కావేరి తదితర తొమ్మిది నదుల జలాలను హోసూరుకు తీసుకొచ్చారు. సోమవారం ఉదయం 10 గంటలకు పట్టణం నడిబొడ్డులోని రామనాయకుని చెరువు కట్ట కింద వెలసిన శ్రీ జలకంఠేశ్వరస్వామి ఆలయం నుంచి కార్పొరేటర్ జే.పి. జయప్రకాష్ అధ్యక్షతన 200 మందికిపైగా మహిళలు పాలకుండలతో ఊరేగింపుగా పుణ్య జలాలను కొండపై ఉన్న శ్రీ చంద్రచూడేశ్వరస్వామి ఆలయానికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా జేపి జయప్రకాష్ మాట్లాడుతూ... సోమవారం నుంచి దేవాదాయ శాఖ, ఆలయ కమిటీచే కుంభాభిషేకోత్సవ కార్యక్రమాలను ప్రారంభించారని, 28వ తేదీ జరిగే మహా కుంభాభిషేకోత్సవ కార్యక్రమంలో ప్రధాని నరేంద్రమోదీకి సెంగోల్‌ను అందజేసిన వేదపండితులు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని కుంభాభిషేకోత్సం జరిపిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా 1000 కిలోల పుష్పాలను హెలిక్యాప్టర్ ద్వారా తీసుకెళ్లి పట్టణంలోని ప్రసిద్ధి పొందిన శ్రీ చంద్రచూడేశ్వరస్వామి, వేంకటేశ్వరస్వామి, బ్రహ్మ కొండలపై పుష్పాంజలి సమర్పించనున్నట్లు తెలిపారు.

ఘనంగా ఆలయ కుంభాభిషేకం




కుంభాభిషేకోత్సవం జరిపిస్తున్న వేదపండితులు

కెలమంగలం: తాలూకా కేంద్రం డెంకణీకోటలోని కెలమంగలం రోడ్డులో వెలసిన ప్రసిద్ధి సేలం మారియమ్మ ఆలయ కుంభాభిషేక మహోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. మారియమ్మ ఆలయం శిథిలావస్థకు చేరుకోవడం స్థానికులు, ఆలయ కమిటీ సభ్యులు పునరుద్ధరణకు చర్యలు చేపట్టారు. ఆలయ నిర్మాణ పనులు పనులు పూర్తి చేసుకొన్న సందర్భంగా కుంభాభిషేకోత్సవ కార్యక్రమాన్ని చేపట్టారు. రెండు రోజులుగా ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున పాలకుండలతో పట్టణ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించి ఆలయానికి చేరుకొని అభిషేకం జరిపించారు. గణపతి పూజ, గోపూజ, నవగ్రహ హోమం, గాయత్రీ హోమం, విగ్రహ ప్రతిష్ఠాపన, ప్రాణప్రతిష్ఠ, కాలయాజ పూజలు, వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య మహా కుంభాభిషేకోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో డెంకణీకోట చుట్టు పక్కల ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. భక్తులకు తీర్థ ప్రసాద వినియోగం జరిగింది.

శ్రీవారికి ఆర్జిత కల్యాణోత్సవం

కదిరి టౌన్: శ్రీ ఖాద్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో శ్రీదేవి భూదేవి సమేత వసంతవల్లభుడికి సోమవారం అర్చకులు ఆర్జిత కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. శ్రీవారిని ప్రత్యేకంగా అలంకరించి వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా, సంప్రదాయ బద్ధంగా కల్యాణం జరిపించారు. భక్తులు పెద్ద ఎత్తున ఉత్సవంలో పాల్గొన్నారు.

మురుగు కాల్వలు ఏర్పాటు చేయండి



రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు నీటిని చూపుతున్న నాయకులు

కెలమంగలం: డెంకణీకోట తాలూకా తళిలో సరైన మురుగు కాల్వలు లేక నీరు రోడ్లపై ప్రవహిస్తోంది. దీంతో విద్యార్థులు, పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులెదుర్కొంటున్నారని, సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని తమిళనాడు వ్యవసాయ రక్షణ సంఘం డిమాండ్ చేసింది.

నియోజకవర్గ కేంద్రమైన తళిలోని బీడీవో కార్యాలయ సమీపంలోని బస్టాండుకెళ్లే మార్గంలో, జవుళగిరి వెళ్లే మార్గంలో మురికి నీరు రోడ్డుపై ప్రవహిస్తోందని, ప్రస్తుతం మురుగు కాల్వలో పూడిపోయిందని, దీంతో నీరు రోడ్డు పైకి రావడంతో దుర్వాసన వెదజల్లుతోందన్నారు. వెంటనే చర్యలు తీసుకోవాలని రైతు రక్షణ సంఘ నాయకులు గణేష్‌రెడ్డి, రామన్, బాబు తదితర నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

ఆటో బోల్తా, విద్యార్థులకు తీవ్ర గాయాలు

మైసూరు: విద్యార్థులను తీసుకెళ్తున్న ఆటో వేగాన్ని నియంత్రించలేక అదుపుతప్పి బోల్తా కొట్టడంతో పది మంది గాయపడిన ఘటన మైసూరు జిల్లా టీ నరసిపుర తాలూకా ఆలగూడు వద్ద చోటు చేసుకుంది. క్షతగాత్రులను టీ నరసిపుర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వీరంతా టీ నరిపురలోని వివిధ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నారు. రోజు ఆటోలో వెళ్లి వస్తుంటారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

జంట హత్య కేసులో మరొకరి అరెస్ట్

మైసూరు: మైసూరు జిల్లా హుణసూరు పట్టణంలోని సామిల్‌లో జరిగిన జంట హత్య కేసులో పోలీసులు మూడో నిందితుడిని అరెస్ట్ చేశారు. నిందితుడిని స్థానిక బజార్ రోడ్డులో నివాసం ఉంటున్న తౌసిబ్‌గా గుర్తించారు. ఇటీవల సామిల్‌లో వెంకటేశ్, షణ్ముఖ అనే ఇద్దరు వృద్ధులను హత్య చేసిన విషయం తెల్సిందే. ఈ కేసులో ఇప్పటికే ఇద్దరిని అరెస్ట్ చేశారు. వీరు ముగ్గురు కలిసి వృద్ధులను హత్య చేశారని పోలీసులు తెలిపారు.

అటవీ సంరక్షణపై నిర్లక్ష్యం వద్దు

శివాజీనగర: అటవీ సంరక్షణలో నిర్లక్ష్యం చేస్తే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని అటవీశాఖ మంత్రి ఈశ్వర్ ఖండ్రె హెచ్చరించారు. సోమవారం విధానసౌధలో అటవీ శాఖ నూతన లోగోను విడుదల చేసి మాట్లాడిన ఆయన, అడవుల నాశనాన్ని అరికట్టే అటవీ, వన్యజీవులను కాపాడటం అధికారుల పని. ఈ విషయంలో నిర్లక్ష్యం చేసే చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. మానవ, వన్యమృగాల సంఘర్షణ ఇటీవల పెద్ద సవాల్‌గా మారింది. గత సంవత్సరంలో వన్య మృగాల దాడి నుంచి 59 మంది మృతి చెందారు. ఇందులో అధికంగా మరణాలు ఏనుగుల దాడిచే జరిగాయన్నారు. అవసరమైన రక్షణ చర్యలు చేపట్టాలని తెలిపారు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి

యశవంతపుర: వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన సిటీ మార్కెట్ పోలీసు స్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి 9:30 గంటల సమయంలో జరిగింది. మృతుడి వివరాలు తెలియాల్సి ఉంది. గుర్తు తెలియని వాహనం అతి వేగంగా వచ్చి ఢీకొట్టి డ్రైవర్ వాహనంతో పరారయ్యాడు. సిటీ మార్కెట్ ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేశారు.

ఈశ్వరప్ప వ్యాఖ్యలపై ఖండన

యశవంతపుర: ఆపరేషన్ కమలం ద్వారా కాంగ్రెస్ ఎమ్మెల్యేలను తీసుకున్నందుకు బీజేపీకి ఈ పరిస్థితి వచ్చిందని మాజీ డీసీఎం కేఎస్ ఈశ్వరప్ప చేసిన వ్యాఖ్యలను బీజేపీ ప్రధాన కార్యదర్శి రవికుమార్ ఖండించారు. వారందరూ పార్టీలోకి వచ్చినందుకే బీజేపీ అధికారంలోకి వచ్చిందని రవికుమార్ పేర్కొన్నారు. సోమవారం మల్లేశ్వరంలోని బీజేపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఈశ్వరప్ప ఈ వ్యాఖ్యలు ఎందుకు చేశారో తెలియటం లేదన్నారు. పార్టీలో ఎలాంటి గందరగోళం లేదని స్పష్టం చేశారు.

జంతువు దాడిలో గొర్రెల మృత్యువాత



దాడిలో మృతి చెందిన గొర్రెలు

క్రిష్ణగిరి: సూళగిరి సమీపంలో కొట్టంలో కట్టేసిన గొర్రెలపై అడవి జంతువు దాడి చేయడంతో 12 గొర్రెలు మృతి చెందాయి. సూళగిరి తాలూకా అత్తిముగం సమీపంలోని పున్నాగరం గ్రామానికి చెందిన దివ్యాంగుడు శంకరప్ప గొర్రెలను పోషిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం 29 గొర్రెలను మేతకు తీసుకెళ్లి రాత్రి ఇంటి పక్కనే కొట్టంలో కట్టేశాడు. సోమవారం ఉదయం లేచి చూడగా 12 గొర్రెలు మృతి చెందగా మరో 17 గొర్రెలు గాయాలపాలయ్యాయి. చిరుత, లేదా నక్కలు, కుక్కలు వంటివి దాడి చేసి ఉంటాయని అనుమానిస్తున్నారు.

క్లుప్తంగా...

జ్యోతిరాదిత్య సింధియాతో విజయసాయిరెడ్డి భేటీ



సాక్షి, న్యూఢిల్లీ : కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియాతో వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రిని శాలువాతో సత్కరించి తిరుమల శ్రీవారి ప్రతిమ బహూకరించారు. ఈ సందర్భంగా పౌర విమానయానానికి సంబంధించి పలు అంశాలపై చర్చించినట్లు ఎంపీ విజయసాయిరెడ్డి సోమవారం ట్వీట్ చేశారు.

దమ్ముంటే... నాపై పోటీ చేసి గెలువు

లోకేశ్‌కు మాజీమంత్రి అనిల్‌కుమార్ సవాల్



నెల్లూరు (దర్గామిట్ట): ఆంధ్రరాష్ట్ర పులకేశి, ముద్దపప్పు నారా లోకేశ్ రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో దమ్ముంటే తనపై పోటీచేసి గెలిస్తే.. తాను రాజకీయాల నుంచి తప్పుకుంటానని నెల్లూరు నగర ఎమ్మెల్యే డాక్టర్ పి.అనిల్‌కుమార్ యాదవ్ సవాల్ విసిరారు. సోమవారం నగరంలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. లోకేశ్ గానీ, ఆయన అనుయాయులు ఎవరైనా తనపై పోటీచేసి గెలిస్తే పూర్తిగా రాజకీయాల నుంచి తాను తప్పుకుంటానని, వారు ఓడిపోతే రాజకీయాల నుంచి వారూ తప్పుకోవడానికి సిద్ధమా అని ప్రశ్నించారు. ఒక వేళ సవాల్‌ను స్వీకరించకపోతే పప్పు, పులకేశి అని లోకేశ్ ఒప్పుకున్నట్లేనన్నారు. లోకేశ్ జిల్లా దాటేంత వరకు నగరంలోనే ఉంటానని, తన సవాల్‌కు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

'ఈపీఎఫ్ కనీస పెన్షన్ రూ.7,500లకు పెంచాలి'

సాక్షి, అమరావతి: ప్రభుత్వ, ప్రైవేటు రంగంలో పనిచేసే ఉద్యోగులకు వర్తించే ఎంప్లాయి ప్రావిడెంట్ ఫండ్ పెన్షన్ కనీస మొత్తాన్ని నెలకు రూ.7,500లకు పెంచాలని నేషనల్ యాజిటేషన్ కమిటీ (ఎన్‌ఏసీ) డిమాండ్ చేసింది. ప్రస్తుతం కనీసంగా రూ.1,000, గరిష్టంగా రూ.3,500 ఉందని, దీన్ని కనీస మొత్తం రూ.7,500లకు పెంచాలని కోరింది. ఈపీఎస్ 95 పెన్షనర్ల దయనీయ పరిస్థితిపై ఎన్‌ఏసీ దేశవ్యాప్త పర్యటనలో భాగంగా విజయవాడ మాకినేని బసవపున్నయ్య హాలులో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌ఏసీ చైర్మన్ అశోక్‌రావత్ మాట్లాడుతూ కనీస పెన్షన్ పెంచడంతో పాటు కరువు భత్యం, భార్యభర్తలకు ఉచిత వైద్య సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే ఈ స్కీమ్‌లో సభ్యులు కానివారికి కనీస పెన్షన్ రూ.5,000 ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఏపీ కమిటీ చైర్మన్ ఏ.జగన్నాథరావు పాల్గొన్నారు.

పర్యాటకానికి తలమానికంగా క్రూయిజ్ టెర్మినల్

బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు

దొండపర్తి(విశాఖ దక్షిణ): విశాఖ నగరంలో పర్యాటక రంగానికి క్రూయిజ్ టెర్మినల్ తలమానికంగా నిలుస్తుందని బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు అన్నారు. విశాఖ పోర్ట్ ట్రస్ట్ ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న క్రూయిజ్ టెర్మినల్ ప్రాంతాన్ని ఎంపీ సోమవారం సందర్శించారు. ఆయన మాట్లాడుతూ విశాఖ పర్యాటకాభివృద్ధిలో ఈ క్రూయిజ్ టెర్మినల్ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. నిర్మాణ పనులు తుది దశకు చేరుకోవడంతోపాటు త్వరలోనే టెర్మినల్ అందుబాటులోకి వస్తుందని చెప్పారు. జూలైలో నిర్మాణం పూర్తయ్యే అవకాశం ఉందని, ఆ వెంటనే దేశీయ క్రూయిజ్ కార్యకలాపాలు ప్రారంభమవుతాయని వెల్లడించారు. మరికొన్ని నెలల్లో అంతర్జాతీయ క్రూయిజ్ కార్యకలాపాలు కూడా ప్రారంభమవుతాయని ఆశాభావం వ్యక్తంచేశారు.

టీడీపీ అధికారంలోకి వస్తే రైతులను ఆదుకుంటాం

రైతులతో నారా లోకేశ్ ముఖాముఖి

నాయుడుపేట(తిరుపతి జిల్లా) : తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే రైతులను అన్ని విధాలా ఆదుకుంటామని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ చెప్పారు. యువగళం పాదయాత్రలో భాగంగా సోమవారం ఆయన తిరుపతి జిల్లా నాయుడుపేట మండలం అన్నమేడు రచ్చబండ వద్ద రైతులతో ముఖాముఖి నిర్వహించారు. అన్నమేడు చెరువు కింద రెండు వేల ఎకరాల భూములున్నాయని, గతంలో నీరు ఏటి(స్వర్ణముఖి) నుంచి వచ్చేదని రైతులు తెలిపారు. కాలువలు పూడిపోవడంతో రైతులకు సాగునీరు ఇబ్బందిగా మారిందన్నారు. సీసీ కెనాల్, చెక్‌డ్యాంలు ఏర్పాటు చేయాలని రైతులు కోరారు. స్పందించిన లోకేశ్.. కాలువల పూడికతీతతోపాటు, చెరువులు అభివృద్ధి బాధ్యతలు తాను తీసుకుంటానన్నారు. ఇది జరగాలంటే చంద్రబాబును సీఎంను చేయాలన్నారు. అనంతరం అన్నమేడు మీదుగా వేముగుంటపాళెం, మడపలం, కాలవగట్టు గ్రామాల్లో పాదయాత్ర చేశారు. అనంతరం గూడూరు నియోజకవర్గంలోని గునపాటిపాలెం, పెళ్లకూరు, తిమ్మరెడ్డివాగు, వడ్డికండ్రిగ, జంగాలపల్లె, అద్దెపూడి, ఎల్లసిరి హిస్టోల్ జంక్షన్, ఎల్లసిరి, ఈశ్వరవాక, భయ్యావారికండ్రిగలో పాదయాత్ర సాగింది.

ఎట్టకేలకు సీఆర్‌డీఏలో పేదలకు ఇళ్లు

రాష్ట్ర ప్రభుత్వ చొరవతో 47 వేల ఇళ్లు మంజూరు చేసిన కేంద్రం

- అనుమతి వద్దంటూ రఘురామ రాజుతో సహా టీడీపీ ఎంపీల లేఖలు
- కేసులున్నాయంటూ అడ్డుపడినా ఫలించని వైనం
- ఇప్పటికే పేదలకు ఇళ్లస్థలాల పట్టాలిచ్చిన సీఎం జగన్
- సీఎం ఆదేశాల మేరకు జూలై 8న ఆ ఇళ్ల నిర్మాణాలు ప్రారంభం
- గృహనిర్మాణ శాఖ ప్రత్యేక సీఎస్ అజయ్‌జైన్ వెల్లడి



సాక్షి, అమరావతి: న్యాయస్థానాల్లో పోరాటం చేసి సీఆర్‌డీఏ పరిధిలో పేదలకు ఇళ్ల స్థలాల పట్టాలు ఇచ్చినప్పటికీ.. ఆ ఇళ్లు మంజూరు చేయవద్దని ఎంపీ రఘురామకృష్ణరాజుతో పాటు టీడీపీ నేతలు కేంద్రానికి లేఖలు రాసినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం కృషితో సీఆర్‌డీఏ పరిధిలో పేదలకు 47 వేలకుపైగా ఇళ్లను కేంద్రం మంజూరు చేసింది. కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాలశాఖ ఆధ్వర్యంలోని కేంద్ర మంజూరు, పర్యవేక్షణ కమిటీ (సెంట్రల్ సాంక్షనింగ్ అండ్ మానిటరింగ్ కమిటీ) సోమవారం సమావేశమై సీఆర్‌డీఏ పరిధిలో 47 వేలకుపైగా పేదల గృహాలను మంజూరు చేసింది. ఈ విషయాన్ని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ ప్రత్యేక సీఎస్ అజయ్ జైన్ వెల్లడించారు. న్యాయస్థానాల్లో కేసులున్నాయని, సీఆర్‌డీఏ పరిధిలో పేదలకు ఇళ్లు మంజూరు చేయవద్దని ఒక పార్టీకి చెందిన కొందరు ఎంపీలు కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాలశాఖకు లేఖలు రాశారని చెప్పారు. ఈ నేపథ్యంలో ఈ రోజు సమావేశ అజెండాలో ఈ ఇళ్ల మంజూరు ఉంటుందా ఉండదా అనే అనుమానాలు కూడా కలిగాయన్నారు. కొంతమంది ఎంపీలు చేసిన వాదనల్లో వాస్తవం లేదని, ఎటువంటి కోర్టు కేసులు లేవని రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాలశాఖ దృష్టికి తీసుకెళ్లి ప్రత్యేకంగా కృషిచేసిందని చెప్పారు. దీంతో సోమవారం జరిగిన కమిటీ సమావేశంలో సీఆర్‌డీఏ పరిధిలోని 47 వేలకుపైగా పేదల ఇళ్లను మంజూరు చేసిందని తెలిపారు. ఇంకా మూడువేల ఇళ్లకు కేంద్రం నుంచి మంజూరు రావాలని, వాటికి కూడా త్వరగా వచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు సీఆర్‌డీఏ పరిధిలో పేదల ఇళ్ల నిర్మాణాలను జూలై 8వ తేదీన ప్రారంభిస్తామని తెలిపారు. తొలినుంచి సీఆర్‌డీఏ పరిధిలో పేదలకు ఇళ్లస్థలాలు ఇస్తే సామాజిక సమతుల్యత దెబ్బతింటుందని టీడీపీ నేతలు న్యాయస్థానాల్లో కేసులు వేసి అడ్డుపడుతూ వచ్చారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం సీఆర్‌డీఏ పేదల కోసం చట్టసవరణ కూడా చేసి, న్యాయస్థానాల్లో పోరాటం చేసి న్యాయస్థానాల అనుమతితోనే సీఆర్‌డీఏ పరిధిలోని పేదలకు ఇళ్లస్థలాల పట్టాలను పంపిణీ చేసింది

గత నెల 26న 50,793 ఇళ్ల పట్టాలు పంపిణీ చేసిన సీఎం జగన్

న్యాయస్థానాల్లో పోరాటం అనంతరం గత నెల 26వ తేదీన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఆర్‌డీఏ పరిధిలోని 50,793 మంది అక్కచెల్లెమ్మలకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి జగన్ ఇదే అమరావతి ఇకమీదట ఒక సామాజిక అమరావతి అవుతుందని, ఇకపై మనందరి అమరావతి అవుతుందని వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. మంగళగిరి, తాడికొండ నియోజకవర్గాల పరిధిలో 1,400 ఎకరాల్లో 25 లే అవుట్లు వేసి ఈ పట్టాలు పంపిణీ చేశారు.

గోదావరి జిల్లాలను దత్తత తీసుకుంటా

- ఇక్కడ వైఎస్సార్‌సీపీని ఒక్క స్థానంలో కూడా గెలవనివ్వను
- గతంలో రెండుచోట్ల ఓడిపోయినా కోపం రాలేదు
- చిన్నప్పుడు నరసాపురం బస్టాండ్‌లో తప్పిపోయా..
- ప్రజల్లో మార్పు వచ్చేవరకూ తిరుగుతా
- ఈ పోరాటంలో బతికి ఉంటానో.. ప్రాణాలు కోల్పోతానో తెలీదు
- నరసాపురం వారాహి విజయయాత్రలో పవన్‌కళ్యాణ్

సాక్షి ప్రతినిధి, ఏలూరు/నరసాపురం : గత ఎన్నికల్లో తాను పోటీచేసిన రెండుచోట్లా ఓడిపోయినప్పుడు గుండె కోసేసినంత బాధేసిందని.. కానీ, కోపం మాత్రం రాలేదని జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ అన్నారు. తాను గెలిచినా, ఓడినా మార్పు వచ్చేవరకు ప్రజల్లోనే తిరుగుతానని చెప్పారు. వారాహి విజయయాత్రలో భాగంగా సోమవారం పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురంలో పవన్ పర్యటించారు. సాయంత్రం బీసీ వసతి గృహంలో విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం రాత్రి జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ.. ఉభయ గోదావరి జిల్లాలను తాను దత్తత తీసుకుంటానని చెప్పారు. రెండు జిల్లాల్లోని 34 అసెంబ్లీ స్థానాల్లో ఒక్క సీటు కూడా వైఎస్సార్‌సీపీ గెలవకుండా చేస్తానని, అందుకోసం తానే తిరుగుతానని తెలిపారు. గౌడ, శెట్టిబలిజలకు రాజ్యాధికారం జనసేన వల్లే వస్తుందని, రాష్ట్రంలో ఏ బీసీ కులానికీ సాధికారత లేదని చెప్పారు. చిన్నప్పుడు తాను నర్సాపురం బస్టాండ్‌లో తప్పిపోయానని, అదృష్టవశాత్తు దొరికానని, లేకపోతే ఇక్కడే తిరుగుతూ ఉండేవాడినని ఆయన తెలిపారు. రాజకీయాల ప్రక్షాళన, పరివర్తన కోసం పోరాటం చేస్తున్నానని, ఈ పోరాటంలో బతికి ఉంటానో.. ప్రాణాలు కోల్పోతానో తనకే తెలియదని పవన్ అన్నారు. కోనసీమలో సాక్షాత్తూ ఒక మంత్రి కొడుకు డీఎస్పీని కొట్టాడన్నారు. మంత్రి కొడుకు కాబట్టి ఎవరూ అడగరని చెప్పారు. ఇలాంటి పరిస్థితులు వస్తుంటే ప్రజల్లో విప్లవం కాకుంటే ఏం వస్తుందని ఆయన ప్రశ్నించారు. నాయకుడు బలంగా ఉంటేనే రాష్ట్రం, దేశం దశ, దిశ మారుతుందన్నారు. వచ్చే పాతికేళ్లు ఈ నేల కోసం గొడ్డుచాకిరీ చేస్తానని పవన్ తీవ్ర ఆవేశంతో చెప్పారు.

నేను సీఎం కావాలని కోరుకోవట్లేదు

అంతకుముందు ఉదయం పశ్చిమగోదావరి జిల్లాలో యాత్రను ప్రారంభించిన పవన్.. నరసాపురం డివిజన్‌లోని పలు మండలాలకు చెందిన జనసేన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను ముఖ్యమంత్రిని కావాలని అనుకోవడం లేదన్నారు. పదవి దక్కితే తీసుకుంటానని చెప్పారు. వైఎస్సార్‌సీపీ చెబుతున్న అభివృద్ధి క్షేత్రస్థాయిలో ఏమీ కనిపించడం లేదని.. గోదావరి పక్కనే ఉన్నా గోదావరి జిల్లాల్లో ప్రజలకు మంచినీళ్లు అందడం లేదన్నారు. సుమారు 15 నిమిషాలు మాట్లాడిన పవన్.. తన మాటల్లో నాలుగైదుసార్లు తనకు సీఎం పదవిపై మోజులేదని, తాను ముఖ్యమంత్రి కావాలని కోరుకోవడంలేదని చెప్పడంపై జనసేన నాయకుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమైంది.

పవన్ కులాలు, మతాలను రెచ్చగొడుతున్నారు

- ఆయన కాపులకు చేసిందేమిటి?
- వంగవీటి రంగాను హత్యచేయించింది చంద్రబాబే
- ఎన్టీఆర్ చావుకూ బాబే కారణం
- ముద్రగడ పోరాటాన్ని అణగదొక్కినప్పుడు ఏం చేశావు పవన్
- సినిమా వేరు.. రాజకీయం వేరు
- రాజకీయాల్లో ప్రేమను పంచాలి.. చెప్పులు కాదు
- మీడియా సమావేశంలో డిప్యూటీ సీఎం నారాయణస్వామి వెల్లడి



తిరుపతి అర్బన్ : గూండాలు, వెన్నుపోటుదారులు టీడీపీ గట్టు వైపే ఉన్నారని.. తమ పార్టీలో అలాంటి నేతలు ఎవరూ లేరని ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి స్పష్టంచేశారు. అవినీతి రాజ్యం చంద్రబాబు పాలనలోనే సాగిందని.. వంగవీటి రంగాను హత్య చేయించింది ఆయనేనని ఆరోపించారు. చంద్రగిరి ఎమ్మెల్యేగా పోటీచేసి ఓడిపోతే పిల్లనిచ్చిన మామ తన పార్టీలో చేర్చుకుని మంత్రి పదవి ఇస్తే.. ముఖ్యమంత్రి పదవి కోసం ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచారన్నారు. తన పదవిని, పార్టీని లాక్కోవడంతో మనోవేదనకు గురై ఎన్టీఆర్ మృతి చెందారని సోమవారం తిరుపతిలో నారాయణస్వామి మీడియాకు చెప్పారు. మరోవైపు.. పవన్ పదే పదే మతాలు, కులాలను రెచ్చగొట్టి విధ్వంసం సృష్టించడానికి ప్రయత్నిస్తున్నారని నారాయణస్వామి మండిపడ్డారు. ఆయన ఇంకా ఏమన్నారంటే..

బాబు కోసమే నారాహి యాత్ర

ముద్రగడ పద్మనాభం కాపుల సంక్షేమం కోసం పోరాడుతుంటే.. ఆ పోరాటాన్ని అణగదొక్కిన ఘనత చంద్రబాబుదే. ఆ సమయంలో పవన్‌కళ్యాణ్ చంద్రబాబును ఒక్కసారి కూడా ప్రశ్నించలేదు. పవన్ కన్నా చిరంజీవి ఎన్నో రెట్లు గొప్ప వ్యక్తి. చిరంజీవి విలువలతో కూడిన రాజకీయం చేశారు. అయితే, ఆయన తమ్ముడు పవన్‌కళ్యాణ్ మాత్రం చెప్పులతో దాడిచేస్తాం.. రాళ్లతో దాడి చేస్తామంటూ నీచ రాజకీయాలు చేస్తున్నారు. అసలు కాపులకు ఆయన చేసింది ఏమిటి? నారాహి యాత్ర ద్వారా చంద్రబాబుకు లబ్ధిచేకూర్చడానికి ప్రయత్నిస్తున్నారు. సినిమాలు వేరు.. రాజకీయం వేరు అనే విషయాన్ని పవన్‌కళ్యాణ్ ఇంకా గుర్తించలేదు. సినిమాల్లో హీరోగా ఆయన లక్షమందిని కొట్టినట్లు రాజకీయాల్లోను జరుగుతుందని భావిస్తున్నారు. రాజకీయాల్లో అలా చెప్పులతో, రాళ్లతో దాడులు చేయడం కుదరదు. ప్రేమ, అభిమానం, ఆత్మీయతతో మాత్రమే రాజకీయాల్లో రాణిస్తారు.

వైఎస్సార్‌లాగానే జగన్..

వైఎస్సార్ గతంలో ప్రేమ, అభిమానంతో రాణించారు. అదేబాటలో ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందడుగు వేస్తున్నారు. ఇక అవినీతి జరిగిందంటూ పదేపదే చెబుతున్న పవన్.. ఏ విభాగంలో అవినీతి చోటుచేసుకుందో స్పష్టంచేయాలి. బటన్ నొక్కి సీఎం లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమచేస్తుంటే ఇక అవినీతి ఎక్కడ జరిగింది? నిజానికి.. భూబకాసురుడు చంద్రబాబు హయాంలోనే విచ్చలవిడిగా అవినీతి చోటుచేసుకుంది. అప్పుడు పవన్ ఒక్కమాట కూడా మాట్లాడలేదు. దొంగలంతా ఒక్క గట్టు వైపు చేరి సంక్షేమ పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై దాడిచేస్తున్నారు. పేదోళ్లకు సముచిత స్థానం కల్పించిన గొప్పవ్యక్తి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి. దేశంలో ఎక్కడాలేని సంక్షేమ పథకాలను ఆయన రాష్ట్రంలో అందిస్తున్నారు.

మరింత చురుగ్గా మండళ్లు!

వ్యవసాయ సలహా మండలి తొలిభేటీలో మంత్రులు కాకాణి, కారుమూరి, అంబటి

- ప్రభుత్వ తోడ్పాటును అన్నదాతలకు సమగ్రంగా వివరించాలి
- త్వరలో మరో 52 ఇంటిగ్రేటెడ్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్స్ సేవలు
- ఎలాంటి వాతావరణ పరిస్థితులైనా ఎదుర్కొనేందుకు యంత్రాంగం సిద్ధంగా ఉండాలి
- జూలైలో రైతులకు వ్యక్తిగత యంత్ర పరికరాల పంపిణీ



మాట్లాడుతున్న మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి..చిత్రంలో మంత్రులు కారుమూరి, అంబటి

సాక్షి, అమరావతి: రైతులకు మరింత మెరుగైన సేవలు అందించడంలో జిల్లా వ్యవసాయ సలహా మండళ్లు చురుగ్గా వ్యవహరించాలని వ్యవసాయ, జలవనరులు, పౌరసరఫరాల శాఖల మంత్రులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, అంబటి రాంబాబు, కారుమూరి నాగేశ్వరరావు సూచించారు. నిత్యం రైతులతో మమేకమై క్షేత్ర స్థాయిలో ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి సూచనలు, సలహాలు అందించాలన్నారు. మంత్రి కాకాణి అధ్యక్షతన రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి తొలి సమావేశం సోమవారం సచివాలయంలో జరిగింది. జూలైలో రైతులకు వ్యక్తిగత యంత్ర పరికరాలను పంపిణీ చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్నట్లు మంత్రులు తెలిపారు. ఇప్పటికే 73 ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్స్ సేవలు అందుబాటులోకి రాగా జూలై 8న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా మరో 52 ల్యాబ్స్‌ను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు చెప్పారు.

ముక్కారు పంటలు.. పెరిగిన దిగుబడులు

విత్తనం నుంచి విక్రయం వరకూ రైతులకు అన్ని విధాలా అండగా నిలుస్తూ అమలు చేస్తున్న కార్యక్రమాలను అర్థమయ్యే రీతిలో వివరించాల్సిన బాధ్యత సలహా మండళ్లదేనని మంత్రులు పేర్కొన్నారు. -క్రాప్, ఆర్బీకేల ద్వారా పంట ఉత్పత్తుల కొనుగోలు, ఉచిత పంటల బీమా, సీజన్ ముగియకముందే పంట నష్టపరిహారం పంపిణీ లాంటివి దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డుల జారీలో భూ యజమానులు సహకరించేలా సలహా మండళ్లు కృషి చేయాలన్నారు. బిందు, తుంపర పరికరాలకు సంబంధించి గత సర్కారు బకాయి పెట్టిన రూ.963 కోట్లను ఈ ప్రభుత్వమే చెల్లించిందన్నారు. టీడీపీ హయాంలో 31వ స్థానంలో ఉన్న ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఇప్పుడు 13వ స్థానానికి చేరుకుందని చెప్పారు. ముందుగానే సాగునీటిని విడుదల చేస్తుండడంతో ఏటా మూడు పంటలు పండించుకునే అవకాశం లభించడంతోపాటు దిగుబడులు గుణనీయంగా పెరిగాయన్నారు. నాలుగేళ్లలో ఏటా సగటున 15 లక్షల టన్నుల వరకూ దిగుబడులు పెరగడమే ఇందుకు నిదర్శనమన్నారు.

ధాన్యం డబ్బులు మరింత వేగంగా..

దళారుల ప్రమేయం లేకుండా ఈ-క్రాప్ ఆధారంగా ఆర్బీకేల ద్వారా ప్రభుత్వమే రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేస్తోందని మంత్రులు పేర్కొన్నారు. ప్రస్తుతం పది రోజుల్లోనే ధాన్యం సొమ్ములు జమ చేస్తున్నామని, రాబోయే రోజుల్లో 4–5 రోజుల్లోనే చెల్లించేలా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. నాలుగేళ్లలో 32.78 లక్షల మంది రైతుల నుంచి 3.11 కోట్ల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రూ.58,773 కోట్లు చెల్లించినట్లు తెలిపారు. టీడీపీ హయాంలో ఐదేళ్లలో 17.94 లక్షల మంది రైతుల నుంచి 2.65 కోట్ల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రూ.40,230 కోట్లను మాత్రమే చెల్లించినట్లు పేర్కొన్నారు. రాగులు, జొన్నలు లాంటి చిరుధాన్యాలను ప్రోత్సహించాలన్న సీఎం జగన్ ఆదేశాల మేరకు ఆర్బీకేల స్థాయిలో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు మంత్రులు చెప్పారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ఎలాంటి వాతావరణ పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సన్నద్ధం కావాలని మంత్రులు అధికార యంత్రాంగానికి సూచించారు. వ్యవసాయ మిషన్ ఉపాధ్యక్షుడు ఎంవీఎస్ నాగిరెడ్డి , వ్యవసాయ శాఖ స్పెషల్ సీఎస్ గోపాలకృష్ణ ద్వివేది, సహకార, మార్కెటింగ్ శాఖ ముఖ్య కార్యదర్శి చిరంజీవి చౌదరి, వ్యవసాయ శాఖ స్పెషల్ కమిషనర్ చేవూరు హరికిరణ్, మార్కెటింగ్ శాఖ కమిషనర్ రాహుల్ పాండే, మార్క్‌ఫెడ్ చైర్మన్ నాగిరెడ్డి, ఆప్కాబ్ చైర్‌పర్సన్ ఝాన్సీరాణి, వ్యవసాయ, ఉద్యాన, సహకార, రైతు సాధికార సంస్థ సలహా దారులు పాల్గొన్నారు.

కులమతాల విద్వేషమే పవన్ లక్షణం'

సాక్షి, అమరావతి : దేశంలో ఏ రాష్ట్రంలోనూ అమలు చేయనన్ని సంక్షేమ పథకాలను అమలుచేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎందుకు ఓడించాలో ఒక్క కారణమైనా చెప్పగలరా పవన్‌కళ్యాణ్.. అంటూ వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మేరాజోత్ హనుమంత్‌నాయక్ ప్రశ్నించారు. తాడేపల్లిలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కులం, మతం, విద్వేషం, అతివాగుడే పవన్ లక్షణమన్నారు. చంద్రబాబు కోసం పనిచేస్తున్న పవన్.. రాష్ట్రంలో పేదల సంక్షేమం కోసం పాటుపడుతున్న సీఎం జగన్‌పై అడ్డగోలు విమర్శలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

టీడీపీతో పొత్తు పెట్టుకోం..

- హోదాను చంద్రబాబే వద్దన్నారు
- తాత్కాలిక రాజధానితో సరిపెట్టారు
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోమువీర్రాజు

చిల్లకూరు(తిరుపతి జిల్లా)/చిత్తూరు కార్పొరేషన్: రానున్న ఎన్నికల్లో అందరూ అనుకున్నట్లు టీడీపీతో పొత్తు పెట్టుకునేది లేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోమువీర్రాజు స్పష్టం చేశారు. తిరుపతి జిల్లా చిల్లకూరు మండలంలోని పారిచెర్లవారిపాళెం గ్రామంలో సోమవారం కేంద్ర ఐటీ సహాయ మంత్రి దేవూసిన్హ్ చౌహాన్‌తో కలసి ఉపాధి హామీ పథకం పనులను ఆయన పరిశీలించారు. అనంతరం విలేకరులతో సోము వీర్రాజు మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం పొత్తులతో అధికారంలోకి రాదని, అందుకే రాష్ట్రంలో టీడీపీతో ఎలాంటి పరిస్థితుల్లో పొత్తు పెట్టుకోకూడదని అనుకుంటున్నట్లు తెలిపారు. అయితే జనసేనతో మాత్రం కలసి నడుస్తామన్నారు. గతంలో చంద్రబాబుతో పొత్తు పెట్టుకుని ఇబ్బంది పెట్టిన విషయం మరచిపోలేదని దీంతోనే కేంద్రంలోని పెద్దలు కూడా చంద్రబాబుతో పొత్తు అంటే అంగీకరించడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి గతంలో చంద్రబాబు పాలన సమయంలో రాష్ట్రానికి రూ.35వేల కోట్ల నిధులు ఇచ్చారని.. అయితే ఆయన వాటిని చంద్రన్న బాట పేరుతో ఖర్చుచేసి బీజేపీ ఏమి ఇవ్వలేదని చెప్పారని దుయ్యబట్టారు. నేడు జాతీయగ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పలు పనులు చేపట్టేందుకు నిధులు మంజూరు చేస్తున్నారని దీంతోనే గ్రామాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. తిరుపతి జిల్లాలో 85 చెరువులను అమృత్ సరోవర్ పేరుతో ఆధునికీకరణ చేస్తున్నామని తెలిపారు. గ్రామాల్లో తాము అందిస్తున్న సంక్షేమ పథకాలతోనే తమ పార్టీ అధికారంలోకి వస్తుందని సోము వీర్రాజు ధీమా వ్యక్తం చేశారు.

ప్యాకేజీ చాలన్నది బాబే..

రాష్ట్రానికి ప్రత్యేకహోదా వద్దు ప్యాకేజీ చాలని చంద్రబాబు కేంద్రాన్ని కోరారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోమువీర్రాజు స్పష్టం చేశారు. బీజేపీ పాలన చేపట్టి 9 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా చిత్తూరులోని గంగినేనిచెరువు పార్కు వద్ద నిర్వహించిన జిల్లా మహాజన సంపర్క్ అభియాన్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చి మాట్లాడారు. మోదీ పాలన దేశానికి ఆదర్శమన్నారు. చంద్రబాబు అమరావతిలో తాత్కాలిక రాజధాని నిర్మించారని ఆరోపించారు. బాబు పాలనలో సోమవారం పోలవరం అని కాలక్షేపం చేశారన్నారు. జనసేన, టీడీపీ పొత్తు విషయమై బాబునే ప్రశ్నించాలని చెప్పారు. కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి పొంగులేటి, జూపల్లి

- పార్టీ అగ్రనేతలతో భేటీ అయిన నేతలు
- ముగ్గురు మాజీ ఎమ్మెల్యేలు, ఓ మాజీ ఎమ్మెల్సీ కూడా కాంగ్రెస్ గూటికి
- 2న ఖమ్మం సభలో పొంగులేటి చేరిక
- 14 లేదా 16న మహబూబ్‌నగర్ సభలో జూపల్లి చేరిక

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణకు చెందిన మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు, మాజీ ఎమ్మెల్యేలు గుర్నాథ్‌రెడ్డి, కోరం కనకయ్య, పాయం వెంకటేశ్వర్లు, మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి సహా 35 మంది నేతలు కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారు. వీరంతా సోమవారం ఢిల్లీలో ఏఐసీసీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో, అనంతరం సోనియా గాంధీ నివాసంలో ప్రియాంక గాంధీతో భేటీ అయ్యారు. జూలై 2న ఖమ్మంలో నిర్వహించే బహిరంగ సభలో పొంగులేటి శ్రీనివాసరెడ్డి కాంగ్రెస్ కండువా కప్పుకోనున్నారు. ఈ సభకు రావాలని వీరు రాహుల్‌గాంధీని ఆహ్వానించగా ఆయన సుముఖత తెలిపారని పొంగులేటి తెలిపారు. జూలై 14 లేదా 16న మహబూబ్‌నగర్‌లో జరిగే సభలో జూపల్లి కాంగ్రెస్‌లో చేరనున్నారు. ఈ సభలో పాల్గొనడానికి ప్రియాంక గాంధీ సమ్మతించారని జూపల్లి తెలిపారు. రాహుల్‌తో భేటీలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, పార్టీ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

కేసీఆర్ హఠావో.. తెలంగాణ బచావో..

ఈ సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. తెలంగాణలో 'ఘర్ వాపసీ' మొదలైందని, పార్టీని వీడిన నేతలంతా తిరిగి చేరేలా చూడాలని రాష్ట్ర నేతలకు సూచించారు. రాష్ట్రంలో కేసీఆర్ కుటుంబ నియంత పాలనను సాగనంపాలని ప్రజలు నిర్ణయించుకున్నారని చెప్పారు. బీజేపీ, బీఆర్ఎస్ కలసిపోయాయని ప్రజలు బలంగా విశ్వసిస్తున్నారని చెప్పారు. ప్రస్తుతం కాంగ్రెస్ సమయం వచ్చిందని, దీన్ని అనుకూలంగా మలచుకుని 'కేసీఆర్ హఠావో.. తెలంగాణ బచావో' నినాదంతో ప్రజల్లోకి వెళ్లాలని సూచించారు. బీజేపీ-బీఆర్ఎస్‌ల అవగాహనలో భాగంగానే ఢిల్లీ మద్యం కేసులో ఎమ్మెల్సీ కవితను అరెస్ట్ చేయలేదని మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. ఈ విషయాన్ని ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్లాలని రాష్ట్ర నేతలను ఆదేశించారు.

ప్రజల నాడి కాంగ్రెస్ వైపే

రాహుల్‌తో భేటీ అనంతరం పొంగులేటి, జూపల్లి విలేకరులతో మాట్లాడుతూ.. తెలంగాణలో ప్రజల నాడి కాంగ్రెస్ వైపే ఉందని చెప్పారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నిరంకుశ, నియంతృత్వ పాలనకు చరమగీతం పాడే సమయం వచ్చిందని, వచ్చే ఎన్నికల్లో ఆయన్ని ఇంటికి పంపిస్తామని చెప్పారు.

ఐటీ ఎగుమతుల్లో బూమ్

▶ మొదటి పేజీ తరువాయి

ఎగుమతులు రూ.846.77 కోట్ల నుంచి రూ.972.43 కోట్లకు పెరిగితే వీసెజ్ ద్వారా ఎగుమతులు రూ.240.63 కోట్ల నుంచి రూ.676.82 కోట్లకు చేరుకున్నాయి. ఇంకా పలు ఐటీ కంపెనీల ఆడిటింగ్ పూర్తికాలేదని, ప్రాథమిక సమాచారం మేరకు 2022–23 ఐటీ ఎగుమతుల అంచనాలను రూపొందించినట్లు రాష్ట్ర ఐటీ శాఖ అధికారులు వెల్లడించారు. రాష్ట్రం నుంచి భారీగా ఎగుమతులు జరుగుతున్నా వాటి ప్రధాన కార్యాలయాలు ఇక్కడ లేకపోవడంతో మన రాష్ట్ర పరిధిలోకి రావడం లేదని ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (ఐటాప్) ప్రెసిడెంట్ శ్రీధర్ కొసరాజు పేర్కొన్నారు. నిజానికి రాష్ట్రం నుంచి కనీసం రూ.5,000 కోట్ల విలువైన ఐటీ ఎగుమతులు జరుగుతున్నట్లు తాము అంచనా వేస్తున్నట్లు వెల్లడించారు.



ఆర్నెల్లలో వరుసగా..

ప్రభుత్వ ప్రోత్సాహంతో పలు ఐటీ కంపెనీలు విశాఖతోపాటు పలు ద్వితీయ శ్రేణి పట్టణాల్లో తమ కార్యాలయాలను ప్రారంభిస్తున్నాయి. 2019కి ముందు రాష్ట్రంలో ఐటీ కంపెనీల సంఖ్య 178 కాగా ఇప్పుడు 372కి చేరుకోవడం గమనార్హం. గత ఆర్నెళ్ల వ్యవధిలో అమెజాన్ డెవలప్‌మెంట్ సెంటర్, బీఈఎల్, ఇన్ఫోసిస్, రాండ్ శాండ్, టెక్నోటాస్క్, ఐజెన్ అమెరికా సాఫ్ట్‌వేర్, టెక్‌బుల్, కాంప్లెక్స్ సిస్టమ్స్ లాంటి డజనుకుపైగా ఐటీ కంపెనీలు రాష్ట్రంలో ఏర్పాటైనట్లు ఏపీ ఎలక్ట్రానిక్స్ అండ్ ఐటీ ఏజెన్సీ (అపిటా) గ్రూపు సీఈవో ఎస్.కిరణ్ కుమార్‌రెడ్డి 'సాక్షి'కి తెలిపారు.మరికొన్ని ఐటీ కంపెనీలతో చర్చలు జరుగుతున్నట్లు వివరించారు. కొత్తగా ఏర్పాటైన కంపెనీల ద్వారా అదనంగా 20,000కి పైగా ఉద్యోగ అవకాశాలు లభించనున్నట్లు వెల్లడించారు.

విస్తరిస్తున్న కంపెనీలు

రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుండటంతో ఇప్పటికే ఏర్పాటైన పలు ఐటీ కంపెనీలు భారీ విస్తరణ కార్యక్రమాలను ప్రకటిస్తున్నాయి. ఇప్పటిదాకా విశాఖకు పరిమితమైన టెక్ మహీంద్రా తాజాగా విజయవాడలో కార్యకలాపాలను ప్రారంభించింది. గన్నవరం మేధా టవర్స్‌లో 120 మంది సీటింగ్ సామర్థ్యం ఉన్న కార్యాలయాన్ని టెక్ మహీంద్రా ప్రారంభించింది. హెచ్‌సీఎల్ విజయవాడ నుంచి విశాఖకు విస్తరించగా, విశాఖలో ఉన్న డబ్ల్యూఎన్‌ఎస్, పల్సస్‌స్ ఐడీఏ లాంటి 30కిపైగా ఐటీ, ఐటీ ఆధారిత సేవల కంపెనీలు విస్తరణ కార్యక్రమాలను చేపట్టింది. 2012లో కేవలం 50 మందితో ప్రారంభమైన డబ్ల్యూఎన్‌ఎస్ గ్లోబల్ సర్వీసెస్ ఉద్యోగుల సంఖ్య ఇప్పుడు 3,300 దాటింది. వీరిలో 2,000 మంది ఉద్యోగులు గత రెండేళ్లలోనే చేరినట్లు డబ్ల్యూఎన్‌ఎస్ సీఈవో కేశవ్.ఆర్.మురుగేష్ ప్రకటించారు. 2019లో 40 మందితో ప్రారంభించిన తమ సంస్థలో ఉద్యోగుల సంఖ్య ఇప్పుడు 4,200 దాటినట్లు పల్సస్ సీఈవో గేదెల శ్రీనుబాబు తెలిపారు. కొత్తగా ఏర్పాటైన కంపెనీలతోపాటు విస్తరణ ద్వారా గత మూడేన్నరేళ్లలో రాష్ట్రంలో 23,000 మందికి ఐటీ రంగంలో ఉపాధి లభించింది. 2019 నాటికి రాష్ట్రంలో 35,000గా ఉన్న ఐటీ ఉద్యోగుల సంఖ్య ప్రస్తుతం 58,000కి చేరినట్లు (అపిటా) గ్రూపు సీఈవో కిరణ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. విశాఖలో మిలియన్ టవర్ రెండో దశ నిర్మాణ పనులు పూర్తి కాగా తాజాగా రూ.300 కోట్లతో ఐస్పేస్ బిజినెస్ పార్క్‌ను అభివృద్ధి చేస్తున్నారు. అదానీ డేటా సెంటర్‌లో ఐటీ పార్క్‌ను అభివృద్ధి చేస్తోంది.

ఇటీవల మలేషియాలోని కౌలాలంపూర్‌లో జరిగిన మిసెస్ గ్రాండ్ సీ వరల్డ్ 2023 (29-40 ఏళ్లలోపు పెళ్లైన మహిళలకు నిర్వహించే కాంటెస్ట్) పోటీల్లో హైదరాబాద్ వాసి శ్రీమతి మహతి కౌమారి 2వ స్థానం దక్కించుకుంది. మలేషియా దక్షిణాఫ్రికా సహా 15 దేశాల నుంచి 45 మంది మహిళలు పాల్గొన్న ఈ పోటీల్లో పాల్గొనే అవకాశం రావడం గురించి, తనను తాను కొత్తగా మెరుగు పరుచుకునే విధానాల గురించి వివరించింది మహతి కౌమారి. 'మన పరిధిని విస్తరించుకుంటేనే అవకాశాలు పెరుగుతాయి, ఏ కిరీటాలైనా దక్కుతాయి' నవ్వుతూ వివరించింది.

నాతో నేనే పోటీ పడ్డాను..!


మహతి కౌమారి

"సొంతంగా ఎదగాలన్న ఆలోచనే ఈ రోజు నన్ను ఎల్లలు దాటేలా చేసింది. పదేళ్లు ఐటీ కంపెనీలలో వర్క్ చేశాను. పెళ్లి, ఇద్దరు పిల్లలు, కుటుంబం.. జీవితం ఒక దశ నుంచి మరో దశకు తీసుకెళుతూనే ఉంది. దీనితోపాటు నా కలలను కూడా తీర్చుకునే క్రమంలో నాతో నేనే పోటీపడుతుంటాను.

కాలేజీ రోజుల నుంచి నా డ్రెస్సులు నేనే స్వయంగా డిజైన్ చేసుకునేదాన్ని. రీ సైక్లింగ్ మీద ఎక్కువ ఆసక్తి చూపేదాన్ని. ఆ తర్వాత ఉద్యోగం చేస్తూ కూడా నా ఈ అలవాటు మానుకోలేదు. నా స్నేహితులు, సహోద్యోగులు నా డ్రెస్సింగ్ గురించి అడిగేవారు. వాళ్లూ తమకు డ్రెస్‌లు డిజైన్ చేయమని కోరేవారు. అలా మా బంధుమిత్రుల్లో అడిగిన వారికి నాకున్న ఖాళీ సమయాన్ని కేటాయించి డిజైన్ చేసిచ్చేదాన్ని. నేను డిజైన్ చేసిచ్చిన డ్రెస్సుల్లో వారిని చూసినప్పుడు చాలా ఆనందం కలిగేది.

సొంతంగా డిజైనింగ్ స్టూడియో

పుట్టి, పెరిగింది హైదరాబాద్‌లోనే. కుటుంబం, ఉద్యోగం అనే వ్యాపకాలు ఉన్న నాకు సొంతంగా నా డిజైన్ స్టూడియో పెట్టుకుంటే బాగుంటుందని ఆలోచన పెరగడానికి నా డిజైన్స్ ఇష్టపడే బంధుమిత్రులే కారణం. మా కుటుంబం కూడా ఆమోదం తెలపడంతో ఉద్యోగం వదిలి, డ్రెస్ డిజైనింగ్‌లోకి వచ్చేశాను. ఎనిమిదేళ్లుగా డిజైనింగ్ స్టూడియో నడుపుతున్నాను. మొదట ఇద్దరికి ఉద్యోగాలు ఇచ్చిన నేను, ఇప్పుడు పదిహేనుమందికి ఉపాధి చూపించగలుగుతున్నందుకు ఆనందంగా ఉంది. ఫ్యాషన్ డిజైనింగ్ నేర్చుకోవాలనుకునే విద్యార్థులకు క్లాసులు కూడా ఇస్తుంటాను.

బ్యూటీ కాంటెస్ట్‌తో మరో అడుగు

'తెలిసిన వారికి వర్క్ చేసిస్తే సరిపోదు, నేను చాలామందికి రీచ్ అవ్వాలి. ఎక్కువ మంది మహిళలకు పని కల్పించేలా నన్ను నేను మలుచుకోవాలి..' ఈ ఆలోచన నన్ను అవకాశాల కోసం వెతికేలా చేసింది. ఆన్‌లైన్‌లో మిసెస్ బ్యూటీ కాంటెస్ట్ అడ్వర్‌టైజ్‌మెంట్ చూసినప్పుడు నా స్కూల్, కాలేజీ రోజులను గుర్తు చేసుకున్నాను. కాంటెస్ట్‌లో పాల్గొనడానికి ఆన్‌లైన్‌లో అప్లై చేసుకున్నాను. మన దేశం నుంచే కాదు మరో పదిహేను దేశాల నుంచి చాలామంది మహిళలు ఈ పోటీలకు అప్లై చేసుకున్నారు. ఇంటర్వ్యూ తర్వాత మన దేశం నుంచి నేను ఎంపిక అయ్యాను. రెండు నెలలు ప్రత్యేక శిక్షణ తీసుకుని, పోటీల్లో పాల్గొన్నాను.

ఇప్పుడు నాకు విదేశాలలోనూ స్నేహితులు పెరిగారు. పోటీలకు వచ్చిన వారందరితోనూ మంచి స్నేహం ఏర్పడింది. దీంతో నాకున్న అవకాశాలను వినియోగించుకునే దిశగా అడుగులు వేస్తున్నాను'' అని వివరించి ఈ బ్యూటీ.

– నిర్మలారెడ్డి

> **మనసును సేదతీర్చేలా...**
> కర్ణాటక సంగీతం నాకున్న మరో హాబీ. కుటుంబం, బిజినెస్ బాధ్యతలు ఎన్ని ఉన్నా నాకు ఇష్టమైన సంగీతాన్ని నిత్యం సాధన చేస్తూనే ఉంటాను. హాబీస్‌కి నాకంటూ కొంత సమయం కేటాయించుకోవడంలో ఏ మాత్రం అలక్ష్యం చేయను. పిల్లలు కూడా నా ఇష్టాలను ప్రోత్సహిస్తుంటారు.



బ్యూటిప్స్

- జుట్టు పొడిబారి నిర్జీవంగా ఉంటే పెరుగు మంచి ఫలితాన్నిస్తుంది. ఒక కప్పు పుల్లటి పెరుగు తీసుకోవాలి. జుట్టును చిక్కులేకుండా దువ్వి పెరుగును ఒక్కొక్క స్పూన్ తల మీద వేస్తూ వేళ్లతో మర్దన చేయాలి. తలంతా ప్రతి వెంట్రుక కుదురుకూ పెరుగు పట్టాలన్న మాట. ఓ అరగంట తర్వాత వేడినీటితో తల స్నానం చేయాలి. వారానికోసారి ఇలా చేస్తుంటే జుట్టు చిట్లిపోకుండా మృదువుగా, ఒత్తుగా, ఆరోగ్యంగా పెరుగుతుంది. వేళ్లతో తలంతా మర్దన చేసుకోవడం సాధ్యం కాకపోతే జుట్టు కుదుళ్లకు పెరుగును పట్టించిన తర్వాత గుండ్రటి పళ్లున్న దువ్వెనతో పది నిమిషాల సేపు దువ్వితే సరిపోతుంది.
- జుట్టు రాలుతుంటే బంగాళా దుంప రసం బాగా పని చేస్తుంది. బంగాళాదుంపను తురిమి రసం తీసుకోవాలి. అరకప్పు రసంలో రెండు టేబుల్ స్పూన్‌ల కలబంద గుజ్జు కలిపి తలకు పట్టించాలి. జుట్టుకు పైన రాసి సరిపుచ్చకూడదు. కేశాల మొదళ్లకు పట్టేలా రాసి పది నిమిషాల సేపు మర్దన చేయాలి. రెండు గంటల తర్వాత వేడి నీటితో తల స్నానం చేయాలి. ఇలా వారానికి రెండు సార్లు చేస్తుంటే జుట్టురాలడం తగ్గిపోతుంది.



అన్నపూర్ణలు

ఆకలికి వైద్యం అన్నం పొట్లం

హాస్పిటల్‌లోని పేషెంట్లకు వైద్యులు వైద్యం చేస్తారు.
కాని వారి ఆకలికి ఎవరు వైద్యం చేస్తారు?
కేరళలో ప్రభుత్వ ఆస్పత్రుల్లోని పేషెంట్ల కోసం, వారిని చూసుకుంటూ ఉండిపోయిన బంధువుల కోసం ఎందరో గృహిణులు వంట చేస్తారు.
'అన్నం పొట్లం' కట్టి అందిస్తారు.
ఇలా దాదాపు రోజూ 40 వేల అన్నం పొట్లాలు అక్కడి యూత్ ఫెడరేషన్ ద్వారా నిత్యం సరఫరా అవుతూనే ఉంటాయి.


సేకరించిన అన్నం పొట్లాలు పంచుతున్న డీవైఎఫ్ఐ కార్యకర్తలు

ఉదయాన్నే లేచిన సౌమ్య ఆఫీసుకు వెళ్లే భర్త కోసం క్యారేజీ కట్టే హడావిడిలో ఉంది. అలాగే పిల్లలకు కూడా లంచ్ బాక్సులు కట్టాలి. ఒకటిన్నర గ్లాసుల బియ్యం పడేస్తే సరిపోతాయి. కాని ఆమె ఆ రోజు రెండు గ్లాసులకు పైనే వండింది. భర్తకు, పిల్లలకు కట్టగా తను తినాల్సింది గిన్నెలో పెట్టి మిగిలింది పొట్లంగా కట్టింది. అన్నంతో పాటు పప్పు, పచ్చడి, తాలింపు, ఒక ఆమ్లెట్టు... చక్కగా అరిటాకులో వేసి న్యూస్‌పేపర్‌లో చుట్టింది. ఆ పొట్లాన్ని కాసేపటికి ఒక కార్యకర్త వచ్చి సేకరించుకుని వెళ్లాడు. అలా ఆ కార్యకర్త ఆ వీధిలో అన్నం పొట్లం కట్టమని చెప్పిన ఇళ్లన్నింటికీ వెళ్లి అన్నం పొట్లాలను సేకరించాడు. ఇలా సేకరించినవి మధ్యాహ్నానికి ఊళ్లోని ప్రభుత్వ ఆస్పత్రికి చేరుతాయి. లోపల ఉన్న పేద పేషెంట్లకూ వారి కోసం బయట కాచుకుని ఉన్న అటెండర్ల కోసం పంచుతారు. 'ఏ తల్లి కట్టిచ్చిన అన్నమో' అని తిన్నవారు ఆ గృహిణులను ఆశీర్వదిస్తారు. ఇలా కేరళలో గృహిణుల వల్ల గత నాలుగేళ్లుగా రోగుల ఆకలి తీరుతోంది. వారి ఆరోగ్యం బాగుపడుతోంది.

ఇంటి నుంచి ఆస్పత్రికి

కేరళలోని డెమొక్రటిక్ యూత్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డివైఎఫ్ఐ) 2017లో 300 అన్నం పొట్లాలు సేకరించి ప్రభుత్వ మెడికల్ కాలేజీలకు అనుసంధానంగా ఉండే పెద్దాస్పత్రులకు పంచే కార్యక్రమం మొదలు పెట్టింది. దీనికి వారు పెట్టిన పేరు 'హృదయపూర్వం పొత్తిచోరు'. అంటే 'హృదయపూర్వకంగా అన్నం పొట్లం'. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉన్న రోగులకు అన్నం కొనుక్కునే స్తోమత అన్ని వేళలా ఉండదు. అలాగే వారిని చూసుకోవడానికి వచ్చే బంధువులు కూడా అన్నం కొనుక్కోలేరు. పేదవారు ఇలా బాధపడుతుంటే చూస్తూ ఊరుకోవడమేనా అని డివైఎఫ్ఐ కార్యకర్తలకు అనిపించింది. 'ప్రతి ఇంట్లోనూ ఓ అమ్మ అన్నం వండుతుంది. ఒక గుప్పెడు అదనంగా వండమని కోరుదాం. ఒకరికి భోజనం పొట్లం కట్టి ఇవ్వమని అడుగుదాం. ఇస్తారు' అని స్త్రీల కరుణ మీద ఉండే విశ్వాసంతో ధైర్యంగా రంగంలోకి దిగారు. కార్యక్రమ ప్రారంభం రోజున 300 అన్నం పొట్లాలు వచ్చాయి. ఇవాళ రాష్ట్రవ్యాప్తంగా 40,000 అన్నం పొట్లాలు పంపిణీ అవుతున్నాయి.




అన్నం పొట్లం

పకడ్బందీగా సేకరణ

కేరళ అంతా డివైఎఫ్ఐ కార్యకర్తలు ఉన్నారు. వారు తమ తమ ఊళ్లలో ఎన్ని అన్నం పొట్లాలు అవసరమో లెక్కించి తమ ఏరియాలో ఉన్న గృహిణులను ముందు రోజే రిక్వెస్ట్ చేస్తారు. మరుసటి రోజు మధ్యాహ్నం అన్నం పొట్లం ఇవ్వమంటారు. అలా ఒకోరోజు ఒక ఏరియాలో కొన్ని ఇళ్లను ఎంపిక చేసుకుని అడుగుతారు. మళ్లీ ఆ ఇళ్లలోని గృహిణులను అడగడానికి వారం పదిరోజులు పట్టొచ్చు. అందుకని స్త్రీలు సంతోషంగా అన్నం పొట్లం కట్టి ఇస్తారు. కొందరు స్త్రీలు రెండు మూడు పొట్లాలు కట్టిచ్చి సంతోష పడతారు.

సారీ అంకుల్!

ఈ అన్నం పొట్లాల పంపిణీలో ఎన్నో ప్రేమమయ సంఘటనలు కూడా ఉన్నాయి. ఒకరోజు ఒక రోగికి తన వంతుగా అందిన అన్నం పొట్లంలో చిన్న చీటీ కనిపించింది. అందులో ఇలా ఉంది. 'అంకుల్.. అమ్మకు వీలు కాలేదు. నేనే స్కూల్‌కు వెళ్లే హడావిడిలో వంట చేశాను. అంత రుచిగా లేవు. క్షమించండి. మీరు తొందరగా కోలుకోండి' అని ఒక అమ్మాయి రాసింది. దానిని అందుకుని ఆ రోగి ఆ చీటిని ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేస్తూ 'బంగారుతల్లీ... నువ్వు పంపిన భోజనం ఎంతో రుచిగా ఉంది. మెతుకు మెతుకులో నీ ప్రేమ ఉంది' అని రాశాడు.

అన్నం పొట్లం కట్టివ్వడానికి అమ్మలాంటి స్త్రీలు ఎందరో ఉంటారు. చేయవలసిందల్లా ప్రయత్నమే.

సాగుబడి

ఆరుద్ర కార్తె : జూన్ 22 నుంచి

తక్కువ ఖర్చుతో నాలుగు నెలల్లో కోతకు వచ్చే మెట్ట వరి సాగు చేపడితే రైతులకు ఆర్థికంగానే కాకుండా అనేక ఇతర ప్రయోజనాలు కూడా నెరవేరుతాయని నిపుణులు చెబుతున్నారు. సేంద్రియ మెట్ట వరి సాగుపై జనగామ జిల్లా లింగాల గణపురం మండలం జీడికల్ గ్రామంలో ఇటీవల రైతులకు శిక్షణ ఇవ్వటంతో పాటు క్షేత్రస్థాయిలో సీడ్ డ్రిల్‌తో విత్తనం వేసి చూపించారు. అంతర్జాతీయ వరి పరిశోధనా సంస్థ (ఐఆర్‌ఆర్‌ఐ), సుస్థిర వ్యవసాయ కేంద్రం(సిఎస్‌ఎ), ఆదర్శ ఎనబావి రైతు ఉత్పత్తిదారుల కంపెనీ, డా. రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెట్ట వరి సాగుపై రైతులకు శిక్షణ ఇచ్చారు. సిఎస్‌ఎ సీనియర్ శాస్త్రవేత్త డా. జి. రాజశేఖర్ ద్వారా సేంద్రియ మెట్ట వరి సాగు తీరుతెన్నుల గురించి ఆయన మాటల్లోనే తెలుసుకుందాం.

సేంద్రియ మెట్ట వరి సాగు మేలు


మెట్ట వరి పొలం

సాంప్రదాయ పద్ధతిలో దమ్ముచేసి నాట్లు వేసి నీరు నిల్వగట్టడం వలన అనేక సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ ఏడాది వర్షాలు మూడు వారాలు ఆలస్యం కావడంతో మెట్ట వరి సాగు వైపు రైతులు దృష్టిసారిస్తున్నారు. మెట్ట వరి సాగు వలన అనేక లాభాలు ఉన్నాయి. అధిక కూలీల ఖర్చు, భూగర్భ జలాల వినియోగం ఎక్కువ కావటం, భూమి చౌడుబారడం, మిథైన్ విషవాయువు విడుదలై వాతావరణం వేడెక్కడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ సమస్యలన్నిటికీ పరిష్కారం మెట్ట వరి సాగు.

- బోర్ల కింద వరి సాగు చేసే రైతులకు మెట్ట వరి సాగు అనువైనది. దీర్ఘకాలిక(180 రోజుల) పంట అయిన పత్తి సాగు నచ్చక కొందరు రైతులు మెట్ట వరి సాగు చేపడుతున్నారు. స్వల్ప, మధ్యకాలిక(120–140 రోజులు) సన్నరకం వరి రకాలను మెట్ట పొలాల్లో ఆరుతడి పంటగా సాగు చేయడానికి ఆసక్తి చూపుతున్నారు.
- సాధారణ వరి సాగులో భూసారం దెబ్బతినటమే కాకుండా చౌడుబారుతుంది. చౌడు వల్ల నీరు నిల్వ ఉండి, కలుపు సమస్య తీవ్రమవుతుంది. సాధారణ వరి సాగుతో పోల్చినప్పుడు నీటి వాడకాన్ని, కర్బన ఉద్గారాలను తగ్గించడానికి మెట్ట వరి పద్ధతి ఉపకరిస్తుంది. సేంద్రియ పద్ధతులు పాటించి మెట్ట వరి సాగు చేస్తే మరింత ప్రయోజనం.
- మెట్ట వరి సాగు వల్ల 60–70% కూలీల ఖర్చు తగ్గుతుంది. నారుమళ్లు పోయటం, నాట్లు వేయటం ఉండదు కాబట్టి కూలీల అవసరం, ఖర్చు భారీగా తగ్గుతాయి. మహిళా రైతులు బురదలో నడుము వంచి చేయాల్సిన చాకిరీ తప్పుతుంది. వారి పాదాలు బురదలో నానాల్సిన అవసరం ఉండదు కాబట్టి ఆరోగ్యంగా ఉంటారు.
- పంట వేరు వ్యవస్థ పటిష్టంగా ఉంటుంది కాబట్టి పురుగులు, తెగుళ్ల బెడద తక్కువగా ఉంటుంది. నీటిలో నిల్వగట్టే పద్ధతిలో వేరు వ్యవస్థ బలహీనంగా ఉంటుంది కాబట్టి చీడపీడల బెడద కూడా ఎక్కువ.
- మెట్ట వరి సాగుకు నల్లరేగడి నేలలు అనువు కాదు. ఎర్ర నేలలు లేదా మధ్యస్థ నేలలు అనుకూలం. సేంద్రియ పద్ధతుల్లో సాగుకు దుక్కిలో ఎకరానికి 4 క్వింటాళ్ల పశువుల ఎరువు వేసి, అజోటోబాక్టర్‌తో విత్తన శుద్ధి చేసి, ఆ తడి ఆరిన తర్వాత విత్తుకోవాలి.


ట్రాక్టరుకు అనుసంధానం చేసిన సీడ్ డ్రిల్‌తో మెట్ట వరి విత్తుకోవాలి


8 వరుసల సీడ్ డ్రిల్

- మెట్ట పద్ధతిలో ట్రాక్టర్‌కు అనుసంధానం చేసిన సీడ్ డ్రిల్ ద్వారా లేదా ఎద్దులతో గొర్రు ద్వారా వరుసలుగా వరిని పొడి నేలలో విత్తుకోవాలి. వరుసల మధ్య అడుగు దూరం ఉంటుంది. 8 వరుసలు విత్తే పెద్ద సీడ్ డ్రిల్ ద్వారా గంట సేపట్లోనే ఎకరంలో విత్తనం వేసే పనిని పూర్తి చేయొచ్చు. ఎకరానికి 10–15 కిలోల విత్తనం సరిపోతుంది.
- దుక్కి, చదును చేసి పొడి మట్టిలో విత్తుకోవాలి. విత్తనం 2 అంగుళాల లోతులో పడాలి. అంతకన్నా లోతులో వేస్తే మొలక శాతం తగ్గుతుంది. విత్తిన తర్వాత 4–5 రోజులు వర్షం పడకపోయినా పర్వాలేదు. మట్టిలో తేమ పూర్తిగా ఆరిపోకుండా చూసుకోవాలి. మరీ అవసరమైతే నీటి తడి ఇవ్వాలి.
- సేంద్రియ మెట్ట వరిలో 40–45 రోజుల వరకు కలుపు మొలుస్తుంటుంది. సైకిల్ గొర్రు, వీడర్లతో కలుపును అదుపులో ఉంచాలి. నల్లరేగడి, చౌడు నేలల్లో కలుపు నిర్మూలన కష్టం. ఎర్ర నేలల్లో కలుపు తీయటం తేలిక.


మెట్ట వరి సాగు చేసిన మహిళా రైతు

- వర్షాధార వరి సాగులో మట్టిలో తేమ ఆరిపోకుండా చూసుకోవాలి. పంట మధ్యలో ఎక్కువ రోజులు వర్షం పడకపోతే నీటి తడి ఇవ్వాలి. ముఖ్యంగా పాలుపోసుకునే/పొట్ట దశలో వర్షం పడకపోతే విధిగా నీటి తడి ఇవ్వాలి.
- సేంద్రియ మెట్ట వరి సాగులో మొదటి నుంచీ ప్రతి 20–25 రోజులకోసారి ద్రవజీవామృతాన్ని (కలిపిన 7–15 రోజుల్లో) ఎకరానికి 200 లీటర్లు పిచికారీ చేయాలి. కనీసం 4 సార్లు చల్లాలి. ఇది వీలుకాకపోతే, ప్రతి 20–25 రోజులకోసారి ఎకరానికి 400 కిలోల వర్మీ కంపోస్టు చల్లాలి.
- కాండం తొలిచే పురుగు, సుడిదోమను కనిపెట్టి ఉండాలి. చీడపీడలు కనిపిస్తే సేంద్రియ కషాయాలు చల్లాలి. ఎర్రనేలల్లో మెట్టసాగులో చెదలు సమస్య కూడా రావచ్చు. ఎకరానికి రెండు లీటర్ల వేపనూనెను 10 కిలోల ఇసుకలో కలిపి ఒకసారి చల్లాలి. సలహాలు, సూచనల కోసం సిఎస్‌ఎ శాస్త్రవేత్త డా. రాజశేఖర్ (83329 45368)కు ఫోన్ చేయవచ్చు.

– పంతంగి రాంబాబు, సాక్షి సాగుబడి డెస్క్

> **2న బసంపల్లిలో రైతులకు శిక్షణ**
> శ్రీసత్యసాయి జిల్లా చెన్నేకొత్తపల్లి మండలం బసంపల్లి గ్రామం (ధర్మవరం- పుట్టపర్తి రోడ్డు)లో జూలై 2న (ప్రతి నెలా మొదటి ఆదివారం) సీనియర్ ప్రకృతి వ్యవసాయదారుడు నాగరాజు తన పొలంలోనే ఉ. 9 గం. నుంచి సా. 4 వరకు రైతులకు ప్రకృతి వ్యవసాయ శిక్షణ ఇస్తారు. భోజనం, నిర్వహణ కోసం రూ. 200 చెల్లించాలి. వివరాలకు.. 91826 71819.

ఏడాది పొడవునా పంటలు, ఆదాయం

- 6.5 ఎకరాల్లో మూడు కాలాల్లోనూ ప్రకృతి సేద్యం
- ఏడాదికి రూ. 5 లక్షల నికరాదాయం పొందుతున్న గిరిజన రైతు వినీత
- డా.ఎం.వి.రెడ్డి ఉత్తమ రైతు పురస్కారం ప్రదానం చేసిన ఎన్జీ రంగా వ్యవసాయ వర్సిటీ


వినీత వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శిస్తున్న ఇండోనేసియా మహిళా శాస్త్రవేత్త (ఫైల్)

ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో తనకున్న 6.5 ఎకరాల్లో ఏడాది పొడవునా బహుళ పంటలను సాగు చేస్తూ రూ. 5 లక్షల వరకు నికరాదాయం పొందుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు గిరిజన యువ మహిళా రైతు పాంగి వినీత(20). అల్లూరి సీతారామరాజు జిల్లా బలియగూడ మండలం డుంబ్రిగూడ గ్రామంలో ఆమె ఐదేళ్లుగా ప్రకృతి వ్యవసాయం చేస్తూ ఇతర రైతులకు స్ఫూర్తినిస్తున్నారు. ఆమెకు ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం 'డాక్టర్ ఎం.వి.రెడ్డి ఉత్తమ రైతు పురస్కారా'న్ని ఇటీవల ప్రదానం చేసింది. అరకు మండలం కిలోగుడలో సంజీవని స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జరిగిన 15వ దేశీ విత్తనోత్సవంలో కూడా ఉత్తమ రైతుగా ఆమె పురస్కారాన్ని అందుకున్నారు. ఇటీవల ఇండోనేషియా శాస్త్రవేత్తల బృందం ఆమె వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించి సాగు పద్ధతులను తెలుసుకున్నారు.

కొండ ప్రాంతంలోని ఎర్ర నేలలో సార్వా, దాళ్వా, వేసవి సీజన్లలో వరుసగా భర్త బాల కృష్ణతో కలసి వినీత ఏడాది పొడవునా పంటలు సాగు చేస్తూ నిరంతరం ఆదాయం పొందుతుండటం విశేషం.

కొండ వాగుల్లో నీటిని సేకరించి పంటలకు మళ్లించడం ద్వారా ఖరీఫ్‌తో పాటు రబీ, వేసవి పంటలను కూడా సాగు చేస్తున్నారు. వర్షాధారంగా వరి, గుళి రాగి పద్ధతిలో రాగులు, కూరగాయలు, పండ్లు, పూలు, చింతపండుతో పాటు కొద్ది సంఖ్యలో నాటుకోళ్లు, గొర్రెలు, మేకలను సైతం పెంచుతూ అనుదినం మంచి ఆదాయం పొందుతున్నారు.

వినీత అన్ని పంటలకు పూర్తిగా ప్రకృతి వ్యవసాయ విధానాలనే అవలంభిస్తున్నారు. ఏపీ రైతు సాధికార సంస్థ సహాయంతో వివిధ కషాయలను తయారు చేసి తమ పంటలకు వాడటంతో పాటు గ్రామంలోని ఇతర రైతులకు అందిస్తున్నారు.

పంట మార్పిడి ఖచ్చితంగా అనుసరిస్తున్నారు. ఏడాది పొడవునా మూడు సీజన్లలోనూ అంతర పంటలు, బహుళ అంతస్తుల పంటలు సాగు చేస్తున్నారు. సజీవ ఆచ్ఛాదనతోపాటు గడ్డిని ఆచ్ఛాదనగా వాడుతూ నేల తేమను సమర్థవంతంగా సంరక్షించుకుంటున్నారు. చింతపల్లి, అనకాపల్లి ఆర్ఏఆర్ఎస్‌ల శాస్త్రవేత్తల సూచనల మేరకు జీవ నియంత్రణ పద్ధతులను అనుసరిస్తున్నారు. వ్యవసాయ వ్యర్థాలతో తయారు చేసిన కంపోస్టును పంటలకు వాడుతున్నారు. అంతర పంటల సాగును అనుసరిస్తారు. మొక్కజొన్న+ ముల్లంగి, టొమాటో+ ముల్లంగి, పసుపు+ అల్లం, బీన్స్+వంకాయ, కొత్తిమీర+టమోటాలను మిశ్రమ పంటలుగా సాగు చేస్తున్నారు. టమోటా, కొత్తిమీర, ముల్లంగిని దశలవారీగా విత్తటం ద్వారా సంవత్సరం పొడవునా పంట దిగుబడి తీస్తున్నారు.

ఏయే పంటల్లో ఎంత ఆదాయం?

గత ఏడాది ఖరీఫ్‌లో 4.3 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేశారు. 2 ఎకరాల్లో వరి (దిగుబడి 32 క్విం./రూ. 26 వేల నికరాదాయం), అరెకరం మొక్కజొన్న (9 క్విం./రూ.12,500), ఎకరంలో రాగులు (7.5 క్విం./రూ.11,500), అరెకరంలో టొమాటో (4.8 క్విం./రూ.4,200), 30 సెంట్లలో సామలను వినీత సాగు చేశారు.

రబీలో 3 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేశారు. అరెకరంలో వరి (9 క్విం./రూ. 8,550 నికరాదాయం), అరెకరంలో మొక్కజొన్న (6 క్విం./రూ.8,000), ఎకరంలో టొమాటో (12.6 క్విం./రూ.12,100), అరెకరంలో ముల్లంగి (1.25 క్విం/రూ.2వేలు), 30 సెంట్లలో పచ్చిమిరప, కూరగాయలను సాగు చేశారు.

అదేవిధంగా ఎండాకాలంలో ఎకరంన్నరలో పంటలు సాగు చేశారు. 30 సెంట్లలో కొత్తిమీర, 20 సెంట్లలో ముల్లంగి, అరెకరంలో కూరగాయలు, అరెకరంలో టొమాటోలు సాగు చేశారు. ఎకరంన్నరలో బొప్పాయి, అరటి, అల్లం, పసుపు వంటి వార్షిక పంటలను సాగు చేస్తున్నారు. దీర్ఘకాలిక పంటలు కాఫీ, మిరియాలు 40 సెంట్లలో సాగు చేస్తున్నారు. 30 పనస, 6 చింత చెట్లున్నాయి. అన్ని పంటలు, కోళ్లు, గొర్రెలు, మేకల ద్వారా ఏటా సగటున రూ. 5 లక్షల నికరాదాయం పొందుతున్నట్లు వినీత తెలిపారు.


వినీత

ఏడాది పొడవునా ఆదాయ భద్రత

ఒకటికి పది పంటల సాగుతో వ్యవసాయ భూమి నుంచి సురక్షితమైన ఆదాయాన్ని పొందడంలో వినీత విజయం సాధించారు. దేశీ వరి, కూరగాయలతో పాటు పాడి, మేకలు, గొర్రెలు, కోళ్ల పెంపకం ద్వారా ఆదాయం సమకూర్చుకుంటున్నారు. మొత్తంగా 6.5 ఎకరాల ద్వారా సుమారు రూ. ఐదు లక్షలను ఏడాదికి సగటు నికరాదాయం పొందుతున్నారు. దేశీ వరిని వరుసలుగా విత్తటం, గుళి పద్ధతిలో రాగి నారు మొక్కలను నాటేసి సాగు చేయటం, అంతర పంటలు, మొక్కజొన్న ఇతర పంటలను ప్రకృతి వ్యవసాయంలో సాగు చేయటం వినీత ప్రత్యేకత.

'పాత విత్తనాలనే వాడుతున్నాం. విత్తనాలను మునుపటి పంట నుండి సేకరించి తదుపరి సీజన్‌కు వినియోగిస్తాం. ఎక్కువగా దేశీ రకాలనే వాడుతున్నాం. సహజ పద్ధతిలో పండించిన నాణ్యమైన ఆహారోత్పత్తులను థిమ్సా ఎఫ్.పి.ఓ. ద్వారా మార్కెట్‌లో విక్రయిస్తున్నందున మంచి ఆదాయం వస్తోంద'ని వినీత తెలిపారు.



అంతరిక్షంలో ప్రపంచకప్! అరుదైన రీతిలో ఐసీసీ ప్రచారం

వన్డే ప్రపంచకప్‌కు మరో 100 రోజుల సమయం ఉంది. భారత్‌లో జరిగే ఈ టోర్నీ కోసం అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ), బీసీసీఐ సంయుక్తంగా కొత్త తరహాలో ప్రచారాన్ని మొదలు పెట్టాయి. వరల్డ్ కప్ ట్రోఫీని ఏకంగా అంతరిక్షంలోకి పంపించి టోర్నీపై ఆసక్తిని మరింతగా పెంచే ప్రయత్నం చేశాయి. జిస్పోక్ బెలూన్‌తో జత చేసిన ట్రోఫీ భూమి నుంచి 1 లక్షా 20 వేల అడుగుల ఎత్తులో ఉన్న 'స్ట్రాటోస్ఫియర్'ను చేరింది. అక్కడ ఉన్న ట్రోఫీని 4కె కెమెరాతో కొన్ని షాట్స్ తీశారు. అనంతరం ట్రోఫీ నేలకు దిగి నేరుగా వరల్డ్ కప్ తొలి మ్యాచ్ జరిగే అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియానికి చేరింది. నేటినుంచి జరిగే వరల్డ్ టూర్‌లో భాగంగా ట్రోఫీ 18 దేశాలకు ప్రయాణిస్తుంది. ఇందులో ప్రపంచ కప్‌లో భాగం కాని కువైట్, బహ్రెయిన్, మలేసియా, నైజీరియా, ఉగాండా, ఫ్రాన్స్, ఇటలీ తదితర దేశాలు కూడా ఉన్నాయి. నేడు ముంబైలో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో వరల్డ్ కప్ పూర్తి షెడ్యూల్‌ను విడుదల చేయనున్నారు. భారత్ ఆతిథ్యమిస్తున్న ఈ టోర్నీ అక్టోబర్ 5 నుంచి నవంబర్ 19 వరకు జరుగుతుంది.

జింబాబ్వే జిగేల్...

వన్డే క్రికెట్‌లో రెండో అతి పెద్ద విజయం ● అమెరికాపై 304 పరుగుల తేడాతో గెలుపు
తొలిసారి వన్డేల్లో 400 పరుగులు చేసిన జింబాబ్వే ● సీన్ విలియమ్స్ భారీ సెంచరీ

హరారే: వన్డే ప్రపంచకప్ క్వాలిఫయింగ్ క్రికెట్ టోర్నమెంట్‌లో పరుగుల వరద పారుతోంది. ఇప్పటికే 'సూపర్ సిక్స్' దశకు అర్హత పొందిన ఆతిథ్య జింబాబ్వే జట్టు తమ గ్రూప్ 'ఎ' చివరి లీగ్ మ్యాచ్‌లో అమెరికాను హడలెత్తించింది. ఏకంగా 304 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించిన జింబాబ్వే తమ గ్రూప్ దశను అజేయంగా ముగించింది. టాస్ గెలిచిన అమెరికా ఫీల్డింగ్ ఎంచుకోగా... ముందుగా బ్యాటింగ్‌కు దిగిన జింబాబ్వే నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్లకు 408 పరుగులు సాధించింది. వన్డేల్లో జింబాబ్వే జట్టుకిదే అత్యధిక స్కోరు. ఇంగ్లండ్, శ్రీలంక, దక్షిణాఫ్రికా, ఆ్రస్టేలియా, భారత్, న్యూజిలాండ్ జట్ల తర్వాత వన్డే ఫార్మాట్‌లో 400 అంతకంటే ఎక్కువ పరుగులు నమోదు చేసిన ఏడో జట్టుగా జింబాబ్వే గుర్తింపు పొందింది. పరుగుల పరంగా భారత జట్టు (2023లో శ్రీలంకపై 317 పరుగుల తేడాతో) తర్వాత వన్డేల్లో రెండో అతి పెద్ద విజయం జింబాబ్వే ఖాతాలోకి చేరింది. కెప్టెన్ సీన్ విలియమ్స్ (101 బంతుల్లో 174; 21 ఫోర్లు, 5 సిక్స్‌లు) వీరవిహారం చేసి కెరీర్‌లో ఏడో సెంచరీ సాధించాడు. సికందర్ రజా (27 బంతుల్లో 48; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు), రియాన్ బర్ల్ (16 బంతుల్లో 47; 3 ఫోర్లు, 4 సిక్స్‌లు) కూడా అమెరికా బౌలర్లను చితగ్గొట్టారు. అంతకుముందు ఓపెనర్లు జాయ్‌లార్డ్ గుంబీ (103 బంతుల్లో 78; 5 ఫోర్లు), ఇన్నోసెంట్ కయా (41 బంతుల్లో 32; 1 ఫోర్, 1 సిక్స్) రాణించారు. కయా అవుటయ్యాక గుంబీతో కలిసి సీన్ విలియమ్స్ రెండో వికెట్‌కు 160 పరుగులు జోడించాడు. 65 బంతుల్లోనే సెంచరీ సాధించిన విలియమ్స్ మూడో వికెట్‌కు సికందర్ రజాతో 88 పరుగులు... రియాన్ బర్ల్‌తో నాలుగో వికెట్‌కు 81 పరుగులు జత చేశాడు. తమ ఇన్నింగ్స్‌లో మరో ఎనిమిది బంతులు మిగిలి ఉండగా సీన్ విలియమ్స్ పెవిలియన్ చేరుకున్నాడు. ఓవరాల్‌గా జింబాబ్వే ఇన్నింగ్స్‌లో 37 ఫోర్లు, 13 సిక్స్‌లు నమోదు కావడం విశేషం. 409 పరుగుల లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన అమెరికా 25.1 ఓవర్లలో 104 పరుగులకే కుప్పకూలింది. అభిషేక్ (24; 3 ఫోర్లు), జెస్సీ సింగ్ (21; 4 ఫోర్లు), గజానంద్ సింగ్ (13; 1 సిక్స్) మాత్రమే రెండంకెల స్కోరు దాటారు. జింబాబ్వే బౌలర్లలో ఎన్‌గరవా, సికందర్ రజా రెండు వికెట్లు చొప్పున తీయగా... ఇవాన్స్, ల్యూక్ జోంగ్వి, రియాన్ బర్ల్ ఒక్కో వికెట్ పడగొట్టారు. ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లో నెగ్గిన జింబాబ్వే గ్రూప్ టాపర్‌గా నిలిచింది.


సీన్ విలియమ్స్


తేజ


వాన్ బీక్

'డచ్' ధమాకా

వెస్టిండీస్ 374/6 ; నెదర్లాండ్స్ 374/9
- 'సూపర్ ఓవర్'లో వెస్టిండీస్‌పై నెదర్లాండ్స్ సంచలన విజయం
- తేజ నిడమనూరు అద్భుత సెంచరీ
- వాన్ బీక్ 'సూపర్' ప్రదర్శన


హరారే: ఒకప్పుడు అన్ని జట్లను గడగడలాడించిన వెస్టిండీస్ జట్టు పరిస్థితి దయనీయంగా మారింది. ప్రపంచకప్ క్వాలిఫయింగ్ టోర్నీలో భాగంగా గ్రూప్ 'ఎ'లో జింబాబ్వే చేతిలో ఓడిన వెస్టిండీస్ జట్టుకు నెదర్లాండ్స్ జట్టు చేతిలోనూ పరాజయం తప్పలేదు. ముందుగా వెస్టిండీస్ 50 ఓవర్లలో 6 వికెట్లకు 374 పరుగులు సాధించింది. నికోలస్ పూరన్ (65 బంతుల్లో 104 నాటౌట్; 9 ఫోర్లు, 6 సిక్స్‌లు) అజేయ సెంచరీ చేశాడు. ఓపెనర్లు బ్రాండన్ కింగ్ (76; 13 ఫోర్లు), జాన్సన్ చార్లెస్ (54; 9 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీలు సాధించారు. 375 పరుగుల కష్టసాధ్యమైన లక్ష్యాన్ని ఛేదించడానికి బరిలోకి దిగిన నెదర్లాండ్స్ జట్టు 50 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి సరిగ్గా 374 పరుగులు చేయడంతో మ్యాచ్ 'టై'గా ముగిసింది. నెదర్లాండ్స్ జట్టుకు ఆడుతున్న ఆంధ్రప్రదేశ్‌కు చెందిన తేజ నిడమనూరు (76 బంతుల్లో 111; 11 ఫోర్లు, 3 సిక్స్‌లు) అసాధారణ ఆటతో సెంచరీ సాధించాడు. చివరి ఓవర్లో నెదర్లాండ్స్ విజయానికి 9 పరుగులు అవసరంకాగా ఆ జట్టు 8 పరుగులే చేయడంతో స్కోర్లు సమమయ్యాయి.

వాన్ బీక్ వండర్...

మ్యాచ్ 'టై' కావడంతో విజేతను నిర్ణయించడానికి 'సూపర్ ఓవర్' ఆడించారు. ఈ సూపర్ ఓవర్‌లో నెదర్లాండ్స్ బ్యాటర్ లోగాన్ వాన్ బీక్ చెలరేగిపోయాడు. జేసన్ హోల్డర్ వేసిన సూపర్ ఓవర్‌లో వాన్ బీక్ వరుసగా 4,6,4,6,6,4తో 30 పరుగులు సాధించాడు. ఈ క్రమంలో అంతర్జాతీయ వన్డే, టి20 క్రికెట్‌లో సూపర్ ఓవర్‌లో అత్యధిక పరుగులు సాధించిన జట్టుగా నెదర్లాండ్స్ రికార్డు సృష్టించింది. అనంతరం వాన్ బీక్ బౌలింగ్‌కు దిగి సూపర్ ఓవర్ వేశాడు. తొలి బంతిపై జాన్సన్ చార్లెస్ సిక్స్ కొట్టగా... తర్వాతి రెండు బంతులకు సింగిల్స్ వచ్చాయి. నాలుగో బంతికి చార్లెస్‌ను, ఐదో బంతికి రొమారియో షెఫర్డ్‌ను వాన్ బీక్ అవుట్ చేయడంతో వెస్టిండీస్ ఇన్నింగ్స్ 5 బంతుల్లో 8 పరుగుల వద్ద ముగిసింది. 22 పరుగుల తేడాతో నెదర్లాండ్స్ చిరస్మరణీయ విజయం సాధించింది. 'సూపర్ ఓవర్' నిబంధనల ప్రకారం ఓ జట్టు రెండు వికెట్లు చేజార్చుకుంటే ఇన్నింగ్స్ ముగుస్తుంది. సూపర్ ఓవర్‌లో 30 పరుగులు చేయడంతోపాటు 2 వికెట్లు తీసిన వాన్ బీక్ ఒంటిచేత్తో నెదర్లాండ్స్‌ను గెలిపించాడు.

అల్‌కరాజ్.. మళ్లీ నంబర్‌వన్

లండన్: అసోసియేషన్ ఆఫ్ టెన్నిస్ ప్రొఫెషనల్స్ (ఏటీపీ) పురుషుల సింగిల్స్ ర్యాంకింగ్స్‌లో స్పెయిన్ యువతార కార్లోస్ అల్‌కరాజ్ మళ్లీ నంబర్‌వన్ ర్యాంక్‌ను సొంతం చేసుకున్నాడు. ఆదివారం ముగిసిన క్వీన్స్‌క్లబ్ టోర్నీలో అల్‌కరాజ్ విజేతగా నిలిచాడు. గ్రాస్‌కోర్టులపై తొలిసారి టైటిల్ నెగ్గిన ఈ స్పెయిన్ స్టార్ ఈ క్రమంలో నంబర్‌వన్ ర్యాంక్‌లో ఉన్న సెర్బియా దిగ్గజం నొవాక్ జొకోవిచ్‌ను రెండో స్థానానికి పంపించాడు. ప్రస్తుతం అల్‌కరాజ్ ఖాతాలో 7,675 పాయింట్లు, జొకోవిచ్ ఖాతాలో 7,595 పాయింట్లు ఉన్నాయి. వీరిద్దరి మధ్య కేవలం 80 పాయింట్ల తేడా ఉండటంతో...జూలై 16న వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ ముగిశాక టాప్ ర్యాంక్ మళ్లీ తారుమారయ్యే అవకాశముంది. ఈనెల 11న ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్ సాధించాక జొకోవిచ్ నంబర్‌వన్ ర్యాంక్‌కు చేరుకొని రెండు వారాలపాటు ఈ స్థానంలో ఉన్నాడు. ఇక వింబుల్డన్ టోర్నీలో జొకోవిచ్ డిఫెండింగ్ చాంపియన్‌గా పోటీ పడనున్నాడు. గత ఏడాది అల్‌కరాజ్ ప్రిక్వార్టర్ ఫైనల్లో ఓడిపోయాడు. దాంతో ఈసారి వింబుల్డన్ టోర్నీలో వీరిద్దరు కనబరిచే ప్రదర్శన వారి తదుపరి ర్యాంకింగ్‌ను నిర్ధారించనుంది.



ఆసీస్‌దే విజయం

- మహిళల యాషెస్ సిరీస్ టెస్టులో ఇంగ్లండ్ ఓటమి
- 8 వికెట్లు తీసిన ఆసీస్ స్పిన్నర్ ఆష్లే గార్డ్‌నర్

నాటింగ్‌హమ్: ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ మహిళా జట్ల మధ్య జరుగుతున్న మల్టీ ఫార్మాట్ యాషెస్ సిరీస్‌లో ఆస్ట్రేలియా శుభారంభం చేసింది. మూడు ఫార్మాట్ల ఫలితాలతో విజేత ఖరారయ్యే ఈ సిరీస్‌లో ఆసీస్ అమ్మాయిలు ఏకైక టెస్టులో గెలిచి ఆధిక్యంలోకి వచ్చారు. ఇక ఈ యాషెస్ సిరీస్‌లో ఇంగ్లండ్ గెలవాలంటే తదుపరి జరిగే ఆరు మ్యాచ్‌ల్లో (మూడు టి20లు, మూడు వన్డేలు) ఐదింట గెలవాలి. సోమవారం ముగిసిన టెస్టులో ఆస్ట్రేలియా 89 పరుగుల తేడాతో ఇంగ్లండ్ జట్టును ఓడించింది. ఆసీస్ ఆఫ్ స్పిన్నర్ ఆష్లే గార్డ్‌నర్ (8/66) ఇంగ్లండ్‌ను దెబ్బ తీసింది. భారత స్పిన్నర్ నీతూ డేవిడ్ (8/53; 1995లో ఇంగ్లండ్‌పై) తర్వాత ఒకే ఇన్నింగ్స్‌లో 8 వికెట్లు తీసిన రెండో బౌలర్‌గా ఆష్లే నిలిచింది. 268 పరుగుల లక్ష్యంతో ఆఖరి రోజు 116/5తో ఆట కొనసాగించిన ఇంగ్లండ్ తొలి సెషన్‌లోనే ఆలౌటైంది. ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్ 49 ఓవర్లలో 178 పరుగుల వద్ద ముగిసింది. నాలుగో రోజు ఆటలోనే 3 కీలక వికెట్లు తీసిన ఆష్లే చివరి రోజు ఉదయం మరో ఐదు వికెట్లను పడగొట్టింది. ఈ టెస్టులో ఆమె మొత్తం 12 వికెట్లు (తొలి ఇన్నింగ్స్‌లో 4) పడగొట్టింది. తద్వారా మహిళల టెస్టు చరిత్రలో రెండో ఉత్తమ బౌలింగ్ గణాంకాలు నమోదు చేసింది. ఈ జాబితాలో పాక్ బౌలర్ షాయిజా ఖాన్ (2004లో విండీస్‌పై 13 వికెట్లు) అగ్రస్థానంలో ఉంది. తొలి ఇన్నింగ్స్‌ల్లో ఆసీస్ 473, ఇంగ్లండ్ 463 పరుగులు చేశాయి. రెండో ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా 257 పరుగులు చేసింది.


గార్డ్‌నర్

భారత్‌కు పతకాల పంట


అలివేలమ్మ

బెర్లిన్: స్పెషల్ ఒలింపిక్స్ వరల్డ్ గేమ్స్‌ను భారత జట్టు ఏకంగా 202 పతకాలతో ముగించింది. ఇందులో 76 స్వర్ణ పతకాలు, 75 రజత పతకాలు, 51 కాంస్య పతకాలు ఉన్నాయి. బుద్ధి మాంద్యంతో బాధపడుతున్న వారికి ప్రోత్సహించేందుకు స్పెషల్ ఒలింపిక్స్ పేరిట క్రీడలు నిర్వహిస్తారు. ఓవరాల్‌గా భారత్ నుంచి 198 మంది క్రీడాకారులు బరిలోకి దిగారు. ఆంధ్రప్రదేశ్ నుంచి గుజ్జల అలివేలమ్మ మహిళల టేబుల్ టెన్నిస్ డి–3 కేటగిరీ సింగిల్స్‌లో, డి02 డబుల్స్‌లో స్వర్ణ పతకాలు నెగ్గింది. బ్యాడ్మింటన్ సింగిల్స్ డబ్ల్యూ–7 కేటగిరీలో దూదేకుల షమీలా కాంస్య పతకం సాధించింది.

'ఎంసీసీ' కమిటీలో జులన్‌కు చోటు

లండన్: ప్రతిష్టాత్మక మెరిలిబోన్ క్రికెట్ క్లబ్ (ఎంసీసీ) వరల్డ్ క్రికెట్ కమిటీలో భారత మాజీ పేసర్ జులన్ గోస్వామికి స్థానం లభించింది. ఆమెతోపాటు ఇంగ్లండ్ మాజీ కెప్టెన్‌లు ఇయాన్ మోర్గాన్, హీతర్ నైట్‌లను కూడా కమిటీలోకి తీసుకున్నట్లు ఎంసీసీ చైర్మన్ మైక్ గ్యాటింగ్ వెల్లడించారు. క్రికెట్ నిబంధనలు రూపొందించే ఎంసీసీలో భాగమైన వరల్డ్ క్రికెట్ కమిటీ కొత్తగా వచ్చే సాంకేతిక అంశాలను, వాటిని ఉపయోగించడానికి సంబంధించి తగిన సూచనలు ఇవ్వడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఎంసీసీ ప్రధాన కేంద్రం లార్డ్స్ మైదానంలో ఉంది. లార్డ్స్‌లోనే జరిగిన ఫైనల్ మ్యాచ్‌లలో 2019 వన్డే వరల్డ్ కప్, 2017 వన్డే వరల్డ్ కప్‌లలో ఇంగ్లండ్ విజేతగా నిలిచింది. ఈ టీమ్‌లకు మోర్గాన్, హీతర్ నైట్ కెప్టెన్లుగా వ్యవహరించారు. గత ఏడాది ఇదే లార్డ్స్ మైదానంలో తన ఆఖరి వన్డే ఆడి జులన్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికింది. ఓవరాల్‌గా మూడు ఫార్మాట్‌లలో కలిపి 355 వికెట్లు పడగొట్టిన జులన్‌కు ఈ ఏడాదే ఎంసీసీ గౌరవ సభ్యత్వం దక్కింది.



సినిమా

త్వరలో టైటిల్

వరుణ్ తేజ్ హీరోగా శక్తి ప్రతాప్ సింగ్ హడా దర్శకత్వంలో తెలుగు, హిందీ భాషల్లో తెరకెక్కుతోన్న చిత్రం 'వీటీ 13' (వర్కింగ్ టైటిల్). సందీప్ ముద్ద నిర్మిస్తున్న ఈ సినిమా టైటిల్‌ని త్వరలో ప్రకటించనున్నారు. ''వాస్తవ ఘటనల స్ఫూర్తితో ఇండియన్ బిగ్గెస్ట్ ఎయిర్ ఫోర్స్ యాక్షన్ చిత్రంగా రూపొందుతున్న మూవీ ఇది. ఇందులో వరుణ్ తేజ్ ఐఏఎఫ్ అధికారిగా కనిపిస్తారు. ఈ చిత్రం లోని భారీ యాక్షన్ సీక్వెన్స్ చిత్రీకరించడానికి భారీ సెట్ రూపొందించాం. ఈ సీక్వెన్స్ కోసం వరుణ్ షూటింగ్‌లో జాయిన్ అయ్యారు. ఈ చిత్రం టైటిల్‌ను త్వరలో ప్రకటిస్తాం '' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రంలో మాజీ మిస్ యూనివర్స్ మానుషి చిల్లార్ రాడార్ ఆఫీసర్ పాత్రలో నటిస్తున్నారు.


● వరుణ్ తేజ్


పాత్రలే దెయ్యాలైతే..!

కాజల్, రెజీనా, జననీ అయ్యర్ ముఖ్య తారలుగా నటించిన తమిళ చిత్రం 'కరుంగాప్పియం'. డి. కార్తికేయన్ (డీకే) దర్శకత్వం వహించారు. వెంకట సాయి ఫిల్మ్స్ పతాకంపై ముత్యాల రామదాసు సమర్పణలో టి. జనార్దన్ 'కార్తీక' పేరుతో ఈ చిత్రాన్ని తెలుగులో రిలీజ్ చేయనున్నారు. ఈ సందర్భంగా ముత్యాల రాందాస్, టి. జనార్దన్ మాట్లాడుతూ– ''జూలై 7న ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నాం. ఇందులో ఐదుగురు వ్యక్తుల జీవితాలను చూపించే క్రమంలో రెజీనా లైబ్రరీలో వందేళ్ల క్రితం నాటి కాటుక బొట్టు అనే బుక్ చదువుతుంది. భవిష్యత్‌లో ఏం జరుగుతుందో చెప్పే బుక్ అది. అయితే అందులోని పాత్రల గురించి చదువుతున్నప్పుడు అవి దెయ్యాలుగా మారి ఆమె ముందుకు వస్తాయి. ఇక తనకు హాని కలిగించిన వ్యక్తులపై దెయ్యంగా మారి పగ తీర్చుకునే పాత్రను కాజల్ చేశారు. జనని పాత్ర కూడా అలరించే విధంగా ఉంటుంది. హారర్ సస్పెన్స్ థ్రిల్లర్ కథాంశంతో ఈ చిత్రాన్ని డీకే అద్భుతంగా తెరకెక్కించారు'' అన్నారు.


● రెజీనా

నేను ఎరేసి వేటాడతా

జగపతిబాబు, మమతా మోహన్ దాస్, విమలా రామన్, ఆశిష్ గాంధీ, గానవి లక్ష్మణ్, 'బాహుబలి' ప్రభాకర్, ఆర్‌ఎస్ నంద ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'రుద్రంగి'. 'బాహుబలి, ఆర్ఆర్ఆర్' చిత్రాలకు డైలాగ్స్ రాసిన అజయ్ సామ్రాట్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ నిర్మించిన ఈ సినిమా జూలై 7న విడుదలకానుంది. తాజాగా ఈ చిత్రం ట్రైలర్‌ని యూనిట్ విడుదల చేసింది. తెలంగాణ చారిత్రక నేపథ్య కథతో పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా రూపొందిన ఈ మూవీలో భీమ్ రావ్ దొరగా జగపతిబాబు, జ్వాలా భాయిగా మమతా మోహన్ దాస్, మల్లేష్‌గా ఆశిష్ గాంధీ నటించారు. 'ఒకడు ఎదురుపడి వేటాడతాడు.. ఒకడు వెంటపడి వేటాడతాడు.. నేను ఎరేసి వేటాడతా' అంటూ జగపతిబాబు చెప్పే డైలాగ్స్‌తో ట్రైలర్ సాగుతుంది. ఈ చిత్రానికి కెమెరా: సంతోష్ శనమోని, సంగీతం: నాఫల్ రాజా.


● జగపతిబాబు

నిజాలను చూడటం కష్టం!


● సోనమ్ కపూర్

''కొన్నిసార్లు నిజాలను చూడటం చాలా కష్టం.. మరి మీరు ఆమె చీకటి ప్రపంచాన్ని చూడ్డానికి రెడీ అవుతారా?'' అంటూ సోనమ్ కపూర్ నటించిన తాజా చిత్రం 'బ్లైండ్' విడుదల తేదీని ప్రకటించారు. జూలై 7 నుంచి ఈ చిత్రం ఓ ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో స్ట్రీమింగ్ కానుంది. కొరియన్ మూవీ 'బ్లైండ్'కి రీమేక్‌గా రూపొందిన ఈ చిత్రంలో సోనమ్ అంధురాలిగా నటించారు. ఓ సీరియల్ కిల్లర్‌ను పట్టుకోడానికి ఓ లేడీ పోలీసాఫీసర్ చేసే ప్రయత్నం నేపథ్యంలో ఈ సినిమా సాగుతుంది. బ్లైండ్ పోలీసాఫీసర్‌గా సోనమ్ అద్భుతంగా నటించారని చిత్ర యూనిట్ పేర్కొంది.. షోమ్ మఖీజా దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందింది. కాగా ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో సోనమ్ కనిపించనున్న తొలి చిత్రం ఇదే కాగా, తల్లయ్యాక (గత ఏడాది ఆగస్టు 20న ఓ బాబుకి జన్మనిచ్చారు) కనిపించనున్న చిత్రం కూడా ఇదే అవుతుంది.

నిర్మాతగా ఉండాలంటే కష్టం - శ్రీకాంత్


● భరత్ కొమ్మాలపాటి, శ్రీకాంత్, అభినవ్

''అభినవ్ సర్దార్ చాలా రంగాల్లో విజయం సాధించాడు. ఇండస్ట్రీలో నిర్మాతగా ఉండాలంటే కష్టం. కానీ, 'మిస్టేక్' కథని నమ్మి సర్దార్ నిర్మాతగా మారాడు. ఈ మధ్య చిన్న సినిమాలు మంచి సక్సెస్ సాధిస్తున్నాయి. ట్రైలర్ చూశాక 'మిస్టేక్' కూడా మంచి విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది'' అని హీరో శ్రీకాంత్ అన్నారు. భరత్ కొమ్మాలపాటి దర్శకత్వం వహించిన చిత్రం 'మిస్టేక్'. అభినవ్ సర్దార్ హీరోగా నటించి, నిర్మించిన ఈ సినిమా విడుదలకు సిద్ధంగా ఉంది. ఈ చిత్రం ట్రైలర్‌ని శ్రీకాంత్ విడుదల చేశారు. ''భరత్ చెప్పిన కథపై నమ్మకంతో 'మిస్టేక్' సినిమా నిర్మించాను'' అన్నారు అభినవ్ సర్దార్. ''జూలైలో ఈ చిత్రం విడుదలకి సన్నాహాలు చేస్తున్నాం'' అన్నారు భరత్ కొమ్మాలపాటి.

ఇకపై భాగ్ సాలే సినిమా గుర్తొస్తుంది - హీరో కార్తికేయ


● కార్తికేయ, శ్రీసింహా, కాలభైరవ

''భాగ్ సాలే ట్రైలర్ వినోదాత్మకంగా ఉంది. ఇప్పటిదాకా భాగ్ సాలే అంటే మహేశ్ బాబుగారి పాట గుర్తుకొచ్చేది. ఇకపై భాగ్ సాలే అంటే ఈ సినిమా గుర్తొస్తుంది. శ్రీ సింహాకి 'భాగ్ సాలే' పెద్ద హిట్ ఇవ్వాలి'' అని హీరో కార్తికేయ అన్నారు. శ్రీ సింహా కోడూరి హీరోగా, నేహా సోలంకి, నందినీ రాయ్ హీరోయిన్లుగా ప్రణీత్ బ్రహ్మాండపల్లి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'భాగ్ సాలే'. అర్జున్ దాస్యన్, యష్ రంగినేని, కల్యాణ్ సింగనమల నిర్మించిన ఈ చిత్రం జూలై 7న విడుదలకానుంది. హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో ఈ చిత్రం ట్రైలర్‌ను కార్తికేయ విడుదల చేశారు. ''క్రైమ్ కామెడీగా రూపొందిన చిత్రమిది'' అన్నారు అర్జున్ దాస్యన్. ''ఇది హైదరాబాద్ బెస్ట్ మూవీ. మంచి ఇరానీ చాయ్‌లాంటి సినిమా'' అన్నారు ప్రణీత్ బ్రహ్మాండపల్లి. ''ఈ చిత్రంలో అర్జున్ అనే టక్కరి దొంగ పాత్ర చేశాను. విలువైన ఉంగరం దొరకడం వల్ల అర్జున్ జీవితం ఎలాంటి మలుపులు తిరిగింది? అనేది ఆసక్తిగా ఉంటుంది'' అన్నారు శ్రీ సింహా.


● సుహానా ఖాన్

తండ్రి నిర్మాత.. కుమార్తె కథానాయిక


● షారుక్

'అలాంటి ఇలాంటి లాంచింగ్ కాదు.. ఓ రేంజ్‌లో ఉండాలి' అన్నట్లు కుమార్తె సుహానా ఖాన్ వెండితెర అరంగేట్రానికి షారుక్ ఖాన్ రంగం సిద్ధం చేస్తున్నారట. ఇప్పటికే సుహానా నటిగా మేకప్ వేసుకుంది. జోయా అక్తర్ దర్శకత్వంలో 'ది ఆర్చీస్' అనే సినిమాలో నటిస్తోంది. ఈ చిత్రం ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో త్వరలో స్ట్రీమింగ్ కానుంది. ఈలోపు సుహానా వెండితెరపై పరిచయం కావడానికి ఓ సినిమా సైన్ చేసిందని సమాచారం. కుమార్తె అరంగేట్రం అట్టహాసంగా జరగాలనే ఆలోచనతో తనకు ఇటీవల 'పఠాన్'లాంటి హిట్ ఇచ్చిన దర్శకుడు సిద్ధార్థ్ ఆనంద్‌తో కలిసి ఈ చిత్రాన్ని నిర్మించాలని షారుక్ అనుకుంటున్నారట. అది మాత్రమే కాదు.. అతిథి పాత్ర కూడా చేయాలని అనుకుంటున్నారట. ప్రస్తుతం కథ రెడీ అవుతోందని సమాచారం. ఇంకా దర్శకుడి ఎంపిక జరగలేదని టాక్.

సర్కిల్‌లోనూ ఆ ప్రయత్నం కొనసాగించా - నీలకంఠ


● నీలకంఠ, రిచా, సాయి రోనక్, అర్షిణ్

''నా సినిమాల్లో హీరోయిన్ పాత్రలకు ప్రాధాన్యత ఇస్తాను. 'షో'లో మంజుల, 'మిస్సమ్మ'లో లయ, భూమిక, 'సదా మీ సేవలో' చిత్రంలో శ్రియ.. ఇలా నా హీరోయిన్ల క్యారెక్టర్స్ బాగుంటాయని అందరూ చెబుతారు. 'సర్కిల్'లోనూ ఆ ప్రయత్నాన్ని కొనసాగించాను. ఈ సినిమాలో అరుంధతి పాత్రలో రిచా పనై కొత్తగా కనిపిస్తుంది. అర్షిణ్, సాయి రోనక్, బాబా భాస్కర్ కూడా చక్కగా నటించారు'' అని డైరెక్టర్ నీలకంఠ అన్నారు. సాయి రోనక్, బాబా భాస్కర్, అర్షిణ్ మెహతా, రిచా పనై, నైనా కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'సర్కిల్'. నీలకంఠ దర్శకత్వంలో ఎమ్.వి శరత్ చంద్ర, టి. సుమలత అన్నిత్ రెడ్డి, వేణుబాబు అడ్డగడ నిర్మించిన ఈ చిత్రం జూలై 7న రిలీజ్ కానుంది. ఈ చిత్రం ట్రైలర్‌ను విడుదల చేశారు. ''నీలకంఠగారితో పని చేయడం ఒక ఛాలెంజ్. ఈ సినిమా షూటింగ్‌ని ఎంజాయ్ చేశాను'' అన్నారు సాయి రోనక్. ''ఇదొక డిఫరెంట్ మూవీ.. ప్రేక్షకులు ఆదరించాలి'' అన్నారు శరత్ చంద్ర.

సరికొత్త ప్రేమకథ

ఆర్యన్ గౌర, మిస్తీ చక్రవర్తి జంటగా దివ్య భావన దర్శకత్వం వహించిన చిత్రం 'ఓ సాథియా'. చందన కట్టా, సుభాష్ కట్టా నిర్మించిన ఈ చిత్రం జూలై 7న విడుదలవుతోంది. ఈ చిత్రం ట్రైలర్‌ని నిర్మాత కేఎస్ రామారావు విడుదల చేసి, ''సినిమా పెద్ద హిట్టవ్వాలి'' అన్నారు. ''ఆర్యన్ గౌర తన గురించి చెప్పుంటే నా తొలి సినిమా కష్టాలు గుర్తొచ్చాయి'' అన్నారు డైరెక్టర్ త్రినాథ రావు నక్కిన. ''మా సినిమా చూసి ప్రేక్షకులు చక్కని చిరునవ్వుతో థియేటర్ నుంచి బయటికొస్తారు'' అన్నారు ఆర్యన్ గౌర. ''నా గురువు విజయేంద్ర ప్రసాద్ గారివల్లే నేను ఇక్కడ ఉన్నాను. సరికొత్త ప్రేమకథగా రూపొందించిన చిత్రం 'ఓ సాథియా'' అన్నారు దివ్య భావన. ''మా సినిమా చూశాక అందరికీ తమ తొలి ప్రేమ గుర్తుకొస్తుంది'' అన్నారు సుభాష్ కట్టా.


● మిస్తీ, ఆర్యన్ గౌర

స్టాక్ మార్కెట్లు				
దేశీ సూచీలు		విదేశీ సూచీలు (సోమవారం రాత్రి 11.00 గంటలకు)		
సెన్సెక్స్ ▽ 9 62,970	నిఫ్టీ △ 26 18,691	నాస్‌డాక్	13,383 ▽	110
		డోజోన్స్	33,776 △	48
		ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,454 ▽	8
		డాక్స్	15,813 ▽	17
		షాంఘై	3,152 ▽	47
		నికాయ్	32,699 ▽	83

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ (రూ.లలో) ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	58,726
బంగారం (99.5 స్వచ్ఛత)	58,491
వెండి (కేజీ)	69,392

పల్లెపల్లెకూ ఫార్మసీ స్టోర్!



వెయ్యి మంది జనాభా ఉంటే చాలు
- తెరుచుకుంటున్న ఔషధ దుకాణం
- మెరుగుపడిన వైద్య వసతులు
- పెరిగిన జీవనశైలి వ్యాధులు
- పల్లెల్లోనూ అధిక ఔషధ వినియోగం

న్యూఢిల్లీ: మారిన జీవనశైలి, ఆహార నియమాలతో పట్టణం, పల్లె అని వ్యత్యాసం లేకుండా ప్రజలు పలు రకాల అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా మధుమేహం, రక్తపోటు, థైరాయిడ్ తదితర జీవనశైలి వ్యాధులు పెరిగిపోయాయి. దీనికితోడు వైద్య వసతులు పెరగడంతో పల్లెల్లోనూ ఔషధ విక్రయాలు పెద్ద ఎత్తున సాగుతున్నాయి. దీంతో ఫార్మసీ స్టోర్లు జోరుగా తెరుచుకుంటున్నాయి. ముఖ్యంగా కరోనా అనంతరం ప్రజల్లో ఆరోగ్యం పట్ల ఏర్పడిన అవగాహన సైతం ఔషధ వినియోగాన్ని పెంచింది. కేంద్ర ప్రభుత్వ ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య పథకం, ఏటా మార్కెట్లోకి పెద్ద సంఖ్యలో ఫార్మాసిస్టులు రావడం కూడా ఔషధ దుకాణాల సంఖ్య విస్తరణకు మద్దతుగా ఉంటున్నాయి. ఏటా 4,50,000 మంది ఫార్మసీ గ్రాడ్యుయేషన్ పూర్తి చేస్తుంటే, ఇందులో 40,000–45,000 వరకు సొంతంగా దుకాణాలను తెరుస్తున్నట్టు ఆల్ ఇండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ జనరల్ సెక్రటరీ రాజీవ్ సింఘాల్ తెలిపారు. దేశంలో 12 లక్షల మంది ఫార్మాసిస్టులకు ఈ సంస్థ ప్రాతినిధ్యం వహిస్తోంది. ''ఫార్మాసిస్టులు పల్లె బాట పడుతున్నారు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు కనీసం 1,000–2,000 మంది జనాభా ఉన్న ప్రతి ఊరులోనూ ఫార్మసీ స్టోర్ ఉంది''అని సింఘాల్ వెల్లడించారు. కరోనా మహమ్మారి తర్వాత ప్రజలు తమ ఆరోగ్య సమస్యల విషయంలో శ్రద్ధ చూపిస్తున్నారని, క్రమం తప్పకుండా ఔషధాలు తీసుకుంటున్నట్టు చెప్పారు.

ఆయుష్మాన్ భారత్ పథకం

పల్లెలు, చిన్న పట్టణాల్లో ఔషధ విక్రయాలు పెరగానికి ఆయుష్మాన్ భారత్ ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన కీలకంగా పనిచేస్తోంది. ఈ పథకం కింద 26,055 నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో 4.3 కోట్ల మంది చేరి వైద్యం పొందినట్టు 2022–23 ఆర్థిక సర్వే వెల్లడించింది. దేశవ్యాప్తంగా 1,54,070 ఆయుష్మాన్ భారత్ హెల్త్ అండ్ వెల్‌నెస్ కేంద్రాలు నడుస్తున్నాయి. ఈ కేంద్రాలు ప్రిస్క్రిప్షన్‌ను జారీ చేస్తే ఔషధాలను ప్రభుత్వ చానళ్ల ద్వారా లేదంటే ప్రైవేటు ఫార్మసీ స్టోర్లలో కొనుగోలు చేసుకుంటున్నట్టు సింఘాల్ తెలిపారు. దీంతో మారుమూల ప్రాంతాల్లోనూ ఔషధాలకు డిమాండ్ ఏర్పడినట్టు చెప్పారు. భారత ఫార్మా మార్కెట్‌లో టైర్–2 నుంచి టైర్–6 వరకు పట్టణాల వాటా 21 శాతంగా ఉంటుందని అంచనా. ఔషధాలకు డిమాండ్ ఏర్పడడంతో ఫార్మసీ కంపెనీలు సైతం మార్కెటింగ్ సిబ్బందిని చిన్న పట్టణాల్లోనూ మోహరిస్తున్నాయి. క్షేత్రస్థాయిలో సిబ్బందిని పెంచుకుంటున్నాయి. తమకున్న విస్తృత నెట్‌వర్క్‌తో దేశవ్యాప్తంగా ఎక్కువ ప్రాంతాల్లో అందుబాటు ధరలకే నాణ్యమైన ఔషధాలను అందిస్తున్నట్టు సన్‌ఫార్మా ప్రతినిధి తెలిపారు. ''నేను దేశవ్యాప్తంగా విస్తృతంగా పర్యటించి ప్రజలు, మా కంపెనీ స్టాకిస్టులు, అమ్మకాల సిబ్బందితో మాట్లాడాను. రహదారులు, ఆస్పత్రులు, విద్యుత్ తదితర సదుపాయాల విస్తరణతో ప్రజలు తమ స్వస్థలాల్లోనే ఉండాలనుకుంటున్నారు. మెట్రో పట్టణాలకు రావాలని అనుకోవడం లేదు. కరోనా తర్వాత సొంత గ్రామాల్లోనే ఉండాలన్నది వారి అభీష్టంగా ఉంది''అని మ్యాన్ కైండ్ ఫార్మా వైస్ చైర్మన్, ఎండీ రాజీవ్ జునేజా వివరించారు. ఆయుష్మాన్ భారత్ పథకం సైతం అమ్మకాలు పెరగడానికి తోడ్పడుతున్నట్టు తెలిపారు. చిన్న పట్టణాల్లోనూ వైద్యుల అందుబాటు పెరిగినట్టు ఎరిస్ లైఫ్ సైన్సెస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వి కృష్ణకుమార్ పేర్కొన్నారు. ''మాకు 140 పాయింట్ ఆఫ్ ప్రెజెన్స్ ఉన్నాయి. ఒక్కోటీ చుట్టుపక్కల 50 కిలోమీటర్ల పరిధిని కవర్ చేస్తుంది. ఈ పాయింట్లను 300కు పెంచుతున్నాం. దేశంలో 85 శాతం ప్రాంతాలను చురుకోగలం''అని వివరించారు.

సవాళ్ల మధ్య ఆశావహంగా భారత్

- భవిష్యత్తులోకి దూసుకెళ్లేందుకు సిద్ధం
- హెచ్‌యూఎల్ చైర్మన్ నితిన్ పరాంజపే



న్యూఢిల్లీ: అంతర్జాతీయంగా సవాళ్ల మధ్య భారత్ కాంతిరేఖలా వెలుగొందుతోందని, ఆశావహంగా కనిపిస్తోందని ఎఫ్‌ఎంసీజీ దిగ్గజం హెచ్‌యూఎల్ చైర్మన్ నితిన్ పరాంజపే వ్యాఖ్యానించారు. భవిష్యత్తులోకి దూసుకెళ్లేందుకు భారత్ సిద్ధంగా ఉందన్నారు. అయితే, ఉద్యోగాల కల్పన, వ్యవసాయ ఉత్పాదకత వంటి సవాళ్లను తప్పక పరిష్కరించుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. సంస్థ వార్షిక సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న సందర్భంగా పరాంజపే ఈ విషయాలు తెలిపారు. గత దశాబ్దకాలంగా భారత్ అత్యంత వేగంగా ఎదుగుతున్న ఎకానమీగా నిలుస్తోందని, త్వరలోనే జపాన్, జర్మనీలను కూడా అధిగమించి ప్రపంచంలోనే మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థ హోదాను దక్కించుకోగలదని ఆయన చెప్పారు. 2047 నాటికి అధిక ఆదాయ దేశంగా ఎదగాలన్న లక్ష్యాన్ని చేరుకోవడం సాధ్యమేనని పరాంజపే పేర్కొన్నారు. పెరుగుతున్న వినియోగం, డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, పెట్టుబడులు, కొత్త ఆవిష్కరణల సంస్కృతి, పెద్ద సంఖ్యలో యువజనాభా మొదలైన సానుకూలతలు ఇందుకు దోహదపడగలవన్నారు. ప్రస్తుతం 66% జనాభా 35 ఏళ్ల వయస్సు లోపు వారేనని, 40% మంది 13–35 ఏళ్ల మధ్యలో ఉన్న వారని పరాంజపే తెలిపారు. పెరిగే యువ జనాభాతో పాటు భారత్‌లో వినియోగం కూడా గణనీయంగా పెరుగుతోందని ఆయన చెప్పారు.

సెన్సెక్స్‌కు నష్టం.. నిఫ్టీకి లాభం..!

- ఇంట్రాడేలో పరిమిత శ్రేణిలో ట్రేడింగ్
- ప్రపంచ ప్రతికూల పరిస్థితుల ప్రభావం



ముంబై: ట్రేడింగ్ ఆద్యంతం తీవ్ర ఒడిదుడుకులకు లోనవుతూ.., పరిమిత శ్రేణిలో కదలాడిన స్టాక్ సూచీలు సోమవారం మిశ్రమంగా ముగిశాయి. ప్రపంచ మార్కెట్ల నుంచి బలహీన సంకేతాలు అందడంతో అధిక వెయిటేజీ రిలయన్స్, హెచ్‌డీఎఫ్‌సీ ద్వయం, టీసీఎస్ షేర్లు ఒకశాతం నష్టపోయి సెంటిమెంట్‌పై మరింత ఒత్తిడి పెంచాయి. ఉదయం సెన్సెక్స్ 33 పాయింట్లు నష్టపోయి 62,946 వద్ద మొదలైంది. ట్రేడింగ్‌లో 282 పాయింట్ల పరిధిలో 62,854 వద్ద కనిష్టాన్ని, 63,136 వద్ద గరిష్టాన్ని నమోదు చేసింది. చివరికి తొమ్మిది పాయింట్ల నష్టంతో 62,970 వద్ద స్థిరపడింది. నిఫ్టీ ఒక పాయింటు పెరిగి 18,666 వద్ద ట్రేడింగ్‌ను ప్రారంభించింది. రోజంతా 18,647 – 18,722 శ్రేణిలో ట్రేడైంది. ఆఖరికి 26 పాయింట్ల స్వల్పలాభంతో 18,691 వద్ద నిలిచింది. ప్రభుత్వరంగ బ్యాంకులు, ఇంధన షేర్లు నష్టాలను చవిచూశాయి. ఆటో, ఐటీ, ఫార్మా, మెటల్, ఎఫ్‌ఎంసీజీ రంగాలకు చెందిన చిన్న, మధ్య తరహా షేర్లు రాణించడంతో బీఎస్‌ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు 1.04%, 0.71 శాతం చొప్పున లాభపడ్డాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.409 కోట్ల షేర్లను విక్రయించగా.., సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.250 కోట్లు నష్టపోయారు. డాలర్ మారకంలో రూపాయి విలువ ఎనిమిది పైసలు నష్టపోయి 82.04 వద్ద ముగిసింది. ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు బలహీనంగా ట్రేడవుతున్నాయి.

సేవా సంస్థలకు పన్ను నిబంధనల్లో మార్పులు



న్యూఢిల్లీ: సామాజిక సేవా సంస్థలు వెల్లడించాల్సిన వివరాల నిబంధనలను ఆదాయపన్ను శాఖ సవరించింది. ఈ మార్పులు అక్టోబర్ ఒకటి నుంచి అమల్లోకి రానున్నాయి. ఇక మీదట చారిటబుల్ సంస్థలు తమ కార్యకలాపాలు ధార్మికమైనవా లేదా మతపరమైనవా లేక మతపరమైన సేవా కార్యక్రమాల కిందకు వస్తాయా? అన్నది వెల్లడించాల్సి ఉంటుంది. ఒకరోజులో రూ.2 లక్షలకు మించి ఎవరైనా విరాళం ఇస్తే ఆ వివరాలను ఆదాయపన్ను శాఖకు తెలియజేయాలి. చెల్లించిన వ్యక్తి, చిరునామా, పాన్ నంబర్ ఇవ్వాలి. ఆదాయపన్ను చట్టంలో ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం మార్పులు చేసింది.

సెప్టెంబర్ నాటికి ఆడిట్ పూర్తి

ఇన్వెస్టర్లకు బైజూస్ హామీ



న్యూఢిల్లీ: 2021–22 ఆర్థిక సంవత్సరానికి గాను సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న ఖాతాల ఆడిట్ ఈ ఏడాది సెప్టెంబర్ నాటికి పూర్తి కాగలదని ఎడ్‌టెక్ దిగ్గజం బైజూస్ సీఈవో బైజూ రవీంద్రన్.. ఇన్వెస్టర్లకు హామీ ఇచ్చారు. అలాగే 2023 ఆర్థిక సంవత్సరం ఆర్థిక ఫలితాలు డిసెంబర్ నాటికి పూర్తి కాగలవని షేర్‌హోల్డర్లతో కాన్ఫరెన్స్ కాల్ సందర్భంగా పేర్కొన్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. గతంలో తప్పిదాలు జరిగాయని అంగీకరించిన రవీంద్రన్.. వాటి నుంచి చాలా పాఠాలు నేర్చుకున్నట్లు చెప్పారు. అటు బోర్డు సభ్యుల రాజీనామా విషయం కూడా వాస్తవమేనని, కానీ కంపెనీ ఇంకా వాటిని ఆమోదించలేదని తెలిపారు. ఈలోగానే రాజీనామా వార్తలు లీకయ్యాయని పేర్కొన్నారు. కొత్తగా నియమితులైన సీఎఫ్‌వో అజయ్ గోయల్‌ను రవీంద్రన్ పరిచయం చేశారు. రాజీనామా చేసిన ముగ్గురు డైరెక్టర్లు కూడా సమావేశంలో పాల్గొన్నట్లు సమాచారం. ఆడిటర్లు వైదొలగడం, తమ రాజీనామాలు రెండూ వేర్వేరు అంశాలని వారు చెప్పినట్లు సంబంధిత వర్గాలు వివరించాయి. సంస్థలోని వివిధ విభాగాలు మెరుగ్గానే పనిచేస్తున్నాయని, గ్రూప్ కౌన్సిల్‌తో కలిసి కొత్త సీఎఫ్‌వో సంస్థను మరింత పటిష్టం చేయగలరని రవీంద్రన్ తెలిపినట్లు పేర్కొన్నాయి. 2022 ఆర్థిక సంవత్సర ఫలితాలను ఇంకా వెల్లడించకపోవడం, ఆడిటర్లు.. డైరెక్టర్లు రాజీనామా చేయడం, 1 బిలియన్ డాలర్ల రుణాల చెల్లింపుపై వివాదం నెలకొనడం తదితర సవాళ్లతో బైజూస్ సతమతమవుతున్న సంగతి తెలిసిందే.

ఏపీలో ఎన్‌ఎండీసీ రూ. 500 కోట్ల వ్యయం

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మైనింగ్ దిగ్గజం ఎన్‌ఎండీసీ.. ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లాలో ఉన్న బంగారు గని కోసం రూ.500 కోట్లు వ్యయం చేసే అవకాశం ఉందని సమాచారం. గుడుపల్లి మండలంలో ఏడు గ్రామాల్లో విస్తరించిన ఈ గోల్డ్ బ్లాక్‌కు సంబంధించిన లీజును ఎన్‌ఎండీసీ త్వరలో దక్కించుకోనుంది. ప్రాజెక్ట్ విషయమై గతేడాది చివరలో ఏపీ ప్రభుత్వంతో ఎన్‌ఎండీసీ చేతులు కలిపింది. నిబంధనల ప్రకారం లెటర్ ఆఫ్ ఇంటెంట్‌పై సంతకం చేసిన మూడేళ్లలో మైనింగ్ లీజు పొందాల్సి ఉంటుంది. ఈ గనిలో 18.3 లక్షల టన్నుల బంగారు ఖనిజం ఉన్నట్టు అంచనా. టన్నుకు 5.15 గ్రాముల పుత్తడి వెలికితీయవచ్చని ఎన్‌ఎండీసీ భావిస్తోంది.

అసోచాం ఏపీ, తెలంగాణ చైర్మన్‌గా రవికుమార్‌రెడ్డి



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: అసోసియేటెడ్ చాంబర్స్ ఆఫ్ కామర్స్, ఇండస్ట్రీ ఆఫ్ ఇండియా (అసోచాం) ఆంధ్రప్రదేశ్, తెలంగాణ స్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్స్ చైర్మన్‌గా యాక్సిస్ ఎనర్జీ గ్రూప్ సీఎండీ కటారు రవికుమార్‌రెడ్డి ఎన్నికయ్యారు. 2023–24 సంవత్సరానికిగాను ఆయన ఈ పదవిలో ఉంటారు.

విద్య, ఉద్యోగ సమాచారం

ఇండియన్ ఆర్మీలో 62వ, 33వ షార్ట్ సర్వీస్ కమిషన్(టెక్నికల్) కోర్సు

ఇండియన్ ఆర్మీ 62వ, 33వ షార్ట్ సర్వీస్ కమిషన్(ఎస్ఎస్‌సీ) కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి అర్హులైన అవివాహిత పురుష, మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది. ఈ కోర్సు ఏప్రిల్ 2024లో చెన్నైలోని ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీలో ప్రారంభం కానుంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 196
» **పోస్టుల వివరాలు:** 62వ షార్ట్ సర్వీస్ కమిషన్ (టెక్) పురుషులు–175, 33వ షార్ట్ సర్వీస్ కమిషన్ (టెక్) మహిళలు–19,ఎస్ఎస్‌సీ డబ్ల్యూ టెక్–01, ఎస్ఎస్‌సీ డబ్ల్యూ నాన్ టెక్–01.
» **విభాగాలు: ఇంజనీరింగ్ స్ట్రీమ్:** సివిల్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, మెకానికల్, ఇతర ఇంజనీరింగ్ స్ట్రీమ్స్.
» **అర్హత:** బీఈ, బీటెక్/ఏదైనా విభాగంలో డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 01.04.2024 నాటికి 20 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి.
» **పే స్కేల్:**రూ.56,100 నుంచి రూ.1,77,500.
» **ఎంపిక విధానం:** దరఖాస్తుల షార్ట్‌లిస్ట్, స్టేజ్–1, స్టేజ్–2 ఎగ్జామినేషన్, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 19.07.2023.
» **కోర్సు ప్రారంభం:** ఏప్రిల్ 2024.
» **వెబ్‌సైట్:** www.joinindianarmy.nic.in

డీఆర్‌డీవో-ఏఎస్ఎల్, హైదరాబాద్‌లో 13 జూనియర్ రీసెర్చ్ ఫెలోలు

హైదరాబాద్‌లోని డీఆర్‌డీవో–అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ ల్యాబొరేటరీ.. జూనియర్ రీసెర్చ్ ఫెలోల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 13;
» **నెలవారీ స్టైపెండ్:** రూ.31,000.
» **విభాగాలు:** మెకానికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్.
» **అర్హత:** బీఈ/బీటెక్ ఉత్తీర్ణతతోపాటు వ్యాలిడ్ గేట్ స్కోరు సాధించి ఉండాలి.
» **వయసు:** 28 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష/ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** ఎంప్లాయ్‌మెంట్ న్యూస్‌లో ప్రకటన ప్రచురితమైన తేదీ నుంచి 21 రోజుల్లోగా దరఖాస్తు చేసుకోవాలి.
» **వెబ్‌సైట్:** www.drdo.gov.in

నల్సార్ యూనివర్శిటీలో పీహెచ్‌డీ ప్రవేశాలు

హైదరాబాద్‌లోని నల్సార్ యూనివర్శిటీ ఆఫ్ లా.. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి పీహెచ్‌డీ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం సీట్ల సంఖ్య:** 15
» **విభాగాలు:**లా,సోషల్ సైన్సెస్, మేనేజ్‌మెంట్.
» **అర్హత:** 55 శాతం మార్కులతో సంబంధిత విభాగంలో పీజీ లేదా కంపెనీ సెక్రటరీ ఎగ్జామ్/ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా ఫైనల్ ఎగ్జామ్ ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులు.
» **ఎంపిక విధానం:** ప్రవేశ పరీక్ష ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 07.07.2023.
» **ఆన్‌లైన్ ప్రవేశ పరీక్ష తేది:** 15.07.2023.
» **వెబ్‌సైట్:** www.nalsar.ac.in

సీఈఎస్ఎస్, హైదరాబాద్‌లో పీహెచ్‌డీ ప్రవేశాలు

హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీస్(సీఈఎస్ఎస్).. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి తెలంగాణ యూనివర్శిటీ (నిజామాబాద్) సహకారంతో రెగ్యులర్ పీహెచ్‌డీ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం సీట్ల సంఖ్య:** 12
» **విభాగాలు:** ఎకనామిక్స్, సోషియాలజీ/ఆంత్రోపాలజీ/సోషల్ వర్క్, డెవలప్‌మెంట్ స్టాటిస్టిక్స్, పొలిటికల్ సైన్స్/పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, కామర్స్/బిజినెస్ మేనేజ్‌మెంట్.
» **అర్హత:** సంబంధిత సబ్జెక్టులో కనీసం 55 శాతం మార్కులతో పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీ లేదా ఎంఫిల్ ఉత్తీర్ణులై ఉండాలి.
» **ఎంపిక విధానం:** ప్రవేశపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 09.07.2023
» **ప్రవేశ పరీక్ష తేది:** 27.07.2023
» **వెబ్‌సైట్:** www.cess.ac.in

పచ్చని కెరీర్‌కు అగ్రి కోర్సులు

» తెలంగాణ అగ్రికల్చర్ యూనివర్సిటీలో పలు కోర్సులు
» ఎంసెట్ బైపీసీ, ఎంపీసీ స్ట్రీమ్ ర్యాంకు ఆధారంగా ప్రవేశాలు
» హార్టికల్చర్, వెటర్నరీ యూనివర్సిటీల్లోనూ కోర్సులు
» పీజేటీఎస్ఏయూ ఆధ్వర్యంలో ఉమ్మడి కౌన్సెలింగ్
» 2023 సంవత్సరానికి మొదలైన దరఖాస్తు ప్రక్రియ


కెరీర్ గైడెన్స్

అగ్రికల్చర్, అగ్రికల్చర్ అనుబంధ కోర్సులు, హార్టికల్చర్, వెటర్నరీ కోర్సుల్లో ప్రవేశాలకు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చర్ యూనివర్సిటీ (పీజేటీఎస్ఏయూ).. ఉమ్మడి కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభించింది. దీనికి టీఎస్ ఎంసెట్(బైపీసీ/ఎంపీసీ)లో ర్యాంకు సాధించిన విద్యార్థులు అర్హులు. 2023-24 విద్యాసంవత్సరానికి తెలంగాణ రాష్ట్రంలోని.. పీజేటీఎస్ఏయూ, శ్రీ కొండా లక్ష్మణ్ హార్టికల్చర్ యూనివర్సిటీ, పీవీ నరసింహరావు వెటర్నరీ యూనివర్సిటీల్లో.. వివిధ కోర్సుల్లో అడ్మిషన్ కల్పించనున్నారు. ఈ నేపథ్యంలో.. ఈ మూడు వర్సిటీల్లో అందుబాటులో ఉన్న కోర్సులు, ప్రవేశ విధానం, భవిష్యత్తు అవకాశాలు తదితర వివరాలు..

అగ్రికల్చర్, అనుబంధ కోర్సులకు సంబంధించి ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో మూడు యూనివర్సిటీల పరిధిలో ఎనిమిది కోర్సులు అందుబాటులో ఉన్నాయి. అగ్రికల్చరల్, వెటర్నరీ సైన్స్, ఫిషరీ సైన్స్, హార్టికల్చర్ సైన్స్‌ల కోర్సులను మూడు యూనివర్సిటీలు అందిస్తున్నప్పటికీ.. ప్రవేశ ప్రక్రియను మాత్రం ఉమ్మడి కౌన్సెలింగ్ విధానంలో నిర్వహిస్తున్నారు.ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ యూనివర్సిటీ ఆధ్వర్యంలో.. ఉమ్మడి కౌన్సెలింగ్ జరుగుతుంది. దీనికోసం అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

పీజేటీఎస్ఏయూ కోర్సులు

- **అగ్రికల్చరల్ బీఎస్సీ–ఆనర్స్:** మొత్తం సీట్లు–720. వీటిలో 200 సీట్లను సెల్ఫ్ ఫైనాన్స్ సీట్లుగా పేర్కొన్నారు.
- **బీఎస్సీ ఆనర్స్ కమ్యూనిటీ సైన్స్:** మొత్తం సీట్లు–43(5 సెల్ఫ్ ఫైనాన్స్ సీట్లు).
- **బీటెక్–అగ్రికల్చరల్ ఇంజనీరింగ్:** మొత్తం సీట్లు–29(9 సెల్ఫ్ ఫైనాన్స్ సీట్లు).
- **బీటెక్ ఫుడ్ టెక్నాలజీ:** మొత్తం సీట్లు–30(10 సీట్లు సెల్ఫ్ ఫైనాన్స్ సీట్లు).
- **బీఎస్సీ ఆనర్స్–కమ్యూనిటీ సైన్స్:** మొత్తం సీట్లు 42(5సెల్ఫ్ ఫైనాన్స్ సీట్లు) (ఎంపీసీ స్ట్రీమ్).

పీవీ నరసింహరావు తెలంగాణ వెటర్నరీ యూనివర్సిటీ కోర్సులు

- **బీవీఎస్సీ అండ్ ఏహెచ్:** మొత్తం సీట్లు–174.
- **బ్యాచిలర్ ఆఫ్ ఫిషరీ సైన్స్(బీఎఫ్ఎస్సీ):** మొత్తం సీట్లు–39.
- ఏపీ రాష్ట్ర పునర్విభజన చట్టం ప్రకారం–ఏపీలోని కాలేజ్ ఆఫ్ ఫిషరీసైన్స్ ముత్తుకూరు(నెల్లూరు జిల్లా)లో 11 సీట్లు అందుబాటులో ఉన్నాయి.

శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం కోర్సులు

బీఎస్సీ ఆనర్స్ హార్టికల్చర్–204 కోర్సులు.వీటిలో 34సీట్లను సెల్ఫ్ ఫైనాన్స్ సీట్లుగా పేర్కొన్నారు.

ఎంసెట్ బైపీసీ/ఎంపీసీ

- తెలంగాణ రాష్ట్రంలోని అగ్రికల్చర్, వెటర్నరీ, ఫిషరీ సైన్స్, అనుబంధ కోర్సులకు సంబంధించి టీఎస్ ఎంసెట్ బైపీసీ/ఎంపీసీ స్ట్రీమ్‌లో ఉత్తీర్ణత ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు.
- బీఎస్సీ అగ్రికల్చర్ ఆనర్స్, కమ్యూనిటీ సైన్స్, బీవీఎస్సీ అండ్ ఏహెచ్, బీఎఫ్ఎస్సీ, బీఎస్సీ ఆనర్స్–హార్టికల్చర్ కోర్సుల సీట్లను ఎంసెట్ బైపీసీ స్ట్రీమ్ ర్యాంకుతో భర్తీ చేస్తారు.
- బీటెక్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్,బీటెక్ ఫుడ్ టెక్నాలజీ సీట్లలో ఎంసెట్ ఎంపీసీ స్ట్రీమ్ ర్యాంకు ఆధారంగా ప్రవేశం కల్పిస్తారు. దీంతోపాటు బీఎస్సీ ఆనర్స్ కమ్యూనిటీ సైన్స్‌లో మొత్తం 42 సీట్లను ఎంపీసీ స్ట్రీమ్ ర్యాంకు ఆధారంగా భర్తీ చేస్తారు.
- హోమ్ సైన్స్‌లో మూడేళ్ల డిప్లొమా పూర్తి చేసుకున్న వారికి సూపర్ న్యూమరరీ కోటా కింద 8 సీట్లు అందుబాటులో ఉంటాయి.

అర్హత

- **బైపీసీ స్ట్రీమ్ కోర్సులు:** ఇంటర్ బైపీసీ ఉత్తీర్ణత సాధించాలి. బీవీఎస్సీ అండ్ ఏహెచ్ కోర్సుకు బైపీసీలో 50 శాతం మార్కులు తప్పనిసరి. దీంతోపాటు టీఎస్ ఎంసెట్ బైపీసీ స్ట్రీమ్‌లో ఉత్తీర్ణత ఉండాలి.
- **ఎంపీసీ స్ట్రీమ్ కోర్సులు:** ఇంటర్ ఎంపీసీ ఉత్తీర్ణతతోపాటు ఎంసెట్ ఎంపీసీ స్ట్రీమ్‌లో అర్హత సాధించాలి.

ఫార్మర్స్ కోటా విధానం

అగ్రికల్చర్, అనుబంధ కోర్సుల్లోని సీట్లను భర్తీ చేసే క్రమంలో ఫార్మర్స్ కోటా విధానాన్ని కూడా అమలు చేస్తున్నారు. ఒక ఎకరానికి తక్కువ కాకుండా భూమి ఉన్న రైతుల కుటుంబాలకు చెందిన పిల్లలకు అగ్రికల్చర్ యూనివర్సిటీ, హార్టికల్చర్ యూనివర్సిటీ కోర్సుల్లో 40 శాతం సీట్లు, వెటర్నరీ యూనివర్సిటీ కోర్సుల్లో 25శాతం సీట్లు కేటాయిస్తారు. ఈ కోటా సీట్లు పొందాలనుకునే విద్యార్థులు ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ మధ్యలో కనీసం నాలుగేళ్లు గ్రామీణ ప్రాంతాల్లో చదివుండాలి.

పెరుగుతున్న పోటీ

- అగ్రికల్చర్ అనుబంధ కోర్సుల్లో ప్రవేశాలకు గత కొన్నేళ్లుగా విద్యార్థుల నుంచి ఆదరణ లభిస్తోంది. దీంతో వీటికి పోటీ పెరుగుతోంది. గత ఏడాది కౌన్సెలింగ్ ఆయా కోర్సుల్లో చివరి ర్యాంకులను పరిశీలిస్తే.. బీఎస్సీ అగ్రికల్చర్ కోర్సులో స్థానిక కోటాలో నాన్–ఫార్మర్ కేటగిరీలో 3,299వ ర్యాంకు, ఫార్మర్/రూరల్ కోటాలో 5,705వ ర్యాంకు చివరి ర్యాంకులుగా నిలిచాయి.

ఉజ్వల అవకాశాలు

అగ్రికల్చర్ కోర్సులకు డిమాండ్ పెరగడానికి ఈ రంగంలో లభిస్తున్న ఉపాధి అవకాశాలే కారణమని నిపుణులు పేర్కొంటున్నారు. కోర్సుల వారీగా భవిష్యత్తు అవకాశాల వివరాలు..

అగ్రికల్చర్ బీఎస్సీ

వ్యవసాయ సాగు విధానాల్లో ఆధునిక పద్ధతులు, నూతన పరికరాల వినియోగం వంటి నైపుణ్యాలను అందించే కోర్సు ఇది. దీన్ని పూర్తి చేసుకున్న వారికి ప్రైవేటు రంగంలో విత్తన ఉత్పాదక సంస్థలు, పౌల్ట్రీ ఫామ్స్‌లో ఉద్యోగాలు లభిస్తాయి. ప్రభుత్వ విభాగంలో వ్యవసాయ శాఖలో అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ వంటి కొలువులు సొంతం చేసుకోవచ్చు. బ్యాంకుల్లో రూరల్ బ్యాంకింగ్ ఆఫీసర్లుగా చేరే వీలుంది.

బీవీఎస్సీ అండ్ ఏహెచ్

పేరుకు ముందు డాక్టర్ హోదా.. కెరీర్ పరంగా ఉన్నత స్థానాలు అందుకునేందుకు దోహదం చేస్తున్న కోర్సు.. బ్యాచిలర్ ఆఫ్ వెటర్నరీ సైన్స్ అండ్ యానిమల్ హజ్బెండరీ(బీవీఎస్సీ అండ్ ఏహెచ్). జంతువులకు వచ్చే వ్యాధులు, నివారణ చర్యలు, పశువుల గర్భధారణ పద్ధతులు తదితర అంశాల్లో నైపుణ్యం కల్పించే కోర్సు ఇది. వీరికి పౌల్ట్రీ ఫారాలు, ప్రభుత్వ, ప్రైవేటు పశువైద్య ఆసుపత్రులు, పశుసంవర్థక శాలలు, వన్యమృగ సంరక్షణ కేంద్రాలు, జంతు ప్రదర్శన శాలలు, డెయిరీ ఫామ్స్, గొర్రెల పెంపక కేంద్రాల్లో ఉద్యోగాలు లభిస్తాయి.

హార్టికల్చర్ సైన్స్

పర్యావరణంపై ఆసక్తి ఉన్న వారికి సరైన కోర్సు.. బీఎస్సీ హార్టికల్చర్ సైన్స్. ఈ కోర్సును పూర్తి చేసుకున్న వారికి స్టేట్ హార్టికల్చర్ మిషన్, నాబార్డ్ సహా పలు బ్యాంకుల్లో ఉద్యోగాలు లభిస్తాయి. అదేవిధంగా ప్రైవేట్ డ్రిప్ ఇరిగేషన్ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్‌ల్లోనూ ఉపాధి అవకాశాలు విస్తృతం అవుతున్నాయి. ఉన్నత విద్య పరంగా పీజీ స్థాయిలో ఫ్రూట్ సైన్స్, వెజిటబుల్ సైన్స్, ఫ్లోరికల్చర్, ప్లాంటేషన్ అండ్ స్పైస్ క్రాప్ ప్రత్యేక అంశాలుగా ఎమ్మెస్సీ చదివే అవకాశం ఉంది.

బీఎఫ్ఎస్సీ

బ్యాచిలర్ ఆఫ్ ఫిషరీస్ సైన్స్..సంక్షిప్తంగా బీఎఫ్ఎస్సీ. చేపల పెంపకం,సేకరణకు సంబంధించి ప్రత్యేక పద్ధతులు అనుసరించేందుకు అవసరమయ్యే నైపుణ్యాలు అందించే కోర్సు ఇది. దీన్ని పూర్తిచేసుకున్న వారికి ఆక్వాకల్చర్ కంపెనీలు, ఆక్వా రీసెర్చ్ సంస్థలు ప్రధాన ఉపాధి వేదికలుగా నిలుస్తున్నాయి.

బీటెక్-ఫుడ్ టెక్నాలజీ

బైపీసీ విద్యార్థులకు అందుబాటులో ఉన్న మరో కోర్సు.. బీటెక్–ఫుడ్ టెక్నాలజీ. ఆహార ఉత్పత్తుల తయారీ, నాణ్యత, ప్రాసెసింగ్ సంబంధిత నైపుణ్యాలు అందించే కోర్సు ఇది. దీన్ని పూర్తి చేయడం ద్వారా ఫుడ్ ప్రొడక్షన్ యూనిట్స్, ప్యాకేజ్డ్ ఫుడ్ మ్యాన్యుఫ్యాక్చరింగ్ సంస్థల్లో కొలువుదీరొచ్చు. దీంతోపాటు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్స్, క్రాప్ పొడక్షన్ కంపెనీలలో మేనేజ్‌మెంట్ విభాగాల్లో ఉద్యోగాలు లభిస్తాయి.

బీటెక్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్

వ్యవసాయ ఉత్పత్తులు, పరికరాల డిజైన్, నిర్వహణకు సంబంధించిన నైపుణ్యాలు అందించే కోర్సు ఇది. మైక్రో ఇరిగేషన్ పరికరాలు, ప్రాసెసింగ్ పరికరాలు, గ్రీన్ హౌస్‌ల నిర్మాణం పర్యవేక్షణ వంటి నైపుణ్యాలు లభిస్తాయి. ఈ కోర్సు పూర్తి చేసుకున్న అభ్యర్థులు అగ్రి ఎక్విప్‌మెంట్ సంస్థలు, క్రాప్ పొడక్షన్ కంపెనీల్లో సాంకేతిక విభాగాల్లో కొలువులు సొంతం చేసుకోవచ్చు.

బీఎస్సీ కమ్యూనిటీ సైన్స్

సామాజిక అంశాలు, విలువలు, సామాజిక అభివృద్ధిలో సాంకేతికతను వినియోగించే నైపుణ్యాలను అందించే కోర్సు ఇది. కోర్సులో భాగంగా ఫుడ్ అండ్ న్యూట్రిషన్, హ్యూమన్ డెవలప్‌మెంట్, ఫ్యామిలీ స్టడీస్, అపరెల్ డిజైన్, రిసోర్స్ మేనేజ్‌మెంట్, కన్స్యూమర్ సైన్సెస్ వంటి అంశాలపై అవగాహన కల్పిస్తారు. ఈ కోర్సు ఉత్తీర్ణులకు హాస్పిటల్స్, చైల్డ్ కేర్ ఇన్‌స్టిట్యూట్స్, సోషల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్స్, ఎన్‌జీఓలలో ఉద్యోగావకాశాలు లభిస్తాయి.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- బైపీసీ స్ట్రీమ్ రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లింపునకు చివరి తేది: 15.07.2023
- బైపీసీ స్ట్రీమ్ ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: జూలై 17,2023
- బైపీసీ స్ట్రీమ్ ఆన్‌లైన్ దరఖాస్తు సవరణ అవకాశం: జూలై 18, 19 తేదీలు
- ఎంపీసీ స్ట్రీమ్ రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లింపునకు చివరి తేది: 07.07.2023
- ఎంపీసీ స్ట్రీమ్ ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 09.07.2023
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: https://ug.pjtsau.ac.in https://btech.pjtsau.ac.in

జేఈఈ రాకున్నా... ఐఐటీ చదువు

సరికొత్త ఆన్‌లైన్, సర్టిఫికెట్ కోర్సులు

- ఐఐటీల ఉమ్మడి కార్యాచరణ
- డిగ్రీ విద్యార్థులకు చదువుకునే అవకాశం
- సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకూ సరికొత్త విద్య
- ఈ ఏడాది నుంచి మరిన్ని కోర్సులు

సాధారణంగా దేశంలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ)ల్లో చదవాలంటే జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్‌డ్‌లో ర్యాంకు కొట్టాల్సిందే. కానీ ఇక మీదట సాదాసీదా డిగ్రీ విద్యార్థులు కూడా ఐఐటీల్లో కోర్సులు పూర్తి చేయవచ్చు. జాతీయ స్థాయిలో ఈ తరహా కసరత్తు వేగంగా ముందుకెళ్తోంది. కోవిడ్ కాలంలో మొదలైన ఈ ఆలోచన ఇప్పుడు అనేక రూపాల్లో విద్యార్థులకు అందుబాటులోకి వస్తోంది. దేశంలో ఏటా లక్షల మంది ఇంజనీరింగ్, డిగ్రీ కోర్సులు చేస్తున్నారు. జాతీయ స్థాయి ఇంజనీరింగ్ కాలేజీల్లో ఉన్న సీట్లు 50 వేల లోపే. అందులోనూ ఐఐటీల్లో ఉన్నవి 16 వేలు మాత్రమే. అంతర్జాతీయ ప్రమాణాలతో ఉండే ఐఐటీల్లో ఏ కోర్సు చేసినా మంచి గుర్తింపు ఉంటుంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని మార్కెట్లో అవసరమైన కొన్ని కోర్సులను ఐఐటీల ద్వారా సర్టిఫికెట్ కోర్సులుగా అందించాలని ఐఐటీలు కార్యాచరణ సిద్ధం చేశాయి.

- సాక్షి, హైదరాబాద్



కోవిడ్ కాలంలో..

కోవిడ్ సమయంలో విద్యార్థులు ఆన్‌లైన్ విద్యకు అలవాటు పడ్డారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని కోర్సులను డిజైన్ చేసినట్లు ఐఐటీలు చెబుతున్నాయి. విద్యార్థులు కూడా ఈ కోర్సులు నేర్చుకునేందుకు ఆసక్తి చూపుతున్నారని మద్రాస్ ఐఐటీ ఇటీవల తెలిపింది. ఈ సంస్థ ప్రతినిధులు వివిధ రాష్ట్రాలోని కాలేజీలకు వెళ్లి ఆన్‌లైన్ కోర్సుల ప్రాధాన్యతను వివరించారు. మిగతా ఐఐటీలు సరికొత్త సర్టిఫికెట్ కోర్సులను తెరపైకి తెచ్చాయి.

ఇవీ కోర్సులు..

ఎంటెక్‌లో ఆన్‌లైన్ కోర్సులకు ఐఐటీ హైదరాబాద్ గతేడాది సమగ్ర ప్రణాళిక రూపొందించింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషీన్ లెర్నింగ్, డిజిటల్ మార్కెటింగ్ వంటి మార్కెట్ డిమాండ్ కోర్సులను ఈ ఏడాది తీసుకొచ్చేందుకు రంగం సిద్ధం చేసింది.

మరికొన్ని ఐఐటీలు ఈ సంవత్సరం నుంచి మార్కెట్ వర్గాల డిమాండ్‌కు అనుగుణంగా ఎంటెక్, ఎగ్జిక్యూటివ్ ఎంబీఏ కోర్సులను తీసుకొస్తున్నాయి. 2020లో ఐఐటీ మద్రాస్ బీఎస్సీ డేటా సైన్స్ ప్రారంభించింది. ఇప్పటికే ఈ కోర్సులో 18 వేల మంది చేరినట్లు ఆ సంస్థ తెలిపింది. నాలుగేళ్ల బీఎస్సీ ఎలక్ట్రానిక్స్ కోర్సును ఆన్‌లైన్ ద్వారా అందించేందుకు ఇప్పటికే ప్రణాళిక సిద్ధం చేసింది.

ఐఐటీ బాంబే డిజిటల్ మార్కెటింగ్ అండ్ అప్లైడ్ అనలిటిక్స్, డిజైన్ థింకింగ్, మెషీన్ లెర్నింగ్ అండ్ ఏఐ విత్ పైథాన్, ఎగ్జిక్యూటివ్ ఎంబీఏ అందిస్తున్నట్లు ప్రకటించింది.

పట్నా ఐఐటీ ఎంటెక్ ఇన్ బిగ్ డేటా అండ్ బ్లాక్‌చైన్, ఎంటెక్ ఇన్ క్లౌడ్ కంప్యూటింగ్ ఎగ్జిక్యూటివ్ ఎంబీఏ కోర్సులను మరింత ఆధునీకరిస్తూ అందిస్తోంది. అయితే వాటిని ప్రస్తుతం ఉద్యోగం చేస్తున్న ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులకు అందించాలని నిర్ణయించింది.

ఢిల్లీ ఐఐటీ కూడా జాతీయ, అంతర్జాతీయంగా డిమాండ్ ఉన్న సర్టిఫికెట్ కోర్సులను అందించనుంది. ఇందులో సేల్స్ అండ్ మార్కెటింగ్, ప్రాజెక్టు మేనేజ్‌మెంట్, డిజిటల్ మార్కెటింగ్, డేటా సైన్స్, మెషీన్ లెర్నింగ్, ఎగ్జిక్యూటివ్ ప్రోగ్రామ్ ఇన్ స్టార్టప్ బూట్‌క్యాంప్, న్యూ ప్రోడక్ట్ డెవలప్‌మెంట్ అండ్ మేనేజ్‌మెంట్, డిజైన్ థింకింగ్ అండ్ ఇన్నోవేషన్ కోర్సులున్నాయి.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు సులువు..

సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఎప్పటికప్పుడూ నైపుణ్యానికి పదును పెట్టాల్సిందే. ఇలాంటి మళ్లీ వారు కాలేజీలకు వెళ్లాల్సిన అవసరం లేకుండానే అంతర్జాతీయ ప్రమాణాలున్న ఐఐటీ సంస్థల్లో సర్టిఫికెట్ కోర్సులు చేయవచ్చు. ఐఐటీ ద్వారా సర్టిఫికెట్ కోర్సు చేస్తే మంచి ఫ్యాకల్టీ ద్వారా పాఠాలు వినడమే కాకుండా ఆ సంస్థలు ఇచ్చే సర్టిఫికెట్లకు విలువ ఉంటుంది. మరింత మెరుగైన ఉపాధికి ఆస్కారం ఉండే వీలుంది.

ట్రెండ్ మంచిదే...



అమెరికాలోని ప్రతిష్టాత్మక విశ్వవిద్యాలయాలు ఇప్పుడు ఆన్‌లైన్ కోర్సులు అందిస్తున్నాయి. ఇదే బాటలో ఐఐటీలు మంచి కోర్సులు ఆఫర్ చేయడం మంచిదే. అయితే ఇవి కేవలం సర్టిఫికెట్ల జారీకే పరిమితం కాకూడదు. కోర్సు నేర్చుకొనే విద్యార్థులు నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకుంటేనే అంతర్జాతీయంగా మంచి ఉద్యోగాలు పొందడానికి వీలుంటుంది.

-ప్రొ.శ్రీరాం వెంకటేష్
(ఓయూ ఇంజనీరింగ్ విభాగం ప్రిన్సిపల్)



‘కోబ్రా’తో బుడతడి ఆటలు..!

కింగ్ కోబ్రా (రాచ నాగు) అంటేనే అందరికీ హడల్. ఆ పామును చూస్తే పరుగులు తీస్తారు. కానీ ఓ ఐదేళ్ల బుడతడు ఏ మాత్రం భయం లేకుండా దానిని ఆడిస్తున్నాడు. కర్ణాటకలో ఉత్తర కన్నడ జిల్లా శిరసి తాలూకా కేహెచ్‌బీ కాలనీవాసి పాములు పట్టే నిపుణుడు ప్రశాంత్ హులేకర్ కుమారుడు విరాజ్ ధైర్యాన్ని అందరూ మెచ్చుకుంటున్నారు. బాలుడు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్నాడు. గత రెండేళ్లుగా తండ్రితో కలిపి పాములు పట్టడం నేర్చుకున్నాడు. సోమవారం కేహెచ్‌బీ కాలనీలో కింగ్ కోబ్రా చొరబడిందని తెలిసి తండ్రీకొడుకులు దానిని బంధించేందుకు వచ్చారు. ఈ సందర్భంగా విరాజ్ స్వేచ్ఛగా సర్పాన్ని ఆడిస్తున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. తర్వాత దానిని దూరంగా విడిచిపెట్టారు. – బనశంకరి

ఇక పూర్తిస్థాయిలో అకాడమీ పుస్తకాలు

- ప్రైవేటుకు అవకాశం ఇవ్వకుండా ప్రభుత్వమే సరఫరా
- ఇంటర్, ఆపైస్థాయి పుస్తకాలు కూడా ముద్రణ

సాక్షి, అమరావతి: విద్యార్థులను పుస్తకాల ధరలతో బెంబేలెత్తిస్తున్న ప్రైవేటు ముద్రణ సంస్థలకు ప్రభుత్వం బ్రేకులు వేసింది. తెలుగు అకాడమీ ద్వారా ఇంటర్మీడియట్, ఆపైస్థాయి అకడమిక్ టెక్ట్స్‌బుక్స్‌తో పాటు పోటీపరీక్షలకు అవసరమైన పుస్తకాలను సొంతంగా ముద్రిస్తోంది. ఇప్పటికే ఇంటర్మీడియట్ రెండో ఏడాది పుస్తకాలను పంపిణీ చేయగా, మొదటి సంవత్సరం పుస్తకాలను సైతం ముద్రించి విడుదల చేసింది. ఆంధ్రప్రదేశ్ విడిపోయినప్పుడు తెలుగు అకాడమీ కార్యకలాపాలు తెలంగాణకు మాత్రమే పరిమితమయ్యాయి. దీంతో ఆంధ్రప్రదేశ్ విద్యార్థులకు అవసరమైన పుస్తకాల ముద్రణ, సరఫరాను అప్పటి ప్రభుత్వం ప్రైవేటు సంస్థలకు అప్పగించింది. దాంతో వారు నిర్ణయించినవే ధరలుగా చెలామణి అయ్యాయి. విద్యార్థులపై ఆర్థికభారం తగ్గించేందుకు వైఎస్ జగన్ ప్రభుత్వం.. విభజన అనంతరం రాష్ట్రానికి రావాల్సిన తెలుగు అకాడమీ నిధులు, ఇతర హక్కులపై ప్రయత్నించినప్పటికీ కోర్టు కేసులు కారణంగా ఆలస్యమైంది. ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు రాష్ట్రంలో అకాడమీ ఏర్పాటైనప్పటికీ.. గత ప్రభుత్వం పుస్తకాల ముద్రణను మూడేళ్ల కాలానికి ప్రైవేటు ముద్రణ సంస్థలకు కట్టబెడుతూ 2019లో ఉత్తర్వులిచ్చింది. దీంతో అకాడమీ సొంతంగా పుస్తకాల ముద్రణ చేపట్టే అవకాశం లేకుండా పోయింది. గత ప్రభుత్వం ప్రైవేటు ముద్రణ సంస్థలకిచ్చిన కాలపరిమితి 2022లో ముగియడంతో అదే సంవత్సరం రాష్ట్రం నుంచి పోటీపరీక్షలకు అవసరమైన పుస్తకాల ముద్రణను తెలుగు అకాడమీ చేపట్టింది. ఈ ఏడాది పూర్తిస్థాయిలో 2023–24 విద్యాసంవత్సరానికి అవసరమైన ఇంటర్మీడియట్ పుస్తకాల ముద్రణ, అమ్మకాలు చేపట్టింది. దీంతోపాటు డిగ్రీ, ఏపీపీఎస్సీ, బీఈడీ, టెట్ వంటి పోటీ పరీక్షల పుస్తకాలను సైతం ముద్రిస్తోంది.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943 Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.